ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

కరీంనగర్ 29-1-2018 సోమవారం సిటీ సంపుటి 44 సంచిక 169

రూ. 5-00. పేజీలు 16+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



ఫెదరర్ @ 20

స్విస్ టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ ఖాతాలో మరో గ్రాండ్‌స్లామ్ చేరింది. అతను ఆస్ట్రేలియన్ ఓపెన్ ఛాంపియన్‌గా నిలిచాడు. ఆదివారం ఫైనల్లో రోజర్ మారిన్ సిలిచ్‌ను ఓడించి.. ఆరోసారి ఈ టోర్నీలో టైటిల్ గెలుచుకున్నాడు. కెరీర్‌లో అతనికిది 20వ గ్రాండ్‌స్లామ్. ఈ ఘనత సాధించిన తొలి పురుష క్రీడాకారుడు ఫెదరరే.

ఉనద్కత్‌కు 11.5 కోట్లు



ఐపీఎల్ 11వ సీజన్ కోసం రెండు రోజుల పాటు సాగిన ఐపీఎల్ వేలానికి తెరపడింది. బెంగళూరులో ఆదివారం ముగిసిన వేలంలో భారత పేసర్ జైదేవ్ ఉనద్కత్ అనూహ్యంగా రూ.11.5 కోట్ల ధర దక్కించుకున్నాడు. అతడిని రాజస్థాన్ రాయల్స్ కొనుగోలు చేసింది. ఈసారి అత్యధిక ధర దక్కించుకున్న భారత ఆటగాడు జైదేవే. మొత్తంగా ఈ వేలంలో స్టోక్స్‌కు అత్యధిక ధర (రూ.12.5 కోట్లు) పలికింది.

– వివరాలు ఛాంపియన్‌లో

పాత బొమ్మలతో హాని.. పిల్లలకేం తెలుసు!



మన ఇళ్లలో పిల్లలు కొన్నాళ్లపాటు ఆడుకుని వదిలేసిన బొమ్మల్ని మరింత చిన్నపిల్లలకు ఇవ్వడం పరిపాటే. కాని ఇదేమంత మంచిది కాదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. బాగా వాడేసిన బొమ్మల్లో ప్రమాదకరమైన ఏంటిమొని, బేరియం, బ్రోమిన్, కాడ్మియం, క్రోమియం, లెడ్, సెలీనియం అనే ప్రమాదకరమైన మూలకాల గాఢత చాలా ఎక్కువగా ఉంటుందని తేలింది. బొమ్మల ద్వారా అవి పిల్లల నోటిలోకి వెళ్లి తీవ్ర హాని చేస్తాయని చెబుతున్నారు.

2లో

ఎవర్ని కుట్టాలో దోమలకే తెలుసు



ఐదారుగురు కూర్చుని ఉన్నప్పుడు వారిలో ఏ ఒకరో ఇద్దరో మాత్రం దోమలు తెగ కుడుతున్నాయంటూ గోల పెడుతుంటారు కదా! అలా పదేపదే కొందరినే కుట్టడానికి ప్రత్యేక కారణాలున్నాయట. ఎవర్ని కుట్టాలి?, మళ్లీ అదే వ్యక్తి రక్తం పీల్చడం ఎలా? అనేది దోమలు చాలా వేగంగా నేర్చుకుంటాయని ఓ పరిశోధనలో తేలింది. ముఖ్యంగా ఎవర్ని కుట్టాలనే విషయంలో సీనియర్ ఆడదోమలు జూనియర్ దోమలకు శిక్షణ కూడా ఇస్తాయంటున్నారు పరిశోధకులు.

2లో

పెట్టుబడులొచ్చాయ్!

రూ.3,500 కోట్లతో తెలంగాణలో పరిశ్రమల స్థాపన

- ముందుకొచ్చిన యూఏఈ సంస్థలు
- ఆహారశుద్ధి, వైద్యపరికరాల తయారీ, ఔషధ పరిశ్రమలు
- హైదరాబాద్‌లో భారీ దుకాణ సముదాయం
- మంత్రి కేటీఆర్ సమక్షంలో దుబాయ్‌లో ఒప్పందాలు





దుబాయ్‌లో బీఆర్ఎస్ గ్రూపు సంస్థ ఛైర్మన్ బీఆర్ శెట్టిని సత్కరిస్తున్న మంత్రి కేటీఆర్ ● అబుదాబిలో లులు సంస్థ ఛైర్మన్ యూసుఫ్ అలీ, మంత్రి కేటీఆర్ సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న తెలంగాణ ఐటీ పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, లులు సీఈవో సైఫీ రూప్‌వాలా

ఈనాడు – హైదరాబాద్

యూఏఈలోని రెండు ప్రసిద్ధ పారిశ్రామిక సంస్థలు లులు గ్రూపు, బీఆర్ శెట్టి గ్రూపులు తెలంగాణలో రూ. 3,500 కోట్ల పెట్టుబడులతో పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చాయి. ఆదివారం అబుదాబీ, దుబాయ్‌ల్లో తెలంగాణ పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ సమక్షంలో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. దావోస్ పర్యటన ముగించుకొని యూఏఈకి వచ్చిన మంత్రి కేటీఆర్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఈ సంస్థలతో సమావేశమయింది. తొలుత అబుదాబీలో లులు గ్రూపుతో మూడు ఒప్పందాలు (ఎంవోయూలు) జరిగాయి. వీటిపై తెలంగాణ పరిశ్రమల ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, లులు గ్రూపు సీఈవో సైఫీ రూపవాలా సంతకాలు చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రిటైల్, ఆహారశుద్ధి రంగాల్లో పేరొందిన లులు గ్రూపు రూ. 2,500 కోట్లతో మెదక్ జిల్లాలో కూరగాయల శుద్ధి పరిశ్రమను, రంగారెడ్డి జిల్లాలో ఆహారశుద్ధి పరిశ్రమను, హైదరాబాద్‌లో 1.8 మిలియన్ చదరపు అడుగుల్లో భారీ (మిగతా 2లో)



యువకుణ్ని మింగిన ఎమ్ఆర్ఐ

ముంబయి ఆసుపత్రిలో ఘోరం

ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి

ముంబయి: వైద్య పరీక్షల కోసం బంధువు వెంట వెళ్లిన ఓ వ్యక్తి.. ఎమ్ఆర్ఐ (మాగ్నటిక్ రిసోనెన్స్ ఇమేజింగ్) స్కానింగ్ గదిలో ప్రమాదానికి గురై మరణించాడు. ఈ ఘటన ముంబయిలో జరిగింది. నాయర్ ఆసుపత్రిలో శనివారం రాత్రి ఎమ్ఆర్ఐ పరీక్షలు చేయించుకునేందుకు ఓ వృద్ధురాలు వచ్చారు. ఆమె వెంట బంధువు రాజేశ్ మారుతి (32) ఉన్నాడు. అతడు ఆక్సిజన్ సిలిండర్ పట్టుకుని గదిలోకి ప్రవేశించాడు. ఎమ్ఆర్ఐ యంత్రం అప్పటికే క్రియాశీలం (ఆన్)గా ఉండటంతో.. అందులోని శక్తిమంతమైన అయస్కాంత క్షేత్రం సిలిండర్‌తోపాటు రాజేశ్‌ను బలంగా లోపలికి లాక్కుంది. దీంతో (మిగతా 2లో)



చలో మేడారం


- మహాజాతరకు కోటిన్నర మంది భక్తులు వస్తారని అంచనా
- భారీగా సర్కారు ఏర్పాట్లు
- ఇప్పటికే 40 లక్షల మంది రాక
- జాతర సమయంలో సమస్త యంత్రాంగం అక్కడే

ఈనాడు – హైదరాబాద్

మరో రెండు రోజుల్లో ప్రారంభం కానున్న మేడారం మహాజాతరకు కావాల్సిన ఏర్పాట్లను అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు ఈసారి కోటిన్నర మంది భక్తులు వస్తారని తెలంగాణ ప్రభుత్వం అంచనా వేస్తోంది. గత పది రోజుల్లో 40లక్షల మంది భక్తులు జాతరకు రాగా రానున్న రెండు రోజుల్లో 20లక్షలమంది వచ్చే అవకాశం ఉంది. జాతర జరిగే ఈ నెల 31 నుంచి మూడో తేదీ వరకు భక్తులు పోటెత్తుతారని భావిస్తోంది. రెండేళ్లకోసారి జరిగే మేడారం మహాజాతరకు భక్తుల సంఖ్య భారీగా పెరుగుతోంది. 2016లో జరిగిన జాతరకు కోటి మంది వచ్చారు. జాతర ప్రాశస్త్యం, రవాణా వసతులు పెరగడంతో ఈసారి ఆ సంఖ్య మరింత భారీస్థాయిలో పెరగనుంది. బుధవారం(ఈ నెల 31) నుంచి ప్రారంభమయ్యే జాతర సందర్భంగా (మిగతా 2లో)

నిల్వ చేసిన ఆహారంతో పేగు వ్యాధులు

- పిల్లలకు యాంటీబయోటిక్స్ వాడకం ప్రమాదమే
- ఐబీడీ సదస్సులో నిపుణుల ఆందోళన



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న పేగు పూత, పేగు వాపు తదితర సమస్యలపై ఇన్‌ఫ్లామేటరీ బౌల్ డీసీజస్ (ఐబీడీ) సదస్సు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్యాకెట్లలో నిల్వ చేసిన ఆహారాన్ని వినియోగించడం పెరగడం వల్లే ఈ సమస్య తీవ్రమవుతోందని పేర్కొంది. నిర్లక్ష్యం చేస్తే ఇది పేగు క్యాన్సర్‌కు దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ (ఏఐజీ) ఆధ్వర్యంలో మూడు రోజులుగా హెచ్ఐసీసీలో జరుగుతున్న ఐబీడీ సదస్సు ఆదివారం ముగిసింది. సదస్సుకు 33 దేశాల నుంచి 1,400 ప్రతినిధులు హాజరయ్యారు. ఇందులో భాగంగా లైవ్ సర్జరీ కార్యశాలలు, చర్చ కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజున ఏఐజీ ఛైర్మన్, ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్టు డాక్టర్ నాగేశ్వరరెడ్డి, యూనివర్సిటీ ఆఫ్ మెల్‌బోర్న్ ప్రొఫెసర్ డాక్టర్ మైఖేల్ ఎ కమ్ తదితర నిపుణులు మాట్లాడారు. 'పాశ్చాత్య దేశాల్లో ఎక్కువ నిల్వ ఉండే ఆహారం తీసుకోవడంతో అక్కడివారిలో పేగు పూత, వాపు తదితర వ్యాధులు సాధారణం. భారతదేశంలోనూ సంప్రదాయ ఆహార అలవాట్లను పక్కన పెట్టి ప్యాకెట్ ఫుడ్స్, నిల్వ చేసిన ఆహారం ఎక్కువ తీసుకోవడం వల్ల ఇక్కడ కూడా ఈ సమస్య సర్వసాధారణంగా మారుతోంది. ఆహారం నిల్వ చేసేందుకు వాడే రసాయనాలు ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. పిల్లల్లో సాధారణ జలుబు, దగ్గు, జ్వరానికి కూడా వైద్యుల ప్రమేయం లేకుండానే యాంటీబయోటిక్స్ వాడటం కూడా వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పిల్లల్లో పేగు సమస్యలు పెరగడానికి ఇదో ప్రధాన కారణం. పేగు పూత, పేగు సమస్యలను (మిగతా 2లో)

ఛూ మంత్రకాళి.. డబ్బంతా ఖాళీ

- ఏటీఎంలపై సరికొత్త సైబర్ దాడి
- అమెరికాలో కలకలం
- మీట నొక్కితే చాలు.. డబ్బంతా కక్కాల్సిందే
- త్వరలో దాడులు జరగబోతున్నట్లు నిఘాసంస్థ హెచ్చరిక

11లో



ఇదీ సంగతి!



నిర్లక్ష్యం వీడితే నిధుల వరదే

- ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తే పురపాలికలకు కోట్లలో రాబడి
- పన్నులు, రుసుములు, అద్దెల వసూలులో నిర్లక్ష్యం
- పక్కాగా వసూలు చేస్తే 37 శాతం అదనపు ఆదాయం
- ఐపీఏఐ అధ్యయనంలో వెలుగు చూసిన వాస్తవాలు
- చర్యలపై పురపాలకశాఖ దృష్టి

ఈనాడు – హైదరాబాద్

ప్రజలపై పన్నుల భారం మోపనక్కర్లేదు.. అదనంగా రుసుములు బాదక్కర్లేదు.. అపరాధ రుసుముల మోత కూడా అక్కర్లేదు.

అధికారులు, యంత్రాంగం.. ఆర్థిక జవాబుదారీతనం పాటిస్తే చాలు తెలంగాణలో పురపాలికలు, నగరపాలక సంస్థలకు నిధుల కరువే ఉండదు. అధికార యంత్రాంగం ఉదాసీనత, పర్యవేక్షణ లోపం, నిబంధనలు పాటించకపోవడం, జవాబుదారీగా వ్యవహరించకపోవడం, నిర్దేశిత రుసుములు వసూలు చేయకపోవడం వల్ల నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలు కోట్ల రూపాయల రాబడిని కోల్పోతున్నాయని ఓ అధ్యయనం తేల్చింది. నిబంధనల ప్రకారం రుసుములు వసూలు చేస్తే రాబడి 37 శాతం పెరుగుతుందని పేర్కొంది.



తెలంగాణ పురపాలక శాఖ రాష్ట్రంలో నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల్లో ఆర్థిక వ్యవహారాలపై 2016-17వ సంవత్సరానికి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఆడిటర్ ఆఫ్ ఇండియా (ఐపీఏఐ) తెలంగాణ, ఏపీ ఛాప్టర్ ద్వారా ప్రత్యేక ఆడిట్ చేయించింది. ఈఆడిట్‌లో (మిగతా 2లో)

పన్నుల ప్రస్తావన ఉండని తొలి బడ్జెట్!

- జీఎస్టీ అమలే కారణం
- రాయితీలు, ప్రోత్సాహకాలపైనే దృష్టి

ఈనాడు, దిల్లీ: త్వరలో ప్రవేశపెట్టనున్న 2018-19 కేంద్ర బడ్జెట్ ఓ ప్రత్యేకత సంతరించుకోనుంది. స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం పరోక్ష పన్నుల ప్రస్తావన లేని తొలి బడ్జెట్ ఇదే కానుండడం విశేషం. వస్తు-సేవల పన్ను (జీఎస్టీ) అమల్లోకి రావడమే ఇందుకు కారణం. సంప్రదాయంగా బడ్జెట్‌లో కస్టమ్స్ డ్యూటీ, సెంట్రల్ ఎక్సయిజ్ సుంకం, సేవా పన్ను, వ్యాట్ వంటి వివరాలు ఉంటాయి. బడ్జెట్ ప్రసంగంలోని బి-విభాగంలో వివిధ వస్తువులపై పన్నుల తగ్గింపు, హెచ్చింపు వంటి అంశాలను పొందుపరుస్తారు. ఇప్పుడు ఆ అవసరం లేదు. దాదాపు 12 పరోక్ష పన్నులు, సెస్సులను విలీనం చేసి జీఎస్టీ కింద ఒకే ఒక్క పన్నుగా రూపొందించారు. పన్నుల రేటుపై జీఎస్టీ మండలి సమావేశాల్లో నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఆ కారణంగా బడ్జెట్‌లో కొత్త పన్నులు, సెస్సులు విధిస్తారన్న ఆందోళన అవసరం లేదు. ప్రత్యక్ష పన్నులైన ఆదాయపు పన్ను, కార్పొరేట్ పన్నుల విధింపు, కొత్త పథకాల వివరాలే ఉంటాయి. బడ్జెట్ ప్రసంగం కూడా తగ్గనుంది.

ప్రజాకర్షక పథకాలకు పెద్దపీట: ఎన్నికల ముందు ప్రవేశపెట్టనున్న చివరి బడ్జెట్ కావడంతో మోదీ ప్రభుత్వం ప్రజాకర్షక పథకాలకు పెద్దపీట వేసే అవకాశం ఉంది. జనాకర్షక విధానాలు ఉండవని స్వయంగా మోదీ (మిగతా 2లో)

TG

సామాన్యులే మాన్యులు

- పద్మ పురస్కారాల ప్రక్రియను సంస్కరించాం
- పనితీరు ప్రామాణికంగా అర్హుల్ని ఎంపిక చేశాం
- అలాంటివారు ఉండడం మనకు గర్వకారణం
- నారీ శక్తి అమోఘం... వారి కృషి అద్భుతం
- 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ

దిల్లీ

వ్యక్తులకు ఉన్న పేరు ప్రఖ్యాతుల్ని బట్టి కాకుండా వారు చేసిన పనినే ప్రామాణికంగా తీసుకుని ఈ ఏడాది పద్మ పురస్కార గ్రహీతల్ని ఎంపిక చేశామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పారు. పెద్ద పెద్ద నగరాల్లో నివాసం ఉండని, ప్రసార మాధ్యమాల్లో ఎక్కడా మచ్చుకైనా కనిపించనివారికే వీటిని ప్రదానం చేయబోతున్నామని తెలిపారు. ఎలాంటి సిఫార్సులకూ ఆస్కారమివ్వలేదన్నారు. నెలవారీ కార్యక్రమం 'మన్ కీ బాత్' (మనసులో మాట)లో భాగంగా ఆదివారం ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలనుద్దేశించి మాట్లాడిన ఆయన పలు అంశాలను స్పృశించారు. 'పద్మ పురస్కారాల ప్రక్రియను ఆన్‌లైన్ చేయడం వల్ల పారదర్శకత సాధించగలిగాం. దీంతో మొత్తం పద్ధతే మారిపోయింది. ఒక్కసారి పురస్కార గ్రహీతల్ని చూస్తే అలాంటి వారు సమాజంలో ఉండడం మనందరికీ గర్వకారణమనిపిస్తుంది. ఎలాంటి సిఫార్సులూ అవసరం లేకుండా వారికి గుర్తింపు లభించినందుకు సహజంగానే మనకు గర్వంగా అనిపిస్తుంది. సాధించిన గుర్తింపునకు కాకుండా వారు చేసే పనికి ప్రాధాన్యం పెరుగుతోంది. అలాంటివారిని పాఠశాలలకు, కళాశాలలకు ఆహ్వానించాలి. వారి అనుభవాలను ఇతరులు తెలుసుకోవాలి... స్ఫూర్తిని పొందాలి...' అని మోదీ చెప్పారు. మూలికా ఔషధాలను తయారు చేసే కేరళ గిరిజన మహిళ లక్ష్మీ కుట్టి, సైన్స్ పట్ల జిజ్ఞాస పెంచడానికి పాటు పడుతున్న అరవింద్ గుప్తా వంటివారి గురించి ప్రస్తావించారు. నిస్వార్థంగా పాటుపడుతున్న ఇలాంటివారిని గుర్తించడానికి సమాజం ప్రాధాన్యమివ్వాలని కోరారు.

మహిళా శక్తికి హద్దుల్లేవు

మహిళల శక్తికి ఎలాంటి హద్దులూ లేవంటూ దివంగత వ్యోమగామి కల్పనాచావ్లా (ఫిబ్రవరి 1న ఆమె వర్థంతి) చరిత్రను ప్రధాని ఉదహరించారు. ఆమె జీవితం లక్షలాదిమందికి ప్రేరణనిచ్చిందన్నారు. అతివలు అన్ని రంగాల్లో ముందంజ వేస్తూ మనదేశానికి గర్వకారణంగా నిలుస్తున్నారని చెప్పారు. ప్రాచీన కాలంలో మన మహిళల విజయాలు, సమాజంలో వారికి ఉన్న స్థానం యావత్



ప్రపంచాన్నీ ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. ఒక కుమార్తె పది మంది కుమారులతో సమానమని అర్థం వచ్చే శ్లోకాన్ని ఈ సందర్భంగా ఉటంకించారు. రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీల సుఖోయ్-30 యుద్ధ విమానంలో ప్రయాణించడాన్ని ప్రస్తావిస్తూ... మహిళలు ముందంజ వేయడమే కాకుండా వివిధ రంగాలకు నాయకత్వం వహిస్తున్నారనీ, సకారాత్మక మార్పులు తీసుకురావడంలో కీలకపాత్ర పోషిస్తున్నారనీ కొనియాడారు. కట్టుబాట్ల సంకెళ్లను తెంచుకుని వారంతా అసాధారణ విజయాలను నమోదు చేస్తున్నారని చెప్పారు. గణతంత్ర వేడుకల్లో బీఎస్ఎఫ్ మహిళా జవాన్లు ప్రదర్శించిన బైకుల విన్యాసాన్ని గుర్తు చేస్తూ ఆ వేడుక దేశ విదేశీ అతిథుల్ని సంభ్రమాశ్చర్యాలకు గురి చేసిందన్నారు. వర్తికా జోషి నేతృత్వంలో మహిళా బృందం నౌకాదళం తరపున ప్రపంచ సాహస యాత్ర చేస్తుండడం, సుఖోయ్ విమానాలనూ నడిపే పైలెట్లుగా ముగ్గురు మహిళలు శిక్షణ పొందడం, దిల్లీ నుంచి అమెరికాకు బోయింగ్ విమానాన్ని పూర్తిగా మహిళా సిబ్బందే నడపడం వంటివి గుర్తు చేశారు.

భారతీయ నాగరికతలో బలం ఉంది

భారతీయ నాగరికత ఎంతో బలమైనదనీ, స్వీయ దిద్దుబాటుకు, రూపాంతరీకరణకు అవసరమైన సరళత దీనిలో ఉందని ప్రధాని చెప్పారు. రుగ్మతల నుంచి బయటపడేందుకు సమాజం ఎల్లప్పుడూ ప్రయత్నిస్తోందన్నారు. ఈ నెల 30న జరగనున్న మహాత్మాగాంధీ వర్థంతి గురించి ప్రస్తావిస్తూ... శాంతి, అహింసలకు ఆయన చూపిన మార్గం అన్ని కాలాల్లో అందరికీ వర్తిస్తుందని చెప్పారు. సాధ్యమైనంత మేర ఆయన మార్గంలో నడవడమే అసలైన నివాళి అన్నారు. మార్కెట్ కంటే 50-90% తక్కువ ధరకు జన ఔషధి కేంద్రాల ద్వారా మందుల్ని సరఫరా చేయడం ద్వారా ఆరోగ్య రక్షణ రంగాన్ని మరింతగా అందుబాటులోకి తెస్తున్నామని చెప్పారు. ప్రవాస భారతీయులు ఏ దేశంలో ఉన్నా అక్కడ కష్టపడి పనిచేయడంతో పాటు మాతృభూమితోనూ బలమైన బంధాన్ని కొనసాగిస్తున్నారని మోదీ చెప్పారు.

పెట్టుబడులొచ్చాయ్!

(మొదటి పేజీ తరువాయి)

దుకాణ సముదాయాన్ని ఏర్పాటు చేస్తుందని చెప్పారు. వీటి ద్వారా ఆరు వేల మందికి ఉపాధి కలుగుతుందన్నారు. ప్రపంచ స్థాయి మౌలిక వసతులకు పేరొందిన తెలంగాణలో మరిన్ని ప్రాజెక్టు రావాలని ఆశిస్తున్నామన్నారు. సంస్థ ఛైర్మన్ యూసఫ్ అలీ మాట్లాడుతూ తెలంగాణ విధానాలు ప్రోత్సాహకరంగా ఉండడంతో భారత్‌లో తమ వ్యాపార విస్తరణ కోసం ఈ రాష్ట్రాన్నే ఎంచుకున్నామని చెప్పారు. తమకు భూములు కేటాయిస్తామని తెలంగాణ ప్రభుత్వం హామీ ఇచ్చిందని, మూడు నెలల్లోనే పరిశ్రమలకు శంకుస్థాపన చేస్తామని వెల్లడించారు.

బీఆర్ శెట్టి గ్రూపుతో..

అనంతరం దుబాయ్‌లో బీఆర్ శెట్టి గ్రూపు సంస్థతోనూ అవగాహన ఒప్పందం కుదిరింది. జయేశ్ రంజన్, బీఆర్ఎస్ సంస్థ ప్రతినిధి సంతకాలు చేశారు. ఈ సమావేశంలో కేటీఆర్, బీఆర్ఎస్ వెంచర్స్ సంస్థ ఛైర్మన్ డాక్టర్ బీఆర్ శెట్టి పాల్గొన్నారు. తాము తెలంగాణలో రూ.వేయి కోట్ల పెట్టుబడులతో మూడు నుంచి అయిదేళ్లలో మూడు ప్రాజెక్టులను నిర్మిస్తామన్నారు. 20 ఎకరాల విస్తీర్ణంలో ఔషధ పరిశ్రమ, పరిశోధన, అభివృద్ధి కేంద్రం, సుల్తాన్‌పూర్‌లోని పార్కులో మరో 20 ఎకరాలతో వైద్యపరికరాల తయారీ సంస్థ, మరో 50 ఎకరాల్లో 500 పడకలతో గ్రీన్‌ఫీల్డ్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి, ఉన్నత విద్యా సంస్థలను నెలకొల్పుతామన్నారు. వీటి ద్వారా నాలుగువేల మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. కేటీఆర్ మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణ, ఔషధ, ఆర్థిక సేవల రంగాల్లో పేరొందిన బీఆర్ఎస్ సంస్థ తెలంగాణలో పరిశ్రమల స్థాపన కోసం రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకోవడం ఆనందదాయకమన్నారు. వాటిని స్వాగతిస్తున్నామని, ప్రభుత్వం నుంచి అన్ని విధాల సహకారం అందిస్తామని తెలిపారు.

కేటీఆర్‌కు భారత రాయబారి ప్రశంసలు

అనంతరం కేటీఆర్ యూఏఈలోని భారత రాయబారి నవదీప్ సూరితో దుబాయ్‌లో భేటీ అయ్యారు. రెండు సంస్థలతో ఒప్పందాల సమాచారం ఇచ్చారు. తెలంగాణకు మరిన్ని పెట్టుబడుల సాధనకు చేస్తున్న కృషిని వివరించారు. సూరి మాట్లాడుతూ.. పెట్టుబడుల సాధనకు మంత్రి చొరవ అభినందనీయమన్నారు. తెలంగాణకు యూఏఈ నుంచి పలు సంస్థలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. మంత్రి కేటీఆర్ 15 రోజుల విదేశీ పర్యటనను పూర్తి చేసుకొని సోమవారం హైదరాబాద్‌కు రానున్నారు. మధ్యాహ్నం టీహబ్‌లో జరిగే కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు.

నిల్వ చేసిన ఆహారంతో పేగు వ్యాధులు

(మొదటి పేజీ తరువాయి)

గుర్తించడంలో ఆలస్యం జరుగుతుండటం వల్ల క్యాన్సర్‌కు దారితీసే ప్రమాదం ఉంది. సేంద్రియ ఎరువులతో పండించిన ఆహారం తీసుకోవడం, నిల్వ చేసిన ఆహారానికి దూరంగా ఉండటం, వ్యాధిని తొందరగా గుర్తించడం, శారీరక శ్రమ, యోగా వంటివి క్రమం తప్పకుండా చేయడం ద్వారా పేగు సమస్యలకు దూరంగా ఉండవచ్చు' అని చెప్పారు.

నిర్లక్ష్యం వీడితే నిధుల వరదే

(మొదటి పేజీ తరువాయి)

ఆర్థిక వ్యవహారాల్లో అక్రమాలు, నిర్లక్ష్యం వెలుగు చూశాయి. పర్యవేక్షణ లేక ఆస్తి పన్ను, ఖాళీ స్థలాలపై పన్ను, ప్రకటనల ద్వారా పన్ను రాబడి, నీటి ఛార్జీలు, వ్యాపార లైసెన్స్‌లు, మార్కెట్ రుసుములు, అద్దెలు, మ్యుటేషన్ ఫీజులు, [illegible], బకాయిల వసూలు సహా పలు రూపాల్లో కోట్ల రాబడికి గండిపడుతున్నట్లు తేల్చారు. నిధుల వ్యయంలోనూ అనేక లోపాలను గుర్తించారు. పాలనపరంగా సామర్థ్యం పెంచుకుని ఆర్థిక నిర్వహణ మెరుగుపరిస్తే రాబడిని [illegible] శాతం పెంచుకోవచ్చని తేల్చారు.

ఆస్తిపన్ను: పొంతన లేని సమాచారం

వరంగల్, ఖమ్మం, నిజామాబాద్, రామగుండం నగరపాలక సంస్థలు, మహబూబ్‌నగర్, నారాయణపేట, సిద్దిపేట, షాద్‌నగర్, పెద్దపల్లి పురపాలకాల్లో ఆస్తిపన్ను వసూళ్లపై ఆన్‌లైన్ సమాచారానికి, రాతపుస్తకాల్లోని వివరాలకు పొంతన లేదు. పాల్వంచ పురపాలక సంఘంలో 2017 మార్చిలో వసూలు చేసిన మొత్తాన్ని ఈ-మాస్ రికార్డుల్లో చూపలేదు. మాన్యువల్ ఆస్తిపన్ను అంచనా రికార్డులు కొన్ని పురపాలికల్లో నిర్వహించడం లేదు. ఆస్తి పన్ను అంచనాలను సమీక్షించడం లేదు. అక్రమ నిర్మాణాల నుంచి ఆస్తి పన్ను వసూలు కూడా అంచనాల మేరకు లేదు.

ఖాళీ స్థలాల పన్ను: వసూలు వేసేవారేరి?

కరీంనగర్, ఖమ్మం, వరంగల్, నిజామాబాద్ కార్పొరేషన్లు, వివిధ పురపాలక సంఘాల్లో ఖాళీ స్థలాలపై పన్ను వసూలు చేయకపోవడం, తక్కువ పన్ను వసూలు చేయడం వంటి అక్రమాలు వెలుగుచూశాయి.

- నిజామాబాద్ కార్పొరేషన్‌లో ఖాళీస్థలాల పన్ను వసూలుపై రికార్డులే లేవు.
- రామగుండంలోనూ రికార్డులు లేక తక్కువ పన్ను వసూలైంది.
- వరంగల్‌లో 2011-12 నుంచి 2016-17 మధ్య 21 లేఅవుట్లకు అనుమతివ్వగా ఎక్కడా ఖాళీ స్థలాలపై పన్ను వసూలు చేయలేదు.

నీటి ఛార్జీలు: ఇష్టారాజ్యంగా వసూలు

నీటి ఛార్జీల వసూలు దస్త్రాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. వరంగల్‌లో వాణిజ్య అవసరాలకు నీటిని తీసుకుంటున్న చోట పాడైన మీటర్లను మార్చడం లేదు. పారిశ్రామిక అవసరాలకు తీసుకుంటున్న నీటికి ఎక్కువ మొత్తంలో ఛార్జీలు వసూలు చేస్తున్నారు. అక్రమంగా పైపులైన్లు వేసుకుని నీటిని వినియోగించుకుంటున్నారు. నిజామాబాద్‌లో 27,752 నీటి కనెక్షన్లు ఉంటే 16,506 కనెక్షన్ల నుంచే ఛార్జీలు వసూలు చేస్తున్నారు. బకాయిలు పేరుకుపోతున్నా వసూలు చేయడం లేదు.

లైసెన్స్ ఫీజులు: భారీగా బకాయిలు

ట్రేడ్ లైసెన్స్‌లకు డబ్బులు వసూలు చేస్తున్నా లైసెన్సులు ఇవ్వడం లేదు. వసూలు చేసిన మొత్తాన్ని జమ చేయడంలోనూ నిర్లక్ష్యమే. లైసెన్స్ ఫీజులు లక్షల రూపాయలు బకాయిపడినా వసూలుకు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

- నిర్మల్‌లో తొమ్మిదేళ్లుగా లైసెన్స్ రేట్లను సమీక్షించలేదు.
- వరంగల్‌లో ట్రేడ్ లైసెన్స్ రుసుములు కేవలం 26 శాతమే వసూలు చేశారు. ఖమ్మంలోనూ 29 శాతం దాటలేదు.

దుకాణాల అద్దె: 30 శాతమే వసూలు

వరంగల్, ఖమ్మం కార్పొరేషన్లలో అద్దెల్లో 30 శాతం మాత్రమే వసూలు చేస్తున్నారు. పలు ప్రాంతాల్లో సుమారు వంద దాకా దుకాణాలు ఖాళీగా ఉన్నా అద్దెకు ఇవ్వడం లేదు.

- నిర్మల్‌లో 2008 నుంచి అద్దె బకాయిలున్నాయి.
- నిజామాబాద్‌లో అగ్రిమెంట్‌లు కూడా చేసుకోలేదు.
- కరీంనగర్‌లో 2009 నుంచి 50 దుకాణాల అద్దెలు వసూలు చేయడం లేదు.
- సూర్యాపేటలో వేలం వేయకుండానే కేటాయించేశారు.

అన్నింటా అవకతవకలు

- మార్కెట్ ఫీజులు వసూలు సరిగా లేదు.
- సినిమా థియేటర్లు సహా వివిధ రూపాల్లో రావాల్సిన ప్రకటనల పన్ను రాబట్టడంలోనూ నిర్లక్ష్యమే.
- రిజిస్ట్రేషన్ శాఖ మ్యుటేషన్ రుసుములు సకాలంలో జమ చేయకపోయినా పట్టించుకోవడం లేదు.
- భవన నిర్మాణ ప్రణాళికల సమయంలో లేబర్ సెస్ వసూలు చేయడం లేదు.
- కరీంనగర్ కార్పొరేషన్‌లో ఎన్ని సినిమా థియేటర్లు ఉన్నాయనే సమాచారమూ కరవే.
- బ్యాంకు హామీలు, సెక్యూరిటీ డిపాజిట్లపైనా నిర్లక్ష్యమే.
- పనులకు సంబంధించిన రికార్డులు లేవు.

శిక్షణ, జవాబుదారీతనం

ఈ నివేదిక ఆధారంగా రాష్ట్ర పురపాలక శాఖ సంచాలకురాలు టి.కె. శ్రీదేవి చర్యలకు శ్రీకారం చుట్టారు. ఆర్థిక అంశాలకు బాధ్యులైన పరిపాలన అధికారులు, ఫైనాన్స్ మేనేజర్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. సంస్థాగతంగా పరిపాలనను బలోపేతం చేయడంతోపాటు జవాబుదారీతనం పెంచి ఉదాసీనంగా వ్యవహరించే వారిపై చర్యలకు సిద్ధమవుతున్నారు.

సెకండ్ హ్యాండ్ బొమ్మలతో పిల్లలకు ప్రమాదం

లండన్: ఒకసారి పిల్లలు బాగా వాడేసిన, ఆడుకున్న ప్లాస్టిక్ బొమ్మల్ని(సెకండ్ హ్యాండ్).. వారి స్నేహితులకు, తమ్ముళ్లకు, చెల్లెళ్లకు ఇవ్వడం మంచిది కాదని అధ్యయనంలో రుజువైంది. వాటిలో ప్రమాదకరమైన ఏంటిమొని, బేరియం, బ్రోమిన్, కాడ్మియం, క్రోమియం, లెడ్, సెలీనియం అనే ప్రమాదకరమైన మూలకాల గాఢత చాలా ఎక్కువగా ఉంటుందని తేలింది. ఇవి తక్కువ మోతాదులో ఉన్నప్పటికీ కాలం గడిచేకొద్దీ విషంలా పనిచేస్తాయని నిర్ధారణ అయింది. యూకేలోని ప్లైమౌత్ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు 200 వాడేసిన ప్లాస్టిక్ బొమ్మలపై పరిశోధన చేశారు. వీటిలో పిల్లలు ఎక్కువగా ఆడుకున్న కార్లు, రైళ్లు, నిర్మాణం ఉత్పత్తులు, బొమ్మలు, పజిల్స్ ఉన్నాయి. ఇళ్లు, నర్సరీలు, స్వచ్ఛంద సేవాసంస్థల నుంచి వీటిని సేకరించారు. ముఖ్యంగా దాదాపు నూరుశాతం చిన్నారులు ఒక్కసారైనా బొమ్మలను నోటిలో పెట్టుకున్నట్లు గమనించారు. వారి నోటిలోకి వెళ్లిన బ్రోమిన్, కాడ్మియం, లెడ్‌వంటి ప్రమాదకరమైన మూలకాల కారణంగా జీర్ణాశయంలోని హైడ్రోక్లోరిక్ ఆమ్లం కూడా క్రియాశీలమై స్రవించడం మొదలుపెట్టడం ఆశ్చర్యానికి గురి చేసిందని ప్రొఫెసరు ఆండ్రూ టర్నర్ చెప్పారు. 'ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ' జర్నల్‌లో పరిశోధన పూర్తి వివరాలు ప్రచురితమయ్యాయి.

ఎవర్ని మళ్లీమళ్లీ ఎలా కుట్టాలో దోమలకు తెలుసు!

న్యూయార్క్: బృందంగా ఒకచోట కూర్చున్న మనుషుల్లో.. దోమలు కొందరినే ఎక్కువగా కుడుతుంటాయని ఎప్పుడైనా గమనించారా?. అలా పదేపదే కొందరినే ఎక్కువగా కుట్టడానికి ప్రత్యేక కారణాలున్నాయట. ఎవర్ని కుట్టాలి?, మళ్లీ అదే వ్యక్తి రక్తం పీల్చడం ఎలా? అనేది దోమలు చాలా వేగంగా నేర్చుకుంటాయట. ఇందుకు వాటి మెదడులో ఉన్న డోపమైన్ అనే రసాయనమే కారణమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. న్యూరాన్‌కణాల మధ్య సంకేతాలను పంపించడానికి, సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకోవడానికి ఈ డోపమైన్ ఉపయోగపడుతోందని తేల్చారు. ముఖ్యంగా ఎవర్ని కుట్టాలో నిర్ణయించుకునే ప్రక్రియలో భాగంగా ఏడిస్ ఈజిప్ట్ అనే ఆడదోమలు జూనియర్ దోమలకు శిక్షణ కూడా ఇస్తాయట. అమెరికాలోని వర్జీనియా పాలిటెక్నిక్ ఇన్స్టిట్యూట్ అండ్ స్టేట్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో జరిగిన పరిశోధన వివరాలు 'కరెంట్ బయాలజీ' అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

పన్నుల ప్రస్తావన ఉండని తొలి బడ్జెట్!

(మొదటి పేజీ తరువాయి)

చెప్పినప్పటికీ, మధ్యతరగతికి, రైతు [illegible] వరాలు ప్రకటించే అవకాశం ఉందని విశ్వసనీయవర్గాలు తెలిపాయి. రైతుల కోసం మార్కెటింగ్ సౌకర్యాల విస్తరణ, మధ్యతరగతి వారికి పన్ను మినహాయింపు వంటి ప్రకటనలు వెలువడే అవకాశం ఉందని చెప్పాయి. ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని ప్రస్తుతం ఉన్న రూ.2.5 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచితే 75లక్షల మందికి ప్రయోజనం కలిగే అవకాశం ఉంది.

వనజాతరకు పోటెత్తిన భక్తజనం

- అమ్మల సన్నిధిలో ఎంపీలు, ఎమ్మెల్యేలు
- ఆదివారం 5 లక్షలమంది సందర్శన!

ఈనాడు డిజిటల్ – జయశంకర్ భూపాలపల్లి

మహాజాతర ప్రారంభానికి ముందుగానే అమ్మల దర్శనానికి భక్తజనం పోటెత్తుతున్నారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మేడారం పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడింది. ఓ వైపు సాధారణ భక్తులు, మరో వైపు ప్రముఖుల రాకతో గద్దెల ప్రాంగణం భక్తజనంతో నిండిపోయింది. ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలతో తరలివస్తున్న భక్తులు తొలుత జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి సమ్మక్క, సారలమ్మలను దర్శించుకున్నారు. వనదేవతలకు చీర, సారె, పూలు, పండ్లు, ఎత్తుబంగారం సమర్పించుకొని మొక్కులు తీర్చుకున్నారు. సెలవురోజు కావడంతో రద్దీ పెరిగింది. మధ్యాహ్నం మూడు గంటకే సుమారు 3 లక్షల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నట్లు దేవాదాయశాఖ అధికారులు తెలిపారు. ఉదయం నాలుగు గంటల నుంచే భక్తుల దర్శనాలు ఆరంభమయ్యాయి. అర్ధరాత్రి వరకు దర్శనాలు కొనసాగాయి. ఆదివారం ఒక్కరోజే సుమారు 5 లక్షల మందికిపైగా దర్శించుకున్నారని అంచనా. ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు మహా జాతర జరగనుంది. ఆ సమయంలో రద్దీని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా మేడారానికి భక్తులు బారులు తీరుతున్నారు. దర్శనం సాఫీగా జరిగేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ సమస్యలు ఎదురుకాకుండా పోలీస్‌శాఖ వన్‌వేను అందుబాటులోకి తెచ్చింది.



ఆదివారం గద్దెల వద్దకు పోటెత్తిన భక్తులు

మేడారం సమ్మక్క, సారలమ్మల దర్శనానికి ఆదివారం ప్రముఖుల తాకిడి కనిపించింది. ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, ఎంపీలు సీతారాంనాయక్, బాల్క సుమన్, పసునూరి దయాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండ విశ్వేశ్వర్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, వరంగల్ మేయర్ నరేందర్ తదితరులు గిరిజన దేవతలను దర్శించుకున్నారు. ఎంపీలు హెలికాప్టర్ ద్వారా మేడారానికి చేరుకుని అక్కడినుంచి ప్రత్యేక వాహనాల ద్వారా గద్దెల వద్దకు వచ్చారు. దేవాదాయశాఖ అధికారులు వారికి సాదర స్వాగతం పలికారు. అమ్మల దర్శనం అనంతరం వారు స్థానిక అతిథిగృహం వద్ద కాసేపు విశ్రాంతి తీసుకొని తిరుగుపయనమయ్యారు.

నేటి నుంచి హెలికాప్టర్ యాత్రలు

ఈనాడు, హైదరాబాద్: లక్షలాది భక్తులు పోటెత్తే పరిస్థితుల్లో సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్దకు సులభంగా తీసుకెళ్లేందుకు హెలికాప్టర్ సిద్ధమవుతోంది. తంబీ ఏవియేషన్స్ హెలికాప్టర్ జాయ్ రైడ్‌ను ఏర్పాటు చేసింది. తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఈ హెలికాప్టర్ రైడ్‌ను ఏర్పాటు చేశామని తంబీ ఏవియేషన్స్ నిర్వాహకుడు గోవింద్ తెలిపారు. సోమవారం(ఈ నెల 29) నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకూ ఉదయం 7.30 - సాయంత్రం 5 గంటల మధ్య హెలికాప్టర్ జాయ్‌రైడ్ ఉంటుందన్నారు. వరంగల్ నుంచి మేడారానికి తీసుకెళ్లేందుకు... అక్కడ వీఐపీ టిక్కెట్ ద్వారా అమ్మవారి గద్దెలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకొని తిరిగి మళ్లీ వరంగల్‌కు వచ్చేందుకు రూ.13,999లు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ఈ క్రతువుకు దాదాపు రెండున్నర గంటల నుంచి 3 గంటలు పడుతుందని నిర్వాహకులు తెలిపారు. మేడారం జాతరకు వచ్చే లక్షలాది భక్తులను.. అక్కడి భక్త సమూహాలను, పరిసరాలను ఆకాశం నుంచి చూసేందుకు హెలికాప్టర్ జాయ్ రైడ్‌ను ఏర్పాటు చేశారు. 10 నిమిషాల పాటు సాగే గగన యాత్రకు రూ.2599లు చెల్లించాల్సి ఉంటుంది. హెలికాప్టర్‌లో ఒకేసారి ఆరుగురు ప్రయాణించవచ్చని చెప్పారు. పూర్తి వివరాలకు.. 8629893491 నంబరులో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

ఆదిలాబాద్‌లో 6 డిగ్రీలు

ఈనాడు, హైదరాబాద్: ఆదిలాబాద్‌ [illegible] శీతల గాలులు వీస్తున్నాయి. ఆదివారం తెల్లవారుజామున అత్యల్పంగా ఆదిలాబాద్‌లో 6, మెదక్, రామగుండం, [illegible]లలో 13 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం సంచాలకుడు వై.కె.రెడ్డి తెలిపారు. ఉష్ణోగ్రతలు సాధారణంకన్నా 5 డిగ్రీలకు పైగా తక్కువగా ఉన్నందున చలి అధికంగా ఉంటోంది. ఉత్తరాది నుంచి వీస్తున్న శీతల గాలులే దీనికి కారణమని వై.కె.రెడ్డి తెలిపారు. శీతాకాలం చివరిదశకు వచ్చిందని, మరో వారం తరవాత క్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగుతాయని వివరించారు.









యువకుణ్ని మింగిన ఎమ్ఆర్ఐ

(మొదటి పేజీ తరువాయి)

అతడికి తీవ్రగాయాలయ్యాయి. అదేసమయంలో సిలిండర్ తెరుచుకోవడంతో పెద్ద మొత్తంలో ద్రవరూప ఆక్సిజన్‌ను రాజేశ్ పీల్చుకున్నాడు. ఫలితంగా వెంటనే అతడు ప్రాణాలు కోల్పోయాడు. అతిశీతలంగా ఉండే ద్రవరూప ఆక్సిజన్‌ను పీల్చితే శరీరానికి తీవ్రమైన హాని కలుగుతుంది.

ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని మృతుడి బంధువులు ఆరోపించారు. చిన్నపాటి లోహపు వస్తువులను సైతం ఎమ్ఆర్ఐ గదిలోకి అనుమతించకూడదు. అయితే సిలిండర్‌ను గదిలోకి తీసుకువెళ్లవచ్చా అని రాజేశ్ ముందుగానే సిబ్బందిని ప్రశ్నించాడని అతడి బంధువులు తెలిపారు. యంత్రం క్రియాశీలంగా లేదని.. ప్రమాదమేమి ఉండదని సిబ్బంది బదులుచెప్పినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీసులు ఓ వైద్యుడు సహా ముగ్గురు ఆసుపత్రి సిబ్బందిని అరెస్టు చేశారు. మహారాష్ట్ర ప్రభుత్వం మృతుడి కుటుంబానికి రూ.5 లక్షల పరిహారాన్ని ప్రకటించింది.

చలో మేడారం

(మొదటి పేజీ తరువాయి)

మేడారం జనసంద్రంగా మారనుంది. వనదేవతలైన సమ్మక్క, సారలమ్మ అమ్మవార్లను గద్దెల మీదికి తీసుకొని రావడం, తిరిగి వన ప్రవేశం చేసే సందర్భాలను మహత్తరమైనవిగా భక్తులు భావిస్తుంటారు. ఈ సందర్భంగా అమ్మవార్ల దర్శనం కోసం లక్షల సంఖ్యలో తరలివస్తారు. ప్రాంగణంతోపాటు చుట్టూ పది కిలోమీటర్ల వరకు ప్రాంతమంతా నిండిపోతుంది. చాలా మంది భక్తులు జాతర ముగిసేవరకు ఉంటారు. జాతరకు పెరుగుతున్న రద్దీని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఈసారి సౌకర్యాలను మరింతగా విస్తరించింది. మొత్తం 4500 బస్సులను ఆర్టీసీ నడపనుంది. సోమవారం నుంచి వీటి సేవలు ప్రారంభమవుతాయి. మంగళవారం నుంచి పది ప్రత్యేక రైళ్లను నడపనున్నారు. దీంతో పాటు పర్యాటకశాఖ సైతం వంద బస్సులను నడుపుతోంది. ఈసారి ప్రభుత్వం ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరితో పాటు మంత్రులకు జాతర పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించింది. కడియం అక్కడే ఉండి సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రజాప్రతినిధులు మేడారాన్ని తరచూ సందర్శించి ఏర్పాట్లపై అధికారులకు సూచనలు ఇస్తున్నారు. మరో వైపు జాతర పర్యవేక్షణ కోసం 150 మంది రాష్ట్రస్థాయి అధికారులు అక్కడికి చేరుకోనున్నారు. ఇప్పటికే 29వేల మంది అధికారులు, సిబ్బందిని జాతర విధుల కోసం ప్రభుత్వం నియమించింది. పదివేల మంది పోలీసులు విధుల్లో ఉంటారు. నాలుగు రోజుల పాటు జరిగే జాతర అత్యంత కీలకం కావడంతో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకుంటారు. వాహనాల రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ సమస్యలు ఏర్పడకుండా మార్గనిర్దేశం చేయడానికి వీలుగా ఈ నెల 31నుంచి మూడోతేదీ వరకు వరంగల్- మేడారం రహదారి పొడవునా పోలీసులను మోహరించనున్నారు.

2న కుటుంబసమేతంగా సీఎం రాక

మేడారం జాతరకు వచ్చే నెల రెండో తేదీన ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబ సమేతంగా హాజరుకానున్నారు. గత జాతర సమయంలో సీఎం జాతరకు హాజరుకావాలని భావించినా తాను వెళ్తే భక్తులు ఇబ్బంది పడతారని భావించి ఆయన మానుకున్నారు. ఈసారి జాతర కమిటీ, పూజారులు, ఉపముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజాప్రతినిధులు కోరడంతో హాజరు కావాలని నిర్ణయించారు. జాతరకు గవర్నర్ నరసింహన్‌ను సీఎం కేసీఆర్ ఆహ్వానించగా అంగీకరించారు. ఆయన పర్యటన ఖరారు కావాల్సి ఉంది. రాష్ట్ర మంత్రులు, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లతోపాటు ఇతర ప్రముఖులు పెద్దఎత్తున హాజరుకానున్నారు. ఈసారి జాతరకు కేంద్రమంత్రులనూ ప్రభుత్వం ఆహ్వానించింది. జాతరను జాతీయ పండగగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. కేంద్రమంత్రులు వస్తే ఈ డిమాండ్ నెరవేరే అవకాశం ఉందని భావిస్తున్నారు. వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఈసారి జాతరలో రాజకీయ కోలాహలం కనిపించనుంది. దీనిని పురస్కరించుకొని అతిథి మర్యాదల పరంగా ఇబ్బందులు రాకుండా అధికార యంత్రాంగం ఏర్పాటు చేస్తోంది.

గ్రహం అనుగ్రహం

29–1–2018 సోమవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర రుతువు; మాఘ మాసం; శుక్ల పక్షం
త్రయోదశి: రా. 12-25 తదుపరి చతుర్దశి
ఆర్ద్ర నక్షత్రం: రా. 9-51 తదుపరి పునర్వసు
అమృత ఘడియలు: మ. 12-31 నుంచి 2-01 వరకు
వర్జ్యం: ఉ. 7-18 నుంచి 8-48 వరకు
దుర్ముహూర్తం: మ. 12-34 నుంచి 1-19 వరకు
తిరిగి మ. 2-49 నుంచి 3-34 వరకు
రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు
సూర్యోదయం: ఉ.6-38; సూర్యాస్తమయం: సా.5-49

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	6.3	31.5
రామగుండం	12.6	30.6
కరీంనగర్	13.0	31.0
నిజామాబాద్	14.0	30.0
హన్మకొండ	14.0	31.0
హైదరాబాద్	15.3	30.5
గుంటూరు	17.0	32.5
అనంతపురం	17.4	31.7
మహబూబ్‌నగర్	17.5	33.2
సూర్యాపేట	19.0	34.0
తిరుపతి	20.0	30.9
ఖమ్మం	22.0	30.0

క్షణికావేశంలోనే హత్య

- నల్గొండ పురపాలిక ఛైర్‌పర్సన్ భర్త హత్య వివరాలు వెల్లడించిన పోలీసులు
- మొత్తం 11 మంది నిందితుల గుర్తింపు
- వీరిలో 8మంది అరెస్టు.. పరారీలో ముగ్గురు
- హత్యలో రాజకీయ కుట్ర కోణం లేదని ఎస్పీ స్పష్టీకరణ



శ్రీనివాస్ హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు, పక్కన ఏఎస్పీ పద్మనాభరెడ్డి, హత్యకేసు విచారణ ప్రత్యేకాధికారి శ్రీధర్. చిత్రంలో వెనుకవైపు నిలుచున్న నిందితులు

ఈనాడు - నల్గొండ

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నల్గొండ పురపాలిక ఛైర్‌పర్సన్ బొడ్డుపల్లి లక్ష్మి భర్త శ్రీనివాస్(45) హత్యకేసులో నిందితులను పోలీసులు ఆదివారం మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. శ్రీనివాస్‌ను ప్రధాన నిందితులు క్షణికావేశంలోనే హత్య చేసినట్లు విచారణలో వెల్లడైందని ఎస్పీ శ్రీనివాసరావు వెల్లడించారు. అన్ని కోణాల్లో ఆరు బృందాలతో కేసును విచారించామని.. ఇందులో స్థానిక పోలీసుల భాగస్వామ్యం, రాజకీయ కుట్ర కోణం లేదని స్పష్టం చేశారు. హత్యలో 11మంది పాల్గొన్నారని, వీరిలో 8మందిని అరెస్టు చేశామని.. ముగ్గురు పరారీలో ఉన్నారన్నారు. ఎస్పీ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఈనెల 24వతేదీ..బుధవారం సాయంత్రం 7 గంటల సమయంలో ఈ హత్య కేసులో ఏ1, ఏ3 నిందితులుగా ఉన్న చింతయల్ల రాంబాబు, శరత్ పట్టణంలోని [illegible]నగర్‌లో ఓమిర్చి బండి వద్ద యజమా[illegible]తో గొడవపడి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న ఏడోవార్డు కౌన్సిలర్ కుమారుడు మెరుగు గోపి రాంబాబు, శరత్‌లను బండి వద్దకు రప్పించారు. కొంత సమయానికి శ్రీనివాస్ అనుచరులైన మాంద్ర మల్లేశ్, సామ్రాట్ అలియాస్ చక్రి, దుర్గయ్య బండి వద్దకు చేరుకున్నారు. రాంబాబు, గోపిల మధ్య వివాదం పెరిగింది. అక్కడున్న శ్రీనివాస్ అనుచరులు చక్రితో సహా మరికొందరు గోపిని అక్కడినుంచి పంపేశారు. ఈవిషయాన్ని గోపి బొడ్డుపల్లి శ్రీనివాస్‌కు చెప్పారు. రాత్రి 11.30 గంటల సమయంలో తన అనుచరుడు మాతంగి మోహన్‌తో కలిసి శ్రీనివాస్ ద్విచక్రవాహనంపై ఘటనాస్థలికి వెళ్లారు. ఘర్షణ విషయం, గోపిపై దాడి గురించి రాంబాబు, శరత్‌లను శ్రీనివాస్ అడుగుతున్న సమయంలో వాగ్వాదం చేటుచేసుకుంది. ఇద్దరిపై శ్రీనివాస్ చేయి చేసుకున్నారు. ఒకరినొకరు కొట్టుకుంటూ కుడివైపునున్న పెద్ద మోరీ(డ్రైన్)లో పడ్డారు. మళ్లీ రాంబాబు, శ్రీనివాస్ ఎడమవైపునున్న మోరీలో పడ్డారు. శ్రీనివాస్ ముఖంపైకి మల్లేశ్ సిమెంటు రాయి విసిరారు. నన్నే కొడతావా అని మల్లేశ్‌ను బెదిరించడంతో మరో బండరాయిని శ్రీనివాస్ తలపై వేశారు. డ్రైన్‌లో నుంచి బయటకు వచ్చిన రాంబాబు ఇంకో రాయిని తలపై వేయడంతో శ్రీనివాస్ అక్కడికక్కడే మరణించారు. రాత్రి 11.40-12.20 గంటల మధ్యలో హత్య జరిగిందని ఎస్పీ వెల్లడించారు. పరారీలో ఉన్న వారిలో ప్రధాన నిందితులు రాంబాబు, మల్లేశ్, శరత్‌లను శనివారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నామని మిగతావారిని ఆదివారం ఉదయం అరెస్టు చేశామని చెప్పారు. ఏ1, ఏ2కు హైదరాబాద్‌లో ఆశ్రయం కల్పించిన ప్రసాద్‌ను ఏ11గా నిందితుల జాబితాలో చేర్చారు. త్వరలో మరిన్ని వివరాలు తెలుస్తాయని ఎస్పీ తెలిపారు. అదనపు ఎస్పీ పద్మనాభరెడ్డి, హత్యకేసు విచారణ ప్రత్యేకాధికారి శ్రీధర్ పాల్గొన్నారు.

ప్రశ్నలకు సమాధానాలు దాటవేత: శ్రీనివాస్ మరణించారన్న విషయం ఎవరు తెలిపారన్న విలేకరుల ప్రశ్నకు పోలీసులు సమాధానాలు దాటవేశారు. తొలుత మృతుడి భార్య ద్వారానే తెలిసిందన్న పోలీసులు, తర్వాత మాటమార్చారు. హత్య కేసులో సమయానికి.. పోలీసులు తెలిపిన దానికి పొంతన కుదరడం లేదని బాధిత కుటుంబీకులు ఆరోపిస్తున్నారు.

పోలీసులది కట్టుకథ

- ఎమ్మెల్సీ రాజగోపాల్‌రెడ్డి



నల్గొండ పురపాలిక, న్యూస్‌టుడే: బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్యపై పోలీసుల విచారణ తీరు హాస్యాస్పదంగా ఉందని, ప్రభుత్వానికి కొమ్ముకాస్తున్న పోలీసులు చెప్పినవన్నీ కట్టుకథలే అని ఎమ్మెల్సీ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం నల్గొండలోని మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మి నివాసంలో విలేకరులతో మాట్లాడారు. రాజకీయంగా ఎదుర్కోలేని వ్యక్తులను కాపాడేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారన్నారు. నయీం కంటే ఎమ్మెల్యే వేముల వీరేశం వల్లే సమాజానికి చేటని పేర్కొన్నారు.

ఎస్పీ ప్రకటన అవాస్తవం

- లక్ష్మి, నల్గొండ పురపాలిక ఛైర్‌పర్సన్



శ్రీనివాస్‌ది రాజకీయ హత్యే. ఈఘటన వెనక నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం, మంత్రి జగదీశ్ రెడ్డి, నియోజకవర్గ తెరాస ఇన్‌ఛార్జి కంచర్ల భూపాల్‌రెడ్డి ఉన్నారు. న్యాయం కోసం త్వరలోనే ప్రగతి భవన్‌ను ముట్టడిస్తాం. శ్రీనివాస్ మరణించిన విషయాన్ని నేను చెప్పినట్లు ఎస్పీ ప్రకటించడం అవాస్తవం. హత్య కేసును సీబీఐకి అప్పగించాలి. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే ఆమరణ నిరాహార దీక్షకు పూనుకుంటాను.

ఫర్నిచర్ వ్యాపార రారాజు ఇంగ్వర్ కంప్రాడ్ మృతి

ఐకెఈఏ'తో ప్రపంచ ప్రఖ్యాతి



స్టాక్‌హోం: ప్రపంచవ్యాప్తంగా తనదైన ఫర్నిచర్ సామ్రాజ్యాన్ని స్థాపించిన అపర కుబేరుడు, ఐకెఈఏ వ్యవస్థాపకుడు ఇంగ్వర్ కంప్రాడ్ మరణించారు. ఆయన వయసు 91 సంవత్సరాలు. శనివారం నిద్రలోనే ఆయన ప్రశాంతంగా మరణించినట్లు ఐకెఈఏ సంస్థ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. 1943లో ఆయన ఐకెఈఏ ఫర్నిచర్‌ను స్థాపించారు. విడివిడి భాగాలుగా ఉంటూ...ఎక్కడికక్కడే చక్కగా బిగించుకునేందుకు వీలుగా ఉండే 'ఫ్లాట్ ప్యాక్ ఫర్నిచర్'ను తయారుచేసిన ఆయన ప్రపంచవ్యాప్తంగా ఆరోజుల్లో పెద్ద సంచలనమే సృష్టించారు. ఇతర ప్రాంతాలకు చేరవేయాలనుకున్నప్పుడు విడివిడిభాగాలుగా విడదీసిన ఫర్నిచర్‌ను ఒక చక్కని ప్యాక్‌లాగా చేయగలిగిన ప్రత్యేకత ఐకెఈఏ ప్రత్యేకత.

భారత సైనిక వసతుల నిర్మాణానికి సీషెల్స్ అనుమతి

దిల్లీ: తమ భూభాగంలో భారత సైనిక మౌలిక వసతుల నిర్మాణానికి ద్వీపదేశం సీషెల్స్ అంగీకారం తెలిపింది. ఈ మేరకు ఇరు దేశాల మధ్య ఉన్న ఒప్పందాన్ని సవరించారు. శనివారం విక్టోరియాలో దీనిపై భారత విదేశాంగ కార్యదర్శి ఎస్.జైశంకర్ సంతకం చేశారు. ఫలితంగా సీషెల్స్‌లోని అసంప్షన్ ద్వీపంలో భారత్ సైనిక వసతులను ఏర్పాటు చేసుకునేందుకు వీలు కలుగనుంది. దీంతో హిందూ మహాసముద్రంపై భారత్ ఆధిపత్యాన్ని పెంచేదిశగా అడుగులు పడ్డాయి.

సబ్ రిజిస్ట్రార్లుకు అనుబంధంగా తహసీల్దార్లు

- వచ్చే నెల మొదటివారంలో శిక్షణ షురూ
- రుసుం వసూళ్లు, నిబంధనలపై అవగాహన

ఈనాడు, హైదరాబాద్: రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల విభాగాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తెచ్చే ప్రయత్నంలో భాగంగా ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది. ఫిబ్రవరి మొదటి వారంలో తహసీలార్లు, ఉప తహసీల్దార్లకు సబ్‌రిజిస్ట్రార్ల శిక్షణ ఇవ్వనున్నారు. దశల వారీగా చేపట్టనున్న ఈ కార్యక్రమంలో ఒక్కొక్కరిని వారం పాటు సబ్ రిజిస్ట్రార్లతో అనుసంధానం చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. రిజిస్ట్రేషన్లు జరిగే విధానం, నిర్వహించాల్సిన రిజిష్టర్లు, రుసుము వసూళ్లు, నిబంధనల అమలుపై అవగాహన కల్పించేందుకు ఈ ప్రయోగాత్మక శిక్షణ ఉపయోగపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు భూదస్త్రాల ప్రక్షాళన కొలిక్కి వచ్చిన క్రమంలో పాస్‌పుస్తకాల ముద్రణపై సీసీఎల్‌ఏ అధికారులు దృష్టిసారించారు. మార్చి 11న పుస్తకాలను పంపిణీ చేయనుండగా ముద్రించే ముందు వాటిని మరోసారి వీఆర్‌ఓ, ఆర్ఐ, తహసీల్దార్ల పరిశీలనకు పంపనున్నారు. ఏవైనా పొరపాట్లు ఉంటే వాటిని సవరించేందుకు అవకాశం కల్పించారు. పట్టాపాసుపుస్తకాల ముద్రణలో ఇప్పటివరకు భూ దస్త్రాల్లో స్పష్టత వచ్చినంత వరకే చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. వ్యవసాయేతర భూములకు సంబంధించి పాసుపుస్తకాలు ముద్రించే అవకాశాలు లేనట్లు తెలుస్తోంది.

తహసీల్దార్ల కార్యాలయాలన్నింటికీ ఒకే రంగు

తహసీల్దారు కార్యాలయాల్లోనే ఇకపై రిజిస్ట్రేషన్ల సేవలు అందుబాటులోకి తెస్తున్న నేపథ్యంలో దానికి అనుగుణంగా కార్యాలయాలను తీర్చిదిద్దే చర్యలు చేపట్టారు. సబ్ రిజిస్ట్రారు విధులు చేపట్టేలా కార్యాలయాల్లో సిబ్బంది నియామకం, మౌలిక సౌకర్యాల ఏర్పాటుకు రెవెన్యూ యంత్రాంగం జాబితా సిద్ధం చేస్తోంది. రెవెన్యూ సేవల్లో తీసుకొచ్చిన మార్పులకు తోడు తహసీల్దార్ల కార్యాలయాన్నీ ఒకే రకంగా కనిపించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రాష్ట్రంలోని అన్ని తహసీల్దార్ల కార్యాలయాలకు ఒకే రంగు(యూనిక్) వేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

వచ్చే బడ్జెట్‌లో దివ్యాంగులకు మరిన్ని నిధులు

- దివ్యాంగుల కార్పొరేషన్ ఛైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి

ఈనాడు, హైదరాబాద్: వచ్చే తెలంగాణ బడ్జెట్‌లో దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం మరిన్ని నిధులు కేటాయిస్తుందని, వారికి మరింత అండగా నిలుస్తుందని దివ్యాంగుల కార్పొరేషన్ ఛైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి వసతిగృహాల నిద్ర కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. హైదరాబాద్ చంపాపేటలోని దివ్యాంగుల వసతిగృహాన్ని సందర్శించి విద్యార్థుల సమస్యలు తీసుకున్నారు. వారితో కలిసి భోజనం చేశారు. తెలంగాణ ప్రభుత్వం దివ్యాంగులకు దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. దివ్యాంగులు బాగా చదువుకొని అభివృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

టీపీటీఎఫ్ డిమాండ్

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) డిమాండ్ చేసింది. సంఘం రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశం ఆదివారమిక్కడ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఏపీటీఎఫ్ పూర్వ అధ్యక్షులు ఎ.నర్సింహారెడ్డి మాట్లాడుతూ..రాష్ట్రం ఏర్పడిన తర్వాత విద్యా రంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు సంబంధించిన సమస్యలు ఇప్పటీ వరకు ఒక్కటీ పరిష్కారం కాలేదన్నారు. ప్రపంచ బ్యాంకు నమూనాను అమలు చేస్తూ పెట్టుబడులు, లాభాలకు ప్రాధాన్యత ఇస్తూ విద్యారంగం నుంచి పూర్తిగా వైదొలగడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఆ క్రమంలోనే నూతన పెన్షన్ విధానం(సీపీఎస్) అమలుకు శ్రీకారం చుట్టిందన్నారు. పాత పింఛను విధానాన్నే కొనసాగించాలని కోరారు. ఏకీకృత సర్వీస్ నిబంధనలు అమలు కావడంలో ఉన్న ఇబ్బందులను తొలగించేలా పాలకులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బి. కొండల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వి.మనోహర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

అటల్ భూజల్ యోజనకు రూ.6,000 కోట్లు

దిల్లీ: భూగర్భ జలాల పెంపునకు ఉద్దేశించిన అటల్ భూ జల్ యోజన(ఏబీవై)కు కేంద్ర ప్రభుత్వం రూ.6,000 కోట్లు కేటాయించనుంది. గుజరాత్, మహారాష్ట్ర, హరియాణా, కర్ణాటక, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోని 78 జిల్లాల్లో దీన్ని అమలు చేయనుంది. ఈ మొత్తంలో రూ.3,000 కోట్లను ప్రపంచబ్యాంకు రుణంగా ఇవ్వనుంది. మంత్రివర్గం ఆమోదం అనంతరం ఈ పథకాన్ని అమలు చేయనుంది. ఈ పథకాన్ని 2016-17 బడ్జెట్‌లోనే ప్రకటించినా, వివిధ సాంకేతిక కారణాల వల్ల ఆలస్యమయింది.

ఆసియాన్‌తో చెట్టపట్టాల్

స్వప్రయోజనాలతో రాజీపడకుండానే శాంతి సద్భావాలతో ఇరుగు పొరుగు దేశాల ప్రగతిలో ఒక్కటిగా మీదడుగేస్తే ఎలాంటి అద్భుతాల్ని ఆవిష్కరించగలవో ఆసియాన్ (ఆగ్నేయాసియా దేశాల సంఘం) స్వర్ణోత్సవ కాంతుల్లో ప్రస్ఫుటమవుతోంది. ఆయా దేశాలతో రెండు వేల సంవత్సరాల సాంస్కృతిక బంధం ఉన్నా ఆసియాన్‌తో భారత్ నేరుగా జట్టుకట్టి పాతికేళ్లు అయింది. ఆ విధంగా స్వర్ణోత్సవ ఆసియాన్‌తో భారత్ రజతోత్సవ మైత్రికి దీపి గురుతుగా, గణతంత్ర వేడుకకు పది దేశాల అధిపతుల రాక- భిన్న రంగాల్లో దృఢతర బాంధవ్యానికి గట్టి పునాదులు ఏర్పరిచింది. ఆ సందర్భంగా వెలువడిన 'దిల్లీ ప్రకటన'- రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, భద్రత, అభివృద్ధి రంగాల్లో పరస్పర ప్రయోజనకరంగా వ్యూహాత్మక భాగస్వామ్యం పటిష్ఠం కావాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది. మొట్టమొదటి సారిగా సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రస్తావించిన ఇండియా-ఆసియాన్ ఉమ్మడి ప్రకటన సన్నిహిత సహకారంతో ఆ ముప్పును తిప్పికొట్టాలని తీర్మానించింది. విదేశీ ఉగ్రశక్తుల పీచమణిచేలా సమగ్ర వ్యూహ రచనకూ సమ్మతించిన ఉగ్ర నిరోధ పోరు ఉమ్మడి పోరు సాగాలంటోంది. భద్రత, వాణిజ్యం- ఈ రెండింటికీగల అగణిత ప్రాధాన్య దృష్ట్యా భారత్, ఆసియాన్లు స్పష్టమైన వైఖరితో ముందడుగేస్తున్నాయి. సమగ్ర ప్రాంతీయ ఆర్థిక భాగస్వామ్య ఒప్పందాన్ని సత్వరం కుదుర్చుకొంటే, మానవాళిలో దాదాపు సగం, ప్రపంచ స్థూల దేశీయోత్పత్తిలో మూడో వంతుకు ప్రాతినిధ్యం వహించే అద్భుత సమీకృత ఆసియా విపణి ఆవిష్కృతమవుతుందని సింగపూర్ ప్రధాని ప్రగాఢంగా అభిలషిస్తున్నారు. ఆసియాన్‌తో ఇండియాకు త్రివిధ రవాణా మార్గాలూ అందుబాటులోకొస్తే ప్రజల మధ్య మేలు జరుగుతుందంటూ, స్మార్ట్ సిటీ ప్రాజెక్టుల్లో ఇండియాతో తాము సహజ భాగస్వాములమనీ స్పష్టీకరిస్తున్నారు. ఆసియాన్ దేశాలతో పటిష్ఠ భాగస్వామ్యం ఇండియా పురోగతికి ఎంతో ఊపు ఉత్సాహం ఇవ్వనుందనడంలో సందేహం లేదు!

ఆసియా దేశాల మధ్య ఆర్థిక సమైక్యత, రాజకీయ పునరేకీకరణ సాధ్యం కావాలని భారతావని స్వాతంత్ర్యానికి నాలుగైదు నెలల ముందే పండిత నెహ్రూ కోరుకొన్నారు. పెద్ద చిన్న, గొప్ప పేదరాలతో పాటు పరస్పరం పొసగని వాతావరణంలో 1967 నాటి ఆగ్నేయాసియా దేశాలే చేరువ కాలేకపోయిన వాస్తవాన్ని విస్మరించకూడదు. దేశీయంగా ఆర్థిక సంస్కరణ శకానికి పురుడు పోసిన పీవీ హయాములోనే తూర్పు వాకిలి తెరవాలన్న (లుక్ ఈస్ట్) విధానం అమలులోకి వచ్చింది. నాడు ఆసియాన్‌లో సెక్టోరల్ భాగస్వామిగా కుదురుకొన్న భారత్, 1996నాటికి చర్చల్లో భాగస్వామిగా, 2002నాటికి సదస్సు స్థాయి భాగస్వామిగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకొంటూ వచ్చింది. 2012లో వ్యూహాత్మక భాగస్వామి హోదా అందుకొన్న ఇండియా మోదీ జమానాలోనే ఆ దేశాలతో కలిసి నడిచే (యాక్ట్ ఈస్ట్) విధానానికి మెరుగులు దిద్దింది. అంతర్జాతీయ ఒడంబడికల్ని కాలదన్నుతూ ట్రంప్ నేతృత్వంలోని అమెరికా క్రమంగా ముడుచుకుపోతుంటే, విస్తరణ కాంక్షతో అగ్రరాజ్య హోదా ఒడిసిపట్టేందుకు డ్రాగన్ చైనా దూకుడు ప్రదర్శిస్తున్న తరుణమిది. 2005 లగాయతు తూర్పు ఆసియా సదస్సు ద్వారా ఇండియా, చైనా, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లను భాగస్వాములుగా పరిగణిస్తూ విస్తృత విపణి అవకాశాలకు ఆసియాన్ బాటలు పరుస్తున్నా- దక్షిణ చైనా సముద్రంపై తనదే పెత్తనమంటూ బీజింగ్ చేస్తున్న దాదాగిరి ఫిలిప్పీన్స్, వియత్నాం, బ్రూనై, ఇండోనేసియా, మలేసియాలకు మింగుడుపడటం లేదు. ఈ నేపథ్యంలో- ఇండో పసిఫిక్ ప్రాంతంలో శాంతి సుస్థిరత సౌభాగ్యాల పరిరక్షణలో భారత్ కీలక భూమిక పోషించాలని ఆసియాన్ గట్టిగా ఆశిస్తోంది. ఎక్కడా బీజింగ్ పేరు ప్రస్తావించకుండానే, దక్షిణ చైనా సముద్రంలో ప్రవర్తనా నియమావళిని సత్వరం అమలులోకి తీసుకు రావాలంటున్న తీర్మానం ద్వారా డ్రాగన్‌కు ముకుతాడు సిద్ధం చేస్తోంది!

అమెరికాకు లేని నెయ్యంతో అద్భుత విజయ గాథ లిఖించిన ఆసియాన్- 2020నాటికి అయిదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అవుతుందని, 2030నాటికి తన పరిధిలో 50 కోట్లమంది పౌరుల్ని మధ్య తరగతిగా మార్చనుందని విశ్లేషణలు వెలువడుతున్నాయి. 'ఆసియాన్ అనుసంధానం 2025' పేరిట 2016లో వెలుగు చూసిన మాస్టర్ ప్లాను సుస్థిర మౌలిక సదుపాయాల పరికల్పన సహా డిజిటల్ ఆవిష్కరణలు, నిరంతర రవాణా సేవలు, పర్యాటక రంగ నిబంధనల సరళీకరణ ఉద్దేశించిన విస్తృత ప్రణాళికల్ని సిద్ధం చేసింది. ఆగ్నేయ అభివృద్ధి అవసరాల నిమిత్తం ఏటా 11 వేలకోట్ల డాలర్లు సేవల రంగంపై వ్యయీకరించనున్నామని, 2030నాటికి డిజిటల్ సాంకేతిక అభివృద్ధిపై 62,500 కోట్ల డాలర్లు వెచ్చిస్తామని మార్గదర్శక వ్యూహ పత్రం వెల్లడిస్తోంది. ఇండియా ఆసియాన్ ఉమ్మడి స్థూల దేశీయోత్పత్తి నాలుగున్నర లక్షల కోట్ల డాలర్లకుపైగా ఉండని, అక్కడా ఇక్కడా యువజన సంద్రం పోటెత్తుతోందంటున్న సింగపూర్ ప్రధానమంత్రి- సమధిక చొరవతో ముందడుగెయ్యాలేగాని విస్తృత అవకాశాల గని సాక్షాత్కరించబోదని భవిష్యద్దర్శనం చేస్తున్నారు. ఆసియాన్-ఇండియా ద్వైపాక్షిక వాణిజ్య పరిమాణం 7,100 కోట్ల డాలర్లు; 2022నాటికి దాన్ని 20 వేలకోట్ల డాలర్లకు పెంచాలన్న మోదీ ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలంటే- ఆసియాన్‌కు మరింత 'చేరువ' కాక తప్పదు. ఆసియాన్ ప్రతిపాదిస్తున్న ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యాన్ని ఔదలదాలిస్తే, 'భారత్‌లో తయారీ' మౌలిక లక్ష్యానికి విఘాతం కలుగుతుందని భారత్ ముందువెనకలాడుతోంది. ఇచ్చిపుచ్చుకొనే రీతిగా ఉభయ తారక వాణిజ్య వారధుల నిర్మాణానికి, సుస్థిర ఆర్థిక అభివృద్ధి వ్యూహాలతో 'ఆసియా శతాబ్ది' ఆవిష్కరణకు మోదీ ప్రభుత్వం చొరవ చూపాల్సిన సమయమిది!

కష్టనష్టాలే రైలు పట్టాలు

రైల్వేలను సంస్కరణల పథంలో పరుగు తీయిస్తున్నట్లు ఎన్డీఏ ప్రభుత్వం ఘనంగా చాటుతుంటే ఆర్థిక గణాంకాలు ఆందోళన రేకెత్తిస్తున్నాయి. రైల్వేలు ఖర్చు పెడుతున్న సొమ్ములో 57శాతమే తిరిగి వస్తున్నట్లు ప్రయాణికులు కొనే ప్రతి టికెట్‌పై రైల్వేశాఖ ప్రత్యేకంగా ముద్రిస్తోంది. అంటే ఖర్చు పెడుతున్న ప్రతి రూపాయిలో 43పైసలు తిరిగి రావడం లేదన్న సందేశాన్ని రైల్వేశాఖ నేరుగానే అందిస్తోంది. ఆర్థిక సమస్యలను దేశమంతటా చాటి చెప్పేందుకు రైల్వేశాఖ ప్రయత్నించడం బాగానే ఉన్నప్పటికీ- ఆ క్రమంలో చేపడుతున్న దిద్దుబాటు చర్యలు ఏ మేరకు ఆదాయం పెంచుతాయన్నది తరచి చూడాల్సిన అంశం. రైల్వే నిర్వహణ వ్యయం(ఓఆర్) గడచిన 16 ఏళ్ల చరిత్రలో అత్యధికంగా 2016-17లో 96.9 శాతానికి చేరింది. లెక్కలన్నీ పక్కాగా గణిస్తే ఈ ఖర్చు నిజానికి 110శాతం దాకా ఉంటుందని రైల్వే శాఖ మాజీ మంత్రి దినేష్ త్రివేదీ గత ఏప్రిల్‌లో లోక్‌సభలో అంకెలతో సహా ఉదహరించారు. వంద రూపాయలు సంపాదించడానికి రూ.110 ఖర్చు చేయాల్సిన ఆర్థిక దుస్థితి రైల్వేలో ఉందని ఆ శాఖను నిర్వహించిన మాజీ మంత్రే చెప్పడం గమనార్హం. ఇది రైల్వేల ఆర్థిక సంక్షోభానికి అద్దం పడుతోంది. ఈ పరిస్థితుల్లో ఎన్డీయే ప్రభుత్వం సంస్కరణల చర్యలనూ, అభివృద్ధి పనులనూ ప్రారంభిస్తోంది. దేశ చరిత్రలో తొలిసారిగా 'ముంబయి-అహ్మదాబాద్' హైస్పీడ్ రైలు మార్గం నిర్మాణానికి జపాన్, భారత ప్రధానమంత్రులు శంకుస్థాపన చేయడం గొప్ప మైలురాయి వంటిదే. ఇలాగే నాగపూర్-సికింద్రాబాద్ మార్గానికి రష్యా రైల్వేతో, కాజీపేట-చెన్నై మార్గంలో హైస్పీడ్ రైళ్లను నడిపేందుకు జర్మనీతో ఒప్పందాలు చేసుకున్నారు. దేశంలోని నాలుగైదు మార్గాల్లో రైళ్లను అత్యంత వేగంతో నడిపేందుకు వేల కోట్ల రూపాయలు వెచ్చించేందుకు పూనుకొంటున్న ప్రభుత్వం- మరోవైపు అనేక మార్గాల్లో ఏళ్ల తరబడి శంకుస్థాపన దశ దాటి ముందుకు సాగని పనులపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది కీలక చర్చగా మారింది. పలు మార్గాల్లో నిధుల కొరత కారణంగా కనీసం పట్టాలు వేసే దిక్కులేకుండా సతమతమవుతున్న దురవస్థ రైల్వే వ్యవస్థకు మాయని మచ్చలా మిగిలింది.

తరిగిపోతున్న మిగులు నిధులు

రైల్వేలకు సంబంధించి వాస్తవంగా వచ్చిన ఆదాయంకన్నా రూ.402.15 కోట్లు అధికంగా చూపారని 2016లో 'కాగ్' వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2017-18)లో రైల్వేల నిర్వహణ వ్యయం రూ.1.78 లక్షల కోట్లు ఉండవచ్చని నిరుడు ప్రవేశపెట్టిన బడ్జెట్లో అంచనా వినిపించారు. గతేడాదికన్నా ఇది దాదాపు రూ.16వేల కోట్లు అదనం. రైల్వేలో మిగులు నిధులు క్రమంగా తగ్గుతున్నాయి. దేశంలో సరకు రవాణా రైళ్లతోనే అత్యధిక ఆదాయం వస్తోంది. వీటిలో సైతం బొగ్గు తరలింపు వాటా 45శాతం దాకా ఉంది. కానీ గతేడాది బొగ్గు రవాణా ద్వారా వస్తుందనుకున్న ఆదాయ అంచనాల్లో 19 శాతం తగ్గుదల నమోదైంది. ప్రయాణికుల టికెట్లపై ఆదాయం 2015-17 మధ్యకాలంలో రూ.45,323 కోట్ల నుంచి రూ.47,678 కోట్లకు చేరినట్లు రైల్వేమంత్రి పీయూష్ గోయల్ ఇటీవల లోక్‌సభలో ప్రకటించారు. ఈ ఏడాది ఈ ఆదాయం 50వేల కోట్ల రూపాయలకు చేరువ కావచ్చన్నది తాజా అంచనా. దేశ ప్రయోజనాల కోసం కొన్ని రవాణా విభాగాల్లో నష్టాలు వస్తున్నా రైళ్లు నడుపుతున్నట్లు రైల్వేశాఖ రాజ్యసభకు తెలిపింది. సెకండ్ క్లాస్, నగరాల్లో సబర్బన్ టికెట్ల విషయంలో, నిత్యావసరాలను తక్కువ ధరలకు తరలించడం తదితర అంశాల్లో ఈ నష్టాలు వాటిల్లుతున్నట్లు తెలిపింది. ఈ నష్టాలు 2015-16లో రూ.35,959.59 కోట్లు. ఇప్పుడు మరింత పెరిగినట్లు తాజా అంచనా. రైల్వేలో ప్రజలకోసం వివిధ సదుపాయాలు కొనసాగించేందుకు చేస్తున్న వ్యయానికి, వాటిపై వస్తున్న ఆదాయానికి మధ్య అంతరం క్రమేణా విస్తరిస్తోంది. ప్రజలు స్వచ్ఛందంగా రైలు టికెట్లపై రాయితీని వదులుకునేందుకు 'గివ్ అప్' అంటూ ప్రభుత్వం ప్రత్యేకంగా పిలుపునిచ్చింది. ఆ నేపథ్యంలో వృద్ధుల కోటాలో రాయితీ వదులుకునేందుకు కొందరు స్పందించి ముందుకు వచ్చారు. దాంతో నిరుడు జులై 22నుంచి నవంబరు వరకు ప్రభుత్వానికి రూ.11.48 లక్షల ఆదాయం అదనంగా వచ్చింది. ఆర్థికంగా మంచి స్థితిలో ఉన్నవారికి రైల్వేల తరఫున రాయితీలు అందించడం సమంజసం కాదన్న వాదనలో వాస్తవముంది. వచ్చే అయిదేళ్లలో గూడ్సు, ప్రయాణికుల రైళ్ల సగటు ప్రయాణ వేగాన్ని మరో 25 కిలోమీటర్లు పెంచాలని 'మిషన్ ర్యాఫ్టార్' పేరుతో కొత్త లక్ష్యం నిర్దేశించారు. దేశ రాజధాని దిల్లీ నుంచి ముంబయి, హౌరా, చెన్నైలతో పాటు హౌరా-చెన్నై, చెన్నై-ముంబయి, హౌరా-ముంబయి వంటి ఆరు మార్గాలను ఇందుకోసం ఎంపిక చేశారు. గడచిన నాలుగేళ్ల ఎన్డీఏ పాలనలో రైల్వేల అభివృద్ధికి భారీగా పెట్టుబడులు పెట్టారు. అభి



బహుముఖ వ్యూహమే పరిష్కార మార్గం

వృద్ధి పనులకు పెట్టుబడి 2014-15లో రూ.54 వేల కోట్లుంటే ఈ ఏడాది అది ఏకంగా రూ.1.31 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా. కానీ రైల్వేల అంతర్గత సామర్థ్యాన్ని పెంచడం ద్వారా నిధుల మొత్తం పెంచే కృషి మాత్రం ఎక్కడిదక్కడే నిలిచిపోయింది. దేశంలో విద్యుదీకరణ చేయాల్సిన రైలుమార్గాల పొడవు 37,844 కిలోమీటర్లుందని, 2021-22కల్లా దీన్ని పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ విద్యుదీకరణ మార్గం తెలుగు రాష్ట్రాల్లోనే 2,574 కి.మీ.లున్నట్లు తేలింది. కానీ ఈ పనులకు అవసరమైన నిధులు ప్రస్తుత ధరల ప్రకారమే రూ.32,591 కోట్లు. వీటిని ఎప్పటిలోగా సమకూర్చగలరన్నదే అతి పెద్ద ప్రశ్న. పనులు ఆలస్యమయ్యే కొద్దీ అంచనా వ్యయం వేల కోట్ల రూపాయలు పెరగడం తథ్యం. ఈ ఆర్థిక సంవత్సరంలో నాలుగు వేల కి.మీ.ల విద్యుదీకరణ పూర్తిచేయాలనే లక్ష్యంలో తొలి తొమ్మిది నెలల్లో 59 శాతమే పూర్తయింది.

నరేంద్ర మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రైల్వేల అభివృద్ధికి బహుముఖ, సమగ్ర వ్యూహంతో ప్రణాళికాబద్ధంగా ముందుకెళుతున్న మాట వాస్తవం. గతంలో మాదిరిగా రాజకీయ కారణాలతో చివరిక్షణంలో రైల్వే బడ్జెట్లో ప్రతిపాదనలు ప్రవేశపెట్టే విధానాలకు పూర్తిగా స్వస్తి పలికారు. ఏకంగా రైల్వే బడ్జెట్‌నే సాధారణ బడ్జెట్లో కలిపేసి కొత్త సంస్కృతికి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల ఫలితంగానే ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఎనిమిది నెల (ఏప్రిల్-నవంబరు)ల్లో ప్రయాణికుల సంఖ్య 0.7శాతం, ఆదాయంలో 5.13శాతం వృద్ధి నమోదైంది. 2012-13 తరవాత ఇలాంటి వృద్ధి కనిపించడం ఇదే తొలిసారి అని రైల్వేశాఖ తాజాగా వెల్లడించింది. వచ్చే ఆర్థిక సంవత్సరాని(2018-19)కి రూ.1.46 లక్షల కోట్ల ప్రణాళికా వ్యయాన్ని కొత్త బడ్జెట్ కోసం రైల్వేశాఖ ప్రతిపాదిస్తున్నట్లు అంచనా. ఇందులో రూ.60 వేల కోట్లను కేంద్రమే సమకూర్చాలని ఆర్థిక శాఖను డబ్బు అడుగుతోంది. అభివృద్ధి పనులకోసం రూ.42వేల కోట్ల మేర అప్పులను వచ్చే ఏడాది తీసుకురావాలన్న ఆలోచన ఉంది. నిధులకోసం పూర్తిగా కేంద్రంపైనే ఆధారపడటమూ సరికాదు. సొంత ఆస్తులను గరిష్ఠంగా వినియోగించుకొని, సామర్థ్యం పెంచుకొని రూ.30 వేల కోట్ల మేర అదనపు సొమ్ము సమకూర్చుకోవాలన్నది మంచి ఆలోచన.

తెలుగు రాష్ట్రాల్లో...

తెలుగు రాష్ట్రాల్లో రైల్వే ప్రాజెక్టుల నిర్మాణాల్లో అలవి మాలిన జాప్యాన్ని నివారించాలి. తెలంగాణ, ఏపీలోని పలు ప్రాజెక్టుల పనులు నిధుల కొరతవల్ల ఏళ్ల తరబడి ముందుకు సాగడంలేదు. నాగపూర్-సికింద్రాబాద్, కాజీపేట-చెన్నై మార్గాల్లో అత్యంత వేగంగా రైళ్లను నడిపేందుకు అధ్యయనాల పేరిట, విదేశాలతో ఒప్పందాల పేరిట తెలుగువారిని ఊరిస్తున్నారు. కానీ ఎన్నో ఏళ్ల క్రితం అధ్యయనాలు పూర్తయినా పనులు జరగని ప్రాజెక్టులు దేశంలో అనేకం ఉన్నాయి. కొత్తపల్లి-మనోహరాబాద్ రైలుమార్గం నిర్మిస్తే తెలంగాణ అభివృద్ధికే కాకుండా రైల్వేకే లాభదాయకమని యూపీఏ హయాములో జరిగిన అధ్యయనంలోనే తేల్చారు. ఈ మార్గం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పట్టుబడుతోంది. చకచకా భూ సేకరణ వ్యవహారం ముగించి ఆశావహంగా ముందుకు సాగుతోంది. కానీ పట్టాలు వేసి, రైళ్లు నడపడం ఎప్పటిలోగా సాధ్యమనేదే తేలడం లేదు. ఇలాగే నడికుడి-వెంకటగిరి, భద్రాచలం రోడ్-కొవ్వూరు, కడప-బెంగళూరు, పటాన్‌చెరు-ఆదిలాబాద్, మణుగూరు-రామగుండం వంటి మార్గాలకు వేగంగా నిధులిచ్చి పట్టాలు వేస్తేనే తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి రైల్వేలు భవిష్యత్తులో మరింత ఉపకరిస్తాయి. ఆసియాలోనే అతిపెద్ద పారిశ్రామికవాడగా పేరొందిన పటాన్‌చెరుకు రైలుమార్గాలతో అనుసంధానం కల్పిస్తే కొత్త రాష్ట్రం అభివృద్ధికి దోహదపడుతుంది. ఏపీకి ప్రత్యేకంగా రైల్వేజోన్ ఏర్పాటు చేయాలని ఏళ్ల తరబడి ప్రజలు పోరాడుతున్నా ఎందుకు స్పందించడం లేదన్న దానికి కొత్త బడ్జెట్లోనే సమాధానం ఇవ్వాల్సి ఉంది. గతంలో ఉత్తరాది రాష్ట్రాల నేతలు రైల్వే మంత్రులుగా రాజ్యమేలినప్పుడు సొంత ఊళ్లకు, రాష్ట్రాలకు విచ్చలవిడిగా ప్రాజెక్టులు మంజూరు చేసుకుని, నిధులూ మళ్లించుకున్నారు. లాలు ప్రసాద్ యాదవ్ రైల్వేమంత్రిగా ఉన్నప్పుడు అత్తగారి ఊరికి రైలు వేసుకున్నారు. అప్పుడు గట్టిగా గళమెత్తి అడగకుండా తెలుగు ప్రాంతాలు నష్టపోయాయి. ఇప్పుడు ఎన్డీఏ ప్రభుత్వం పారదర్శక, సంస్కరణల పథంలో ముందుకు సాగుతోంది. ఈ పద్ధతిలో ఆశించిన నిధులు ఎప్పటికి వస్తాయి, కొత్త రైళ్లు, ప్రాజెక్టులు ఏనాటికి పూర్తవుతాయన్నది వేచి చూడాల్సి ఉంది. అనేక సంవత్సరాలుగా రైల్వే కేటాయింపులకు సంబంధించి తీవ్రంగా నష్టపోయిన తెలుగు రాష్ట్రాలకు ఈ బడ్జెట్లో న్యాయం చేయాల్సి ఉంది.

– మంగమూరి శ్రీనివాస్

అయిదేళ్లలో రైల్వేల అభివృద్ధికి అవసరమైన నిధులు (రూ.కోట్లలో)



పాత రైలు పట్టాల మార్పిడి, డబ్లింగ్	1,99,320
కొత్త మార్గాల నిర్మాణం, విద్యుదీకరణ	1,93,000
ఈశాన్య, కశ్మీర్ రాష్ట్రాలకు జాతీయ ప్రాజెక్టులు	39,000
రైల్వేభద్రత పనులు	1,27,000
అధునాతన ఐటీ వినియోగం, పరిశోధనలు	5,000
ఇంజిన్లు, కోచ్‌లు, వ్యాగన్ల మార్పిడి	1,02,000
ప్రయాణికులకు సదుపాయాలు	12,500
అత్యంత వేగంగల మార్గాలు	65,000
స్టేషన్ల అభివృద్ధి	1,00,000
ఇతర పథకాలు	13,200

ఆధారం: రైల్వేశాఖ విడుదల చేసిన అభివృద్ధి ప్రణాళిక

ప్రమాదాలు లేని ప్రయాణం



దేశంలో రైలు ప్రమాదాలను క్రమంగా తగ్గిస్తున్నట్లు ఇటీవల కేంద్రం ఘనంగా ప్రకటించింది. మోదీ ప్రభుత్వం వచ్చిన మొట్టమొదటి ఏడాది(2014-15) 135 ప్రమాదాలు జరిగితే, 2016-17లో అవి 104కి తగ్గాయి. ఇక ఈ ఏడాది గడచిన తొమ్మిది నెలల కాలంలో 49 ప్రమాదాలు జరిగాయని, అంతకుముందు ఏడాది ఇదే కాలవ్యవధిలో చోటుచేసుకున్న 87 ప్రమాదాలతో పోలిస్తే ఈ సంఖ్య బాగా తక్కువని- 2017 వార్షిక నివేదికలో రైల్వేశాఖ తెలిపింది. దేశంలో 'మిషన్ జీరో యాక్సిడెంట్'(సున్నా రైలు ప్రమాదాల మిషన్)ను 2016-17 బడ్జెట్‌లో ప్రకటించారు. దేశంలో నాలుగేళ్లలోగా ఒక్క రైలు ప్రమాదమూ జరగకుండా దాన్ని సున్నాకు చేర్చాలన్నది లక్ష్యం. కానీ గడచిన 21 నెలల కాలంలో 156 రైలు ప్రమాదాలు జరిగి, ఎన్నో ప్రాణాలు గాలిలో కలిశాయి. నిర్దేశించుకున్న గడువులో సగం పూర్తవుతోంది. దేశంలో రైలు ప్రమాదాల నివారణకు, ప్రయాణికుల భద్రతకు ప్రత్యేకంగా లక్ష కోట్ల రూపాయలతో 'రాష్ట్రీయ రైల్ సంరక్ష కోష్'(ఆర్ఆర్ఎస్‌కే) పేరుతో ప్రత్యేక నిధి ఏర్పాటు చేస్తున్నట్లు నిరుటి బడ్జెట్లో ప్రకటించారు. అయిదేళ్ల కాలవ్యవధిలో ఈ నిధిని ఖర్చు చేయడం ద్వారా రైల్వే భద్రతను మరింత పెంచాలన్నది లక్ష్యం. కానీ నిధులు ఎక్కడి నుంచి తెస్తారన్నది తేలాల్సి ఉంది. అనిల్ కకోద్కర్ నేతృత్వంలోని అత్యున్నత రైల్వే భద్రతా కమిటీ 2012లో ఇచ్చిన నివేదికలోని 106 సిఫార్సుల్లో 19 ఆచరణ సాధ్యంకానివని పక్కన పెట్టేశారు. మిగిలిన 89 సిఫార్సులను ఆమోదించినా వాటిలో ఇప్పటికి పాక్షికంగా లేదా పూర్తిగా అమలైనవి 65 మాత్రమే. పనులు ఈ తీరుగా నత్తనడకన సాగితే ప్రమాదాల సంఖ్య సున్నాకు చేరడం ఇప్పట్లో అసాధ్యమే.

'హజ్'పై హేతుబద్ధ నిర్ణయం



ఎ.సూర్యప్రకాశ్

హజ్ యాత్రికులకు ఇంత కాలం ఇస్తున్న సబ్సిడీని రద్దు చేయాలని నరేంద్ర మోదీ సర్కారు నిర్ణయించడం నిజంగా పెద్ద మలుపు. కుహనా లౌకికవాదానికి, మైనారిటీల బుజ్జగింపు విధానానికి క్రమంగా స్వస్తి చెప్పే ప్రయత్నమిది. గతంలో అధికారం చలాయించిన ఏ ప్రధాన పార్టీ కాని, సంకీర్ణ ప్రభుత్వాలు కాని ఈ సాహసం చేయలేకపోయాయి. హజ్ సబ్సిడీని రద్దు చేస్తే ముస్లిం ఓటర్ల ఆగ్రహానికి గురవుతామని అవి భయపడ్డాయి. దీన్ని పదేళ్లలో రద్దు చేయాలని 2012లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన దరిమిలా మోదీ ప్రభుత్వం ధైర్యంగా ముందడుగు వేసింది. హజ్ సబ్సిడీపై ఖర్చు చేస్తున్న మొత్తాన్ని ముస్లిం బాలికల చదువుపై వెచ్చిస్తామని ప్రకటించింది. 1990లో రూ.10 కోట్లుగా ఉన్న ఈ సబ్సిడీ 2013లో రూ.836 కోట్లకు పెరిగింది. ఒకప్పుడు ఏటా 20 వేలమంది యాత్రికులు ఈ రాయితీని వినియోగించుకుంటే ఇప్పుడు ఏటా 1.5 లక్షల మంది వినియోగిస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పు తరవాత ప్రభుత్వం హజ్ సబ్సిడీని రూ.400 కోట్లకు పరిమితం చేసింది.

పార్టీల ఊగిసలాట

హజ్ సబ్సిడీ మీద కాంగ్రెస్, భారతీయ జనతాపార్టీల మధ్య, వాటి సహచర పార్టీల మధ్య చాలాకాలంగా వివాదం నడుస్తోంది. ముస్లిం తదితర మైనారిటీ వర్గాల ఓట్లకు గాలం వేసే కాంగ్రెస్ వంటి పార్టీలు హజ్ సబ్సిడీ జోలికి వెళ్లడానికి భయపడేవి. భాజపా వంటి పార్టీలు ఈ సబ్సిడీని మొదటి నుంచీ వ్యతిరేకిస్తున్నాయి. హజ్ సబ్సిడీ కుహనా లౌకిక వాదానికి ప్రతీక అని అవి వాదిస్తున్నాయి. నిజమైన లౌకిక, ప్రజాస్వామ్య సమాజంలో అన్ని మత వర్గాలనూ సమానంగా పరిగణించాలి తప్ప ఏదో ఒక వర్గంపైనే వల్లమాలిన ప్రేమ ఒలకబోయడం సరికాదని భాజపా వాదిస్తూ వచ్చింది.

హజ్ సబ్సిడీని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించేటప్పుడు సుప్రీంకోర్టు తాను దేశంలోని ముస్లిములందరి తరఫున మాట్లాడటం లేదని స్పష్టం చేసింది. ఏది సరైన మతాచారమో, ఏది కాదో ముస్లిములకు వివరించడం తన పరిధిలో లేని విషయమని స్పష్టీకరించింది. అయితే హజ్ యాత్ర ఆర్థిక కోణం గురించి అత్యధిక ముస్లిం యాత్రికులకు తెలియకపోవచ్చునని, యాత్ర ఖర్చుల్లో పెద్ద భాగాన్ని ప్రభుత్వమే భరిస్తోందని తెలుసుకుంటే వారు ఇబ్బంది పడవచ్చునని కోర్టు వ్యాఖ్యానించింది. ఇస్లామిక్ మత గ్రంథాలను ఉటంకిస్తూ ఇలా సబ్సిడీ ఇవ్వడం మంచి పని కాకపోవచ్చునన్నది. హజ్ సబ్సిడీని పదేళ్లలో ఎత్తివేసి, దానికి కేటాయిస్తున్న నిధులను ముస్లిం వర్గ విద్యకు, ఇతర సామాజిక సంక్షేమ కార్యక్రమాలకు ఖర్చు చేయవచ్చునని సర్వోన్నత న్యాయస్థానం సూచిస్తోంది. సంక్షేమంపై చేసే ఖర్చు ఎక్కువ ఫలితమిస్తుందని సూచించింది.



ముస్లిముల విద్యాభివృద్ధికి నిధులు

గతంలో ప్రభుత్వం వివిధ కారణాల వల్ల హజ్ యాత్రపై పలు నిర్ణయాలు తీసుకుంది. ఉదాహరణకు 1967 నుంచి ఏటా ఒక సుహృద్భావ సంఘాన్ని హజ్‌కు పంపుతోంది. 1965లో భారత్-పాక్ యుద్ధం జరిగిన తరవాత హజ్ యాత్రను భారత్ వ్యతిరేక ప్రచారానికి ఉపయోగించుకోవాలని పాకిస్థాన్ చూసింది. ఈ దుష్ప్రభావాన్ని ఎదుర్కోవడానికి భారత్ ఏటా ఒక సంఘాన్ని హజ్ యాత్రకు పంపుతోంది. ప్రస్తుతం పాక్ ఇలాంటి సుహృద్భావ సంఘాలను పంపడం లేదు కాబట్టి భారత్ కూడా వాటికి స్వస్తి చెప్పాలి. అదీ కాకుండా హజ్ సుహృద్భావ సంఘ సభ్యులను ఒక పద్ధతి ప్రకారం ఎంపిక చేయడం లేదు. ఎవరిని పడితే వారిని, ఎంతమందంటే అంతమందినీ ఎడాపెడా ఎంపిక చేసేస్తున్నారు. దీనికి నిర్దిష్ట ప్రమాణాలను పాటించడం లేదు. ఇంతటి భారీ ప్రతినిధి వర్గాలను పంపడం వల్ల ప్రయోజనం శూన్యమని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. దీనికి బదులు సౌదీ అరేబియాలోని భారత రాయబారి ఎంపిక చేసిన ప్రసిద్ధ ముస్లిములను హజ్‌కు భారత ప్రతినిధులుగా పంపడం ఉత్తమం.

ప్రైవేటు రవాణా ఆపరేటర్లకు (పీటీఓలకు) కోటా కేటాయించడంపై గతంలో ప్రభుత్వాన్ని అనేక వ్యాజ్యాలు చుట్టుముట్టాయి. ఈ విషయంలోనూ సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవలసి వచ్చింది. భారత్ నుంచి ఏటా ఎంతమంది యాత్రికులు హజ్‌కు రావచ్చునో, ఒక్కో పీటీఓ ఎంతమంది యాత్రికులను తీసుకురావచ్చునో సౌదీ అరేబియా నిర్ణయిస్తూ ఉంటుంది. 2002 వరకు పీటీఓలకు వ్యక్తిగత కోటాలను నిర్దేశించిన సౌదీలు, ఆ తరవాత భారత ప్రభుత్వం అనుమతితోనే వారు యాత్రికులను తీసుకురావలసి ఉంటుందని ప్రకటించారు. పీటీఓల సంఖ్య కేవలం ఆరేళ్లలోనే 293 నుంచి 567కి పెరిగిందని 2011 నాటి మధ్యంతర ఉత్తర్వులో సుప్రీంకోర్టు గుర్తు చేసింది. హజ్ యాత్రికులను మత స్థలాలకు తీసుకెళ్లడం లాభసాటి వ్యాపారం కనుకే పీటీఓలు ఈ రంగంలో తమ పేర్లను నమోదు చేసుకుంటున్నాయనీ అభిప్రాయపడింది. భారత్, సౌదీ ప్రభుత్వాల ఒప్పందం ప్రకారం ఒక పీటీఓ తీసుకువచ్చే హజ్ యాత్రికుల సంఖ్య 50కి తగ్గకూడదు. ఇలా కోటా విధిస్తే పీటీఓలకు లాభమే తప్ప నష్టం లేదు. హజ్ యాత్ర నిర్వహణకు అనుమతి పొందిన ఏ పీటీఓకైనా రెండు నెలల సీజనులో సగటున రూ.35 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు లాభం వస్తుందని సుప్రీంకోర్టు లెక్కగట్టింది. పీటీఓలకు ఆ తరవాత చెప్పుకోదగిన వ్యాపారం లేకపోయినా సంవత్సరమంతా హాయిగా గడపవచ్చు.

మతాతీత భావన

కొన్ని మోసకారి సంస్థలు హజ్ కోటాను చేజిక్కించుకుని ఇతర పీటీఓలకు అమ్ముకొంటున్నాయి. హజ్ యాత్రలో గాయపడిన, అస్వస్థులైన యాత్రికులను వారి మానానికి వారిని వదిలివేస్తున్న పీటీఓలూ ఉన్నాయి. హజ్ యాత్ర వివిధ భాగాలుగా జరుగుతుంది. ఒక్కో భాగాన్ని నిర్దిష్ట కాలంలో మత నిబంధనల ప్రకారం పూర్తి చేయాల్సి ఉంటుంది. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని పీటీఓల నమోదు ప్రక్రియలో లొసుగులు దొర్లకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలని కోర్టు సూచించింది. హజ్ యాత్రకు ఇస్తున్న రూ.800 కోట్ల సబ్సిడీ కేంద్ర ప్రభుత్వానికి పెద్ద మొత్తం కాకపోవచ్చు. అయినా ఈ రాయితీని రద్దు చేయడం ద్వారా ప్రభుత్వం ఇచ్చిన సందేశమేమంటే- అన్ని మత వర్గాలనూ, సామాజిక వర్గాలనూ సమదృష్టితో చూస్తానని. ప్రభుత్వం ఇకపై సౌదీ అరేబియాకు సుహృద్భావ ప్రతినిధి వర్గాలనూ పంపకపోవచ్చు. మతపరమైన చర్యలకు దూరం జరగడం ద్వారా ప్రభుత్వం తాను మతాలకు అతీతమని చాటుకోగలుగుతుంది. అత్యధిక, అల్ప సంఖ్యాక వర్గాల మధ్య సౌమనస్య సాధనకు ఇది ఎంతో ఉపయోగకరం. తద్వారా ప్రభుత్వం 'సబ్ కా సాథ్ సబ్ కా వికాస్' అనే విధానాన్ని చిత్తశుద్ధితో అమలు చేసినట్లవుతుంది!

(రచయిత– ప్రసార భారతి ఛైర్మన్)

భక్తి లక్షణం

ధర్మ అర్థ కామ మోక్షాలనే చతుర్విధ మార్గాలు ఆది కాలం నుంచీ భారతీయుల జీవన ధ్యేయాలయ్యాయి. మొదటి మూడూ (త్రిపుటి) ఉత్కృష్టమైన మోక్షసాధనకు సాధనాలు. జ్ఞాన భక్తి కర్మయోగాలనేవి భగవద్గీత ఆరంభ కాలం నుంచే జీవనమార్గాలయ్యాయి. మానవుడు తన అభిరుచిని అనుసరించి, ఈ మూడు మార్గాల్లో దేన్నైనా స్వీకరించి లక్ష్యాన్ని సాధించవచ్చు.

బుద్ధిజీవులకు జ్ఞానమార్గం, భావనాశీలురకు భక్తి మార్గం, క్రియాశీలురకు కర్మమార్గం స్వీకారయోగ్యమవుతాయి. మానవ జీవనవిధానంలో భక్తి వినూత్న చైతన్యాన్ని సృష్టించింది.

ఇష్టదైవం పట్ల ప్రేమను 'భక్తి'గా నిర్వచిస్తారు. ఆ మార్గంలో మొదటి మెట్టు ప్రతీకోపాసన. అంటే, విగ్రహారాధన. విగ్రహాన్ని సాక్షాత్తు దేవతగా భావిస్తారు. ఆ బాహ్య పూజావిధానానికి పైమెట్టు- మానసిక ప్రయత్నం. భక్తుడు తన హృదయపీఠం పైకి ఇష్టదైవాన్ని ఆహ్వానించి, ప్రతిష్ఠించి, పూజిస్తాడు. 'అనన్య భక్తితో నన్ను ఎవరు ఆరాధిస్తారో, ఏ ఇతర భావాలూ లేక నన్నే ఎవరు ధ్యానిస్తారో, సదా అనుసరిస్తారో- వారి బాధ్యతలన్నీ నేనే నిర్వర్తిస్తాను' అంటాడు గీతాకారుడు. భగవంతుడి పట్ల ప్రేమానుబంధం ఎక్కువయ్యేకొద్దీ, మిగిలిన వాటిపై భక్తుడి విముఖత పెరుగుతుంటుంది. దాన్ని ఆధ్యాత్మిక పరిభాషలో 'వైరాగ్య భావన'గా పరిగణిస్తారు.

భక్తికి సంబంధించి, రెండు దృక్పథాలున్నాయి. ఒకటి- భక్తుడు స్వప్రయత్నంతో ఈశ్వరానుగ్రహం సంపాదించడం, లేదా దైవం మీదే భారమంతా మోపి 'సర్వాత్మ'గా ఆరాధించడం. రెండోది ప్రపత్తి. అంటే, బంధవిముక్తికి ప్రభు పాదాల్ని ఆశ్రయించడం. వీటిలో- మొదటిది మర్కట కిశోర న్యాయం. రెండోది మార్జాల కిశోర న్యాయం. మర్కటం (కోతిపిల్ల) ఎప్పుడూ తల్లి



పొట్టను పట్టుకొనే ఉంటుంది. ఆ తల్లి చెట్లపై ఎంతగా గెంతుతున్నా, దాన్ని పిల్ల వదలదు. మార్జాలం (పిల్లి) తన పిల్లను నోట కరచుకొని తీసుకుపోతుంటుంది. పిల్లి పిల్ల తన రక్షణ కోసం ఏమీ చేయదు. మొదటి మార్గంలో దైవానుగ్రహాన్ని భక్తుడు సంపాదించుకుంటాడు. రెండో మార్గంలో, దైవమే అనుగ్రహిస్తాడు. ప్రపత్తి అంటే ఇదే! ఈ రెండూ పూర్తి విరుద్ధమైన మార్గాలు కావు. ఇవి అన్యోన్యమైనవి. సహానుభూతిని కలిగించేవి.

'అంతర్యామివి నీవు, ఆడేటి బొమ్మను నేను, చెంతగాచుట నీ పని, సేవించుట నా పని...' అంటాడు అన్నమయ్య. ఏ ప్రాణి పట్లా ద్వేషభావం లేనివాడు; సర్వ ప్రాణుల మీద అవ్యాజమైన ప్రేమ, కరుణ గలవాడు భక్తుడు. అతడు విపరీతమైన మమత, అహంకారం- రెండూ లేనివాడు. సుఖం ప్రాప్తించినా, దుఃఖం కలిగినా సమభావం కలిగి ఉండేవాడు. క్షమాగుణం కలిగినవాడు. మనసు, శరీరం, ఇంద్రియాల్ని వశంలో ఉంచగలవాడు. సర్వకాల సర్వావస్థల్లోనూ సంతుష్టుడైనవాడే అసలైన భక్తుడు. అతడు భగవంతుడికే తన మనసును, బుద్ధిని అర్పణ చేసేంత గొప్పవాడు.

భక్తుడు అందరితోనూ సమభావంతో మెలగాలి. నిందాస్తుతులకు చలించకూడదు. ఈర్ష్య, భయం వంటి మనోవికారాలకు లొంగకూడదు.

భక్తుల్ని మూడు విధాలుగా గుర్తిస్తారు. 'భగవంతుడు అక్కడెక్కడో ఉన్నాడు. ఆయన వేరు, ఆ సృష్టి వేరు' అని భావించేవాడిది అధమ భక్తి. 'భగవంతుడు అంతర్యామి. లోపల నుంచి అందర్నీ నియంత్రిస్తాడు' అని తలచేవాడు మధ్యముడు. 'సర్వమూ భగవంతుడే' అని తలపోస్తాడు ఉత్తమ భక్తుడు. 'సకల తత్వాలూ భగవంతుడే... సృష్టి అంతటా ఆయనే నిండి ఉన్నాడు' అనే భావనే ఉదాత్త భక్తి!

– డాక్టర్ దామెర వేంకట సూర్యారావు

ప్రధానితో విదేశాలకు ఎవరెవరు వెళ్తున్నారు?

- ౩౦ రోజుల్లోగా వారి పేర్లు వెల్లడించండి
- పీఎంవోకు సీఐసీ ఆదేశాలు

దిల్లీ: ప్రధాని మోదీ విదేశీ పర్యటనలకు వెళ్తున్నపుడు ఆయన వెంట ఎవరెవరు వెళ్తున్నారో వెల్లడించాల్సిందిగా ప్రధాని కార్యాలయం(పీఎంవో)ను ప్రధాన సమాచార కమిషనర్(సీఐసీ) ఆర్.కె.మాథుర్ ఆదేశించారు. ప్రధాని బృందం వివరాలను బయటపెట్టడం జాతీయ భద్రత కారణాల రీత్యా సమంజసం కాదంటూ పీఎంవో వెలిబుచ్చిన అభ్యంతరాన్ని ఆయన తోసిపుచ్చారు. ప్రధాని బృందంలో భద్రతా సిబ్బందితోపాటు భద్రత వివరాలతో సంబంధమున్నవారి సమాచారం మినహా ఇతర వ్యక్తుల పేర్లను 30 రోజుల్లోగా తెలియజేయాలని సూచించారు. ప్రధాని వెంట విదేశీ పర్యటనలకు వెళ్తున్నవారి వివరాలు కోరుతూ దాఖలైన సమాచార హక్కు చట్టం దరఖాస్తుపై విచారణ సందర్భంగా సీఐసీ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ప్రధాని బృందంలోని వ్యాపారవేత్తలు, ప్రైవేటుసంస్థల సీఈవోలు-యజమానుల వివరాలను తెలియజేయాలని కోరుతూ నీరజ్ శర్మ అనే వ్యక్తి సహ దరఖాస్తు దాఖలు చేసిన సంగతి గమనార్హం.

మోదీ విదేశాంగ విధాన రూపశిల్పి..
జైశంకర్ పదవీ విరమణ



దిల్లీ: "నరేంద్ర మోదీ విదేశాంగ విధానానికి రూపశిల్పి"గా మన్ననలు పొందిన విదేశాంగ కార్యదర్శి ఎస్ జైశంకర్ ఆదివారం పదవీవిరమణ చేశారు. మూడేళ్ల క్రితం (2015, జనవరి 28న) ఆయన ఈ పదవీ బాధ్యతలు తలకెత్తుకున్నారు. నాలుగు దశాబ్దాల్లో సుదీర్ఘ కాలం విదేశాంగ కార్యదర్శిగా పనిచేసిన దౌత్యవేత్తగా ఆయన చరిత్ర సృష్టించారు. కార్యదర్శి స్థాయి అధికారులు వస్తుంటారు పోతుంటారు... జైశంకర్ స్థానం ప్రత్యేకమైనది. దౌత్య చతురత, ఆయనపై మోదీ పెట్టుకున్న నమ్మకం ఆయన్ను ప్రత్యేకంగా నిలబెట్టాయి. అమెరికాతో పౌర అణు ఒప్పందాన్ని కుదిర్చేందుకు జైశంకర్ కృషిచేశారు. [illegible]పాటు సాగిన చర్చలు 2008 అక్టోబరులో ఫలించాయి. భారత్, [illegible] సంబంధాల్లో నవ శకానికి ఇవి నాంది పలికాయి. 2014లో అమెరికా[illegible] మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో మోదీ ప్రసంగ కార్యక్రమ బాధ్యత [illegible] తలకెత్తుకుంది జైశంకరే. ఈ పర్యటనే ఆ మరుసటి ఏడాది [illegible] గణతంత్ర అతిథిగా విచ్చేసేందుకు బాటలు పరిచింది. డోక్లాం వివాద పరిష్కరణ సమయంలోనూ జైశంకర్ కీలకపాత్ర పోషించారు.

నేడు గోఖలే బాధ్యతల స్వీకారం: విదేశాంగ శాఖ కార్యదర్శిగా విజయ్ [illegible] గోఖలే సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. 1981 బ్యాచ్ ఐఎఫ్ఎస్ అధికారి అయిన గోఖలే ప్రస్తుతం విదేశాంగ శాఖలో ఆర్థిక [illegible]వ్యవహారాల కార్యదర్శిగా పనిచేస్తున్నారు.

పకోడీలు అమ్మడమూ ఉద్యోగమేనా?

ప్రధాని వ్యాఖ్యల్ని తప్పుపట్టిన చిదంబరం

దిల్లీ: పకోడీలు అమ్ముకోవడాన్ని ఓ ఉద్యోగంగానే ప్రధాని మోదీ చెప్పడం [illegible] ఈ లెక్కన బిచ్చగాళ్లు సైతం ఉద్యోగులే అవుతారని కేంద్ర మాజీ మంత్రి చిదంబరం అన్నారు. దేశవ్యాప్తంగా నిరుద్యోగ సమస్య పెరుగుతుంటే ప్రధాని మాత్రం దానికి విరుద్ధంగా ఓ ముఖాముఖిలో గొప్పలు చెప్పారని విమర్శించారు. భవిష్యనిధి చందాదారుల సంఖ్య గతేడాది జులైలో 4.[illegible] కోట్లు ఉంటే ఆ ఏడాది సెప్టెంబరుకు 4.38 కోట్లకు తగ్గిందని గుర్తు చేశారు. ప్రముఖమైన ఉద్యోగాలను ఎన్నింటిని ఇచ్చారో చెప్పాలని ట్వీటర్‌లో [illegible] చేశారు. కాంగ్రెస్ వ్యాఖ్యలు పేదల్ని కించపరిచేవిగా ఉన్నాయని [illegible] ప్రత్యారోపణ చేసింది. పేదల పట్ల ఆ పార్టీకున్న చిన్నచూపును [illegible] వ్యాఖ్యలు చాటుతున్నాయని ట్వీటర్లో పేర్కొంది.

పనులు సరిగ్గా చేయకుంటే తల తీస్తా

గుత్తేదార్లకు కేంద్ర సహాయ మంత్రి హెచ్చరిక

[illegible]: పనులు సక్రమంగా చేయకుంటే తలలు తెగుతాయని కేంద్ర [illegible] ఇంధన శాఖ సహాయ మంత్రి ఆర్.కె.సింగ్ గుత్తేదార్లను హెచ్చరించారు. బిహార్‌లోని తన నియోజకవర్గమైన అర్రాహ్‌లో [illegible] జరిగిన సమావేశంలో చేసిన ఈ వ్యాఖ్యలు వీడియోలో నమోదయ్యాయి. 'ఎవరైనా అక్రమాలకు పాల్పడితే వారి తల తీస్తా. జేసు పెట్టి [illegible] పంపిస్తా' అని అన్నారు. 'ప్రాజెక్టులకు అత్యధిక ప్రజాధనానికి [illegible] కలిగించాలి. గుత్తేదార్ల ఎంపికలో వైవిధ్యానికి ప్రాధాన్యం [illegible] పనులు నాణ్యంగా ఉండాలని' అన్నారు. 64 ఏళ్ల సింగ్ గతంలో [illegible] హోం శాఖ కార్యదర్శిగా పనిచేయడం గమనార్హం.

తక్కువ వ్యయంతోనే సాఫీ జీవితం

అనువైన దేశాల జాబితాలో భారత్‌కు రెండోస్థానం

[illegible]: తక్కువ ఖర్చుతోనే సాఫీగా జీవనం సాగించేందుకు అనువైన దేశాల జాబితాలో భారత్‌కు రెండో స్థానం దక్కింది. దక్షిణాఫ్రికా తొలిస్థానం అందుకుంది. స్థానికంగా కొనుగోలు శక్తి, ఇంటి అద్దెలు, నిత్యావసర ధరలు తదితర సూచీలను కొలమానాలుగా తీసుకుని గోబ్యాంకింగ్ రేట్స్ అనే సంస్థ ఈ సర్వే నిర్వహించింది. కోల్‌కతాలో సాఫీగా జీవించేందుకు అవసరమైన వస్తువులు, నిత్యావసరాల కొనుగోలుకు నెలకు ఒక్కో వ్యక్తికి రూ.18,121 ఖర్చవుతుందని ఈ సర్వే లెక్కగట్టింది. భారత్‌లో కొనుగోలు శక్తి 20.9% తక్కువగా ఉందని.. అయితే ఇంటి అద్దెలు 95.2%, నిత్యావసరాల ధరలు 74.4%, వస్తువులు, సేవల ధరలు 74.9% తక్కువగా ఉన్నాయని పేర్కొంది. జాబితాలో పాకిస్థాన్ 14వ, నేపాల్ 28వ, బంగ్లాదేశ్ 40వ స్థానాల్లో నిలిచాయి. జీవించేందుకు అత్యంత ఖరీదైన దేశంగా బెర్ముడాను పేర్కొంది.

యూపీ అల్లర్లలో 112 మంది అరెస్టు

కాస్‌గంజ్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాస్‌గంజ్‌లో తలెత్తిన ఉద్రిక్తతలు ఆదివారం కూడా కొనసాగాయి. ఘటనకు సంబంధించి 112 మంది వ్యక్తుల్ని పోలీసులు ఇంతవరకు అరెస్టు చేశారు. నిఘా కోసం డ్రోన్లను రంగంలో దింపారు. ఇళ్లను సోదా చేస్తున్నప్పుడు పేలుడు పదార్థాలూ లభ్యమవుతుండడంతో దోషులపై జాతీయ భద్రత చట్టాన్ని (ఎన్ఎస్ఏ) ప్రయోగించనున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. పరిస్థితి కుదుటపడుతోందని డీజీపీ ఒ.పి.సింగ్ లఖ్‌నవూలో చెప్పారు.

పచ్చబొట్టుతో వాయుసేన ఉద్యోగానికి ఎసరు

వైమానికదళ నిర్ణయాన్ని సమర్థిస్తూ దిల్లీ హైకోర్టు తీర్పు

దిల్లీ: పచ్చబొట్టు వేయించుకున్నందుకు తన ఉద్యోగ నియామకాన్ని వైమానిక దళం (ఐఏఎఫ్) రద్దు చేయడాన్ని సవాలు చేస్తూ.. దిల్లీ హైకోర్టును ఆశ్రయించిన ఓ అభ్యర్థికి చుక్కెదురైంది. ఐఏఎఫ్ నిర్ణయాన్ని సమర్థిస్తూ జస్టిస్ హిమా కోహ్లి, జస్టిస్ రేఖా పల్లితో కూడిన ధర్మాసనం తీర్పు నిచ్చింది. పచ్చబొట్ల విషయంలో గిరిజనుల ఆచార వ్యవహారాలు, మరికొన్ని అంశాలకు మాత్రమే ఐఏఎఫ్ మినహాయింపులను ఇస్తోంది. రాత, వైద్య పరీక్షల్లో తాను ఉత్తీర్ణత సాధించానని.. నియామక పత్రం అందగానే తనకు పచ్చబొట్టు ఉన్నట్లు పత్రం కూడా ఐఏఎఫ్‌కు సమర్పించానని అభ్యర్థి కోర్టుకు పేర్కొన్నారు. అయితే సదరు పచ్చబొట్టు ఉద్యోగ ప్రకటనలో తాము సూచించిన షరతులకు లోబడి లేదని ఐఏఎఫ్ వాదించింది.

డ్రైవర్ రహిత ఇ-రిక్షా

పట్టణ ప్రాంతాల కోసం ఐఐఐటీ-దిల్లీ అభివృద్ధి

దిల్లీ: పట్టణ ప్రాంతాల కోసం డ్రైవర్‌రహిత ఇ-రిక్షాలను అభివృద్ధి చేసేందుకు దిల్లీలోని ఇంద్రప్రస్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ) కృషిచేస్తోంది. ఇవి నిర్దేశిత మార్గాల్లోనే నడుస్తాయి. మొదట వీటి సేవలను వర్సిటీ ప్రాంగణంలో ప్రారంభిస్తారు. అనంతరం మెట్రో స్టేషన్లు లాంటి ఆధునిక రవాణా సదుపాయాల కేంద్రాల నుంచి ఇంటికి చేరుకునేలా వీటిని తీర్చిదిద్దుతారు. 'ఇవి 3డీ మ్యాప్‌ల సాయంతో ముందుకు కదులుతాయి. వేగ పరిమితులు, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, పదునుగా వెళ్లడం, ఆగివున్న వస్తువులను ఢీకొట్టకుండా చక్కగా పక్కకు తప్పుకోవడం వీటి ప్రత్యేకత'అని ఐఐఐటీ-దిల్లీలోని ఇన్ఫోసిస్ సెంటర్ ఫర్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అధిపతి మయాంక్ వత్స వెల్లడించారు.

ఎరువు.. ధర దరువు!

- ఒకటో తేదీ నుంచి డీఏపీ టన్నుకు రూ.2,600 పెంపు
- కాంప్లెక్స్ ఎరువులపైనా రూ.2,240 అధికం
- ధరల పెంపుపై వ్యవసాయశాఖకు సమాచారం

ఈనాడు, హైదరాబాద్: ఆరుగాలం శ్రమించే అన్నదాతపై ఎరువుల రూపంలో భారీగా భారం పడనుంది. ఎరువుల ధరలు పెంచుతున్నట్లు ప్రధాన కంపెనీలు వ్యవసాయశాఖకు సమాచారం పంపాయి. ఫిబ్రవరి 1నుంచి కొత్త ధరలు రైతుల నుంచి వసూలు చేయాలని గ్రామాల్లోని వ్యాపారులకు సందేశాలు పంపుతున్నాయి. డై అమ్మోనియం ఫాస్ఫేట్(డీఏపీ) కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెంచుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి సరకుల కొనుగోలు ధరలు పెరుగుతున్నందున ఇక్కడి చిల్లర మార్కెట్‌లో పెంచుతున్నట్లు పలు కంపెనీలు కేంద్ర ప్రభుత్వానికి వర్తమానం పంపాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో డీఏపీ టన్ను ధర గత సెప్టెంబరులో రూ.21,852 ఉండగా ఈ నెలారంభానికి రూ.24,758కి చేరింది. డీఏపీ తయారీకి వినియోగించే ఫాస్ఫారిక్ ఆమ్లం ధర కూడా పెరిగింది. ఇతర దేశాల నుంచి ఎక్కువగా డీఏపీని దిగుమతి చేసుకుని ఇక్కడ విక్రయిస్తున్నారు. ఆ మేరకు ధరలు పెంచుకునే స్వేచ్ఛ కంపెనీలకు ఉందని వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. తాజాగా ఎరువుల వినియోగం పెరగడంతో విదేశీ కంపెనీలు ముడిసరకు ధరలు పెంచుతున్నాయి.

ధరలు పెరిగేదిలా

టన్ను డీఏపీపై రూ.2600, కాంప్లెక్స్ ఎరువుల్లో ఏపేరు గల రకమైనా టన్నుకు రూ.2240 వరకూ కోరమాండల్ కంపెనీ పెంచుతున్నట్లు సమాచారం. రైతులకు 50 కిలోల బస్తాల చొప్పున విక్రయిస్తారు. డీఏపీ బస్తా ధర ప్రస్తుతం రూ.1,083 కాగా ఇక నుంచి రూ.1,213కి పెంచుతున్నారు. 17.17.17 పేరుగల కాంప్లెక్స్ ఎరువు ధర రూ.1,828 పెంచారు. 28.28.0 ఎరువు బస్తా ధర ప్రస్తుతం రూ.1122 కాగా రూ.1,234కు చేరనుంది. ప్రస్తుతం కాంప్లెక్స్ ఎరువు బస్తా ధర ఎంతకు పెంచాలనేది కంపెనీలు పూర్తిగా వెల్లడించలేదు. ఒక్కో కంపెనీ ఒక్కో బ్రాండు పేరుతో వేర్వేరు ధరలను నిర్ణయించడం ఆనవాయితీ. కాంప్లెక్స్ బస్తాపై అదనంగా రూ.112 పెంచుతున్నారు. ప్రస్తుతం బస్తాలపై కొత్త ధరలను ముద్రించే పనుల్లో కంపెనీలు నిమగ్నమయ్యాయి.

ఎరువుల అమ్మకాలపై రాయితీని ఆన్‌లైన్‌లో చెల్లించేందుకు ఈనెలారంభం నుంచే 'పాయింట్ ఆఫ్ సేల్(పీఓఎస్)' యంత్రాలపైనే అమ్మకాలు ప్రారంభించారు. ప్రతి రైతు ఆధార్ సంఖ్యను ఈయంత్రంలో నమోదు చేశాకనే ఎరువుల బస్తాలు అమ్మాలనే నిబంధన ఉంది. ఎరువుల రాయితీపై అక్రమాలకు తావుండదని కంపెనీలు ధరల పెంపును తెరతీశాయనే ఆరోపణలూ ఉన్నాయి. తెలంగాణలో ఈసీజన్‌లో లక్ష టన్నుల డీఏపీ అమ్ముతారని అంచనా. టన్నుకు రూ.2600 పెంచుతున్నందున రైతులపై అదనంగా రూ.26 కోట్ల అదనపు భారం పడనుంది. కాంప్లెక్స్ వివిధ రకాల ఎరువులపై అదనంగా మరో రూ.30 కోట్ల భారం పడుతుందని అంచనా. వరి నాట్లు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నాయి. పలు పైర్లకు ఇప్పుడు డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల వాడకం అత్యవసరమని ఇప్పుడు ధరల పెంపు వల్ల అధిక భారం పడుతుందని రైతులు వాపోతున్నారు.

ఆమ్లదాడి బాధితులకు అండ

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు : డీవోపీటీ ఆదేశం

దిల్లీ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఇకపై అంధులు, మానసిక సమస్యలు, మేధో వైకల్యం, ఆమ్ల (యాసిడ్) దాడి బాధితులకు రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు సిబ్బంది శిక్షణ విభాగం (డీవోపీటీ) ఓ ఆదేశంలో తెలిపింది. గ్రూప్-ఎ, బీ, సీ పదవులకు నియామకాలు నేరుగా చేపడితే ప్రస్తుతం మూడు శాతం పోస్టులను 40 శాతానికిపైగా వైకల్యముండేవారికి కేటాయిస్తున్నారు. దీన్ని నాలుగు శాతానికి పెంచుతున్నట్లు డీవోపీటీ తాజా ఆదేశంలో పేర్కొంది. వీటిలో అంధులు, చూపు సరిగా లేనివారు, బధిరులు, సరిగా వినపడనివారు, మరుగుజ్జులు, కుష్ఠురోగం నుంచి ఉపశమనం పొందినవారు, శిశుపక్షవాతం, కండరాల బలహీనతలు, ఆమ్లదాడి బాధితులకు ఒక శాతం పోస్టులు కేటాయించాలని అన్ని కేంద్ర ప్రభుత్వ విభాగాలకు డీవోపీటీ లేఖలు రాసింది. మరోవైపు అంధులు, మేధో దుర్బలతలు, మానసిక సమస్యలుండేవారికి మరొక శాతం పదవులు కేటాయించాలని దీనిలో సూచించింది. దివ్యాంగుల హక్కుల చట్టం-2016 నిబంధనలకు అనుగుణంగా ఈ రిజర్వేషన్లను పెంచుతున్నట్లు పేర్కొంది. మరోవైపు ఈ విషయంపై సమాధానాల ఫిర్యాదుల కోసం ప్రజాసాధక బాధకాల పరిష్కార అధికారిని నియమించాలని అన్ని విభాగాలకూ సూచించింది. 'నియామకాలకు సంబంధించి ఏ విషయంలోనైనా వివక్షకు గురైతే ఫిర్యాదు చేసేందుకు ఈ సదుపాయం ఉపయోగపడుతుంది. ఫిర్యాదు నమోదైన రెండు నెలల్లోగా విచారణ పూర్తిచేయాలి. సంబంధిత నివేదికను ఫిర్యాదుదారుడికి అందించాలి. ఫిర్యాదు ఎప్పుడు అందింది? ఎవరు చేశారు? ఎవరిపై చేశారు? వీటిని ఎప్పుడు పరిష్కరించారు? లాంటి అంశాలను అధికారులు ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాలి'అని డీవోపీటీ పేర్కొంది.



గణతంత్ర దినోత్సవ పెరేడ్‌లో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ కార్యకర్తలతో మాట్లాడుతున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు. చిత్రంలో కేంద్ర మంత్రి రాజ్యవర్ధన్

శకటాల కళాకారులను అభినందించిన ఉపరాష్ట్రపతి

దిల్లీ: గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు, శకటాల రూపకర్తలైన నిపుణులు, గిరిజన అతిథులు, అధికారులు, ఇతర సిబ్బంది తదితరులు ఆదివారం నాడిక్కడ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడును కలుసుకున్నారు. ఆయన వారందరినీ పలకరించారు. రెండు గంటలపాటు వారితో గడిపారు. దేశంలోని వివిధ ప్రాంతాలు, విభిన్న సంస్కృతులకు చెందిన సుమారు రెండువేల మంది ఉపరాష్ట్రపతి దంపతులను కలుసుకున్న వారిలో ఉన్నారు. గణతంత్ర దిన వేడుకల్లో భాగంగా వారంతా ఒక్కవేదికపై చేరి తమ వైవిధ్యాలను ప్రదర్శించడం... భారత్‌లోని భిన్నత్వంలో ఏకత్వానికి అద్దంపడుతోందని ఉపరాష్ట్రపతి ఈ సందర్భంగా అన్నారు. గణతంత్ర వేడుకల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాలన్నిటి కోసం శ్రమించిన వారందరినీ ఆయన అభినందించారు.

'పద్మశ్రీ' అవార్డును నిరాకరించిన సిద్ధేశ్వర్ స్వామీజీ

కలబురిగి: ఆధ్యాత్మికగురువు సిద్ధేశ్వర్ స్వామీజీ తనకు ప్రకటించిన 'పద్మశ్రీ' అవార్డును స్వీకరించేందుకు నిరాకరించారు. విజయపుర స్వామీజీగా పేరొందిన ఆయన ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఒక లేఖ రాశారు. తాను సన్యాసినని... ఇలాంటి టైటిళ్లు తనకు అక్కరలేదని స్పష్టం చేశారు.

రాజ్యాంగ పరిరక్షణ ప్రజల చేతుల్లో

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చలమేశ్వర్



విజయవాడ, న్యూస్‌టుడే: భారత రాజ్యాంగం దేశ సంస్కృతి, విలువలకు ప్రతిబింబమని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ చెప్పారు. రాజ్యాంగ పరిరక్షణ ప్రజల చేతుల్లో ఉందని, స్వతంత్ర న్యాయవ్యవస్థ దేశానికి చాలా అవసరమని పేర్కొన్నారు. 'రాజ్యాంగ బద్ధత- పౌర సమాజం' అనే అంశంపై ఆదివారం విజయవాడ పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో జరిగిన స్మారకోపన్యాసంలో న్యాయమూర్తి మాట్లాడారు. "రాజ్యాంగం ప్రధాన ఉద్దేశం సమానత్వం. సమాజంలో వ్యక్తిపరమైన నిర్ణయాలు క్షేమకరం కాదు. ప్రజాస్వామ్య దేశంలో సమష్టి నిర్ణయం శిరోధార్యం. వ్యక్తి పూజ ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. మార్పు మన దగ్గర నుంచే రావాలి. అవినీతితో దేశం అభివృద్ధి సాధించడం లేదని ప్రతి సమావేశంలో చెబుతుంటారు. కానీ లంచం తీసుకునే వారిపై ఉదాసీనంగా వ్యవహరించడం విడ్డూరం. కనీసం సాక్ష్యం చెప్పడానికి కూడా వెనకడుగు వేస్తున్నారు. వ్యక్తుల భావ స్వాతంత్ర్యానికి పరిమితులు ఉంటాయి. వాటిని పాటించాలి. ప్రస్తుతం అంతర్జాల వాడకం పెరిగింది. స్వేచ్ఛను హేతుబద్ధంగా వినియోగించుకోవాలి" అని వివరించారు.

పదవీ విరమణ తరువాత కృష్ణా జిల్లాలోనే

విజయవాడలో ఉపన్యసించడం చాలా కష్టమని, విభిన్న అభిప్రాయాల ప్రజలు ఇక్కడ ఉంటారని జస్టిస్ చలమేశ్వర్ అభిప్రాయపడ్డారు. కొద్ది నెలల్లో పదవీ విరమణ చేయబోతున్నానని, తరువాత ఈ జిల్లాలోనే ఉంటానని చెప్పారు. "ఏ రాజకీయ పక్షం వద్దకు వెళ్లకుండా.. ఈ ఉద్యోగం కావాలని దేహీ అని అడకుండా ఉంటా" అని పేర్కొన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మణరావు, న్యాయమూర్తులు వెంగయ్య, బబిత, రమేష్‌బాబు, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, కంఠమనేని రాజగోపాల్, కర్నాటి రామ్మోహనరావు, దివ్వెల పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

[illegible] గంటల్లో రైల్వే స్టేషన్ నిర్మాణం



చైనా తాజాగా మరో రికార్డు సృష్టించింది. చైనాలోని మూడు ప్రధాన రైల్వే ట్రాకులను అనుసంధానం చేయడానికి ఉపయోగపడే నాన్‌లాంగ్ రైల్వే స్టేషన్‌ను కేవలం తొమ్మిది గంటల్లోనే సర్వం సిద్ధం చేసింది. రూ. [illegible] లక్షల కోట్లతో చైనా దేశవ్యాప్తంగా నిర్మిస్తున్న హైస్పీడ్ రైల్వే వ్యవస్థలో 247 కిమీ పొడవైన నన్సన్‌లాంగ్ కూడా ఒకటి.



మృతులు రామస్వామి, శ్రీశైలం,

'అన్న'ంతపనీ చేశాడు!

- ఆస్తి కోసం తమ్ముళ్లు, తండ్రిని మట్టుబెట్టిన యువకుడు
- బండరాళ్లతో మోది మరీ హత్య
- నాగర్‌కర్నూల్ జిల్లాలో ఘటన
- అదుపులో నిందితుడు?



భాస్కరయ్య మృతదేహం

అచ్చంపేట పట్టణం, న్యూస్‌టుడే: మానవత్వం.. రక్త సంబంధాన్ని మరిచిన ఓ యువకుడు తండ్రి సహా.. ఇద్దరు తమ్ముళ్లను పొట్టనబెట్టుకున్నాడు. ఒకరికి తెలియకుండా మరొకర్ని తమ వ్యవసాయ పొలం వద్దనే అతి దారుణంగా హతమార్చాడు. ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో కలకలం సృష్టించింది. అచ్చంపేట సీఐ ఎస్.రామకృష్ణ కథనం ప్రకారం.. ఉప్పునుంతల మండలం మామిళ్లపల్లి గ్రామానికి చెందిన సామ భాస్కరయ్య(60)కు మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. ముగ్గురు కుమారుల్లో పెద్ద వాడైన మల్లేశ్ జులాయిగా తిరుగుతూ కుటుంబ సభ్యులతో తరచూ గొడవ పడేవాడు. ఇతని వైఖరితో విసిగిపోయిన తల్లి కొన్నేళ్ల కిందటే పుట్టింటికి వెళ్లిపోయింది. తండ్రి మిగిలిన ఇద్దరు కుమారులు శ్రీశైలం(22), రామస్వామి(18)ల సాయంతో వ్యవసాయం చేస్తూ సంసారాన్ని నెట్టుకొస్తున్నాడు. కొద్ది రోజులుగా వ్యవసాయ భూమిలో తన వాటా పంచి ఇవ్వడమో లేదా భూమి అమ్మి తన వాటా తాలూకూ సొమ్ము ఇవ్వడమో చేయాలంటూ మల్లేశ్ తండ్రి, తమ్ముళ్లపై ఒత్తిడి తెస్తున్నాడు. లేదంటే చంపుతానంటూ బెదిరిస్తుండగా. .వాళ్లు మాత్రం ఆ ప్రతిపాదనకు ససేమిరా అంటూ వస్తున్నారు.

అడ్డుతొలగించేందుకు ప్రణాళిక

వారు అడ్డు తొలగితే తప్ప తనకు ఆస్తి రాదని భావించిన మల్లేశ్.. వారిని మట్టుబెట్టాలన్న నిర్ణయానికొచ్చాడు. అందులో భాగంగా ముందుగా పైపులు మార్చడానికి వేకువజామున పొలం వద్దకు బయల్దేరిన చిన్న తమ్ముడు రామస్వామిని అనుసరిస్తూ వెళ్లాడు. పొలం వద్దనే బండరాయితో తలపై మోది, తరవాత కత్తితో పొడిచి చంపాడు. తర్వాత అతన్ని వెదుకుతూ వెళ్లిన శ్రీశైలాన్ని పొలంలో మాటువేసి రాయితో కొట్టి అంతమొందించాడు. తర్వాత ఇంటికి వెళ్లి బోరు నడవడం లేదంటూ అబద్ధం చెప్పి తండ్రిని వెంట తీసుకెళ్లాడు. పొలం సమీపంలో బండరాయితో కొట్టి ఆయన్నీ చంపాడు. మొత్తంగా వేకువజామున 2-4 గంటల మధ్య ముగ్గుర్నీ హతమార్చి పరారయ్యాడు. జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిందితుడు తెల్కపల్లిలో ఉండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

రూ.4.2 వేల కోట్ల డిజిటల్ కరెన్సీ స్వాహా

జపాన్ ఎక్స్ఛేంజీ 'కాయిన్‌చెక్'పై హ్యాకర్ల పడగ

టోక్యో: డిజిటల్ కరెన్సీ రంగంలో తాజాగా కళ్లు చెదిరే దోపిడీ చోటుచేసుకుంది. జపాన్‌లోని అతిపెద్ద డిజిటల్ కరెన్సీ ఎక్స్ఛేంజీల్లో ఒకటిగా పేరొందిన 'కాయిన్‌చెక్' నుంచి దాదాపు రూ. 4.2 వేల కోట్ల విలువైన వర్చువల్ కరెన్సీని హ్యాకర్లు స్వాహా చేశారు. దీంతో క్రిప్టోకరెన్సీ కొనుగోళ్లు, ఉపసంహరణలను ప్రస్తుతానికి నిలిపివేసినట్లు 'కాయిన్‌చెక్' తమ వెబ్‌సైట్‌లో శుక్రవారం తెలిపింది. హ్యాకింగ్‌తో దెబ్బతిన్న పెట్టుబడిదారులకు తమ సొంత నిధుల నుంచి దాదాపు రూ. 3.3 వేల కోట్లను తిరిగి చెల్లిస్తామని కూడా ప్రకటించింది. 2014లో టోక్యోకు చెందిన బిట్‌కాయిన్ ఎక్స్ఛేంజీ సంస్థ 'ఎంటిగాక్స్' నుంచి సుమారు రూ. 3 వేల కోట్ల విలువైన వర్చువల్ కరెన్సీ మాయమైంది. దీంతో సంస్థ మూతపడింది. ప్రస్తుతం హ్యాకింగ్ కారణంగా 'కాయిన్‌చెక్' అంతకంటే ఎక్కువమొత్తాన్ని కోల్పోయింది.

ఎన్ని మార్పులొచ్చినా పుస్తకం చిరంజీవే

- పుస్తకాలు కేసీఆర్‌ను నడిపించాయి
- ఆయన రాష్ట్రాన్ని నడిపిస్తున్నారు
- 'జాతీయ ప్రదర్శన' ముగింపు సభలో మంత్రి హరీశ్‌రావు



ముగింపు సభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

కవాడిగూడ, న్యూస్‌టుడే: పుస్తకాలు కేసీఆర్‌ను నడిపించడం వల్లే.. నేడు ఆయన రాష్ట్రాన్ని నడిపించగలుగుతున్నారని నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. పుస్తక ప్రదర్శనను చూస్తే.. ప్రపంచ జ్ఞానాన్ని ఒక్క చోటికి తెచ్చినట్టుగా ఉందని చెప్పారు. ఆదివారమిక్కడ తెలంగాణ కళాభారతి (ఎన్‌టీఆర్‌స్టేడియం)లో 31వ జాతీయ పుస్తక ప్రదర్శన ముగింపు సభకు హరీశ్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పుస్తకం విలువ తగ్గలేదని ఇక్కడికి విచ్చేసిన పదిలక్షల మంది సందర్శకులు చాటి చెప్పారన్నారు. ఈ ప్రదర్శనలను 31 జిల్లాలకు విస్తరించాలని కోరారు. ఆర్.విద్యాసాగర్‌రావు రచించిన 'నీళ్లు నిజాలు' తనను అమితంగా ప్రభావితం చేసిందని గుర్తు చేసుకున్నారు. మనం ఏం కోల్పోయామో పాత పుస్తకాలు చదువుతుంటే తెలుస్తుందన్నారు. సెల్‌ఫోన్లు వచ్చిన తరువాత రేడియో, గడియారం, కెమెరా, వాయిస్‌రికార్డర్లు మాయం అయినప్పటికీ పుస్తకం మాత్రం మిగిలిపోయిందని చెప్పారు. ఫేస్‌బుక్, ట్విట్టర్, వాట్సాప్.. ఇలా ఎన్ని వచ్చినా పుస్తకం చిరంజీవిగా ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జాతీయపుస్తక ప్రదర్శనకు ఉచితంగా స్టేడియం ఇవ్వడమే కాకుండా రూ.పది లక్షల ఆర్థిక సహాయం చేసిందని తెలిపారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఎన్‌టీఆర్ స్టేడియాన్ని భావితరాల కోసం మైదానంగానే కొనసాగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు సంచాలకుడు మల్లెపల్లి లక్ష్మయ్య, సాంస్కృతికశాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, జాతీయ పుస్తకప్రదర్శన అధ్యక్షుడు జూలూరి గౌరీశంకర్, ప్రధాన కార్యదర్శి కోయ చంద్రమోహన్, బీసీ కమిషన్ సభ్యుడు వకుళాభరణం కృష్ణమోహన్, ఎమెస్కో విజయ్‌కుమార్, గుడిపూడి విజయరావు పాల్గొన్నారు.

పుస్తకానికి చావులేదు: రాఘవులు

పుస్తకానికి చావులేదని సీపీఎం జాతీయ కార్యదర్శి బీవీ రాఘవులు అన్నారు. పదిరోజులుగా బాలబాలికలకు నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. చిన్నప్పుడు రాయితో చెక్కిన చిన్న గణపతి విగ్రహం ముందు పుస్తకాలు పెట్టి పూజలు చేసేవాడినని గుర్తుచేసుకున్నారు. కాశీమజిలీ కథలు, భాగవతం, భారతం, వేమన పద్యాలు, విశ్వదర్శనం, నరావతారం చదవడంతో పుస్తకాల పట్ల మక్కువ పెరిగిందన్నారు. సైన్స్, హేతువాదం, శ్రీశ్రీ, దిగంబర కవుల రచనలు తనను మార్చివేశాయని, రాజకీయాల వైపు నడిపించాయని చెప్పారు.

మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: గత ప్రభుత్వాలకంటే భిన్నంగా మైనారిటీల సంక్షేమానికి తెరాస ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని నీటి పారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. రెండో భాషగా ఉర్దూను అమలు చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆదివారం సంగారెడ్డి జిల్లాలో ఆయన సుడిగాలి పర్యటన చేశారు. సంగారెడ్డిలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని 500 మంది మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి ఉర్దూలో ప్రసంగించి ముస్లింలను ఆకట్టుకున్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వం మైనార్టీల కోసం 206 ఆంగ్ల మాధ్యమ మినీ గురుకులాలు ఏర్పాటు చేయడంతోపాటు.. ఒక్కో విద్యార్థిపై ఏడాదికి రూ. 64 వేలు ఖర్చు చేస్తున్నట్టు వివరించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఈ గురుకులాల్లోని రెండు వేల ఉపాధ్యాయ ఖాళీలను త్వరలో భర్తీ చేస్తామన్నారు. ఉర్దూ భాషా ఉపాధ్యాయుల పోస్టులనూ భర్తీ చేస్తామని వివరించారు. హైదరాబాద్‌లో ఇస్లామిక్ సెంటర్ ఏర్పాటుకు పది ఎకరాల స్థలంతోపాటు రూ. 40 కోట్లు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని షాద్‌నగర్‌లోని జహంగీర్ పీర్ దర్గా అభివృద్ధికి ఐదు ఎకరాల భూమి, రూ. కోటి నిధులు సీఎం కేటాయించామన్నారు. ఇమామ్‌లకు నెలకు గౌరవ వేతనంతో పాటు 2 పడకల గదుల ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. తర్వాత సంగారెడ్డిలో జరిగిన ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంజన్‌గౌడ్ పదవీ విరమణ సభలోనూ మంత్రి పాల్గొన్నారు.

ప్రజోపయోగ పరిశోధనలకు మద్దతు

- జీవకణ శాస్త్ర అంతర్జాతీయ సదస్సులో కేంద్ర మంత్రి సుజనా చౌదరి



ఈనాడు, హైదరాబాద్: ప్రజలకు ఉపయోగపడే పరిశోధనలకు కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ మద్దతిస్తుందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక సహాయ మంత్రి సుజనాచౌదరి అన్నారు. శాస్త్రీయ దృక్పథ పరిశోధనల నుంచి ప్రజా పరిశోధనల వైపు మారాల్సి ఉందని చెప్పారు. ఏ ఆవిష్కరణ అయినా, అప్లికేషన్ అయినా గ్రామీణ ప్రజలు, ఎక్కువ మంది జీవితాలు మెరుగుపడేందుకు దోహదపడేదిగా ఉండాలని సూచించారు. శాస్త్రవేత్తలు, రాజకీయ నేతలు, పరిశ్రమ కలిసి దేశానికి అవసరమైన సాంకేతికత, ఆర్థిక పరిష్కారాల గురించి ఆలోచించాల్సి ఉందని చెప్పారు. హైదరాబాద్‌లో జరుగుతున్న జీవకణ శాస్త్ర అంతర్జాతీయ సదస్సులో 'జీవకణశాస్త్రంలో అవకాశాలు.. బయోటెక్ అంకురాల నిర్మాణం' అంశంపై ఆదివారం జరిగిన సమావేశంలో సుజనా చౌదరి మాట్లాడారు. ఇలాంటి చర్చలు అవసరమని, మనలాంటి దేశంలో స్పష్టమైన భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించుకునేందుకు ఇవి దోహదం చేస్తాయని అన్నారు. దేశంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ), బయోటెక్నాలజీ (బీటీ) ఒకే సమయంలో మొదలైనా ఇప్పటివరకు ఐటీలో మాత్రమే ముందున్నామన్నారు. ఇప్పుడు బీటీ సమయం వచ్చిందని, ఈ రంగంలో పరిశోధనలకు ఇప్పుడు ఎన్నో వేదికలు అవకాశం కల్పిస్తున్నాయని చెప్పారు. సదస్సులో నిపుణులు, ఔత్సాహికవేత్తలు పాల్గొని చర్చించిన వైద్యం, వ్యవసాయం, పోషకాహారం వంటి అంశాల్లో ప్రజల అవసరాలకు తీర్చే పరిశోధనలకు అంకురార్పణ జరగాలని ఆకాంక్షించారు.

"సామాజిక మాధ్యమ సమాచార" విశ్లేషణకు ప్రత్యేక కేంద్రాలు

దిల్లీ: సామాజిక అనుసంధాన వేదికలపై చక్కర్లు కొట్టే వాడీవేడీ అంశాలనూ జల్లెడపట్టాలని నరేంద్ర మోదీ సర్కారు భావిస్తోంది. మత ఘర్షణలు, అసత్య వార్తలు, రాజకీయ సంచలనాలు ఇలా ఏ అంశాన్నైనా క్షేత్రస్థాయిలో పరిశీలించేలా ఓ సామాజిక మాధ్యమ సమాచార కేంద్రం (ఎస్ఎంసీ)ను ఏర్పాటుచేసేందుకు కేంద్ర సమాచార ప్రసార శాఖ కసరత్తు మొదలుపెట్టింది. ఈ ప్రాజెక్టుపై ప్రస్తుత సంవత్సరానికిగాను ఇప్పటికే రూ. 17 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. 707 కేంద్రాల ఏర్పాటు, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, సిబ్బందికి వేతనాల కోసం ఈ మొత్తాన్ని ఉపయోగించనున్నారు. ఒక్కో కేంద్రంలో దాదాపు 20 మంది సామాజిక అనుసంధాన వేదిక సమాచార విశ్లేషకులు ఉంటారు. వీరు వాడీవేడీ అంశాలు, ట్విటర్‌లో చక్కర్లు కొడుతున్న సమాచారంపై రోజూ ఆరు నివేదికలు తయారుచేస్తారు. 'దేశానికి మేలుచేసే అంశాలవైపు ప్రజా దృష్టిని ఎలా మరల్చాలి? ప్రజల్లో జాతీయవాద భావనలను ఎలా పెంపొందించాలి? లాంటి అంశాలపై లోతైన అధ్యయనాలకు ఈ సదుపాయాలు చక్కగా తోడ్పడతాయి' అని మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారి తెలిపారు.

మావోయిస్టుల కట్టడికి వ్యూహం

- పినపాక ఘటనతో అప్రమత్తమైన పోలీసులు
- ప్రాజెక్టులు, ప్రజాప్రతినిధులకు భద్రత పెంపు

ఈనాడు, హైదరాబాద్: మావోయిస్టు దళాలు ఛత్తీస్‌గఢ్ సరిహద్దులు దాటి రాష్ట్రంలోకి ప్రవేశించాయన్న సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. రాష్ట్ర సరిహద్దుల్లో పోలీసుల గాలింపులు ముమ్మరం చేయడంతోపాటు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ముఖ్యంగా గోదావరి నదిపై నిర్మిస్తున్న ప్రాజెక్టులకు, ఆయా ప్రాంతాల్లో పర్యటించే ప్రజాప్రతినిధులకు భద్రత పెంచారు. వేసవి వచ్చేలోపే సత్తా చాటుకుని తిరిగి సురక్షిత ప్రదేశాలకు తరలి వెళ్లాలని మావోయిస్టులు భావిస్తున్నట్లు పసిగట్టిన పోలీసులు ఇందుకు అనుగుణంగానే వ్యూహ రచన చేస్తున్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలంలో శనివారం ఒక గిరిజనుడిని హత్యచేసి ఆదివాసీపై కాల్పులకు తెగబడ్డ మావోయిస్టులు ఇసుక ర్యాంపులోని వాహనాలనూ దగ్ధం చేశారు. ఈ మధ్యకాలంలో జరిగిన తీవ్రమైన ఘటనల్లో ఇదొకటి. వాస్తవానికి ఛత్తీస్‌గఢ్‌కు ఆనుకొని ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోకి అడపాదడపా మావోయిస్టులు చొరబడుతున్నా పెద్దగా హింసాత్మక ఘటనలకు పాల్పడ్డ దాఖలాలు ఇటీవల లేవు. కానీ పెద్దసంఖ్యలో మావోయిస్టులు సరిహద్దులు దాటి రాష్ట్రంలోకి ప్రవేశించడంతోపాటు ఇన్ఫార్మర్ నెపంతో హత్య, హత్యాయత్నానికి పాల్పడటం పోలీసుల వర్గాల్లోనూ కలకలం రేపుతోంది. దాంతో అప్రమత్తమైన పోలీసులు మరిన్ని దుర్ఘటనలు జరగకముందే వారిని కట్టడి చేయాలని భావిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ సరిహద్దులకు ఆనుకొని ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నెలకొన్న భౌగోళిక పరిస్థితులు కొంతవరకు మావోయిస్టులకు అనుకూలిస్తున్నాయి. గోదావరి నది ఒక్క భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మినహా ఛత్తీస్‌గఢ్, తెలంగాణలను భౌతికంగా విడదీస్తున్న సంగతి తెలిసిందే. భద్రాద్రి కొత్తగూడెంకు మాత్రం నదికి అవతలి వైపు కూడా కొంతమేరా సరిహద్దు ఉంది. తమకు సురక్షితంగా ఉండే ఛత్తీస్‌గఢ్‌లో మకాం వేస్తున్న మావోయిస్టులు నదికి అటువైపు ఉన్న భద్రాద్రి కొత్తగూడెంలో తలదాచుకొని అవకాశం ఉన్నప్పుడు చొరబడుతున్నారు. మధ్యలో నది అడ్డుగా ఉండటంతో ఆవలి వైపు ఉన్న ప్రాంతంలో గాలింపులు చేపట్టడం తెలంగాణ పోలీసులకు కొంత ఇబ్బందే. దీంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శాంతిభద్రతల పరంగా పోలీసులకు సవాలే. తాజా ఘటనే ఇందుకు నిదర్శనం. ఎండలు తీవ్రరూపం దాల్చే పక్షంలో అడవులు మోడువారి మావోయిస్టుల కదలికలు కష్టమవుతాయి. దీంతో ఎండలు తీవ్రం కాకముందే ఛత్తీస్‌గఢ్‌లోని సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోతారు. ఇప్పుడు కూడా మార్చిలోపే తమ ఉనికి చాటుకోవాలని మావోయిస్టులు ప్రయత్నిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. తాజా ఘటనను దృష్టిలో పెట్టుకొని సరిహద్దు జిల్లాలన్నింటిలోనూ భద్రతను కట్టుదిట్టం చేశారు. సరిహద్దు ప్రాంతం పూర్తిగా తమ ఆధీనంలో ఉండేలా(ఏరియా డామినేషన్) గ్రేహౌండ్స్ బలగాలతో గాలింపులు చేపడుతున్నారు.

వైద్య నియామకాల బాధ్యత 'సుపరిపాలన'కు!

- వైద్యవిధాన పరిషత్‌లో 1200 పోస్టుల భర్తీ సీజీజీ ద్వారా..
- టీఎస్‌పీఎస్సీ నుంచి ఉపసంహరణకు నిర్ణయం
- త్వరితగతిన భర్తీ చేపట్టేందుకేనన్న వైద్యవర్గాలు

ఈనాడు, హైదరాబాద్: వైద్యుల నియామక ప్రక్రియలో జాప్యం జరుగుతుండడంతో ప్రత్యామ్నాయంపై వైద్య ఆరోగ్య శాఖ దృష్టిసారించింది. ఇటీవల ఆ శాఖలోని వివిధ విభాగాల అధిపతులతో ముఖ్యకార్యదర్శి శాంతికుమారి అత్యవసరంగా జరిపిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే ప్రకటన ఇచ్చిన వైద్యుల పోస్టులు మినహాయించి.. మిగిలినవాటిని టీఎస్‌పీఎస్సీ నియామక ప్రక్రియ నుంచి ఉపసంహరించుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ నిర్ణయించింది. ముఖ్యంగా వైద్యవిధాన పరిషత్‌లో సుమారు 1200 సివిల్ అసిస్టెంట్ సర్జన్ల పోస్టులను సుపరిపాలన కేంద్రం (సీజీజీ) ద్వారా భర్తీ చేసేందుకు ఏర్పాట్లు చేయాలని తీర్మానించింది. వచ్చే రెండు నెలల్లోపు వైద్యుల పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తి చేసేందుకే కీలక నిర్ణయాలను తీసుకోవాల్సి వచ్చిందని వైద్యవర్గాలు తెలిపాయి.

భర్తీకే ప్రాధాన్యం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం వైద్యఆరోగ్యశాఖకు 10754 పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్‌కు 23, కాళోజీ ఆరోగ్య వర్సిటీకి 82, వైద్యవిద్య సంచాలకులకు 3635, ప్రజారోగ్య సంచాలకులకు 708, వైద్యవిధాన పరిషత్‌కు 4583, నిమ్స్‌కు 1472, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రికి 251 పోస్టులున్నాయి. వీటిల్లో ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి మినహా మిగిలిన అన్ని పోస్టులకు ఇప్పటికే ఆర్థిక శాఖ నుంచి అనుమతులొచ్చాయి. ఇవి కాకుండా 2118 ఖాళీల భర్తీకి ప్రభుత్వం 2016 జులై 13నే ఉత్తర్వులిచ్చింది. మొత్తం పోస్టుల్లో సుమారు 7900 పోస్టులు టీఎస్‌పీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని నిర్ణయించారు.. మిగిలిన వాటిని పదోన్నతుల ద్వారా భర్తీ చేస్తారు. అయితే టీఎస్‌పీఎస్సీ, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులకు మధ్య సమన్వయం లేని కారణంగా నెలలు గడుస్తున్నా ఉద్యోగాల భర్తీ ప్రక్రియ మాత్రం ముందుకు సాగలేదనే ఆరోపణలున్నాయి. సరైన విధానంలో సమాచారాన్ని పంపించడంలో ఆరోగ్యశాఖ అధికారులు అలసత్వంగా వ్యవహరించడంతోనే పదేపదే టీఎస్‌పీఎస్సీ నుంచి ప్రతిపాదిత పత్రాలు వెనక్కి వచ్చాయనే విమర్శలున్నాయి. ఈ క్రమంలో ఇటీవలే వైద్యఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన శాంతికుమారి తొలి ప్రాధాన్యాంశంగా నియామకాలను స్వీకరించారు. ఇప్పటికే రెండు పర్యాయాలు ప్రత్యేకంగా నియామకాలపైనే ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. శనివారం నిర్వహించిన భేటీలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశానికి టీఎస్‌పీఎస్సీ, సుపరిపాలన కేంద్రం ఉన్నతాధికారులను ఆహ్వానించారు. ఎప్పటిలోగా నియామక ప్రక్రియను పూర్తిచేస్తారో స్పష్టత ఇవ్వాల్సిందిగా ముఖ్యకార్యదర్శి కోరాగా.. ప్రక్రియంతా పూర్తయ్యేందుకు కనీసం ఆర్నెల్లైనా పడుతుందని టీఎస్‌పీఎస్సీ అధికారులు వెల్లడించినట్లు సమాచారం. నర్సుల పోస్టులపై న్యాయస్థానంలో కేసు ఉన్న దృష్ట్యా వీటిల్లో కొంత జాప్యం జరిగే అవకాశాలున్నాయని తెలిపినట్లు తెలిసింది. ఇప్పటికే నియామక ప్రకటన వెలువరించి, ఆటంకాల్లేని పోస్టులకు త్వరితగతిన ప్రక్రియను పూర్తిచేయాలని ఈ సందర్భంగా శాంతికుమారి కోరినట్లు తెలిసింది.

సీజీజీ తెరపైకి..: ఇప్పటికీ ఉద్యోగ ప్రకటన వెలువడని పోస్టుల్లో.. పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాల్సిన పోస్టులను మినహాయించి.. మిగిలిన పోస్టులను ఇంకా త్వరగా భర్తీ చేయడానికి ఉన్న అవకాశాలపై చర్చించారు. ప్రజారోగ్య సంచాలకుల పరిధిలో భర్తీ చేయనున్న 528 సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, డెంటల్ అసిస్టెంట్ సర్జన్ల పోస్టులను సీజీజీ ద్వారా భర్తీ చేయాలని ఇప్పటికే నిర్ణయించి ఉండడంతో.. ఆ దిశగా మరికొన్ని వైద్యుల పోస్టులను కూడా భర్తీ చేయడంపై దృష్టిపెట్టారు. వైద్య విధాన పరిషత్‌లో సుమారు 1200 సివిల్ అసిస్టెంట్ సర్జన్ల పోస్టులకు ఇంకా టీఎస్‌పీఎస్సీ నియామక ప్రకటన వెలువరించకపోవడంతో.. ఆ పోస్టులను, ఆయుష్ పరిధిలో మంజూరైన 180 వైద్యుల పోస్టులను కూడా సీజీజీ ద్వారానే భర్తీ చేయాలని నిర్ణయించారు. వైద్య పోస్టుల భర్తీ దరఖాస్తులను పరిశీలించే బాధ్యతలను ఉస్మానియా విశ్వవిద్యాలయానికి అప్పగించినట్లు తెలిసింది.

ఆహార పరిరక్షణాధికారుల పోస్టుల భర్తీపైనా చర్చించినట్లు సమాచారం. సీజీజీ ద్వారా చేపట్టనున్న నియామకాల ప్రక్రియ పర్యవేక్షణ బాధ్యతను ఆరోగ్య శాఖ ఉన్నతస్థాయి కమిటీకి అప్పగించనున్నారు.

మల్లెలు కిలో రూ.7,500

విల్లివాక్కం, న్యూస్‌టుడే: తమిళనాడులోని తేని జిల్లాలో మల్లె పూల ధర చుక్కలనంటుతోంది. జిల్లాలోని ప్రస్తుతం ఆండిపట్టి మార్కెట్‌లో కిలో మల్లెలు రూ. 7,500 పలికినట్లు వ్యాపారులు తెలిపారు. సాధారణంగా వేసవిలో వీటి ఉత్పత్తి అధికంగా ఉంటుంది. ఆ సమయంలో తక్కువ ధర ఉండడంతో 'సెంట్' తయారీకి ఇక్కడి పూలు విక్రయించేవారు. ప్రస్తుతం ఉత్పత్తి చాలా తక్కువగా ఉంది. గత నెలలో కిలో రూ. 1,000 పలకగా సంక్రాంతికి రూ. 3 వేలకు చేరినట్లు వ్యాపారులు చెప్పారు. గత వారం రూ. 4,500 ఉండగా శని, ఆదివారాల్లో ఏకంగా రూ. 7,500 పలకడం గమనార్హం.

'మల్లన్న' సన్నిధికి తరలొచ్చిన లష్కర్‌వాసులు

చేర్యాల, న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా కొమురవెల్లిలోని మల్లికార్జునస్వామి దర్శనానికి ఆదివారం సికింద్రాబాద్(లష్కర్)వాసులు భారీగా తరలివచ్చారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లోభాగంగా లష్కర్‌వారంగా పిలిచే రెండోవారం మల్లన్న ఆలయం భక్తులతో కిటకిటలాడింది. సికింద్రాబాద్‌కు చెందిన భక్తులతోపాటు వరంగల్, మెదక్, సంగారెడ్డి, నల్గొండ ఉమ్మడి జిల్లాలే కాకుండా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి మల్లన్న భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. స్వామిని దర్శించుకుని బోనాల నైవేద్యం సమర్పించడంతోపాటు పట్నాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి దర్శనానికి భక్తులు 5 గంటలు ఎదురు చూడాల్సి వచ్చింది.

బడి నిర్వహణకు బడ్జెట్ శూన్యం

- పెరిగిపోతున్న విద్యుత్తు బిల్లులు
- కొద్దిపాటి కేంద్ర పథకాల నిధులే ఆధారం

ఈనాడు - హైదరాబాద్

- కరీంనగర్ జిల్లా గంగాధర్ మండలం కురిక్యాల ప్రాథమిక పాఠశాల. మూడు గదుల ఈ పాఠశాలకు ఏడాదికి రూ. 5 వేల వరకు విద్యుత్తు బిల్లు వస్తోంది. ఈ ఏడాది వచ్చిన రూ. 10 వేల పాఠశాల వార్షిక, నిర్వహణ నిధులు మొత్తం ఖర్చయ్యాయి. అక్కడి ప్రధానోపాధ్యాయుడు రూ. 5 వేల వరకూ సొంత ఖర్చులు భరించారు.
- కరీంనగర్ సప్తగిరికాలనీలోని ఉన్నత పాఠశాలలో 17 గదులున్నాయి. 8 గదుల్లో ఆర్థిక సహకారంతో ఫ్యాన్లు సమకూర్చుకున్నారు. బోరు, నీటిశుద్ధి యంత్రం ఉంది. డిజిటల్ తరగతులు నడవాలి. దానివల్ల ప్రతి నెలా రూ. వెయ్యికి పైగా విద్యుత్తు బిల్లు వస్తోంది. వీటన్నింటికీ మూణ్నెల్లకే నిధులు అయిపోయాయి.

ఇలా నిర్వహణకు నిధులు చాలక పలు సర్కారు బడులు సమస్యలతో సతమతమవుతున్నాయి. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ పథకాలైన సర్వశిక్షా అభియాన్(ఎస్ఎస్ఏ), రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్(ఆర్ఎంఎస్ఏ) కింద విడుదలయ్యే నిధుల నుంచి ఏటా పాఠశాలల వార్షిక, నిర్వహణ నిధులను విద్యాశాఖ విడుదల చేస్తోంది. ప్రాథమిక పాఠశాలలకు ఎస్ఎస్ఏ కింద రూ. 10 వేలు ఇస్తున్నారు. ఆర్ఎంఎస్ఏ కింద అందే రూ. 50 వేల నిధుల నుంచి ఉన్నత పాఠశాలలు నిర్వహణ అవసరాలకు రూ. 15వేలు వాడుకోవచ్చు. ఎస్ఎస్ఏ నుంచి ఉన్నత పాఠశాలలకు మరో రూ. 15 వేలకు తగ్గకుండా నిధులొస్తున్నాయి. విద్యార్థులు, గదుల సంఖ్యను బట్టి మరికొంత పెరుగుతాయి. ఏడాది మొత్తం అవసరాలకు అవి సరిపోవడం లేదని ఉపాధ్యాయవర్గాలు ఆవేదన చెందుతున్నాయి. దాదాపు పాఠశాలలన్నింటికీ విద్యుత్తు సౌకర్యం ఉంది. డిజిటల్ తరగతులున్నాయి. బోర్‌వెల్ ఉన్న పాఠశాలలూ అధికమే. ఆర్ఓ శుద్ధియంత్రాలు ఉన్న బడులూ పెరిగిపోతున్నాయి. ప్రత్యేక దినోత్సవాల కార్యక్రమాలు నిర్వహించాలని విద్యాశాఖ నుంచి ఆదేశాలు అందుతున్నాయి. వీటన్నింటికీ నిధులు చాలడం లేదు.

రాష్ట్ర బడ్జెట్‌లో నిధులేవీ?: పాఠశాల విద్యాశాఖకు ఈఏడాది బడ్జెట్‌లో రూ. 10,215 కోట్లు కేటాయించినా బడుల నిర్వహణకు, మరమ్మతులకు కేటాయించేవి శూన్యం. ఎన్ని అవసరాలున్నా కేంద్ర పథకాల కింద ఇస్తున్న నిధులతో సరిపెట్టుకోవాల్సిందే. ఇటీవల రాష్ట్రప్రభుత్వం దార్శనికత 2024 పత్రంలోనూ నిర్వహణ నిధులు కేటాయించకపోవడాన్ని బలహీనతగా పేర్కొనడం గమనార్హం. దీనిపై విద్యాశాఖ కమిషనర్ కిషన్‌ను వివరణ కోరగా విద్యుత్తు బిల్లుల సమస్య తన దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై ఆలోచన చేయాలని చెప్పారు.

దాతలు కరుణిస్తున్నా...

ఉపాధ్యాయులు చొరవ తీసుకున్న చోట్ల దాతలు ముందుకొచ్చి ఫ్యాన్లు బహుకరిస్తున్నారు. దీనివల్ల విద్యుత్తు బిల్లులు పెరిగిపోతున్నాయి. మొత్తానికి ఒక్క విద్యుత్తు బిల్లులకే కేంద్ర పథకాల కింద వచ్చే నిధుల్లో సగం పోతున్నాయి. దీనిపై ఇప్పటికే కొన్ని ఉపాధ్యాయ సంఘాలు విద్యాశాఖతో మొరపెట్టుకున్నా ఫలితంలేదు. విద్యుత్తు బిల్లు ఎంతవస్తే అంత మొత్తాన్ని మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులు కోరుతున్నారు.



వైభవంగా రథోత్సవం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి దేవస్థానానికి అనుబంధంగా కొనసాగుతున్న పాతగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ సన్నిధిలో ఆదివారం రాత్రి రథోత్సవం ఘనంగా జరిగింది. బ్రహ్మోత్సవాలలో భాగంగా కల్యాణమూర్తులైన లక్ష్మీనరసింహులను రథంపై ఉంచి తీర్థజనుల దర్శనాలకు అవకాశం కల్పించారు.

31న ఆలయం మూసివేత: సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని బుధవారం(ఈ నెల 31న) ఉదయం 10 గంటల నుంచి మూసివేస్తారు. ఈ సందర్భంగా భక్తులు నిర్వహించే నిత్యకల్యాణం, హోమాది పూజలు, అలంకార సేవోత్సవాలను రద్దు చేసినట్లు దేవస్థానం కార్యనిర్వహధికారి తెలిపారు. ఫిబ్రవరి ఒకటో తేదీన నిత్యపూజలు యథావిధిగా కొనసాగుతాయన్నారు.

వారెవ్వా!

కరీంనగర్, సోమవారం జనవరి 29, 2018

varevva@eenadu.in

ఈనాడు

'వెల్'మెట్

తీపి దెబ్బ తగలకుండా!



వాహనచోదకులు, భారీ భవనాలు నిర్మించే కార్మికులు రక్షణ కోసం శిరస్త్రాణాలు ధరించడం తెలిసిందే. పూజారులు శిరస్త్రాణాలు ధరిస్తే వింతే కదూ! పైగా ఇదెక్కడో కాదు, తెలంగాణ కుంభమేళాగా ప్రఖ్యాతిచెంది, లక్షలాది భక్తులు తరలివచ్చే మన మేడారం జాతరలోనే. అయినా పూజారులు హెల్మెట్‌లు ఎందుకు పెట్టుకుంటారని మీకు సందేహం కలిగే ఉంటుంది. సమ్మక్కసారలమ్మ తల్లులకు భక్తులు నిలువెత్తు బంగారం (బెల్లం) మొక్కులను సమర్పించడం ఇక్కడ ఆనవాయితీ. జాతర సమయంలో సుమారు కోటి మంది వరకు భక్తులు మేడారం తరలివస్తారు. రద్దీ ఎక్కువ కావడంతో భక్తులను గద్దెల లోపలికి అనుమతించరు. గిరిజన పూజారులు, వలంటీర్లే లోపల ఉంటారు. అమ్మవార్లకు బెల్లం నివేదించాక భక్తులు భారీ బెల్లం ముక్కలను గద్దెల లోపలికి వేగంగా విసురుతుంటారు. ఇవి తాకకుండా ఉండేందుకు కొన్నేళ్లుగా జాతర సమయంలో లోపలున్న పూజారులు, ఇతర వలంటీర్లు హెల్మెట్లు ధరిస్తున్నట్లు పూజారి సిద్ధబోయిన అరుణ్ తెలిపారు.

–న్యూస్‌టుడే, మేడారం



సమితులు..

బహుపదులు..

క్షేత్ర సమితి..

త్రికోణమితి..

..ఇలా రోజుకొక పాఠం. పేజీలు చకచకా తిప్పేస్తూ బుద్ధిగా చదువుతోంది ఒక పెద్దావిడ. బయటి వాళ్లు చూస్తే.. ఈ వయసులో పదో తరగతి గణితం ఎంత ఓపిగ్గా చదువుతోంది. లేటు వయసులో పరీక్షలు రాస్తోందేమోనని పొరపడతారు. 'హమ్మయ్య.. నాలుగు పాఠాలు చదివేశా. ఈ రోజుకిక చాలు!' అనుకుని చేతిసంచి భుజాన వేసుకుని.. కళ్లద్దాలు సవరించుకుని.. వెళ్లిపోయిందామె. ఆ కళ్లలో ఎక్కడలేని సంతృప్తి. తన చూపును ఇతరులకు అరువు ఇచ్చానన్న మహదానందం. అయితే ఆమె నేత్రదానం చేయలేదు. స్వరదానం చేసిందంతే! ఆ పఠనం అంధులకు నయనానందం!



మన గాత్రం

ఎందరికో నేత్రం

హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి రోజూ వచ్చిపోయే పేషెంట్లతో కిటకిటలాడుతుంటుంది. ప్రధానద్వారం నుంచి లోపలికి వెళుతూనే విజన్ రిహాబిలిటేషన్ సెంటర్ కనిపిస్తుంది వీరిలో. అక్కడంతా నిశ్శబ్దం. మూడు రికార్డింగ్ థియేటర్లలో ఎవరో ఒకరు స్పీకరు ముందు కూర్చుని.. పుస్తకాలను చదువుతుంటారు. గాయత్రిమంత్రం పఠిస్తున్నంత భక్తిభావం కనిపిస్తుంది. ఒకరి తరువాత ఒకరు.. రావడం.. చదవడం.. వెళ్లిపోవడం.. అదొక స్వర యజ్ఞమే!

ఇంతకూ వాళ్లేం చేస్తారు?


అంధులకు అవసరమైన అన్నిరకాల పాఠ్యపుస్తకాలను ఆడియోల్లో రికార్డు చేస్తుంది రిహాబిలిటేషన్ కేంద్రం. ఇప్పటికే వేల పుస్తకాలు ఆడియోల్లోకి నిక్షిప్తం అయ్యాయి. ఈ ఆలోచన వెనక పెద్ద తపస్సే ఉంది. ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి ఛైర్మన్ గుళ్లపల్లి ఎన్.రావు మదిలో మెరిసిన ఆలోచన ఇది. ఆస్పత్రికి నిత్యం వందల మంది కంటి వైద్యం కోసం వస్తుంటారు. ఎంతోమందికి వైద్యులు చూపునిస్తారు. కొందరికి ఇతరత్రా, పుట్టుకతో సమస్యల వల్ల జీవితాంతం చూపు రాదు. ఇలాంటి అంధులు ఎవరిమీదా ఆధారపడకుండా.. తమ పనులు తామే చేసుకునేలా శిక్షణ ఇస్తారు. అంధులకు ప్రత్యేకమైన జీవన నైపుణ్యాలన్న మాట. ఆ లక్ష్యంతోనే కేంద్రాన్ని స్థాపించారు ఎన్.రావు. దేశ విదేశాల్లోని అంధులు సైతం ఇక్కడ శిక్షణ పొందుతుంటారు. అయితే ఇక్కడికి వచ్చిపోయే అంధులు.. తమ చదువుకు అంధత్వం పెద్ద అడ్డంకి అవుతోందన్నారు. ఎందుకంటే- బ్రెయిలీ లిపిలో పాఠ్యపుస్తకాలను చదవడం సులువు కాదు. ఒక బ్రెయిలీ పుస్తకం బరువు.. సాధారణ పుస్తకానికి ఆరు రెట్లు ఎక్కువ. ఒక చోటు నుంచి మరో చోటికి తీసుకెళ్లడం కష్టం. భద్రపరచడానికీ అనువుగా ఉండదు. బ్రెయిలీని స్పర్శజ్ఞానంతోనే చదవాలి. దీనివల్ల మనసు త్వరగా అలసిపోతుంది. ఇలా బడి పుస్తకాలు చదవడమే గగనం. ఇక, ఇతర సాహిత్య పుస్తకాలంటే శ్రమే.

శ్రవణమే శ్రేయస్కరం

గూగుల్‌ప్లేలో అంధులకు చదివిపెట్టే యాప్స్ బోలెడు. ఇప్పటికే కొన్ని సాఫ్ట్‌వేర్లు అందుబాటులో ఉన్నాయి. అయితే వచ్చిన చిక్కల్లా.. స్థానిక భాషల్లోని పాఠ్యపుస్తకాలు ఆడియోల్లో దొరక్కపోవడమే పెద్ద సమస్య. పాఠశాల స్థాయి నుంచి స్నాతకోత్తర విద్య (పీజీ) వరకు శ్రవణ పుస్తకాలు లేవు. ఈ కొరతను తీర్చేందుకు పూనుకుంది ఎల్‌వీ ప్రసాద్ విజన్ రిహాబిలిటేషన్ సెంటర్. నిర్వహణకు అవసరమైన చేయూతను జీఈ సంస్థ అందించింది. మరిన్ని కార్పొరేట్ సంస్థలు చేతులు కలిపాయి. అంతా బాగానే ఉంది. మరి, పుస్తకాలు చదవడానికి ముందుకొచ్చేవాళ్లేరీ? అందులోనూ స్పష్టమైన వాచకం, వినసొంపైన స్వరం అందించే వాళ్లే కావాలి. కార్పొరేట్, ఐటీ సంస్థల దృష్టికి తీసుకెళ్లారు కేంద్రం నిర్వాహకులు. శని, ఆదివారాల్లో రోజుకొక గంట చొప్పున పుస్తకాలు చదివేందుకు ఉద్యోగులు ముందుకు వచ్చారు. 'మాకు మూడు రికార్డింగ్ గదులు ఉన్నాయి. ఎవరికి కావాల్సిన సమయాన్ని వాళ్లకు కేటాయిస్తున్నాం. శ్లాబ్‌లను బట్టి చదివి వెళ్లిపోతున్నారు.." అని చెప్పారు ఇన్‌ఛార్జి బ్యూలా క్రిస్టీ.

స్వర దాతలు కదిలారు..

తొమ్మిదో తరగతి నుంచి పోస్టుగ్రాడ్యుయేషన్ వరకు పాఠ్యపుస్తకాలు, గైడ్‌లు, క్వశ్చన్ బ్యాంకులకు లెక్కలేదు. ఇక, రెండు తెలుగు రాష్ట్రాల పాఠ్యపుస్తకాలు కలిపితే ఆ సంఖ్య మరింత పెద్దదవుతుంది. వీటిని చదివి ఆడియోల్లోకి పొందుపరచడానికి చాలా మంది ముందుకొచ్చారు. మనం చదివిన పుస్తకం ఎంతో మంది అంధులకు కొత్త జీవితాన్ని ప్రసాదిస్తుందన్న ఆలోచన వారిని కట్టిపడేసింది. ఆస్పత్రిలోని కేంద్రానికి నేరుగా వచ్చి.. మేముసైతం అన్నారు. తొలినాళ్లలో ముందుకొచ్చిన మొట్టమొదటి స్వరదాత - శాంతి తిరుమలై. 'కంటి వైద్యం కోసమని మా అమ్మాయిని ఎల్‌వీ ప్రసాద్‌కు తీసుకెళ్లా. ఈ కేంద్రం గురించి తెలిసింది. నాకు పుస్తకాలు ఇవ్వండి. ఇంటివద్ద చదివి టేపురికార్డర్లలో రికార్డు చేసి.. క్యాసెట్లు పంపిస్తాను అని ఒప్పించాను. వాళ్లు సరేనన్నారు. ఇప్పటిలా డీవీడీలు లేవు.." అని గుర్తు చేసుకున్నారామె. ఆ తరువాత ఎల్‌వీ ప్రసాద్ కేంద్రానికి వచ్చి కొన్నేళ్ల పాటు రికార్డింగ్ కోసం ఎన్నో పుస్తకాలను చదివారు. ఇలా ఒకర్ని చూసి మరొకరు స్వచ్ఛందంగా తరలివచ్చారు. ఇప్పుడైతే కనీసం ఎనిమిది వందల మంది స్వరదాతలను తయారుచేసుకుంది విజన్ రిహాబిలిటేషన్ కేంద్రం. అందరూ తమ సొంత ఖర్చులతో వచ్చి గాత్ర దానం చేస్తుండటం గొప్ప విషయం.



'మా నాన్న ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి ఉద్యోగి. ఆయన రోజూ వందల మంది కళ్లు లేని పిల్లలను చూస్తుంటాడు. జీవితం ఎలా ఉంటుందో వాళ్లను చూస్తే తెలుస్తుంది అనేవాడు. నాన్న వెంట ఒక రోజు అక్కడికి వెళ్లాను. నాకు చిన్న చిన్న కథలు చదవమని ఇచ్చారు. రికార్డింగ్ థియేటర్‌లో కూర్చుని చదివాను. అప్పటి నుంచి ఐదేళ్లుగా రికార్డింగ్ కోసం పుస్తక పఠనం చేస్తూనే ఉన్నా. అంధుల్లో కూడా మనలాంటి పిల్లలు ఉంటారు కదా! వాళ్లకు నేనే కళ్లు అయితే అంతకంటే ఆనందం ఇంకేముంటుంది?

– సంహితరెడ్డి, విద్యార్థిని

ఉచిత ఆడియో బుక్స్ కావాలనుకునే అంధులు సంప్రదించాల్సిన చిరునామా.. విజన్ రిహాబిలిటేషన్ సెంటర్, ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్, ఎల్‌వి ప్రసాద్ మార్గ్, హైదరాబాద్.

ఫోన్ : 040 30612841

ఈమెయిల్ : rehabhelpline@lvpei.org

ఆ పాఠాలు.. వెలుగు దీపాలు

ఇప్పుడు విజన్ రిహాబిలిటేషన్ సెంటర్.. దేశంలోనే ఎన్నడాలేనంత పెద్ద ఆడియో లైబ్రరీని రూపొందించుకుంది. తెలుగు రాష్ట్రాల్లోని మారుమూల గ్రామం నుంచి కూడా.. నాకు ఫలానా ఆడియో బుక్ కావాలని ఫోన్ చేస్తే చాలు. ఆ పుస్తకం తాలూకు సీడీని పోస్టులో పంపిస్తారు నిర్వాహకులు. లేదంటే పెన్‌డ్రైవ్‌లో సేవ్ చేసిస్తారు. నిరుపేదలైన అంధులకైతే ఏకంగా ఒక ట్యాబ్‌లోకి ఆడియో పుస్తకాలన్నీ డౌన్‌లోడ్ చేసి.. ఉచితంగా అందిస్తారు. ఈ ఆడియో పాఠాలు చదువుకుని పైకొచ్చిన అంధులకైతే కొదవ లేదు. హైదరాబాద్‌కు చెందిన బిబూ గంగాధర్‌కు చూపులేదు. "నేను కళాశాల రోజుల నుంచి ఇక్కడున్న ఆడియో పుస్తకాలే విన్నాను. పోటీపరీక్షలకు కావాల్సిన పుస్తకాలను కూడా రికార్డు చేసి నాకిచ్చారు. అవి లేకపోతే నేనీరోజు ప్రభుత్వ ఉద్యోగం సాధించేవాడ్ని కాదు' అన్నాడతను. నిజామాబాద్‌కు చెందిన ఆరోగ్యరాజ్ ఇంట్లో అందరూ అంధులే! "ఎల్‌వీ ప్రసాద్ కేంద్రం రికార్డు చేసిన ఆడియోబుక్స్ దొరికాక.. కొత్త చూపు వచ్చిందన్న భరోసా కలిగింది. వాటిని విని ఉపాధ్యాయ ఉద్యోగం సంపాదించా.." అంటూ ఆనందంగా చెప్పుకొచ్చాడు. విప్రోలో ఉద్యోగం చేస్తున్న సింధు, సీబీఐ ఉద్యోగి అనీల్‌కుమార్, ఎస్‌బీఐలో పనిచేస్తున్న స్వాతి.. ఇలా ఒకరా ఇద్దరా? వందల మందికి ఆడియోబుక్స్ అన్నం పెట్టాయి. ఆ చల్లని చూపునిచ్చిన స్వరదాతలు.. అంధుల విధిరాతను తిరగరాశారు!




'ఆంగ్లంలో ఆడియోబుక్స్‌కు కొదవ లేదు. అయితే మనది భిన్న భాషలున్న దేశం. ప్రతి రాష్ట్రానికో మాతృభాష ఉంటుంది. అందులోనే విద్యార్థులు చదవాలి. పోటీపరీక్షలు రాయాలి. అంతర్జాలంలో ఆంగ్లంలో తప్పిస్తే.. ప్రాంతీయ భాషల్లో శ్రవణ పుస్తకాలు దొరకవు. కాబట్టి ప్రతి పాఠ్యపుస్తకాన్నీ, పోటీపరీక్షలకు అవసరమైన వాటినీ.. ఆడియోబుక్స్‌లోకి మార్చేశాం. ఈ మధ్య పశ్చిమ బంగా ప్రభుత్వం కూడా తమ పాఠ్యపుస్తకాలను ఆడియోల్లోకి మార్చివ్వమని కోరింది..'

–బ్యూలా క్రిస్టీ, ఇన్‌ఛార్జి, విజన్ రిహాబిలిటేషన్ సెంటర్



జీవితంలో ఆఖరికి.. పదిమందికి పనికొచ్చే పని చేశామన్న సంతృప్తే మిగులుతుంది! నాకు తెలుగు, హిందీ, ఆంగ్లం, దేవనాగరి భాషలు వచ్చు. ఈ భాషల్లోని పుస్తకాలను ఆడియో పాఠాలుగా చదువుతుంటాను. నా బుక్స్‌ను అంధులు వింటున్నప్పుడల్లా నేను గుర్తుకొస్తుంటాను. ఎన్నేళ్లయినా ఆ ఆడియోలు భద్రంగా ఉంటాయి..

– డా కిన్నెరమూర్తి, రిటైర్డు డీన్, అడ్మినిస్ట్రేటివ్ కాలేజ్ ఆఫ్ ఇండియా



అందరివారు



చదువుకు సాకేతనం

కొందరు యువతీ యువకులు తమ ఇంట్లోనే కాకుండా.. సాఫ్ట్‌వేర్ కంపెనీలు, గవర్నమెంట్ ఆఫీసుల్లో చెత్తకాగితాలను సేకరిస్తున్నారు. వారా పని చేసేది కొందరి జీవితాల్లో అక్షర వెలుగులు నింపడానికి...

నిత్యం మనం చూసే చెత్త కాగితాల్లోనే 'యువత' సంస్థ ఫౌండర్ సాకేత్‌కి ఓ కొత్త ఆలోచన కన్పించింది. ఆ కాగితాలను రీసైక్లింగ్ చేసి నోట్‌పుస్తకాలను తయారు చేయాలనుకున్నాడు. తన ఆలోచనను తోటి వాలంటీర్లతో పంచుకున్నాడు. అందరూ సరేనన్నారు. వాళ్ల ఇళ్లతోపాటు పలుచోట్ల సేకరించి తీసుకొచ్చారు. 1563 కేజీల చెత్త కాగితాలన్ని సేకరించి వాటితో 2500 నోటు పుస్తకాలు తయారు చేశారు. వారి సంరక్షణలో ఉండే తొమ్మిది పిల్లల హాస్టల్స్‌లో ఒక్కొక్కరికి రెండు చొప్పున పంచారు. పిల్లలు ఆనందపడ్డారు. 'యువత'కి సరికొత్త ఉత్సాహం వచ్చింది.

లక్ష నోటు పుస్తకాల తయారీకి..

పైలెట్ ప్రాజెక్టు హిట్ కావటంతో మెగా కార్యక్రమానికి ఈ సంస్థ రూపకల్పన చేసుకుంది. లక్ష పుస్తకాలను తయారు చేసే క్రమంలో పడిందీ సంస్థ. ఈ ఎన్జీవోలో ఉండే వలంటీర్లు ఎవరికివాళ్లు వారి ఇంటితో పాటు పనిచేసే కార్యాలయల్లోనూ చెత్తకాగితాలు సేకరిస్తున్నారు. వీళ్ల ఆలోచన నచ్చి కొన్ని వందల కేజీలను జేఎన్‌టీయూతో పాటు కొన్ని ఆఫీసులు, సాఫ్ట్‌వేర్ కంపెనీలు చెత్తకాగితాలను ఉచితంగా ఇచ్చాయి. 'ఇప్పటికి ఇరవై వేల కేజీల కాగితాలు పోగయ్యాయి. మరో పదిహేను వేల కేజీలయితే లక్ష పుస్తకాలు తయారు చేయవచ్చు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభంలో పిల్లలకు వీటిని అందిస్తా'మంటోంది ఈ బృందం. ఈ నోటు పుస్తకాలను సర్కారు బడి పిల్లలకే అందించనున్నారు.

ఇదీ యువత ప్రత్యేకం!

హైదరాబాద్‌కి చెందిన సాకేత్ ఇంజినీరింగ్ చదివే సమయంలో సమాజానికి ఏదోటి చేయాలనుకున్నాడు. తన స్నేహితులతో కలిసి 2011లో 'యువత'ను ప్రారంభించాడు. ఇంజినీరింగ్ పూర్తయ్యాక మూడేళ్లు గూగుల్‌మ్యాప్స్‌లో ఉద్యోగం చేశాడు. పల్లెతో అనుబంధముండే పని చేయాలని ఉద్యోగానికి రాజీనామా చేసి టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సులో 'రూరల్ డెవలప్‌మెంట్ అండ్ గవర్నెర్స్ సోషల్ సెక్టార్' కోర్సును చదువుతున్నాడు. కోర్సులో భాగంగా గిరిజన ప్రాంతాల్లో సాకేత్ పనిచేస్తుంటాడు. ఇక యువత విషయానికొస్తే.. ఎకోహబ్స్, హెల్పింగ్ హ్యాండ్స్, గిఫ్టింగ్ ఫ్యూచర్, బ్లడ్ బ్రికేడ్ అనే నాలుగు అంశాలే ధ్యేయంగా ముందుకెళుతోంది. 'మేం 150 మంది ఉన్నాం. ప్రతి ఏడాదీ లక్ష పుస్తకాలను ఉచితంగా ప్రభుత్వ పాఠశాలలకు ఇవ్వాలనేదే ప్రస్తుతమున్న లక్ష్యం' అంటూ ఆత్మవిశ్వాసంతో చెప్పుకొచ్చాడు సాకేత్.



కర్షక... హర్షం

రైతులు..

పండించిన రైతులకు గిట్టుబాటు ధర దక్కడం లేదు. దళారుల దోపిడీతో చిక్కి శల్యమైపోతున్నారు.

వినియోగదారులు.

మార్కెట్లో కూరగాయల ధరలు మండిపోతున్నాయి. రూ.500 తీసుకెళ్లినా చేతి సంచి నిండని పరిస్థితి.

అన్నగారి సంత వచ్చాక...

రెండు వందల మందికి పైగా రైతులకు భరోసా దొరికింది... పదివేలకు పైగా కుటుంబాలకు తక్కువ ధరకు కూరగాయలు లభిస్తున్నాయి.

సంతంటే సంతా కాదు...

లాభాల పుంత



ఓ వ్యవస్థ సక్రమంగా పనిచేస్తే... ఎందరికి, ఎన్ని విధాలా ప్రయోజనం కలుగుతుందో తెలియజెప్పే స్ఫూర్తి మంత్రం అన్నగారి సంత.

ప్రకాశం జిల్లాలో మార్టూరు, ఒంగోలు, అద్దంకి పరిసర ప్రాంతాల్లో ఉన్న పదులకొద్దీ గ్రామాల్లో రైతులు కూరగాయలను పండిస్తారు. ఈ పంటను మార్కెట్లకు తీసుకెళ్లినా తగిన ధర లభించకపోవడంతో నిరుత్సాహానికి గురయ్యేవారు. 2015లో ఏర్పాటైన అద్దంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) నూతన పాలకమండలి ఈ స్థితిగతుల నుంచి అన్నదాతలను గట్టెక్కించాలని సంకల్పించింది. సుమారు పద్దెనిమిదెకరాల్లో విస్తరించి ఉన్న ఏఎంసీ ప్రాంగణం చాలాకాలం నిరుపయోగంగా ఉంటోంది. దానిని రైతులకు ఉపయోగపడేలా చేస్తే... ఈ ఆలోచన వచ్చిందే తడవుగా కార్యాచరణ ప్రారంభించారు. దళారులు, అధికారుల ప్రమేయం లేకుండ రైతులందరినీ ఓ చోటకు చేర్చి... వారి ఉత్పత్తుల్ని వారే అమ్ముకునేలా వారంలో ఒకరోజు సంత నిర్వహించాలన్న నిర్ణయానికి వచ్చారు. ఈ క్రమంలో కొరిశపాడు అద్దంకి, బల్లికురవ మండలాల్లో కూరగాయలు పండించే రైతులతో సమావేశాలు నిర్వహించారు. అలా... 2015 జూన్ 6న అద్దంకిలో అన్నగారి సంత ప్రారంభమైంది.

- ప్రకాశం జిల్లాలోని ఏ ఇతర మార్కెట్లతో పోల్చినా అన్నగారి సంతలో కూరగాయల ధరలు 30 నుంచి 50 శాతం తక్కువ.
- ప్రతి ఆదివారం జరిగే అన్నగారి సంతలో... ఆ ఒక్క రోజే రూ.25 లక్షలకు మించి అమ్మకాలు జరుగుతాయి.
- అద్దంకితో పాటు పంగులూరు, బల్లికురవ, ముండ్లమూరు, తాళ్లూరు మండలాల నుంచి వినియోగదారులు వస్తుంటారు.
- దళారుల ప్రమేయం లేకుండా కర్షకులు నేరుగా వినియోగదారులకు తమ ఉత్పత్తులను అమ్ముకొనే ఏకైక మార్కెట్టు ఇది.
- అన్నగారి సంత విజయవంతంతో అద్దంకి ఏఎంసీ ఆధ్వర్యంలోనే కొరిశపాడు మండలం మేదరమెట్ల, పంగులూరులోనూ ఇలాంటి సంతలే ఏర్పాటయ్యాయి.

నిలబెట్టేదెలా...

సంత నిర్ణయం బాగానే ఉన్నా... అద్దంకికి కాస్త దూరంగా ఉన్న రామ్‌నగర్ వరకు వినియోగదారులు వస్తారా? అన్న సంశయం తలెత్తింది. ఈ ప్రాంత రైతులు ప్రధానంగా దొండ, బెండ, పప్పు చిక్కుడు, పొట్ల, కాకర, మిర్చి, టమాటా, బీర, ఆకు కూరలను మాత్రమే పండిస్తారు. అన్ని రకాల కూరగాయలు ఉంటేనే తప్ప సగటు వినియోగదారు ఇంత దూరం రాడు. ఈ విషయంలో ఏఎంసీ వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. స్థానికంగా దొరకని క్యారెట్, క్యాబేజీ, బీట్‌రూట్, క్యాప్సికం, బంగాళాదుంప, క్యాలీఫ్లవర్, బీన్స్, కూర అరటి, బజ్జీ మిర్చి, ముల్లంగి, ఉల్లి తదితరాలను... కర్నూలు, అనంతపురం, చెన్నై, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి తెప్పించారు. రవాణా ఛార్జీలు మాత్రమే జతచేసి... ప్రత్యేక కౌంటర్ల ద్వారా లాభాపేక్షలేకుండా అందుబాటులోకి తెచ్చారు. ఇప్పటికీ ఈ పద్ధతి కొనసాగుతోంది. అదనంగా కిరాణా, పూలు, పండ్లు, చేపలు, మాంసం కౌంటర్లను కూడా ఏర్పాటు చేయించారు. అన్నీ ఒక్కచోటే లభ్యమయ్యేలా చర్యలు తీసుకోవడంతో వినియోగదారులు మరో వైపు చూడాల్సిన అవసరం లేకపోయింది. 16 దుకాణాలతో ప్రారంభమైన సంత... తరువాత 40... ఇప్పుడు ఏకంగా 210 దుకాణాలకు విస్తరించింది. బయటి మార్కెట్‌కు అన్నగారి సంతకు ధరల్లో దాదాపు సగం మేర వ్యత్యాసం ఉండడం వినియోగదారులను బాగా ఆకర్షించింది. విక్రేతలంతా రైతులే. బయటి మార్కెట్‌కు తీసుకువెళ్లినకంటే ఎక్కువగానే గిట్టుబాటు అవుతుండడంతో వారూ ఆనందంగానే ఉన్నారు. ప్రస్తుతం సంత టర్నోవర్ నెలకు (నాలుగు రోజులు) రూ.కోటి దాటుతోంది.

– నాగినేని చంద్రమౌళి, -న్యూస్‌టుడే, అద్దంకి

ఈనాడు సినిమా

ఎలా వచ్చిందబ్బా..?

సెట్లో సందడి


చిత్రీకరణ చేసిన ఓ సన్నివేశాన్ని దర్శకుడు వెంకీతో కలసి తీక్షణంగా పరిశీలిస్తున్న వరుణ్‌తేజ్

సాంకేతికత వల్ల ఎన్ని ఉపయోగాలో ప్రత్యేకంగా చెప్పాలా? మరీ ముఖ్యంగా సినిమా ప్రస్తుతం టెక్నాలజీపైనే నడుస్తోంది. ఇది వరకటి రోజుల్లో.. తీసిన సన్నివేశం ఎలా వచ్చిందో తెలుసుకోవాలంటే ల్యాబుల్లోకి పరిగెట్టాల్సివచ్చేది. ఆ తరవాత మానిటర్లు వచ్చాయి. ఇప్పుడు అక్కడికక్కడ ఎడిట్ చేసి మరీ చూసేసుకోవొచ్చు. నచ్చకపోతే... మరో టేక్‌కి వెళ్లిపోవొచ్చు. ఓ ప్రేక్షకుడిలా ఆలోచించగలిగితే తప్పొప్పుల్ని అక్కడే సవరించుకోవచ్చు. ఇదిగో ఈ చిత్రం చూశారు కదా? వరుణ్‌తేజ్ ఎంత సీరియెస్‌గా కెమెరా వెనుక ఉన్న స్క్రీన్‌పై ఓ లుక్కేశాడో..? 'తొలిప్రేమ' సెట్లో కనిపించిన దృశ్యమిది. అసలే బాబాయ్ పవన్ కల్యాణ్ టైటిల్‌తో వస్తున్న సినిమా. 'ఫిదా'తో పెరిగిన అంచనాల్నీ అందుకోవాలి. అందుకే ప్రతి ఫ్రేమూ జాగ్రత్తగా గమనించాల్సివస్తోంది. దర్శకుడు వెంకీ అట్లూరితో కలసి తీసిన సన్నివేశంని తీక్షణంగా పరిశీలిస్తున్నప్పుడు క్లిక్‌మన్న ఫొటో ఇది.


శ్రియ, విష్ణు, టి.సుబ్బరామిరెడ్డి, నిర్మల, మోహన్‌బాబు, మదన్, చాముండేశ్వరినాథ్, అనసూయ

గురువువల్లే శభాష్ అనిపించుకొన్నా!

- 'గాయత్రి' పాటల వేడుకలో మోహన్‌బాబు

"కష్టమైన వ్యాపారం సినిమా. నటులుగా పుట్టాం కాబట్టి మాకు తెలిసిన వ్యాపారం ఇదొక్కటే. అరవై సినిమాలు నిర్మించాం. విజయాలు వచ్చినప్పుడు విర్రవీగలేదు. అపజయం వచ్చినప్పుడు కుంగిపోలేదు. వరుసగా ఐదు సినిమాలు విజయవంతమైనా... ఆ తర్వాత ఒక్కటి పరాజయాన్ని చవిచూసిందంటే ఐదు సినిమాల్లో వచ్చిన లాభం పోతుంది. సినీ నిర్మాతల పని అంత కష్టం" అన్నారు మోహన్‌బాబు. ఆయన ప్రధాన పాత్రధారిగా నటిస్తూ నిర్మించిన చిత్రం 'గాయత్రి'. మంచు విష్ణు, శ్రియ జంటగా నటించారు. మదన్ దర్శకత్వం వహించారు. తమన్ స్వరకర్త. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో పాటల విడుదల వేడుక జరిగింది. తొలి సీడీని మోహన్‌బాబు, టి.సుబ్బరామిరెడ్డి, విష్ణు సంయుక్తంగా ఆవిష్కరించారు. అనంతరం మోహన్‌బాబు మాట్లాడుతూ "నన్ను నటుడిగా పరిచయం చేసింది మా గురువు దాసరి నారాయణరావు. నా కోసం ఎన్నో పాత్రలు సృష్టించి ఇచ్చారు. ఆయన నేర్పించిన సంభాషణలవల్లే శభాష్ అనిపించుకొంటున్నా. మహానటుడు ఎన్టీఆర్ తర్వాత సంభాషణలు చెప్పే నటుడు మోహన్‌బాబు అంటున్నారంటే అది మా గురువుగారి చలవే. యోధానుయోధులతో కలిసి నటించా. విలన్‌గా, కమెడియన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా చేసి, నేను మోహన్‌బాబు అని ముద్ర వేసుకొన్నా. ఇందులో రెండు పాత్రల్లో నటించా. మదన్ మంచి రచయిత, దర్శకుడు. 'గాయత్రి'ని అద్భుతంగా తీశాడు. విష్ణు నటన కంటతడి పెట్టించింది. శ్రియ ఈతరంలో కథానాయికలెవ్వరూ చేయలేరనేలా తన పాత్రని పండించింది" అన్నారు. విష్ణు మాట్లాడుతూ "ప్రతినటుడికీ ఒక మలుపు ఉంటుంది. 'ఢీ', 'దేనికైనా రెడీ' ఇలా చాలా విజయాలొచ్చాయి కానీ నా దృష్టిలో అవి నాకు ఇష్టమైన పాత్రలు కాదు. రెండు మూడు సినిమాల్ని నటుడిగా చాలా ఇష్టపడి చేశా. అందులో 'అనుక్షణం' ఒకటి. నాకు నటుడిగా ఆత్మ విశ్వాసాన్నిచ్చింది రామ్‌గోపాల్ వర్మ. ప్రతి నటుడికీ వాళ్ల కెరీర్‌లో గుర్తుండిపోయే ఒక పాత్ర ఉంటుంది. ఆ పాత్ర వాళ్లకి మంచి నటుడిగా పేరైనా తీసుకొస్తుంది, లేదంటే నటన రాదనైనా నిరూపిస్తుంటుంది. అలా ఈ పాత్ర నా జీవితంలో ఒక గొప్ప మలుపు అవుతుంది. ఒక కూతురికీ, తండ్రికీ మధ్య జరిగే కథే 'గాయత్రి'. భావోద్వేగాలు మాకు బాగా నచ్చాయి. అందుకే ఈ సినిమా ఎంపిక చేసుకొన్నాం. మాతో పోలిస్తే అక్కకు ఎక్కువ స్వేచ్ఛనిస్తూ, ఆమె చేసే తప్పులన్నింటినీ మా నాన్న ఎందుకు క్షమిస్తాడా అనుకొనేవాణ్ని. ఇద్దరు కూతుళ్లు పుట్టాక ఇప్పుడు నాకు ఆ విషయం అర్థమవుతోంది. శ్రియ బాగా నటించింది. నాన్నగారి సినిమాలు చూస్తూ పెరిగా. మా నాన్నని 'అల్లుడుగారు', 'అసెంబ్లీ రౌడీ'లో ఎలా చూశానో అలా చూశాను ఈ సినిమాలో. అన్నీ అనుకొన్నట్టు జరిగితే ఫిబ్రవరి 9న సినిమాని విడుదల చేయాలనుకొంటున్నాం" అన్నారు. శ్రియ మాట్లాడుతూ "నా హృదయానికి బాగా దగ్గరైన సినిమా ఇది. చాలా రోజుల కిందట మోహన్‌బాబు కలిశారు. తన జీవితం గురించి చెప్పారు. ఆయన కష్టం స్ఫూర్తిని నింపింది. ఆయనతో కలిసి ఈ సినిమాలో భాగం కావడం సంతోషంగా ఉంది" అన్నారు. బ్రహ్మానందం మాట్లాడుతూ "పలు అద్భుతాలతో కూడిన సినిమా ఇది. నేను విష్ణుతో కలిసి హాస్యాన్ని పండించే మంచి పాత్రని చేశా. మోహన్‌బాబు నటనా చరిత్రలో ఒక మైలురాయిగా 'గాయత్రి' నిలవాలని కోరుకొంటున్నా" అన్నారు. మంచు మనోజ్ మాట్లాడుతూ "మా తరాన్ని మించిపోయేలా నాన్న ఇందులో ఫైట్లు చేశారు. విష్ణు అన్నయ్య, శ్రియ బాగా నటించారు. శ్రియకి అభిమానిని నేను. నా స్నేహితుడు తమన్ అందించిన పాటలు బాగున్నాయి. ఎనిమిది గంటలు పనిచేస్తేనే పిల్లల్ని పట్టించుకోని పరిస్థితులు కనిపిస్తుంటాయి. కానీ నాన్న అంత బిజీగా ఉన్నప్పటికీ ఒక్క రోజు కూడా నాన్న మా దగ్గర లేరే అనే ఫీలింగ్ లేకుండా మమ్మల్ని పెంచారు. ఇంతకంటే ఎక్కువ కోరుకోం" అన్నారు. కోట శ్రీనివాసరావు మాట్లాడుతూ "భావి తరాల్లో వచ్చే నటులకి ఓ డిక్షనరీ మోహన్‌బాబు. ఆయన సినిమాల్ని చూస్తే ఏ శిక్షణ అవసరం లేదు. ఆయన సంభాషణలు వింటే తెలుగుపై పట్టు పెరుగుతుంది. 'గాయత్రి' విజయవంతం కావాలని కోరుకొంటున్నా" అన్నారు. ఈ కార్యక్రమంలో టి.సుబ్బరామిరెడ్డి, మంచు నిర్మల, మంచు లక్ష్మీప్రసన్న, అనసూయ, తనికెళ్ల భరణి, జి.నాగేశ్వరరెడ్డి, గిరిబాబు, వరప్రసాద్‌రెడ్డి, బి.గోపాల్, పృథ్వీ, సర్వేష్ మురారి, డైమండ్ రత్నబాబు, చాముండేశ్వరినాథ్, రఘురామకృష్ణంరాజు, నాగినీడు, రామజోగయ్య శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తా!


సాయిధరమ్ తేజ్, ప్రభాస్

"వినాయక్‌తో 'యోగి' చిత్రానికి పనిచేశా. నా జీవితంలో ఏ సినిమాకీ అంత ఆనందంగా పనిచేయలేదు. అందుకే వినాయక్ అంటే నాకు చాలా ఇష్టం" అన్నారు ప్రభాస్. వి.వి.వినాయక్ దర్శకత్వం వహించిన చిత్రం 'ఇంటిలిజెంట్'. సాయిధరమ్ తేజ్, లావణ్య త్రిపాఠీ జంటగా నటించారు. సి.కల్యాణ్ నిర్మాత. ఈ చిత్రంలోని 'లెట్స్ డూ' పాటని ఆదివారం హైదరాబాద్‌లో ప్రభాస్ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "ఓ పాట విడుదల చేయాలి.. వస్తావా, అని వినాయక్ మొహమాటపడుతూ అడిగారు. ఆయన ఫోన్‌లో ఓ చిన్న మెసేజ్ ఇస్తే చాలు ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తా. 'చమకు చమకు ఛాం' చిరంజీవిగారి కెరీర్‌లో అత్యుత్తమ గీతాల్లో ఒకటి. అందులో ఆయన చాలా మంచి స్టెప్పులు వేశారు. మరి సాయిధరమ్ తేజ్ ఎలా వేశాడో చూడాలని ఆత్రుతగా ఉంద"న్నారు. "స్నేహానికి ప్రాణం ఇస్తాడు ప్రభాస్. చిన్న చిన్న విషయాలకే సంతోషపడిపోతాడు. ఆ ఆనందాన్ని ఈరోజు మా అందరికీ పంచాడు. టీజర్ చూసిన వాళ్లంతా తేజు చిరంజీవిలా ఉన్నాడని చెబుతుంటే ఆనందంగా ఉంద"న్నారు వినాయక్. "ప్రభాస్‌ని మా కుటుంబ సభ్యుడిలా భావిస్తాం. తన చేతులమీదుగా ఈ పాట విడుదలకావడం ఆనందంగా ఉంద"ని సాయిధరమ్ చెప్పాడు. "చిత్రంలోని నాలుగు పాటల్ని నాలుగు దఫాలుగా విడుదల చేస్తాం. ఫిబ్రవరి 9న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామ"న్నారు నిర్మాత. ఈ కార్యక్రమంలో రచయిత ఆకుల శివ, లావణ్య త్రిపాఠి పాల్గొన్నారు.


నారా రోహిత్

కొత్త దర్శకుడితో...

నారా రోహిత్ కథానాయకుడిగా ఇ.ఎం.ఈ.వి స్టూడియోస్ సంస్థ ఓ చిత్రాన్ని తెరకెక్కించనుంది. ఎస్.డి.చక్రవర్తి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. స్క్రిప్టు పనులు పూర్తి కావొచ్చాయి. మార్చి నుంచి చిత్రీకరణ మొదలుపెడతారు. చిత్ర సమర్పకుడు వడ్డేపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ "పల్లెటూరి నేపథ్యంలో సాగే కథ ఇది. నారా రోహిత్ పాత్ర కొత్త తరహాలో ఉంటుంది. వినోదానికి లోటు ఉండదు. అన్ని వాణిజ్య అంశాలూ ఉంటాయి. త్వరలోనే కథానాయిక, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలు ప్రకటిస్తామ"న్నారు. సంగీతం: సాయి కార్తిక్.

చూస్తున్నా నిన్నే


హేమలత, సుహాసిని

కొత్త నటీనటులు శ్రీకాంత్, హేమలత జంటగా నటించిన చిత్రం 'నిన్నే చూస్తు'. సుహాసిని, సుమన్ ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. వి.ఎస్.ఫణీంద్ర దర్శకత్వం వహిస్తున్నారు. హేమలతా రెడ్డి నిర్మాత. తొలి షెడ్యూల్ చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరుగుతోంది. నిర్మాత మాట్లాడుతూ "ఒక మంచి కుటుంబ కథతో తెరకెక్కుతున్న చిత్రమిది. సీనియర్ నటులు సుహాసిని, సుమన్ పోషించిన పాత్రలు గుర్తుండిపోతాయి. త్వరలోనే చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం" అన్నారు. భానుచందర్, కిన్నెర, కాశీ విశ్వనాథ్, నిహాల్, వేణు, మహేష్, ఫణి, రమణ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: రమణ్ రాథోడ్, ఛాయాగ్రహణం: ప్రసాద్ ఈదర.

ఎందుకో.. ఏమిటో?

నందు, నోయల్, పునర్నవి ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'ఎందుకో ఏమో'. కోటి వద్దినేని దర్శకుడు. మాలతి వద్దినేని నిర్మాత. ప్రచార చిత్రాన్ని ఆదివారం హైదరాబాద్‌లో వి.వి.వినాయక్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "టైటిల్ కొత్తగా ఉంది. దర్శకుడిగా పరిచయం అవుతున్న కోటికి ఈ చిత్రం మంచి పేరు తీసుకురావాల"న్నారు. దర్శకుడు చెబుతూ "ఇదో ముక్కోణపు ప్రేమకథ. చిత్రీకరణ పూర్తయింది. ఫిబ్రవరి మొదటి వారంలో పాటల్ని, చివరి వారంలో చిత్రాన్ని విడుదల చేస్తామ"న్నారు. సంగీతం: ప్రవీణ్.



పునర్నవి, నందు

'శీలవతి'గా షకీలా


షకీలా

షకీలా కథానాయికగా సాయిరాం దాసరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'శీలవతి'. రాఘవ ఎమ్.గణేష్, వీరు బాసింశెట్టి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ "షకీలా నటించిన 250వ చిత్రమిది. కేరళలో జరిగిన యధార్థ సంఘటన ఆధారంగా ఒక సైకలాజికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కించాం. సంగీతానికి ప్రాధాన్యముంది" అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ "షకీలా నటనతో పాటు, ప్రజ్వల్ క్రిష్ సంగీతం చిత్రానికి ప్రధాన బలం. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం" అన్నారు. గీతాంజలి, అశోక్ బాబు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: తరుణ్ కరమ్‌తోత్

బాలరాజు కథలో..


రాఘవ్, కరాణ్య కత్రీన్

రాఘవ్, కరాణ్య కత్రీన్ జంటగా నటిస్తున్న చిత్రం 'బంగారి బాలరాజు'. కోటేంద్ర దుద్యాల దర్శకుడు. కె.ఎం.డి.రఫి, రెడ్డం రాఘవేంద్ర రెడ్డి నిర్మాతలు. ఈ చిత్ర టీజర్‌ని దర్శకుడు సురేందర్‌రెడ్డి హైదరాబాద్‌లో విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ "ఒక యధార్థ సంఘటన ఆధారంగా తెరకెక్కించిన ప్రేమకథ ఇది. ఫిబ్రవరి 14న ట్రైలర్‌ని, మార్చిలో సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం" అన్నారు.

బూత్ బంగ్లాలో...

అజయ్ కౌండిన్య కథానాయకుడిగా నటిస్తూ తెరకెక్కిస్తున్న చిత్రం 'ఎన్.హెచ్ 47లో బూత్ బంగ్లా'. సంధ్య, అనూష కథానాయికలు. ఆంజనేయులు కొమ్మగోని, రాసంబట్టి అరుణాచలం గౌడ్ నిర్మాతలు. చైతన్యరాజ స్వరకర్త. హైదరాబాద్‌లో పాటల విడుదల కార్యక్రమం జరిగింది. ఠాగూర్ బాలాజీసింగ్, వి.ఆంజనేయ ముఖ్యఅతిథులుగా హాజరై తొలి సీడీని ఆవిష్కరించారు. దర్శకుడు మాట్లాడుతూ "హారర్ కామెడీ కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. బూత్ బంగ్లాలో ఏం జరిగిందన్నది తెరపైనే చూడాలి" అన్నారు. "నాలుగు పాటలున్నాయి. సంగీతానికి ప్రాధాన్యమున్న చిత్రం కావడంతో మంచి మెలోడీ, మాస్ గీతాల్ని అందించే అవకాశం లభించింది. చిత్రం తప్పకుండా అందరికీ నచ్చుతుంది" అన్నారు సంగీత దర్శకుడు.


పూరి జగన్నాథ్, సిద్ధార్థ్, పూర్ణానంద్, కార్తీక్‌రాజ్

ఆయుష్మాన్ భవ..

కార్తీక్‌రాజు, మిస్టీ చక్రవర్తి జంటగా నటిస్తున్న చిత్రం 'దీర్ఘ ఆయుష్మాన్ భవ'. ఎం.పూర్ణానంద్ దర్శకుడు. జి.ప్రతిమ నిర్మాత. ఈ చిత్ర మోషన్ పోస్టర్‌ను ఆదివారం హైదరాబాద్‌లో దర్శకుడు పూరీ జగన్నాథ్ ఆవిష్కరించారు. దర్శకుడు మాట్లాడుతూ "విభిన్నమైన ప్రేమకథా చిత్రంగా తీస్తున్న సోషియో ఫాంటసీ ఎంటర్‌టైనర్ ఇది. చాన్నాళ్ల తర్వాత కైకాల సత్యనారాయణ పోషిస్తున్న యముడి పాత్ర సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంద"న్నారు.

పంచ్ డైలాగ్

నీ వల్ల ఒకరు కన్నీరు పెడితే అది పాపం.
నీ కోసం ఒకరు కన్నీరు పెడితే అది ప్రేమ.

- చిత్రం: అనగనగా ఓ అమ్మాయి
- పంపినవారు: ఎస్.వెంకటరాయశర్మ, విశాఖపట్నం.

చిరునామా: సినిమా డెస్క్, ఈనాడు కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501512
మెయిల్ ఐడీ: cinema@eenadu.net



ఖిల్జీని చూసి ఫిదా అయిపోయా

'రణ్‌వీర్... అసలు ఇలా ఎలా చేశావ్!. నిన్ను చూసి నేను పూర్తిగా ఫిదా అయిపోయాను తెలుసా' అంటోంది పాలబుగ్గల సుందరి ఆలియా భట్. ఇటీవలే విడుదలైన సంజయ్ లీలా భన్సాలీ చిత్రం 'పద్మావత్' చూసిందట ఆలియా. అందులో రాణి పద్మావతిగా నటించిన దీపికా పదుకొణెతో పాటు ఇతర పాత్రధారుల నటనపై ప్రశంసలు కురిపించిందామె. మరీ ముఖ్యంగా అల్లాఉద్దీన్ ఖిల్జీ పాత్రలో రణ్‌వీర్ నటన అదరహో అంటూ ఆకాశానికెత్తేసింది. "పద్మావత్'లో నీ అభినయంతో మాయ చేశావు. అదో అద్భుతం. నాకు నీ నటన తెగ నచ్చేసింద"ంటూ పొగిడేసింది ఆలియా. ప్రస్తుతం 'గల్లీ బాయ్' అనే చిత్రంలో తొలిసారిగా కలసి నటిస్తున్నారు ఆలియా, రణ్‌వీర్. "పద్మావత్'లో రణ్‌వీర్ తన నటనతో ఆశ్చర్యపరిచాడు. 'గల్లీ బాయ్' లోనూ ఆ స్థాయిలోనే ఆకట్టుకుంటాడ"ని చెప్పింది ఆలియా. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను అనుసరించేవారి సంఖ్య రెండు కోట్లకు చేరుకున్న సందర్భంగా అభిమానులతో లైవ్ వీడియోలో ముచ్చటిస్తూ ఈ విషయాలు పంచుకుంది. ఆమె గూఢచారిగా నటిస్తున్న 'రాజీ' మేలో విడుదలవుతోంది.

ఆలియా భట్

ఈనాడు

వసుంధర

సోమవారం జనవరి 29, 2018 కరీంనగర్ 9

మూత్రనాళ ఇన్‌ఫెక్షన్ కావచ్చేమో....!

కొన్ని లక్షణాలను చెప్పినప్పుడు వైద్యుల నుంచి వచ్చే మాట ఇదే. దాదాపు అరవైశాతం మంది మహిళలు తమ జీవితకాలంలో ఎప్పుడో ఒకప్పుడు ఎదుర్కొనే ప్రధాన సమస్య కూడా ఇదే. నిజానికి వినడానికి ఇది చిన్నదిగానే అనిపించొచ్చు కానీ... నిర్లక్ష్యం చేస్తే మాత్రం నిజంగానే అది ఇబ్బందిగా మారొచ్చు. అదెలాగో... అసలు మూత్రనాళ ఇన్‌ఫెక్షన్‌ని ఎలా గుర్తించొచ్చు...? దానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటో చూద్దాం.



ఆ మంట ముప్పు కావొచ్చు...!

వాస్తవానికి ఈ సమస్య పురుషులతో పోలిస్తే.. మహిళల్లోనే ఎక్కువగా కనిపిస్తుంది. సంతానోత్పత్తి వయసులోనే కాదు మెనోపాజ్ తరువాత కూడా ఈ తీవ్రత ఎక్కువగా కనిపిస్తుంది. దీనికి ప్రధాన కారణం మహిళ కావడమే. మూత్రాశయం దగ్గర బ్యాక్టీరియా ఎప్పుడూ ఉంటుంది. పురుషులతో పోలిస్తే... మహిళల్లో మూత్రాశయ మార్గం నుంచి మూత్రం బయటికి వెళ్లే మార్గం చాలా చిన్నగా ఉంటుంది. దాంతో బ్యాక్టీరియా చేరితే సులువుగా వ్యాపిస్తుంది. అలా వచ్చే ఇన్‌ఫెక్షన్లలో కొన్నింటిని యాంటీబయాటిక్స్‌తో నివారించొచ్చు. ఒకవేళ ఇన్‌ఫెక్షన్ తాలూకు బ్యాక్టీరియా మూత్రపిండాలకు గనుక వ్యాపిస్తే.. నడుమునొప్పి, చలీ, జ్వరం, వికారం, వాంతులు.. కావడం వంటివన్నీ కనిపిస్తాయి. ఈ సమస్య కొందరిలో ఏడాదికి ఒకటి రెండుసార్లు వచ్చి తగ్గిపోతే మరికొందరిలో తరచూ ఇబ్బందిపెట్టొచ్చు. బాధాకరం ఏంటంటే మనలో చాలామంది ఈ సమస్యను తేలిగ్గా తీసుకుంటాం. వైద్యులకు ఆ లక్షణాలను చెప్పడానికి ఇబ్బందిపడతాం. చాలా మటుకు వీటిని మందులతోనే నయం చేయొచ్చు. కానీ అలా చేయకపోవడం వల్ల ఇతర సమస్యల్ని తెచ్చుకుంటాం.

లక్షణాలేంటి?

- తరచూ బాత్రూంకి వెళ్తుంటే మంటగా అనిపించడం...
- రోజులో ఎక్కువ సార్లు బాత్రూంకి వెళ్లడం... లేదా ఆపుకోలేకపోవడం
- పొత్తి కడుపులో నొప్పి, కలయిక సమయంలో నొప్పి
- మూత్రం కోసం తరచూ నిద్ర లేవడం
- మూత్రం నురగగా ఉండటం, దుర్వాసన..
- చాలా అరుదుగా మూత్రంలో రక్తం కనిపించడం వంటివన్నీ దీనికి సంకేతాలే.

అవి ఎలాంటి సమస్యలంటే...

- తరచూ ఇన్‌ఫెక్షన్ కనిపించడం, దాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్ల ఆ ప్రభావం మూత్రపిండాలపై పడుతుంది. అది క్రమంగా అధిక రక్తపోటుకు దారితీసి.. చివరకు మూత్రపిండాలు పనిచేయని పరిస్థితి ఎదురవుతుంది. మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడతాయి.
- సమస్య మొదట్లోనే అదుపు చేయకపోతే... మెనోపాజ్ వచ్చాక అర్జ్ ఇంకాంటినెన్స్ సమస్య ఎదురుకావచ్చు. అంటే తెలియకుండానే మూత్రం పడిపోవడం, నియంత్రించుకోలేకపోవడం వంటి ఇబ్బందులన్నమాట.
- ఒకవేళ గర్భధారణ సమయంలో ఎదురైతే గనుక ఆ తల్లికే కాదు.. పుట్టబోయే పాపాయికీ కొన్నిసార్లు ప్రమాదకరమే. కొన్నిసార్లు లక్షణాలు కనిపించకపోవచ్చు కూడా.
- మెనోపాజ్ వచ్చాక ఈస్ట్రోజెన్ హార్మోను విడుదల ఆగిపోతుంది. అదే జననేంద్రియాల్లో పీహెచ్ శాతాన్ని పెంచుతుంది. క్రమంగా అదే ఇన్‌ఫెక్షన్‌కి కారణం అవుతుంది.

ముందు జాగ్రత్తలే మేలు...

- మంచినీళ్లు వీలైనంత ఎక్కువగా తీసుకోవడం వల్ల మూత్రం ద్వారా బ్యాక్టీరియా బయటకు పోతుంది. ఇన్‌ఫెక్షన్ అదుపులోకి వస్తుంది. అలాగని రోజులో నాలుగైదు లీటర్ల నీటిని తాగాలని లేదు. మూత్రం రంగు తెల్లగా పారదర్శక రంగులో వచ్చేవరకూ మంచినీళ్లు తాగితే సరిపోతుంది.
- ఒక రోజులో ఒకటిన్నర నుంచి రెండు లీటర్ల వరకూ ద్రవపదార్థాలు తీసుకోవాలి. రోజూ రెండుపూటలా భోజనం సమయంలో నీళ్లు తాగితే చాలనుకోకూడదు. ప్రతి గంటకోసారి దాహం వేసినా వేయకపోయినా నీళ్లు తాగుతూ ఉండాలి. భోజనం చేసేప్పుడు మాత్రం మరో గ్లాసు అదనంగా తీసుకుంటే చాలు.
- గాఢతా, సువాసన ఎక్కువగా ఉండే సబ్బులూ, యాంటీసెప్టిక్ క్రీంలూ, స్ప్రేలూ, పౌడర్లు జననేంద్రియ భాగాల్లో వాడకుండా చూసుకోవాలి.
- వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి. మలవిసర్జనకు వెళ్లిన తరువాత ముందునుంచీ వెనక్కి శుభ్రం చేసుకోవాలి. దానివల్ల బ్యాక్టీరియా మూత్రకోశంలోకి వెళ్లకుండా ఉంటుంది. జననేంద్రియ భాగాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. బాత్రూంకి వెళ్లినప్పుడు పూర్తిగా వెళ్లాలి తప్ప మధ్యలోనే ఆపేయకూడదు. కాటన్ లోదుస్తుల్ని ఎంచుకోవాలి. అవి కూడా రోజులో రెండుసార్లు మార్చుకోవాలి.
- లైంగికచర్య సమయంలో ఎక్కువశాతం బ్యాక్టీరియా మూత్రాశయంలోకి చేరుతుంది. అదే ఇన్‌ఫెక్షన్‌కి దారితీయొచ్చు. అందుకే కలయిక తరువాత తప్పనిసరిగా మూత్రవిసర్జనకు వెళ్లాలి. అలాగే మలబద్ధకం సమస్య ఉన్నప్పుడు కూడా ఎక్కువశాతం బ్యాక్టీరియా చేరుతుంది. దాన్ని నివారించాలంటే పీచుశాతం ఎక్కువగా ఉన్న పండ్లూ, కూరగాయలు తీసుకోవాలి. పండ్లరసాలు ఎక్కువగా తాగాలి. కుదిరితే క్రాన్‌బెర్రీ జ్యూస్‌ని తాగడం మంచిది. ఇది బజార్లో దొరుకుతుంది. ఇందులో ప్రత్యేకంగా ఉండే యాసిడ్ మూత్రంలోకి ప్రవేశిస్తుంది. అది మూత్రం పీహెచ్‌శాతాన్ని తగ్గిస్తుంది. పీహెచ్‌శాతం ఉన్నప్పుడే బ్యాక్టీరియా పెరుగుతుంది కాబట్టి దాన్ని అదుపులో ఉంచుతుంది.
- బ్యాక్టీరియా వృద్ధి చెందకుండా వైద్యులు యాంటీబయాటిక్స్‌ని సిఫారసు చేస్తారు. అంటే నేరుగా ఇన్‌ఫెక్షన్‌ని నివారించకుండా పరోక్షంగా బ్యాక్టీరియా సంఖ్యను తగ్గిస్తారు. రెండోసారి లక్షణాలు కనిపిస్తే మూత్ర పరీక్ష చేయించుకుని ఆ ప్రకారమే మాత్రల్ని వాడాలి. మందులు వాడి ఆపేసిన తరువాత సమస్య తిరగబెట్టే ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. అందుకే ఆ తరువాత కూడా పరీక్ష చేయించుకుని లేదని నిర్ధరించుకోవాలి. కొందరు బ్యాక్టీరియాను నివారించేందుకు దీర్ఘకాలం మందులు వాడాల్సి రావచ్చు.



డాక్టర్ ప్రణతీరెడ్డి
యూరో గైనకాలజిస్టు

తెలుగు మహాసభలకు వీరి జ్ఞాపికలు..

శిల్పాలూ, కళాఖండాలు తయారుచేసే రంగాల్లో మగాళ్లది కాస్త పైచేయే. అది అమ్మాయిలకు నప్పదేమో అన్న ఆలోచనే దీనికి కారణం. కానీ జనగాం జిల్లా పెంబర్తి గ్రామ మహిళలు మాత్రం దీనికి భిన్నం. ఆ వివరాలే ఇవి...



ఇత్తడి కళాకృతులకు వరంగల్‌లోని పెంబర్తి గ్రామం పెట్టింది పేరు. అయితే మారిన పరిస్థితుల్లో ఈ వృత్తికి ఆదరణ తగ్గిపోయింది. సరైన ఉపాధి దొరక్కపోవడంతో చాలా మంది వృత్తినీ ఊరునీ వదిలి ఉపాధికోసం పట్టణాలకు వలసపోతున్నారు. అప్పటివరకూ భర్త సంపాదనపైన ఆధారపడి కుటుంబాన్ని నడిపిన ఆ ఊరి మహిళల్ని ఈ పరిస్థితులు కలవరపెట్టాయి. ఎన్నో ఏళ్ల నుంచి అలవాటైన పనిని వదిలిపెట్టాల్సి రావడం వారిని బాధపెట్టింది. అందుకే తాము ఏదైనా చేయాలనుకున్నారు. ఆడవాళ్లం అయితే ఏంటి? తామెందుకు ఈ పని నేర్చుకోకూడదని హస్తకళకు అదనపు హంగులు చేర్చి దానికి ఊపిరి పోయాలనుకున్నారు.

ఆ ముగ్గురూ...

ఇంతకీ వాళ్లెవరు అంటారా? అదే గ్రామానికి చెందిన హైమవతి, రా... ఈశ్వరమ్మ, కప్పోజీ శరణ్యలు. వాళ్లు ముగ్గురూ కలిసి ఓ బృందంగా ఏర్పడ్డారు. మేం ఈ వృత్తిని నేర్చుకోవాలనుకుంటున్నాం అని "హస్తకళ అభివృద్ధి సంస్థ"ను సంప్రదించారు. నేర్చుకోవడానికి వెళ్లినప్పుడు మీరంతా మహిళలు శ్రద్ధగా నేర్చుకోవడమే కాదు దీన్ని వృత్తిగా కొనసాగించగలరా? అన్నారు. వీరు మాత్రం తమ పట్టుదల వీడలేదు. దాన్ని చూసి ఇంట్లోనూ, బయటా కూడా ప్రోత్సహించారు. అలా హస్తకళాకృతుల తయారీపై శిక్షణ తీసుకున్నారు. వీరిని చూసి మరికొంతమంది కూడా ఈ మార్గంలోనే ప్రయాణించడానికి మొగ్గుచూపారు. అలా కొన్నేళ్ల క్రితం ముగ్గురితో మొదలైన మహిళల సంఖ్య ఇప్పుడు ముప్పైకి చేరింది.

ఆధునిక హంగులతో...

ఆ సంస్థ నేర్పిన కళలను వాళ్లేమీ మొక్కుబడిగా నేర్చుకోవడంతోనే అయిపోయింది అనుకోలేదు. వాటికి తమ ఆలోచనల్నీ, సృజననూ జోడించారు. ఈ క్రమంలో సాంకేతిక సాయం కూడా తీసుకున్నారు. పాత పనికి భిన్నంగా కొత్త కళాసృష్టి చేయగలిగారు. కేవలం అలంకరణకు మాత్రమే ఉపయోగపడే కళాకృతులు కాకుండా అందరికీ ఎక్కువగా ఉపయోగపడే వస్తువుల తయారీపైనా దృష్టిసారించారు. నెమ్మదిగా వీరు తయారు చేసిన వస్తువులకు గిరాకీ పెరిగింది. వీరి ఉత్పత్తులను వివిధ ప్రదర్శనల్లో ఉంచడం మొదలుపెట్టారు. దాంతో వీరి బొమ్మలకు విదేశాల్లోనూ ఆదరణ పెరిగింది. దాంతో సాంకేతికతను ఉపయోగించి వీరు ఖాతాదారులకే నేరుగా పంపిస్తున్నారు. అక్కడి సంస్థలూ వీటిని ఎగుమతి చేసుకుంటున్నాయి.

ఏమేం తయారు చేస్తారంటే...

వీరంతా పురుషులకు ఏమాత్రం తీసిపోని విధంగా వెండీ, ఇత్తడీ, రాగీ, కంచు..వంటి లోహాలతో ఈ కళాకృతులను తయారు చేస్తారు. ఇవి కాస్త శ్రమతో కూడుకున్నవే. వీటిల్లో చాలావరకూ ఎటువంటి యంత్రాలూ ఉపయోగించకుండా చేతితో చేసేవే. గుమ్మాలకు ఇత్తడి తోరణాలు, గృహాలంకరణకు అవసరమైన నెమళ్లూ, పిచ్చుకలు..వంటివి ఎంతో ఆకట్టుకుంటున్నాయి. వివిధ ఫంక్షన్లకు, ప్రభుత్వ అవార్డులకూ జ్ఞాపికలు తయారుచేసిస్తుంటారు. వీరు తయారు చేసే వస్తువుల్లో ఆధ్యాత్మిక సామగ్రి సినిమా అవార్డులూ, షీల్డులూ, పోలీసులకు గుర్తింపు పతకాలూ, సంప్రదాయ సభలకు బహుమతులు..వంటివెన్నో ఇక్కడ ప్రస్తుతం తయారవుతున్నాయి. ఇటీవల తెలుగు మహాసభల్లో అతిథులకు అందించిన కాకతీయ కళా తోరణం ప్రతిమల్లో కొన్ని వీరు తయారుచేసినవే.

కె. జ్యోతిరాజ్, ఈనాడు పాత్రికేయ పాఠశాల,

సమయం సరిపోవడం లేదా!

'నాకస్సలు టైమ్ లేదు మరో రెండు గంటలు ఉంటే బాగుండు' అని అప్పుడప్పుడూ మనమే అంటుంటాం. కానీ సరైన ప్రణాళిక ఉంటే గనుక సమయాన్ని మనకు అనుకూలంగానే మార్చుకోవచ్చు. అదెలాగో చూద్దామా...



- మన రోజును ప్రణాళికతో ప్రారంభించాలి. ఏయే పనులకు ఎంత సమయాన్ని కేటాయించుకోవాలో ముందే నిర్ణయించుకుంటే ఇబ్బందులు ఎదురు కావు.
- కేవలం పుస్తకంలో రాసుకున్నంత మాత్రాన సరిపోదు. అందులో రాసిన విధంగా ఆ ప్రణాళికను పాటిస్తున్నామా లేదా అని నిరంతరం స్వీయ సమీక్ష చేసుకుంటూ ఉండాలి.
- ప్రతిరోజూ మనకు చాలా పనులు ఉంటాయి. వాటిని విభజించుకుంటే ఒత్తిడి ఉండదు. ఉదాహరణకు అత్యవసరంగా చేయాల్సినవీ, ముఖ్యమైనవీ, కాస్త సమయం తీసుకుని చేయాల్సినవీ... ఇలా వేటికవి వేరు చేసుకుంటే కంగారూ, ఒత్తిడీ ఉండదు.
- చాలామంది ఫోన్లో ఎక్కువ సమయం మాట్లాడుతుంటారు. దీనివల్ల సమయం వృథా అవుతుంది. ఫోన్లు మాట్లాడేందుకు కచ్చితంగా సమయాన్ని పెట్టుకోవాలి. ఆవిషయాన్ని స్నేహితులకూ, బంధువులకూ కూడా తెలియచేయండి. అలానే ఆ సంభాషణనూ వీలైనంత క్లుప్తంగా ముగించాలి. అప్పుడు సమయపాలన సాధ్యమవుతుంది.
- రోజూ దాదాపు ఏడెనిమిది గంటలు కంటి నిండా నిద్రపోవాలి. అప్పుడే మీ పనులను సమర్థమంతంగా నిర్వహించగలుగుతారు. లేదంటే నిద్రలేమీ మీ పని తీరును దెబ్బతీస్తుంది. లేదంటే రోజులో పనులన్నీ భారంగా గడుస్తాయి. వీటన్నింటి కంటే ముందు మీరు నిద్రలేచే సమయం కూడా మీ సమయ ప్రణాళికలో కీలకం అని గుర్తుంచుకోండి. ఉదయాన్నే లేవడం వల్ల చాలా పనులు ప్రణాళికాబద్ధంగా పూర్తవుతాయి.
- చాలామంది చిన్న పనుల్నీ సులువుగా వాయిదాలు వేస్తుంటారు. దీనివల్ల తెలియకుండానే భారం పెరిగిపోతుంది. ఫలితంగా విలువైన సమయం, ఉత్పాదకత కూడా వృథా అవుతాయి.

కన్నబిడ్డల కోసం కాటికాపరిగా...!



"మగవారే మద్యం తాగకుండా అక్కడ పని చెయ్యలేరు. ఆడకూతురువి నువ్వు ఏం చేస్తావ్?' అని అధికారులు అభ్యంతరం తెలిపారు. 'అలాంటి పని అస్సలే చేయొద్దు' అంటూ కుటుంబ సభ్యులూ, బంధువులు ఆక్షేపించారు. ఇవేవీ ఆమెను ఆ పని చేయకుండా ఆపలేకపోయాయి. కళ్లముందు కన్నబిడ్డల ఆకలి కేకలు తప్ప ఆ కన్నతల్లికి మరేదీ కనిపించలేదు. వాళ్ల కడుపు నింపడానికి కాటికాపరిగా పనిచేస్తానని అధికారులకూ, బంధువులకు చెప్పేసింది. ఆమే కట్టా జయలక్ష్మి. అనకాపల్లిలోని గవరపాలెం శ్మశానవాటికలో కాటికాపరిగా పనిచేస్తోంది. 'నా భర్త లోకేశ్వరరావు కాటికాపరి. నలుగురు పిల్లలతో ఉన్నదాంట్లో హాయిగా బతికేవాళ్లం. ఆయన 2002లో అనారోగ్యంతో చనిపోయారు. ఆ తరువాత వంశ పారంపర్యంగా వచ్చే కాటికాపరి పని ఎవరు చెయ్యాలనే చర్చ వచ్చింది. వాస్తవానికి మా కుటుంబానికి చెందినవారే గత నాలుగు తరాలుగా ఆ పని చేస్తున్నారు. కానీ మా వారు పోయే సమయానికి మా ఇంట్లో మిగిలిన మగవాళ్లు వివిధ పనుల్లో స్థిరపడ్డారు. దీంతో ఒక్కరూ ముందుకు రాలేదు. నాదేమో ఏదో ఒక పనిచేస్తేనే కానీ కుటుంబం గడవని పరిస్థితి. పిల్లల ఆకలి తీర్చే మార్గం అదే అనుకున్నా. దాంతో నేనే ఆ పని చేయాలనుకున్నా. అదే విషయం అధికారులకూ, బంధువులకూ చెప్పా. ముందు అభ్యంతరం చెప్పినా.. నా పట్టుదలను చూసి సరేనన్నారు. అలా పదహారేళ్లుగా కాటికాపరిగా చేస్తూనే ఉన్నా. ఆ బాధ్యతను తీసుకున్నప్పుడు నా వయసు ఇరవై నాలుగేళ్లు..' అంటుందామె. జయలక్ష్మి చేతుల మీదుగా వందల శవాలకు దహన సంస్కారాలు జరిగాయి. శవాలు దహనం అయ్యే సమయంలో అటువైపు చూడటానికే చాలామంది భయపడిపోతారు. కొన్నిసార్లు కాళ్లుపైకి లేస్తుంటాయి. వాటిని కర్రతో సరిచేసి పూర్తిగా కాలేవిధంగా చూడాలి. కొన్నిసార్లు రాత్రి వరకు దహనం చెయ్యాల్సి ఉంటుంది. మొదట్లో ఇలా చేయాలంటే కాస్త భయం వేసేది. అయినా ఎలాగో అలా ధైర్యంగా పనిచేస్తోంది. ఇప్పుడు అమ్మాయిల పెళ్లిళ్లు చేసింది. పెద్ద అబ్బాయి అసోంలో ఉద్యోగం చేస్తోంటే, చిన్నఅబ్బాయి అరవింద్ ఇంజినీరింగ్ చదువుతున్నాడు. 'ఆదాయం తక్కువైనా ఆ పనిని ధైర్యంగానే చేస్తున్నా...' అంటుందామె.

ఆత్మవిశ్వాసమే తోడుగా



మనల్ని మనం అంచనా వేసుకునే విధానాన్ని బట్టి మనపై మనకు ఎంత ఆత్మవిశ్వాసం ఉందో తెలుస్తుంది. ఆ నమ్మకం ఉన్నప్పుడు ఇతరులు ఏమనుకుంటారో అని ఆలోచించకుండా ఉంటేనే మేలు. అప్పుడే మన లక్ష్యాలను చేరుకోగలుగుతాం. అందుకోసం ఈ సూత్రాలు మీకు ఉపయోగపడొచ్చు.

- జీవితంలో పైకి ఎదగాలంటే ముందుగా కావాల్సింది ఆత్మవిశ్వాసమే. అయితే అప్పుడప్పుడూ వైఫల్యాలు భయపెడతాయి. వాటికి బెదిరిపోవద్దు. పరిస్థితులను ఉన్నది ఉన్నట్లుగా స్వీకరించాలి. కొన్నిసార్లు వాటికి ఎదురెళ్లి సవాళ్లను స్వీకరించాలి. అప్పుడే మీలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. అలాంటి పరిస్థితులు భవిష్యత్తులో ఎదురైనప్పుడు ఎలా వ్యవహరించాలో తెలుస్తుంది.
- 'ఈ పని నీవల్ల ఏమవుతుందిలే?', 'ఇది చాలా కష్టం. నువ్వు చేయలేవు' అంటూ చాలామంది మిమ్మల్ని నిరుత్సాహపరచడానికి సిద్ధంగా ఉంటారు. వారి మాటలను పట్టించుకోవద్దు. మీరు చేయాలనుకున్న పనిపై మనసు పెట్టి చేయండి. దాన్ని సాధించడానికి కావాల్సిన నైపుణ్యాలను పెంచుకోండి.
- మీ లక్ష్యం కోసం పరుగెత్తే క్రమంలో పోటీ కూడా ఉండొచ్చు. అయితే అది ఆరోగ్యకరంగా ఉండాలి. మీరెలా పైకి ఎదగాలా అని ఆలోచించాలి తప్ప ఇతరులతో పోలిక వద్దు. ఒకవేళ మీకంటే అవతలివారు బలమైన వ్యక్తులైతే వారి నుంచి సానుకూల అంశాలను నేర్చుకునే ప్రయత్నం చేయండి. ఇది మీలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. మీకు మరింత అనుకూలంగా మారుతుంది.
- మన ఆహార్యం కూడా ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేస్తుంది. కాబట్టి ఎలాంటి దుస్తులను ధరించాలో, ఏవి మీకు నప్పుతాయో ఒకసారి చూసుకోండి. ఇంతకు ముందు మీరు సాధించిన విజయాలను గుర్తుకు తెచ్చుకోండి. కష్టాలకు ఎదురెళ్లి మరీ విజయాలు సాధించిన వారి స్ఫూర్తిగాథలను చదవండి. ఇవన్నీ మీలో ఆత్మవిశ్వాసాన్ని నింపేవే.

వృద్ధాప్యంలో గృహహింస... ఈ నరకం నుంచి తప్పించండి!

? నా వయసు అరవై మూడు సంవత్సరాలు. నేను ఒక రిటైర్డ్ ఉద్యోగినిని. మా పెళ్లై ముప్పై సంవత్సరాలైంది. నాకు ఇద్దరు పిల్లలు. అమ్మాయికి పెళ్లి చేశాం. అబ్బాయి ఉద్యోగం చేస్తున్నాడు. నాకు పెళ్లైనప్పటినుంచి నా భర్తకు ఉద్యోగం లేదు. ఉద్యోగం వస్తుందని నమ్మించి పెళ్లి చేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకూ ఆవారాగా తిరగడం, తాగడమే కాదు నన్ను కొట్టడం, హింసించడం కూడా ఆయన దినచర్యగా మారిపోయింది. ఆ బాధలు పడుతూనే నా పిల్లల్ని చదివించుకుని ప్రయోజకుల్ని చేశాను. కానీ, ఈ రెండు సంవత్సరాల నుంచి నా భర్త ప్రవర్తన మితిమీరిపోయింది. ఈ వయసులో కూడా నాకు మనశ్శాంతి లేకుండా చేస్తున్నాడు. .కనీసం చుట్టుపక్కల వారు చూస్తున్నారన్న స్పృహ కూడా లేకుండా ప్రవర్తిస్తున్నాడు. ఈ విపరీతమైన హింస నుంచి నన్ను నేను ఎలా తప్పించుకోవాలి. ఈయన కారణంగా మా అబ్బాయికి పిల్లనివ్వడానికి కూడా ఎవరూ ముందుకు రావడం లేదు. ఎన్నోసార్లు విడాకులు ఇవ్వాలని ప్రయత్నం చేసినా పరువు కోసం మానుకున్నా. ఈ హింసవల్ల ఆత్మహత్య ఆలోచనలు వస్తున్నాయి. దయచేసి ఈ వృద్ధాప్యంలో నేను అనుభవిస్తున్న నరకం నుంచి విముక్తి కల్పించండి.

– ఓసోదరి

✔ మీ సమస్య చూస్తే చాలా బాధగా ఉంది. నిజం చెప్పాలంటే చాలామంది స్త్రీలు పరువుకోసం, పిల్లలకోసం, సంసారబంధం కోసం భర్త ఎలాంటి వాడైనా భరిస్తున్నారు. అది నిజంగా సహనానికి పరీక్ష...మీలాంటి వారి కోసమే 2005లో గృహహింస చట్టం తెచ్చారు. మీకు ఆర్థిక స్వాతంత్ర్యం ఉండి కూడా బాధలు అనుభవించారు. ఇప్పుడు పిల్లలు పెద్దవాళ్లయ్యారు. వాళ్ల భవిష్యత్తు కోసం అయినా ఒక నిర్ణయాన్ని తీసుకోకతప్పదు. నిజానికి గృహహింస చట్టంలో విడాకుల ప్రసక్తి లేదు. కానీ సెక్షన్ 12 కింద మీరు మీపై జరుగుతున్న శారీరక, మానసిక హింసల గురించి కోర్టులో పిటిషన్ దాఖలు చేయవచ్చు. కోర్టువారు సెక్షన్ 14 డీవీసీ యాక్ట్ ప్రకారం మీ భర్తను పిలిపించి కౌన్సెలింగ్ చేస్తారు. లేదా మధ్యవర్తితో చెప్పిస్తారు. అయినా అతడు తన ప్రవర్తనను మార్చుకోకపోతే మీరు సెక్షన్ 18 కింద రక్షణ కోరవచ్చు. మీరు ఉంటున్న ఇల్లు మీదే అయితే అతను మిమ్మల్ని హింస పెట్టకుండా ఈ ప్రొటెక్షన్ ఆర్డర్ ఉపయోగపడుతుంది. కానీ అతని నుంచి శాశ్వత విముక్తి కావాలంటే సెక్షన్ 13 2(ఎ)హింసాత్మక హిందూ వివాహ చట్టం ప్రకారం విడాకుల కోసం దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసిన తరువాత విడాకులు వచ్చేవరకూ మీకు ఈ ప్రొటెక్షన్ ఆర్డర్ ఉపయోగపడుతుంది. రెండు కేసుల్లోనూ కౌన్సెలింగ్ జరుగుతుంది. మారతాడన్న నమ్మకం లేకపోతే కౌన్సెల్సింగ్ వద్దని కూడా చెప్పొచ్చు. సెక్షన్ 13 కింద విడాకులు మంజూరు అయిన తరువాత కూడా మిమ్మల్ని వేధిస్తుంటే మీ జీవితంలోకి రాకుండా ఇంజక్షన్ సూట్ వేయొచ్చు. ఒకవేళ అతడు తనని తాను పోషించుకోలేని స్థితిలో ఉంటే మీరు అతనికి జీవన భృతికి కూడా ఇవ్వవలసి ఉంటుంది. అది తను వేసే కేసుని బట్టి ఆధారపడి ఉంటుంది. కోర్టు ఇచ్చిన ప్రొటెక్షన్ ఆర్డర్‌ని ఉల్లంఘిస్తే గృహహింస చట్టంలోని సెక్షన్ 31 కింద అతనిని జైలుకి కూడా పంపించడానికి అవకాశం ఉంది. మీరు అతడిని తీసుకెళ్లి ఏదైనా రిహాబిలిటేషన్ క్లినిక్‌లో చూపించండి. అక్కడ అతడికి మందులూ, కౌన్సెలింగ్ వంటి ప్రయత్నాలతో చెడు అలవాట్లు మాన్పించడానికి అవకాశం ఉంటుంది. ఇన్నాళ్లు మీ భర్త హింసాత్మకంగా జీవించాడు. ఇకనైనా మారకపోతే చివరిరోజుల్లో ఎవరూ చూడరని చెప్పండి. మీ మాటలు వినే పరిస్థితి లేనప్పుడు మానసిక నిపుణులతో చికిత్స ఇప్పించండి. మీరు మాత్రం దయచేసి ఆత్మహత్య ఆలోచనలు రానివ్వొద్దు. ఇన్నాళ్లు పిల్లలకోసమే జీవించారు. మీరు సంతోషంగా బతికే అవకాశం కోసం జీవించండి.

డియర్ వసుంధర



జి. వరలక్ష్మి
న్యాయవాది



కళ్లకి రంగుల హంగామా!

కళ్లకి మేకప్ వేసుకుంటే మరింత కళగా కనిపించొచ్చు. కానీ వేసుకునేటప్పుడు ఈ చిన్న చిన్న జాగ్రత్తల్ని మరిచిపోవద్దు!

- కంటిమీద వేసుకునే రంగులూ, ఐ షాడోలు మరీ ఒకదాంతో ఒకటి సంబంధం లేకుండా ఎంచుకోకూడదు. కాస్త దగ్గరి రంగులకే ప్రాధాన్యం ఇవ్వండి. రంగులు ఎక్కువగా కనిపిస్తే చూడటానికి ఆకర్షణీయంగా కనిపించదు. అలాగే ఐషాడో కోసం బ్లెండింగ్ బ్రష్‌ను ఉపయోగించుకోవడం వల్ల రంగులు చక్కగా సర్దుకుంటాయి.
- కొంత మంది మస్కారా వేసుకున్న తర్వాత కనురెప్పలు కర్లింగ్ చేస్తుంటారు. దీనివల్ల మస్కారా ఎక్కడికక్కడ విడిపోయినట్లు కనబడుతుంది. అందుకే ముందుగానే కర్లింగ్ చేసుకోవాలి.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ

పోస్టులు: టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు
ఖాళీలు: 52
అర్హత, వయసు: ఆయా పోస్టులను అనుసరించి ప్రకటనలో తెలిపిన విధంగా (వర్సిటీ నిబంధనల ప్రకారం అన్ని పోస్టులకు ఉర్దూ పరిజ్ఞానం ఉండాలి)
ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా.
దరఖాస్తు: ఆఫ్‌లైన్
దరఖాస్తు ఫీజు: మోడల్ స్కూల్ టీచర్ పోస్టులకు రూ.300, మిగిలిన పోస్టులకు రూ.500
చివరి తేది: 28.02.2018
http://www.manuu.ac.in/

చిత్తరంజన్ నేషనల్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్, కోల్‌కతా

పోస్టు: స్టాఫ్ నర్సు, వార్డ్ మాస్టర్
ఖాళీలు: 28
అర్హత: స్టాఫ్ నర్సు పోస్టుకు పదోతరగతితో పాటు జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీలో సర్టిఫికెట్. స్టేట్ నర్సింగ్ కౌన్సిల్‌లో రిజిస్టరై ఉండాలి. వార్డ్ మాస్టర్ పోస్టులకు డిగ్రీ లేదా ఇంటర్‌తో పాటు 3 సంవత్సరాల క్లరికల్ అనుభవం లేదా పదోతరగతితో పాటు 5 సంవత్సరాల క్లరికల్ అనుభవం ఉండాలి.
వయసు: 30 సంవత్సరాలకు మించకూడదు. **ఎంపిక:** రాతపరీక్ష ద్వారా.
దరఖాస్తు: ఆఫ్‌లైన్
చివరి తేది: 19.02.2018
వెబ్‌సైట్: http://cnci.org.in/

వాక్ - ఇన్స్

ఇండియన్ వెటర్నరీ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, యూపీ

పోస్టు: యంగ్ ప్రొఫెషనల్ - 2
ఖాళీలు: 01 **వేతనం:** రూ.25,000
అర్హత: లైఫ్ సైన్సెస్‌లో పీజీ ఉత్తీర్ణత. సంబంధిత రంగంలో అనుభవం ఉండాలి. **వయసు:** 21 - 45 సంవత్సరాల మధ్య ఉండాలి. **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
ఇంటర్వ్యూ తేది: 12.02.2018 **వేదిక:** ఐవీఆర్ఐ, ఇజత్ నగర్, యూపీ.
వెబ్‌సైట్: http://ivri.nic.in/

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

ఐఐటీ ఖరగ్‌పూర్‌లో న్యాయవిద్య



ఐఐటీ అంటే ఇంజినీరింగ్‌లో యూజీ, పీజీ కోర్సులుంటాయని మనందరికీ తెలిసిందే. అయితే ఐఐటీ ఖరగ్‌పూర్ మాత్రం మిగిలిన వాటితో పోల్చితే కొన్ని విభిన్న కోర్సులను అందిస్తోంది. వాటిలో ఎల్ఎల్‌బీ ఒకటి. తాజాగా ఈ కోర్సులో ప్రవేశానికి సంబంధించి ప్రకటన విడుదలచేసింది.

ఎల్ఎల్‌బీ

ఎల్ఎల్‌బీలో ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ మూడేళ్ల లా కోర్సును రెసిడెన్షియల్ విధానంలో ఐఐటీ ఖరగ్‌పూర్ అందిస్తోంది. మొత్తం 6 సెమిస్టర్లు ఉంటాయి.

అర్హత: ప్రథమ శ్రేణి మార్కులతో ఇంజినీరింగ్ / మెడిసిన్‌లో బ్యాచిలర్ డిగ్రీ లేదా పీజీలో ప్రథమ శ్రేణి మార్కులతో సైన్స్ / ఫార్మసీ డిగ్రీ లేదా ప్రథమ శ్రేణి మార్కులతో ఎంబీఏతోపాటు ఇంజినీరింగ్ / మెడిసిన్‌లో యూజీ లేదా సైన్స్/ ఫార్మసీలో పీజీ ఉత్తీర్ణత.

పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా సీట్లను కేటాయిస్తారు.

రాతపరీక్ష ప్రశ్నపత్రం 200 మార్కులకు ఉంటుంది. ఇందులో ఇంగ్లిష్ 60, లాజికల్ రీజనింగ్ 20, మ్యాథమెటికల్ ఎబిలిటీ 15, బేసిక్ సైన్స్ (కెమిస్ట్రీ, ఫిజిక్స్, లైఫ్ సైన్సెస్) 35, లీగల్ ఆప్టిట్యూడ్ 70 మార్కులకు ఉంటాయి. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ తరహాలో ఇస్తారు.

ఎల్ఎల్ఎం


అర్హత: మూడేళ్లు లేదా అయిదేళ్ల ఎల్ఎల్‌బీ లేదా బీఎల్‌లో ప్రథమ శ్రేణి మార్కులతో ఉత్తీర్ణత.

రాత పరీక్షలో లీగల్ ఆప్టిట్యూడ్ నుంచి 120 మార్కులకు ప్రశ్నలు వస్తాయి. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ తరహాలోనే ఉంటాయి.

రెండు కోర్సులకూ ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలి. జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.2500; ఎస్సీ, ఎస్టీలకు రూ.1250 ఫీజుగా నిర్ణయించారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియ జనవరి 22 నుంచి ప్రారంభమైంది. మార్చి 28తో గడువు ముగుస్తుంది. ఏప్రిల్ 29న (ఉదయం 10 నుంచి 12 వరకు) రాత పరీక్ష జరుగుతుంది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థుల కోసం విశాఖపట్నం, హైదరాబాద్‌ల్లో పరీక్ష నిర్వహిస్తారు.

http://www.iitkgp.ac.in/law
http://www.iitkgp.ac.in/llm



యూపీఎస్‌సీ మార్గనిర్దేశకత్వంలో తెలుగు రాష్ట్రాల సర్వీస్ కమిషన్లు గ్రూప్-I, 2 సిలబస్, పరీక్షా విధానాలను మారుస్తున్నాయి. వాటిపై పూర్తి స్పష్టత వచ్చేవరకూ అభ్యర్థులు సమయం వృథా చేయటం నష్టదాయకం. అందుకే ప్రతిపాదిత మార్పులను గమనిస్తూనే... ఈలోపు ఏ అంశాలు అధ్యయనం చేయాలో గ్రహించటం తప్పనిసరి. అందుకు ఉపకరించే విశ్లేషణ ఇదిగో!

మార్పులొస్తున్నాయ్ మారాలి అధ్యయనం

పరీక్షా విధానంలో మార్పులు వస్తున్నప్పుడు వాటిని శ్రద్ధగా గమనించి, ఆకళింపు చేసుకోవడం కార్యసాధకుల లక్షణం. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లోని గ్రూప్స్ ఆశావహుల కర్తవ్యమిదే! రెండు పబ్లిక్ సర్వీస్ కమిషన్లు ప్రతిపాదిస్తున్న మార్పుల లక్ష్యం- సిలబస్‌లో 'హేతుబద్ధత'ను పెంచడం. అలాగే సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో ఎక్కువమంది తెలుగువారు ఎంపికయ్యే అవకాశాలను కూడా మెరుగుపరచడం.



కొడాలి భవానీ శంకర్

ముఖ్యమైన మార్పులు

◆ ప్రిలిమినరీలో ఒక జనరల్‌స్టడీస్ పేపర్ బదులు రెండు జనరల్‌స్టడీస్ పేపర్లు ◆ మెయిన్స్ స్కోరులో తెలుగు, ఇంగ్లిష్ భాషల మార్కులు అంతర్భాగం ◆ మెయిన్స్ రాతపరీక్ష మార్కులు 900 ◆ ఇంటర్వ్యూ మార్కులు 100 ◆ ఉమ్మడి పాఠ్యప్రణాళిక వల్ల సివిల్స్ ఆశావహులకు మార్గం సుగమం ◆ సిలబస్ అంశాల లోతైన అధ్యయనం తప్పనిసరి.

ప్రతిపాదిత పరీక్షా విధానం

అంశం	సమయం	మార్కులు
ప్రిలిమ్స్		
జనరల్ స్టడీస్-1	2 గం.	200
జనరల్ స్టడీస్-2	2 గం.	200
మెయిన్స్		
ప్రాంతీయ భాష	3 గం.	150
ఆంగ్లభాష	3 గం.	150
వ్యాసరచన	3 గం.	150
జనరల్ స్టడీస్-1	3 గం.	150
జనరల్ స్టడీస్-2	3 గం.	150
జనరల్ స్టడీస్-3	3 గం.	150
ఇంటర్వ్యూ		100

వెలువడుతున్న వార్తల ప్రకారం... రెండు రాష్ట్రాల పరీక్షా విధానంలో నిర్మాణపరంగా ఎటువంటి మార్పులూ లేవు. స్థానిక చరిత్ర, ప్రాంతీయ భౌగోళిక, ప్రాంతీయ ఆర్థిక అంశాల్లో మాత్రం భిన్నత్వం కనిపిస్తుంది. ఫలితంగా రెండు రాష్ట్రాల్లోనూ అభ్యర్థులు తమ అవకాశాలను పరీక్షించుకోవచ్చు. ప్రిలిమినరీ, మెయిన్స్, ఇంటర్వ్యూ... ఇలా పాతవిధానాన్నే ప్రతిపాదించారు. అయితే ప్రిలిమినరీ పరీక్షలో రెండు జనరల్ స్టడీస్ పేపర్లు తేవడం గమనార్హం. ఈ రెండు పేపర్లు ఆబ్జెక్టివ్ పద్ధతిలో ఉంటాయి. ఒక్కో పేపర్‌కు 200 మార్కులు. ప్రతి పేపర్‌కూ 2 గంటల పరీక్ష వ్యవధి ఉంటుంది.

ప్రాథమికంగా అందుతున్న సమాచారాన్నిబట్టి-

▮ ప్రిలిమినరీ మొదటి పేపర్‌లో భారతదేశ చరిత్ర, సంస్కృతి వారసత్వం, భారత రాజ్యాంగం, సామాజిక న్యాయం, అంతర్జాతీయ సంబంధాలు, సాధారణ మానసిక సామర్థ్యాలు ఉండే అవకాశం కనిపిస్తోంది.

▮ ప్రిలిమినరీ రెండో పేపర్‌లో భారత ఆర్థికవ్యవస్థ, భారత భౌగోళికాంశాలు, శాస్త్రసాంకేతికత, వర్తమానాంశాలు 50 మార్కుల చొప్పున ఉండొచ్చు.

నిడివి, లోతు పెరిగాయి

గత ప్రిలిమినరీలో ఉన్న సిలబస్ అంశాల కొనసాగింపే ఇది. కాకపోతే రెండు పేపర్లుగా విభజించడం వల్ల చదవాల్సిన నిడివీ, లోతూ బాగా పెరిగాయని చెప్పవచ్చు. అందువల్ల గత గ్రూప్-1కి తయారైన అభ్యర్థులు కొత్తగా 'భారం' పడిందని భావించాల్సిన అవసరం లేదు. అయితే ప్రతి విభాగం 50 మార్కుల ప్రాధాన్యాన్ని కలిగివుండే పరిస్థితి కనిపిస్తోంది. కాబట్టి, ఇప్పటి నుంచే ఆరు విభాగాలు (మానసిక సామర్థ్యాలు, వర్తమానాంశాలు తప్ప) పాఠశాల పుస్తకాల ఆధారంగా చదివితే సరైన మార్గంలో తయారయ్యేందుకు అవకాశాలు పెరుగుతాయి.

గత ప్రిలిమినరీ సిలబస్‌గా ఉన్న విపత్తు నిర్వహణను జాగ్రఫీలో భాగంగా చేశారు. 'పర్యావరణ' విభాగాన్ని శాస్త్ర సాంకేతికతతో కలిపారు. అందువల్ల సీనియర్ అభ్యర్థులు మరింత సమయం అందుబాటులోకి వచ్చిందని భావించి, సద్వినియోగం చేసుకోవాలి. ఇది లక్ష్యసాధనలో భాగమే.

ప్రిలిమినరీ నుంచి మెయిన్స్‌కి 1:15 నిష్పత్తిలో ఎంపిక చేసే అవకాశం ఉంది. కాబట్టి, సిలబస్ నిర్దిష్టంగా కమిషన్ ద్వారా వెలువడేవరకూ సమయం వృథా కాకుండా ఈ రెండు పేపర్ల జనరల్ స్టడీస్ అంశాలే అధ్యయనంలో ప్రధానంగా పెట్టుకోవాలి. అప్పుడే మెయిన్స్‌కు ఎంపిక అవుతారు. పైగా రోస్టర్ వారీగా ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్‌కు ఎంపిక జరుగుతుంది. ఒకరకంగా ప్రిలిమ్స్ గట్టెక్కడమే ప్రధాన అవరోధమని గుర్తించి మరింత శ్రమపడాల్సి ఉంటుంది.

మెయిన్స్ వెయిటేజీల్లో మార్పు

మెయిన్స్ ప్రతిపాదిత సిలబస్‌లో గత సిలబస్ అంశాలనే కొనసాగించారు. అయితే గతంలో ఇచ్చిన వెయిటేజీల్లో మార్పు పెద్దఎత్తున కనిపిస్తోంది. ఎకానమీ 150 మార్కులు, శాస్త్ర- సాంకేతికత 150 మార్కులు, డేటా ఇంటర్‌ప్రిటేషన్ 150 మార్కులకు ఉండేవి. ప్రతిపాదిత సిలబస్‌లో వ్యాసరచనతో పాటు జనరల్ స్టడీస్‌కు చెందిన మెయిన్స్ 3 పేపర్లు ఉంటాయి. జీఎస్‌లో మొత్తం 9 ఉప విభాగాలను పేర్కొన్నారు. అందులో ఎకానమీ, శాస్త్ర సాంకేతికతలను 50 మార్కులకే పరిమితం చేశారు. డేటా ఇంటర్‌ప్రిటేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వలేదు. ఈ సిలబస్ విధానంలో ప్రాంతీయ ఆర్థికవ్యవస్థ, ప్రాంతీయ సాంస్కృతిక చరిత్ర ఎంత వెయిటేజి పొందుతాయనేది వేచిచూడాల్సిన విషయం. భారత దేశ చరిత్ర-సంస్కృతి, భారత రాజ్యాంగం, ప్రభుత్వ పాలనాంశాలు, గవర్నెన్స్ లాంటి అంశాలు ప్రాధాన్యాన్ని పొందే అవకాశం కనిపిస్తోంది. వర్తమానాంశాలను గతంలో ఒక వ్యాసం రూపేణా మాత్రమే పరిశీలించేవారు. ఇప్పుడు వ్యాసంతోపాటు మరో 50 మార్కుల కేటాయింపు పేపర్-3 (జనరల్‌స్టడీస్)లో భాగంగా జరిగింది. ప్రతిపాదిత సిలబస్‌లో తెలుగు, ఇంగ్లిష్ 150 మార్కుల చొప్పున రెండు పేపర్లుగా ఇచ్చారు. 'భాష' అంశాలకే అవకాశం ఉంది కాబట్టి సాహిత్యానికి ప్రాధాన్యం లేదు. ఒకరకంగా అభ్యర్థులు తమ సన్నద్ధతను హేతుబద్ధ అంశాలకే పరిమితం చేసుకోవచ్చు. ఆంగ్ల మాధ్యమంలో చదివినవారు తెలుగులో కొంత ఇబ్బందిని ఎదుర్కోవచ్చు. గ్రామీణ తెలుగు మాధ్యమ అభ్యర్థులకు ఆంగ్లభాష అధ్యయనంలో ఇబ్బంది ఎదురయ్యే అవకాశం స్పష్టంగా ఉంది. పైగా ఈ రెండు పేపర్లను అంతిమ ఫలితాన్ని నిర్దేశించే మార్కులుగా పరిగణిస్తున్నారు. ఒకరకంగా సరైన ప్రణాళిక, సన్నద్ధత లేకపోతే గట్టెక్కడం కష్టమే. జాగరూకతతో వ్యవహరించాలి. లేదంటే ఆశలు తలకిందులవుతాయి.

ఏమిటి కర్తవ్యం ?

పోటీపరీక్షల్లో నిరంతర సాధనే విజయ సోపానం. పైగా ఉమ్మడి సిలబస్ విధానం వల్ల సివిల్స్ అభ్యర్థుల నుంచి బలమైన పోటీ ఏర్పడుతుంది. దీనికి తోడు రుణాత్మక మార్కులు, 1:15 నిష్పత్తిలో వడపోత మొదలైనవాటి కారణంగా ప్రతి దశా ఒక యుద్ధం లాంటిదే. అందువల్ల సిలబస్, నోటిఫికేషన్లపై స్పష్టత వచ్చేవరకూ ఈ కింది అంశాల అధ్యయనం తప్పనిసరి.

■ ఏడు నుంచి పదో తరగతి వరకు ఉన్న పాఠ్య పుస్తకాల్లోని సాంఘిక శాస్త్ర, సామాన్యశాస్త్ర అంశాలను 'అనువర్తిత' కోణంలో అధ్యయనం చేయాలి. ఆంగ్లమాధ్యమ అభ్యర్థులు సీబీఎస్ఈ సిలబస్‌ను+2 వరకూ చదవాలి.

■ ప్రతిరోజూ కనీసం రెండు గంటలైనా దినపత్రికల్లోని వివిధ అంశాలను అర్థం చేసుకోవడానికి చదవాలి. ఇందులో ఆర్థిక, రాజ్యాంగ, శాస్త్ర సాంకేతిక, సామాజిక అంశాలకు ప్రాధాన్యమివ్వాలి. దినపత్రికల అధ్యయనంలో తొలిరోజుల్లో ఎక్కువ సమయం పడుతుందనే ఆందోళన వద్దు. కాలం గడిచేకొద్దీ వెచ్చించాల్సిన సమయం దానికదే తగ్గుతుంది. ఎడిటోరియల్ పేజీ కథనాలు తొలిరోజుల్లో కొద్దిగా ఇబ్బంది పెడతాయి. కానీ తరువాత బాగా పట్టు దొరుకుతుంది.

■ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, యోజన లాంటి మాస పత్రికలు గత ఆరు నెలల్లో ప్రచురితమైనవాటిని చదవడానికి తగిన సమయం కూడా ఇదే.

■ అంబేడ్కర్, ఆంధ్ర, ఉస్మానియా మొదలైన విశ్వవిద్యాలయాల సిలబస్ పుస్తకాలను చదవడానికి కూడా తరుణమిదే.

■ అంశాలవారీగా సొంత నోట్సు తయారీని కూడా ఇదే సందర్భంలో ప్రారంభించవచ్చు. ముఖ్యంగా భావవ్యక్తీకరణకు ప్రాధాన్యమున్న గ్రూప్-1 లాంటి పరీక్షలో సొంతంగా నోట్సు తయారు చేసుకోవడం ద్వారా వ్యక్తీకరణ శక్తి మెరుగవుతుంది. పదజాల వినియోగం కూడా పెరుగుతుంది.

■ ప్రస్తుత ప్రతిపాదిత సిలబస్‌లో ప్రశ్నలకు సమాధానాల నిడివీ, మార్కుల కేటాయింపూ స్పష్టంగా ఉంది. కాబట్టి, నిడివికి తగిన రీతిలో సమాధానం రాస్తేనే అధిక మార్కులు పొందే అవకాశం ఉంది. ఇలా నిడివికి తగిన సమాధానం సరైన రీతిలో రాయాలంటే అభ్యాసం ఒక్కటే మార్గం!

■ మూసధోరణి సమాధానాలు ఇస్తే మార్కులు పడవు. అందువల్ల సొంత శైలి అలవరచుకుంటే మార్కుల సాధన సులభం అవుతుంది.

ఖాళీల భర్తీకి కదిలింది దిల్లీ మెట్రో!

ప్రయాణికులను అత్యంత సౌకర్యవంతంగా గమ్యస్థానాలకు చేర్చడానికి ప్రపంచస్థాయి సేవలను అందిస్తోంది దిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్. దాదాపు 230 కిలోమీటర్ల రైల్వే ట్రాక్‌తో, 170పైగా స్టేషన్లతో నిత్యం రద్దీగా, ప్రయాణికుల రక్షణ ధ్యేయంగా వేలాదిమంది ఉద్యోగులు శ్రమిస్తుంటారు. ఈ ప్రతిష్ఠాత్మక రైల్వే విభాగం ఇప్పుడు పలు విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి ప్రకటన వెలువరించింది. ఆధునిక పట్టణ రవాణా వ్యవస్థలో భాగస్వాములు కావాలనుకునే వారందరికీ ఇదో మంచి అవకాశం.



కేంద్రం, దిల్లీ ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న దిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (డీఎంఆర్‌సీఎల్) వివిధ విభాగాల్లోని ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం 1896 ఖాళీలు ఉన్నాయి. నియామక ప్రక్రియలో కంప్యూటర్ బేస్డ్ పరీక్ష, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ, మెడికల్ టెస్టులు ఉన్నాయి.

ఖాళీలు - అర్హతలు

1) రెగ్యులర్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు (అసిస్టెంట్ మేనేజర్)
మొత్తం ఖాళీలు: 49 (వీటిలో ఎలక్ట్రికల్ 21, ఎస్ అండ్ టీ 12, ఆపరేషన్స్ 8, ఫైర్ 2, స్టోర్స్ 2, ఎన్విరాన్‌మెంట్ 1, ఐటీ 3 ఖాళీలు ఉన్నాయి)
అర్హత: సంబంధిత బ్రాంచీల్లో బీఈ/ బీటెక్/ బీఎస్సీ/ ఎంఎస్సీ ఉత్తీర్ణత సాధించాలి. అలాగే గేట్ - 2017 స్కోరు తప్పనిసరి. **వేతన శ్రేణి:** రూ.20600 - 46500

2) రెగ్యులర్ నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు
మొత్తం ఖాళీలు: 1523
ఎ) జూనియర్ ఇంజినీర్: 440 (ఇందులో ఎలక్ట్రికల్ విభాగంలో 192, ఎలక్ట్రానిక్స్ 135, మెకానికల్ 87, సివిల్ 24, ఎన్విరాన్‌మెంట్ 2 పోస్టులు ఉన్నాయి)
అర్హత: సంబంధిత బ్రాంచీల్లో ఇంజినీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణత.
బి) అసిస్టెంట్ ప్రోగ్రామర్: 09
అర్హత: ఇంజినీరింగ్ డిప్లొమా/ బీసీఏ/ బీఎస్సీ ఐటీ ఉత్తీర్ణత.
సి) లీగల్ అసిస్టెంట్: 04 **అర్హత:** ఎల్ఎల్‌బీ ఉత్తీర్ణత.
డి) ఫైర్ ఇన్‌స్పెక్టర్: 10
అర్హత: బీఎస్సీతో పాటు ఫైర్ సేఫ్టీ కోర్సులో ఉత్తీర్ణత.
ఇ) లైబ్రేరియన్: 02
అర్హత: బీఎల్ఐఎస్సీ ఉత్తీర్ణత. ఎంఎల్ఐఎస్సీ/ బీఈడీ/ పీజీ ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తారు.
వేతన శ్రేణి: పై అన్ని పోస్టులకు రూ. 14,000 - 26950
ఎఫ్) మెయింటెయినర్: 1058 (ఇందులో 317 ఎలక్ట్రీషియన్, 530 ఎలక్ట్రానిక్ మెకానిక్, 33 రెఫ్రిజిరేటర్ అండ్ ఏసీ మెకానిక్, 178 ఫిట్టర్ ఖాళీలు ఉన్నాయి)
అర్హత: సంబంధిత ట్రేడుల్లో ఐటీఐ ఉత్తీర్ణత.
వేతన శ్రేణి: రూ. 10170 - 18500

3) కాంట్రాక్ట్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు (అసిస్టెంట్ మేనేజర్)
మొత్తం ఖాళీలు: 92 (వీటిలో ఎలక్ట్రికల్ 25, ఎస్ అండ్ టీ 22, సివిల్ 44, అలైన్‌మెంట్ డిజైన్ 1 ఖాళీలు ఉన్నాయి)
అర్హత: సంబంధిత బ్రాంచీల్లో బీఈ/ బీటెక్/ బీఎస్సీ/ ఎంఎస్సీ ఉత్తీర్ణత. గేట్ - 2017 స్కోరు కార్డు ఉండాలి.
వేతన శ్రేణి: రూ.20600 - 46500

4) కాంట్రాక్ట్ నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు
మొత్తం ఖాళీలు: 232 **ఎ) జూనియర్ ఇంజినీర్:** 205 (ఎలక్ట్రికల్ 7, ఎలక్ట్రానిక్స్ 102, సివిల్ 96 ఖాళీలు ఉన్నాయి)
అర్హత: సంబంధిత బ్రాంచీల్లో ఇంజినీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణత.
వేతన శ్రేణి: రూ. 14,000 - 26950
బి) ఆఫీస్ అసిస్టెంట్: 14 **అర్హత:** బీఏ/ బీఎస్సీ/ బీకామ్ ఉత్తీర్ణత. **సి) స్టోర్ అసిస్టెంట్:** 13
అర్హత: ఎలక్ట్రికల్ / ఎలక్ట్రానిక్స్/ మెకానికల్/ సివిల్‌బ్రాంచీల్లో ఇంజినీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణత.
వేతనం: ఆఫీస్ అసిస్టెంట్, స్టోర్ అసిస్టెంట్ పోస్టులకు ఎంపికైన వారికి ప్రతి నెల రూ. 45,000 కన్సాలిడేటెడ్ విధానంలో చెల్లిస్తారు.

వయసు: ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు జనవరి 1, 2018 నాటికి 18 - 28 సంవత్సరాల మధ్య వయసు ఉండాలి. అంటే జనవరి 2, 1990 కంటే ముందు, జనవరి 1, 2000 తర్వాత జన్మించినవాళ్లు అనర్హులు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు; ఓబీసీలకు మూడేళ్లు గరిష్ఠ వయసు పరిమితిలో సడలింపులు వర్తిస్తాయి.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో **చివరి తేది:** 26.02.2018.
ఫీజు: ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళలకు రూ. 250. జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ. 500.
పరీక్ష తేదీలు: తర్వాత ప్రకటిస్తారు.
వెబ్‌సైట్: http://delhimetrorail.com

ఎంపిక ప్రక్రియ

రాతపరీక్ష/ గ్రూప్ డిస్కషన్/ పర్సనల్ ఇంటర్వ్యూ/ మెడికల్ టెస్ట్ ద్వారా. ఎగ్జిక్యూటివ్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్నవారికి మూడంచెల్లో నియామకాలు చేపడతారు. ముందుగా కంప్యూటర్ బేస్డ్ టెస్టు (రెండు పేపర్లు) నిర్వహిస్తారు. అందులో అర్హత సాధించినవారికి గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు ఉంటాయి. ఇందులోనూ ఉత్తీర్ణత సాధిస్తే మెడికల్ పరీక్షల అనంతరం ఉద్యోగంలోకి తీసుకుంటారు. నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్నవారికి కంప్యూటర్ బేస్డ్ టెస్టు (రెండు పేపర్లు) నిర్వహిస్తారు. ఇందులో అర్హత సాధించినవారికి వైద్య పరీక్షలు నిర్వహించి విధుల్లోకి తీసుకుంటారు. మెయింటెయినర్ పోస్టులకు మాత్రం కంప్యూటర్ బేస్డ్ పరీక్ష ఒక పేపర్‌లో మాత్రమే నిర్వహిస్తారు. అనంతరం మెడికల్ టెస్టులు నిర్వహించి ఉద్యోగానికి ఎంపిక చేస్తారు. నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలు ఉండవు.

కంప్యూటర్ బేస్డ్ టెస్టు (సీబీటీ)

ఇందులో పేపర్-1లో జనరల్ అవేర్‌నెస్, జనరల్ ఇంటెలిజెన్స్, రీజనింగ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌లతో పాటు సంబంధిత ట్రేడ్ (అభ్యర్థి దరఖాస్తు చేసుకున్న విభాగం) నుంచి మొత్తం 120 ప్రశ్నలు వస్తాయి. అన్ని ప్రశ్నలకూ సమాన మార్కులు కేటాయించారు. పరీక్ష వ్యవధి 90 నిమిషాలు. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీ మాధ్యమంలో బహుళైచ్ఛిక విధానంలో ఉంటుంది. పేపర్-2లో జనరల్ ఇంగ్లిష్ నుంచి మొత్తం 60 ప్రశ్నలు ఉంటాయి. ఇందులో అభ్యర్థి ఆంగ్లభాషా నైపుణ్యాన్ని పరీక్షిస్తారు. అన్ని ప్రశ్నలకూ సమాన మార్కులు కేటాయించారు. పరీక్ష వ్యవధి 45 నిమిషాలు. రెండు పేపర్లలోనూ రుణాత్మక మార్కులు ఉన్నాయి. తప్పుగా గుర్తించిన ప్రతి జవాబుకు 1/3 వంతు చొప్పున మార్కులు తగ్గిస్తారు. మెయింటెయినర్ పోస్టులకు మాత్రం పేపర్‌లో జనరల్ అవేర్‌నెస్, జనరల్ ఇంటెలిజెన్స్, రీజనింగ్, జనరల్ ఇంగ్లిష్, సంబంధిత ట్రేడ్‌లో ప్రశ్నలు వస్తాయి. వీరికి పేపర్-2 వర్తించదు. అభ్యర్థులు పేపర్-1, పేపర్-2ల్లో విడిగా అర్హత సాధించాలి. మెరిట్, రిజర్వేషన్ ప్రాతిపదికన తర్వాతి దశకు ఎంపిక చేస్తారు. విధుల్లో చేరినవాళ్లు రెండేళ్లపాటు ప్రొబేషన్‌లో కొనసాగుతారు. డీఏ, హెచ్‌ఆర్ఏ చెల్లిస్తారు. కాంట్రాక్ట్ ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు ఎంపికైనవారు నాలుగేళ్లపాటు విధుల్లో కొనసాగుతారు.

లైబ్రరీ


కాంపిటీటివ్, అకడమిక్, ఎంట్రన్స్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం ఇటీవల మార్కెట్లోకి విడుదలైన పుస్తకాల వివరాలు...



1) ఏపీ టెట్ పేపర్-1 వాల్యూమ్-1 (శిశువికాసం-అధ్యాపనం, తెలుగు, ఇంగ్లిష్), పేజీలు: 848, ధర: రూ. 449
2) ఏపీ టెట్ పేపర్-1 వాల్యూమ్-2 (గణితం, పరిసరాల విజ్ఞానం - కంటెంట్, మెథడాలజీ), పేజీలు: 608, ధర: రూ. 349
3) ఏపీ టెట్ పేపర్-2 వ్యాల్యూమ్-1 (శిశు వికాసం-అధ్యాపనం, తెలుగు, ఇంగ్లిష్), పేజీలు: 864, ధర: రూ. 459
4) ఏపీ టెట్ పేపర్-2 వాల్యూమ్-2 (మ్యాథమేటిక్స్ అండ్ సైన్స్ -కంటెంట్, మెథడాలజీ), పేజీలు: 1264, ధర: రూ. 599

ప్రచురణ: విజేత కాంపిటీషన్స్

జవహర్ నవోదయ



● ఆరోతరగతి జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షా దర్శిని (2005 నుంచి 2017 వరకు జరిగిన పరీక్షల పేపర్లు జవాబులతో)
● సమాధానాలతో సహా అయిదు సెట్ల ప్రాక్టీస్ పేపర్ల అనుబంధం ఉచితం. ధర: రూ. 189

ప్రచురణ: వీజీఎస్ బుక్ లింక్స్

విపక్షాలు నిర్మాణాత్మక సూచనలివ్వాలి

- అఖిలపక్ష భేటీలో ప్రధాని వినతి
- నేటి నుంచే పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు
- తొలి రోజునే రాష్ట్రపతి ప్రసంగం, ఆర్థిక సర్వే నివేదిక సమర్పణ

దిల్లీ



దిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో జరిగిన అఖిలపక్ష సమావేశానికి హాజరైన ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్, అరుణ్‌జైట్లీ, అనంత్‌కుమార్, కాంగ్రెస్ నేతలు గులాంనబీ ఆజాద్, మల్లిఖార్జున ఖర్గే

పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో నిర్మాణాత్మక వాతావరణం నెలకొనేలా అన్ని పార్టీలు సహకరించాలని ప్రధాని నరేంద్ర మోదీ కోరారు. పార్లమెంటు సమావేశాలు సోమవారం ప్రారంభంకానున్న దృష్ట్యా ఆదివారం జరిగిన అన్ని పార్టీల సభాపక్ష నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని పార్టీల అభిప్రాయాలకు ప్రభుత్వం గౌరవం ఇస్తుందని అన్నారు. పార్లమెంటరీ స్థాయీ సంఘాల సమావేశాల్లో నామమాత్రంగా పాల్గొనకుండా, నిర్మాణాత్మక సూచనలు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర అసెంబ్లీలకు ఆదర్శంగా ఉండేలా స్థాయీ సంఘాల విధానాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. జాతి మేలు కోసం సలహాలు ఇవ్వాలని అన్నారు. సీపీఐ నాయకుడు రాజా మాట్లాడిన అనంతరం మోదీ ప్రసంగించారు. 'రాజా అనంతరం ప్రజా (అంటే నేను) మాట్లాడుతార'ని ప్రధాని చమత్కరించారు. రెండు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అరుణ్ జైట్లీ, అనంతకుమార్; మల్లికార్జున్ ఖర్గే (కాంగ్రెస్), ములాయం సింగ్ యాదవ్ (ఎస్పీ), డి.రాజా (సీపీఐ), కనిమొళి (డీఎంకే), డెరెక్ ఓబ్రెయిన్, సుదీప్ బంధోపాధ్యాయ (టీఎంసీ), తారిక్ అన్వర్ (ఎన్సీపీ)లు పాల్గొన్నారు.

తలాక్ బిల్లుపై ఏకాభిప్రాయ సాధన

అనంతరం పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంతకుమార్ విలేకరులతో మాట్లాడుతూ అఖిలపక్ష సమావేశం ఫలప్రదమయినట్టు చెప్పారు. ముమ్మారు తలాక్ బిల్లుకు ఈ సమావేశాల్లోనే ఆమోదం లభించేలా అన్ని ప్రయత్నాలు చేస్తామని తెలిపారు. దీనిని గత సమావేశాల్లోనే ప్రవేశపెట్టినా రాజ్యసభలో ప్రతిపక్షాల వ్యతిరేకత కారణంగా ఆమోదం పొందలేదు. జీఎస్టీ మాదిరిగానే ఇది కూడా ఏకగ్రీవంగా ఆమోదం పొందుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. అన్ని పార్టీలను కలిసి ఏకాభిప్రాయసాధనకు కృషి చేస్తామని తెలిపారు. ఓబీసీ కమిషన్‌కు రాజ్యాంగ ప్రతిపత్తి ఇచ్చే బిల్లు ఆమోదానికీ కృషి చేయనుంది.

నిలదీయనున్న విపక్షాలు

పార్లమెంటులో వివిధ అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రతిపక్షాలు నిర్ణయించాయి. రాజ్యాంగ సంస్థలపై జరుగుతున్న దాడులు, వ్యాపారుల సమస్యలు, మహిళలపై అత్యాచారాల వంటి సమస్యలు లేవనెత్తుతామని కాంగ్రెస్ నేత ప్రమోద్ తివారీ చెప్పారు. ఆర్జేడీ నేత జయప్రకాశ్ నారాయణ్ యాదవ్ మాట్లాడుతూ నిరుద్యోగం, దళితులపై దాడులు, రైతుల సమస్యలు ప్రస్తావిస్తామని చెప్పారు.

స్పీకర్ విందు

పార్లమెంటు సమావేశాల సందర్భంగా స్పీకర్ సుమిత్రా మహాజన్ అన్ని పార్టీల నాయకులకు విందు ఇచ్చారు.

బడ్జెట్ సమావేశాల వివరాలు

బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ఏప్రిల్ 26 వరకు జరగనున్నాయని మంత్రి అనంతకుమార్ చెప్పారు. తొలి రోజున ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించిన అనంతరం ఆర్థిక సర్వే నివేదికను సమర్పిస్తారని అన్నారు. గురువారం బడ్జెట్ ప్రవేశపెడుతారని చెప్పారు. తొలివిడత సమావేశాలు ఫిబ్రవరి 9న ముగుస్తాయని తెలిపారు. అనంతరం బడ్జెట్‌పై అధ్యయనం కోసం సభలను వాయిదా వేస్తారని చెప్పారు. మార్చి 5న రెండో దశ సమావేశాలు ప్రారంభమవుతాయని తెలిపారు. మొదటి దశలో 8 భేటీలు, రెండో దశలో 23 భేటీలు మొత్తం 31 భేటీలు జరుగుతాయని వివరించారు.

అవినీతిపై పోరులో యువత కలిసి రావాలి: ప్రధాని మోదీ




ఎన్‌సీసీ ర్యాలీ సందర్భంగా కాడెట్‌కు ట్రోఫీ అందజేస్తున్న ప్రధాని మోదీ

దిల్లీ: అవినీతిపై తాము చేస్తున్న పోరాటానికి భారత యువత తమవంతు సహకారాన్ని అందించాలంటూ ప్రధాని మోదీ కోరారు. అవినీతి విషయానికి వచ్చేసరికి.. ..ఎంతటి వారినైనా వదిలిపెట్టేదే లేదని ఆయన ఆదివారం నాడిక్కడ స్పష్టం చేశారు. అవినీతి కేసుల్లో ఇప్పటికే ముగ్గురు మాజీ ముఖ్యమంత్రులు జైలుపాలైన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. బిహారు మాజీ ముఖ్యమంత్రులు లాలూ ప్రసాద్‌యాదవ్, జగన్నాథ్ మిశ్రా, హరియాణా మాజీ సీఎం..ఓం ప్రకాశ్ చౌతాలాలు అవినీతి కేసుల్లో జైలుపాలైన విషయం ఈ సందర్భంగా గమనార్హం. అవినీతి చెదను అంతమొందించడం వల్ల నిరుపేదలకు ఎంతో మేలుజరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఇక్కడ జరిగిన ఎన్‌సీసీ ర్యాలీలో ఆయన మాట్లాడుతూ.... 'ఆధార్' వినియోగం గురించి నొక్కి చెప్పారు. దేశ అభివృద్ధికి 'ఆధార్' గొప్ప శక్తినిచ్చిందన్నారు. నగదురహిత లావాదేవీలు మరింతగా పెరిగేందుకు యువత సహకరించాలని కోరారు. అందులో భాగంగా కనీసం వంద కుటుంబాలతో అనుసంధానమై...నగదురహిత లావాదేవీలను ప్రోత్సహించేలా చూసి మరింత జవాబుదారీతనానికి, పారదర్శకతకు తోడ్పాటునందించాలనిన్నారు. ఎన్‌సీసీని 2023 నాటికల్లా మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్లేందుకు సంబంధించిన కార్యాచరణ గురించి యోచించాల్సిందిగా ప్రధాని కోరారు. తాను ఒకప్పుడు ఎన్‌సీసీ సభ్యుడినేనన్నారు.

సూర్యుడే ఏపీ బ్రాండ్ అంబాసిడర్

- ప్రజల్లో చైతన్యం నింపేందుకే సూర్యారాధన: చంద్రబాబు





ఆదివారం విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సూర్యనమస్కారాలు చేస్తున్న యువతీ యువకులు ★ జలంతో సూర్యారాధన చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు డిజిటల్, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు సూర్యుడే అతి పెద్ద బ్రాండ్ అంబాసిడర్ అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. అందుకే 'సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్' నినాదమిచ్చామని వెల్లడించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని.. ప్రకృతిని, సాంకేతికతను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలని సూచించారు. కరవు అనే మాట లేకుండా రాష్ట్రం అభివృద్ధిపథంలో ముందుకెళ్లాలనే ఆకాంక్షతోనే సూర్యారాధన కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. ఇది ప్రాంతానికి, మతానికి, కులానికి పరిమితమైంది కాదని పేర్కొన్నారు. ప్రతి ఏటా గణతంత్ర వేడుకలా దీన్ని నిర్వహిస్తామని, ఇది ప్రజాహిత వేడుకని స్పష్టం చేశారు. అనేక దేశాల్లో ప్రకృతిని పూజిస్తున్నారని, కాపాడుకునేందుకు చర్యలు చేపడుతున్నారని వివరించారు. అందుకే రాష్ట్రంలో నీరు-ప్రగతి, వనం- మనం, ఏరువాక, జలహారతి తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆదివారం విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 'సూర్యారాధన' కార్యక్రమాన్ని నిర్వహించారు. జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు అనంతరం ప్రసంగించారు. 'ఆంధ్రప్రదేశ్ సూర్యున్ని నమ్ముకున్న రాష్ట్రం. ప్రస్తుతం పర్యావరణానికి ఎలాంటి హాని లేకుండా సౌర విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. నేడు 5 వేల మెగావాట్ల పవన, సౌర విద్యుదుత్పత్తి చేస్తున్న మొదటి రాష్ట్రం ఏపీ. నేను సీఎం అయిన తొలినాళ్లలో సౌర విద్యుత్ యూనిట్ రూ.6గా ఉండేది. ప్రత్యేక చొరవతో ముందుకెళ్లడం ద్వారా ప్రస్తుతం రూ.3 కే అందుబాటులోకి వచ్చింది. దేశంలో మొట్టమొదటి సారిగా విద్యుత్ సంస్కరణలు అమలుచేసి కొరత లేకుండా చేశాను. ఇప్పుడు రెండో సారి సంస్కరణలు చేపట్టి విద్యుత్ ఛార్జీలు తగ్గించే చర్యలు తీసుకుంటున్నాం. ఇదంతా సూర్యరశ్మిని సమర్థంగా వినియోగించుకోవడం ద్వారానే సాధ్యమవుతుంది. శాతవాహనుల కాలం నుంచే రాష్ట్రం లాజిస్టిక్ హబ్‌గా పేరుగాంచింది' అని అన్నారు.

సర్వమత ప్రార్థనలతో సూర్యారాధన

సూర్యారాధన కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం మతాలకు అతీతంగా సర్వమత ప్రార్థనలతో ఘనంగా ప్రారంభించింది. మతపెద్దలు వేదాంతం రాజగోపాలచారి, అఫ్జిత్ మహ్మద్ అబ్దుల్ ఖదీర్ నయీమి, ఫాదర్ కరుణానిధి హిందూ మతం, ఖురాన్, బైబిల్‌లో సూర్యుని ప్రస్తావనను, సూర్యారాధన వల్ల కలిగే ప్రయోజనాలను చెప్పారు. ఆయా మతాల్లో సూర్యునికి ఉండే ప్రాధాన్యాన్ని, ఆరాధించే విధానాలను వివరించారు. ఈ కార్యక్రమం కోసం ప్రత్యేకంగా రూపొందించిన గీతంపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. దాదాపు 900 మందికి పైగా ఒకేసారి సూర్యనమస్కారాలు చేశారు. కార్యక్రమంలో మంత్రి దేవినేని ఉమ, ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యేలు బోండా ఉమ, గద్దె రామ్మోహన్ సూర్య నమస్కారాలు చేశారు.

అభివృద్ధి వెంటే నడుస్తా

అనంతపురం పర్యటనలో పవన్ కల్యాణ్

కదిరి, న్యూస్‌టుడే: అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లే వారి వెంటే నడుస్తానని జనసేన అధినేత పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని, అందులో అనంతపురానికి ఎక్కువ మొత్తం కేటాయించి ఆదుకోవాలని కోరారు. అనంతపురం పర్యటనలో భాగంగా ఆదివారం కదిరికి వచ్చిన ఆయన కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు.

మంత్రి సునీతతో భేటీ: ఆదివారం ఉదయం పవన్ కల్యాణ్ అనంతపురంలో మంత్రి పరిటాల సునీతను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల వివరాల గురించి మంత్రిని, ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. హంద్రీనీవా ప్రాజెక్టు పురోగతిని పవన్ ప్రత్యేకంగా తెలుసుకున్నారు. అనంత అభివృద్ధికి సహకారం అందించేందుకు పవన్ ముందుకు రావడం సంతోషకరమని మంత్రి సునీత వ్యాఖ్యానించారు. సాయంత్రం కదిరి లక్ష్మీ నరసింహస్వామిని పవన్ దర్శించుకున్నారు. కదిరి ఎమ్మెల్యే చాంద్‌బాషాను కలిసి ఆ ప్రాంత సమస్యలు తెలుసుకున్నారు. రాత్రికి పుట్టపర్తి చేరుకున్న పవన్ స్థానికంగా ప్రసంగిస్తూ సత్యసాయి స్ఫూర్తితో జనసేనను నడిపిస్తామని చెప్పారు.

అభిమానికి గాయాలు: పవన్ కదిరి నుంచి పుట్టపర్తికి వెళ్తుండగా నల్లమాడ క్రాస్‌వద్ద యువకులు పెద్ద ఎత్తున తమ అభిమాన నటుడితో చేయి కలపాలనే తపనతో ఒక్కసారిగా ముందుకొచ్చారు. దీంతో నల్లమాడకు చెందిన మహేష్ (23) కిందపడగా.. అతనిపై నుంచి కారు వెళ్లడంతో కాలు విరిగింది. స్నేహితులు గుర్తించి పక్కకు లాగారు. వెనకాలే వస్తున్న మరో వాహనంలో పుట్టపర్తి ఆసుపత్రికి తరలించారు.

ఆధార్‌తో డీఎన్ఏ అనుసంధానం యోచన లేదు: ఉడాయ్

దిల్లీ: ఆధార్ సంఖ్య అనేది ఒక గుర్తింపు మాత్రమేననీ, ఇది వ్యక్తిగత వివరాలను క్రోడీకరించే సాధనం కాదనీ 'భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ' (ఉడాయ్) స్పష్టం చేసింది. ప్రజల డీఎన్ఏ వివరాలను సేకరించి వాటిని ఆధార్‌తో అనుసంధానం చేసే యోచనేదీ లేనేలేదని తేల్చిచెప్పింది. ఆదివారం ట్విటర్ ద్వారా ప్రజలు అడిగిన ప్రశ్నలకు ఉడాయ్ ముఖ్య కార్యనిర్వహణాధికారి అజయ్ భూషణ్ పాండే సమాధానాలిచ్చారు. ఆధార్ గణాంక సమాచారానికి పటిష్ఠమైన భద్రత ఉందనీ, దానిలోకి ఎవరూ చొరబడలేరనీ చెప్పారు. తాము కేవలం వేలిముద్రలు, ఫోటో, కనుపాపల వివరాలనే తీసుకుంటామనీ, ఏ వ్యక్తినైనా గుర్తించడానికి ఇవి సరిపోతాయని చెప్పారు. వివిధ రకాల సమాచారాన్ని ఆధార్‌తో అనుసంధానించడం వల్ల ప్రజలపై ప్రభుత్వ నిఘా, పర్యవేక్షణ ఉంటాయనే వాదనల్ని పాండే తోసిపుచ్చారు. దీనికి గానీ, ఆధార్ వివరాల దుర్వినియోగానికి గానీ ఆస్కారమే లేదన్నారు. 'మీరు ఆధార్ సంఖ్యను బ్యాంకులో సమర్పించినంతమాత్రాన మీ బ్యాంకు ఖాతా వివరాలు ఉడాయ్‌కు తెలియవు. మీ ఆధార్ సంఖ్య, వేలిముద్రలు ఉడాయ్ వద్ద ఉన్న వివరాలతో సరిపోలాయా లేదా అనేది మాత్రమే మేం చెబుతాం. లేదంటే పరిమితంగా ఇ-కేవైసీ వివరాలు ఇస్తాం. ఈ వ్యవస్థ ద్వారా ఏ ఒక్కరి వివరాలనూ ప్రభుత్వం పొందజాలదు. ఆధార్ వివరాలను ఇవ్వడం వల్ల తమ ఖాతాలను ప్రభుత్వం ఎప్పుడైనా స్తంభింపజేయవచ్చనే ఆందోళనలు అనవసరం' అని తేల్చిచెప్పారు. పూర్తి ఆధార్ వివరాలు ఇవ్వకుండా ఎవరికివారు వెబ్‌సైట్లో ఒక గుర్తింపు సంఖ్యను సృష్టించుకుని దాని ద్వారా తమ ధ్రువీకరణను పూర్తి చేసుకునే పద్ధతికి, సమాచార వెల్లడి (డేటా లీక్) కథనాలకు మధ్య సంబంధం లేదని చెప్పారు. గత ఏడేళ్లలో ఉడాయ్ నుంచి ఎలాంటి సమాచారం బయటకు వెల్లడికాలేదని గుర్తుచేశారు. వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కు అనే సిద్ధాంతం ఆధారంగా బలమైన చట్టాలతో ఆధార్‌కు రక్షణ కల్పించామని చెప్పారు. ఒక వ్యక్తి అనుమతి లేకుండా వారికి సంబంధించిన వేలిముద్రల సమాచారాన్ని వేరొకరితో పంచుకోలేమని తేల్చిచెప్పారు.



'బాహుబలి'పై ఐఐఎం-ఎ విద్యార్థుల అధ్యయనం!

అహ్మదాబాద్: చరిత్ర సృష్టించిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'బాహుబలి'పై సునిశిత అధ్యయనానికి ప్రతిష్ఠాత్మక అహ్మదాబాద్ ఐఐఎం సన్నద్ధమౌతోంది. కళ...వ్యాపారం... సాంకేతిక నైపుణ్యం ...కలగలిసి ఆ చిత్రం అఖండ విజయానికి ఎలా దోహదపడ్డాయనే అంశంపై అధ్యయనం జరగాలని ఐఐఎంఏ పూర్వవిద్యార్థులు, అతిథి అధ్యాపకుడిగా ఉన్న భరతన్ కందస్వామి సంకల్పించారు. ఐఐఎం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు 'మేనేజ్‌మెంట్'పై నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా 'చలనచిత్ర వ్యాపారం' అంశంపై బాహుబలి ఘనవిజయాన్ని ఓ అంశంగా ఇస్తారు. ఓ ప్రత్యేక కోర్సుగా ఎంపిక చేసిన ఈ అంశంపై విద్యార్థులు లోతైన అధ్యయనం చేస్తారు. నాలుగునెలల్లో ఈ ప్రక్రియను పూర్తిచేసేయాలి. భారత చలనచిత్ర పరిశ్రమ వ్యాపారంపై కూడా దృష్టిపెడతారు. స్క్రిప్టు ఎంపిక నుంచి...సినిమా తెరపై కనపడేవరకూ ఈ కోర్సు ప్రత్యేకంగా దృష్టిసారిస్తుందని కందస్వామి వెల్లడించారు. "బాహుబలి అనేది ఓ గొప్ప చిత్రం. కళ, వ్యాపారం, సాంకేతిక పరిజ్ఞానాల అద్భుత మేళవింపుతో...ఘనవిజయం సాధించింది. చాలా సందర్భాల్లో చిత్రాలు సృజనత్మాకంగా, కళాత్మకంగా ఉంటాయే తప్ప మంచి వ్యాపారాన్ని చేయలేకపోతాయి. కొన్ని సందర్భాల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా ప్రతిభావంతంగా ఉపయోగించుకోలేకపోవచ్చు"నని కందస్వామి పేర్కొన్నారు. ఒక్కోసారి కథ గొప్పగా ఉండవచ్చు. అయితే, దాని అమలు అంతతమాత్రం కావచ్చు. కొన్ని సార్లు ఏదో ఓ మోస్తరు కథలు లభించవచ్చు. అయితే, బాహుబలి విషయానికి వచ్చే సరికి అన్ని కలగలిసి...చక్కని మేళవింపు అయినాయి. అందుకే, బాహుబలి అంతటి ఘనవిజయాన్ని సొంతం చేసుకుందని కందస్వామి అన్నారు. బాహుబలి- ది బిగినింగ్, బాహుబలి - ది కన్‌క్లూజన్‌ల దిగ్విజయ మంత్రమేమిటనే అంశంపై ప్రధానంగా విద్యార్థుల కేస్ స్టడీ ఉంటుందని ఆయన చెప్పారు.

ఎంపీలు వేతనాలను త్యజించాలి: వరుణ్‌గాంధీ

దిల్లీ: ఆర్థికంగా కాస్త మెరుగైన పరిస్థితుల్లో ఉన్న ప్రస్తుత లోక్‌సభ సభ్యులంతా తమ తమ వేతనాలను స్వచ్ఛందంగా త్యజించే దిశగా ప్రోత్సహిస్తూ తగిన చర్యలను ప్రారంభించాల్సిందిగా భాజపా ఎంపీ వరుణ్‌గాంధీ స్పీకర్ సుమిత్రా మహాజన్‌ను అభ్యర్థించారు. ఇలాంటి చర్యల వల్ల ప్రజలకు సంబంధిత ప్రజాప్రతినిధుల పట్ల విశ్వాసం మరింత బలపడుతుందన్న అభిప్రాయాన్ని వరుణ్‌గాంధీ వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా కూడా ఓ విధమైన సానుకూల సందేశాన్ని పంపినట్లువుతుందని ఆయన స్పీకరుకు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఈ చర్యకు సంబంధించిన సాధ్యాసాధ్యాలను పరిశీలించి ఓ నిర్ధారణకు వచ్చేందుకు చట్టబద్ధమైన ఓ స్వతంత్రప్రతిపత్తి కలిగిన సంఘాన్ని ఏర్పాటు చేయాలన్న అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

ఛూ మంత్రకాళి.. డబ్బంతా ఖాళీ

- ఏటీఎం యంత్రాలపై సరికొత్త సైబర్ దాడి
- అమెరికాలో 'జాక్‌పాటింగ్' కలకలం

వాషింగ్టన్

'జాక్‌పాటింగ్'.. ఈ పేరు వినిపిస్తే చాలు.. ప్రస్తుతం అమెరికాలో కలకలం రేగుతోంది. బ్యాంకు అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయి. ఏటీఎం యంత్రాల తయారీ సంస్థలు తలలు పట్టుకుంటున్నాయి.

ఇంతకూ 'జాక్‌పాటింగ్' అంటే ఏంటీ అంటారా.. ఇదో సరికొత్త సైబర్ దాడి. ఏటీఎం యంత్రాలను లక్ష్యంగా చేసుకొని ప్రస్తుత సాంకేతిక ప్రపంచంలో నేరగాళ్లు జరుపుతున్న భారీ దోపిడీ. ఇందులో నేరాగాళ్లు ఓ మీట నొక్కారంటే చాలు.. తాము గురిపెట్టిన ఏటీఎం డబ్బులు కక్కాల్సిందే.. పూర్తిగా ఖాళీ కావాల్సిందే. ఇప్పటికే మెక్సికో, జపాన్ తదితర దేశాల్లో ఈ తరహా హైటెక్ దాడులతో అలజడి సృష్టించిన సైబర్ నేరగాళ్లు.. ఇక అగ్రరాజ్యం అమెరికానూ కుదిపేసేందుకు సిద్ధమవుతున్నట్లు సంకేతాలు వెలువడ్డాయి.

ఏటీఎం యంత్రాల తయారీరంగంలో ప్రపంచంలోనే ప్రముఖ సంస్థలుగా పేరొందిన డీబోల్డ్ నిక్స్‌డార్ఫ్, ఎన్‌సీఆర్ కార్పొరేషన్.. బ్యాంకులకు గత శుక్రవారం ఓ హెచ్చరిక జారీ చేశాయి. 'జాక్‌పాటింగ్' దాడులకు నేరగాళ్లు సిద్ధమవుతున్నారని.. అప్రమత్తంగా ఉండాలని అందులో సూచించాయి. ముందస్తు రక్షణ చర్యలకు పిలుపునిచ్చాయి. ఇప్పటికే అమెరికాలో ఓ 'జాక్‌పాటింగ్' దాడి జరిగిందని కూడా తెలిపాయి. అయితే, అందులో ఎంతమొత్తం డబ్బు దోపిడీ చోటుచేసుకుందనే సంగతిని మాత్రం చెప్పలేదు. మరోవైపు, అమెరికా నిఘా సంస్థ 'సీక్రెట్ సర్వీస్' కూడా బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలకు హెచ్చరిక జారీ చేసింది. ఔషధ దుకాణాలు, బిగ్ బాక్స్ రిటైల్ సంస్థల సమీపంలో విడిగా ఉంటున్న ఏటీఎంలను హ్యాకర్లు లక్ష్యంగా చేసుకోబోతున్నట్లు తెలిపింది. దీంతో అమెరికావ్యాప్తంగా ప్రస్తుతం బ్యాంకర్లు ఆందోళన చెందుతున్నారు. సమీప భవిష్యత్తులో ఈ దాడులతో పెను సవాళ్లు ఎదురయ్యే అవకాశముందని వారు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రధానంగా డీబోల్డ్ నిక్స్‌డార్ఫ్ ఏటీఎం యంత్రాలను 'జాక్‌పాటింగ్'కు నేరగాళ్లు లక్ష్యంగా చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

గతంలోనూ..

తొలిసారిగా మెక్సికోలో 2013లో 'జాక్‌పాటింగ్' దాడిని గుర్తించారు. అనంతరం అక్కడక్కడా ఈ పేరు వినిపిస్తూనే ఉంది. ప్రధానంగా ఐరోపా, ఆసియా ఖండాల్లో 'జాక్‌పాటింగ్' తరహా సైబర్ దాడులు జరిగినట్లు తెలుస్తోంది. అమెరికాలో మాత్రం గతంలో ఎన్నడూ ఈ దాడి చోటుచేసుకోలేదు.

2016లో 'జాక్‌పాటింగ్'తో జపాన్‌లో కొన్ని ఏటీఎంల నుంచి సైబర్ నేరగాళ్లు కేవలం మూడు గంటల వ్యవధిలో సుమారు రూ.83 కోట్లు కాజేశారు. తైవాన్‌లోనూ 'ఫస్ట్ కమర్షియల్ బ్యాంక్' ఏటీఎంల నుంచి డబ్బు బయటకు పడుతుండటం గతంలో కనిపించింది. దీంతో అప్పట్లో బ్యాంకు వెయ్యికి పైగా ఏటీఎంలను స్తంభింపజేయాల్సి వచ్చింది. ఈ దాడులకు సంబంధించి ముగ్గురు వ్యక్తుల్ని పోలీసులు అరెస్టు చేశారు. థాయిలాండ్‌లోనూ 'గవర్నమెంట్ సేవింగ్స్ బ్యాంక్'పై ఇలాంటి దాడి జరిగింది.

ఎలా చేస్తారు?

'జాక్‌పాటింగ్'ను లాజికల్ దాడిగానూ పిలుస్తారు. ఈ దాడి చేయాలంటే సాంకేతికంగా చాలా నైపుణ్యాలు అవసరం. దోపిడీకి అనుకూలంగా ఉన్న ఏటీఎంను నేరగాళ్లు ముందుగా ఎంచుకుంటారు. స్వయంగా ఏటీఎంకు వెళ్తారు. వైద్యరంగంలో ఉపయోగించే సన్నని ఎండోస్కోప్‌కు కొన్ని మార్పులు చేసి.. దాన్ని ఏటీఎం యంత్రంలోకి చొప్పిస్తారు. తమకు అవసరమైన సాంకేతిక సమాచారాన్ని సంగ్రహిస్తారు. అనంతరం తాము రూపొందించిన హానికర సాఫ్ట్‌వేర్ లేదా హార్డ్‌వేర్‌ను లోపల ప్రవేశపెడతారు. అవసరమైతే రెండిటినీ అమరుస్తారు. తద్వారా ఏటీఎం కంప్యూటర్‌ను తమ ల్యాప్‌టాప్‌కు అనుసంధానిస్తారు. దీంతో ఏటీఎం పూర్తిగా వారి నియంత్రణలోకి వచ్చేస్తుంది. ఆపై వారు అవసరమైన మీట నొక్కితే చాలు.. ఏటీఎం తెరపై 'జాక్‌పాట్!!' అనే పదం కనిపిస్తుంది. యంత్రం నుంచి డబ్బులు బయటకు పడుతూనే ఉంటాయి. నేరగాళ్లు ఆపకపోతే.. ఏటీఎం మొత్తం ఖాళీ అయ్యేంతవరకు డబ్బు బయటకు వస్తూనే ఉంటుంది. దోపిడీ తర్వాత కూడా ఏటీఎం వారి నియంత్రణలోనే ఉంటుంది. సాధారణ వినియోగదారులు వెళ్తే.. 'ఈ ఏటీఎం పని చేయడం లేదు' అనే పదాలు మాత్రమే కనిపిస్తాయి.

నంగా పర్వతంపై చిక్కుకుపోయిన ఇద్దరు

- ప్రాణాలకు తెగించి ఒకరిని కాపాడిన పోలెండ్ పర్వతారోహకుల బృందం



పోలెండ్ పర్వాతారోహకుల బృందం రక్షించిన ఎలిసబెత్ రెవోల్(ఎడమ), గల్లంతైన టొమెక్ మాకివిక్జ్

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లోని నంగా పర్వతంపై చిక్కుకుపోయిన ఫ్రాన్స్‌కు చెందిన పర్వతారోహకురాలిని.. పోలెండ్‌కు చెందిన అగ్రశ్రేణి పర్వతారోహకుల బృందం ప్రాణాలకు తెగించి రక్షించింది. పాక్ సైన్యం సాయంతో ఈ బృందం సాహసోపేత రక్షణ ఆపరేషన్‌ను చేపట్టినట్లు అధికారులు తెలిపారు. అయితే బృంద సభ్యుల ప్రాణాలకే తీవ్రముప్పు పొంచి ఉండటంతో.. పోలెండ్‌కు చెందిన మరో పర్వతారోహకుడి కోసం చేపట్టాల్సిన గాలింపును ఆపివేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఆయన మరణించి ఉంటాడని భావిస్తున్నారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన పర్వతాల్లో 'నంగా' (8,126 మీ.) ది తొమ్మిదో స్థానం. 'హంతక పర్వతం'గా పేరుకెక్కిన దీన్ని.. అధిరోహించేందుకు ఎలిసబెత్ రెవోల్, టొమెక్ మాకివిక్జ్ కలిసి బయల్దేరారు. 7,400మీ.ల ఎత్తులో ఉండగా మాకివిక్జ్‌కు మంచు వల్ల ఫ్రోస్ట్‌బైట్ (కాళ్లు, చేతులు మొద్దుబారిపోవడం), చూపు మందగింపు సమస్యలు ఎదురయ్యాయి. దీంతో మాకివిక్జ్‌ను కొన్ని వందల మీటర్లు కిందకి తీసుకువచ్చి రెవోల్ శిబిరం ఏర్పాటు చేశారు. మరికొంత కిందకు వచ్చి ఆమె ఉపగ్రహ ఫోన్ ద్వారా సాయం కోసం అభ్యర్థించారు. రెవోల్‌కూ ఫ్రోస్ట్‌బైట్, చూపు మందగింపు సమస్యలు వచ్చాయి. దీంతో కే2 శిఖరాన్ని అధిరోహించడంలో నిమగ్నమై ఉన్న పోలెండ్ అగ్రశ్రేణి పర్వతరోహకుల బృందాన్ని.. పాక్ సైన్యం 4,800మీ. ఎత్తులో ఉన్న నంగా బేస్‌క్యాంప్‌నకు తరలించింది. అర్ధరాత్రి అంధకారంలో ఈ బృందం నంగాను 8 గంటపాటు (1200 మీ.) అధిరోహించి.. కెరోల్ వద్దకు వెళ్లగలిగింది. ఇటు మరణించి ఉంటాడని భావిస్తున్న మాక్‌విక్జ్ కోసం గాలింపు జరిపే వీలులేకపోవడంతో.. రక్షణ ఆపరేషన్‌ను నిలిపివేయాలన్న నిర్ణయం తీసుకున్నారు. తిరిగి బేస్‌క్యాంప్‌కు చేరేందుకు ఐదున్నర గంటలు ఈ బృంద సభ్యులు శ్రమించారు. అక్కడి నుంచి వారిని హెలికాప్టర్‌లో ఆసుపత్రికి తరలించారు. ఇటు రెవోల్‌ను ఇస్లామాబాద్‌కు చేర్చారు. ఆమె మెరుగైన పరిస్థితిలోనే ఉన్నట్లు కనిపించారు. పర్వతారోహణ చరిత్రలో ఇదో గొప్ప రక్షణ ఆపరేషన్ అని పాక్ పర్వతారోహకుడు కరీమ్ షా అన్నారు. ఈ 1200మీ.ల అధిరోహణకు చాలా మందికి రెండు మూడు రోజుల సమయం పడుతుందని ఆయన పేర్కొన్నారు.

పొగాకు నమిలే అలవాటుతో పతనమవుతున్న ఉత్పాదకత

నోటి క్యాన్సర్లతో రూ.వేల కోట్లు కోల్పోతున్న భారత్

ముంబయి: భారతీయుల పొగాకు నమిలే అలవాటు కారణంగా ప్రబలుతున్న రకరకాల క్యాన్సర్ల వల్ల మనదేశం ఏటా రూ.వేల కోట్ల విలువైన ఉత్పాదకత కోల్పోతోందని నివేదికలు చెబుతున్నాయి. భారత్, రష్యా, చైనా, దక్షిణాఫ్రికాలను బ్రిక్స్ దేశాలుగా పేర్కొంటారనే సంగతి విదితమే. బ్రిక్స్ దేశాల్లో క్యాన్సర్ల వల్ల 2012లో రూ.2,94,000 కోట్ల విలువైన ఉత్పాదకతకు నష్టం వాటిల్లింది. పలురకాల క్యాన్సర్ల కారణంగా 2012లో భారత్ సుమారు రూ.40 వేల కోట్లు నష్టపోయిందని, ఇది జీడీపీలో 0.36 శాతమని 'క్యాన్సర్ ఎపిడెమియోలజీ' అనే జర్నల్‌లో వ్యాసం ప్రచురితమైంది. చనిపోతున్న ప్రతి క్యాన్సర్‌రోగి కారణంగా భారత్ సుమారు రూ.12.62 లక్షల ఉత్పాదకత కోల్పోతోంది. పెదవులు, నోటికి వచ్చే క్యాన్సర్లలో సగం క్యాన్సర్లు పొగాకు నమిలే అలవాటు కారణంగానే వస్తున్నాయని ముంబయిలోని టాటా మెమోరియల్ ఆసుపత్రికి చెందిన క్యాన్సర్ శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ పంకజ్ చతుర్వేది తెలిపారు. మనదేశంలో పురుషుల్లో 23 శాతం, మహిళల్లో రెండు శాతం మంది పొగతాగుతున్నారని చెప్పారు. దీని కారణంగా మరణాలు కూడా పురుషుల్లోనే ఎక్కువగా ఉండటం వల్ల ఉత్పాదకతపై తీవ్రప్రభావం చూపుతోందని ఆయన విశ్లేషించారు.

గుండె పదిలంగా ఉండాలంటే...

★ రోగులకు మైండ్‌డైట్‌ను సూచిస్తున్న వైద్యులు



షికాగో: గుండెపోటు వచ్చినవారు ఏదిపడితే అది తినకుండా, పది రకాల ఆహారం తీసుకుంటే వారి గుండె పదిలంగా ఉంటుందని పరిశోధకులు సూచిస్తున్నారు. ఒక్కసారైనా గుండెపోటు వచ్చినవారిలో ఆలోచన, విచక్షణ, జ్ఞాపకశక్తి క్రమేణా తగ్గుముఖం పడతాయి. సాధారణ ప్రజలతో పోలిస్తే 'డిమెన్షియా' వచ్చే ముప్పు రెండురెట్లు ఎక్కువ. అలా కాకుండా ఉండాలంటే కూరగాయలు, బెర్రీస్, చేపలు, ఆలివ్ నూనె బాగా ఉపయోగపడతాయని చెబుతున్నారు. మెదడు ఆరోగ్యంగా పనిచేయాలంటే తినాల్సిన పది రకాల ఆహార పదార్థాలను పరిశోధకులు 'మైండ్' డైట్‌గా వ్యవహరిస్తున్నారు. అవేమిటంటే... ఆకుకూరలు, కూరగాయలు, గింజలు, బెర్రీస్, బీన్స్, అన్నిరకాల ధాన్యాలు, చేపలు, గుడ్లు, ఆలివ్ నూనె, ద్రాక్షరసం. చికాగోలోని రష్ యూనివర్సిటీ మెడికల్ సెంటర్‌కు చెందిన డాక్టర్ లారెల్ జె.చెరియన్ ఆధ్వర్యంలో జరిగిన పరిశోధన పూర్తి వివరాలను లాస్‌ఏంజిలెస్, కాలిఫోర్నియాలో నిర్వహించనున్న అంతర్జాతీయ గుండెపోటు సదస్సు-2018లో వివరించనున్నారు. ఇప్పటికే కనీసం ఒక్కసారైనా గుండెపోటు వచ్చిన 106 మందిపై 2004 నుంచి 2017 వరకు పరిశోధన చేశారు. వీరిని మూడుబృందాలుగా విభజించి, సగటున ఒక్కో రోగిని 5.9 ఏళ్లపాటు పరిశీలించారు.

ముడతలను తొలగించే కొత్త బొటాక్స్

★ ఆవు పేడలో నూతన బ్యాక్టీరియా



ముడతలను తొలగించి, ముఖారవిందానికి వన్నెలద్దడానికి 20 ఏళ్లుగా ఉపయోగిస్తున్న బొటులినమ్ టాక్సిన్ టైప్ 'ఏ' (బొటాక్స్)ను పోలిన సరికొత్త న్యూరోటాక్సిన్‌ను ఆవు పేగుల్లో శాస్త్రవేత్తలు కనుగొన్నారు. అందానికి మెరుగులద్దడంతో పాటు తీవ్రమైన తలనొప్పి, మూత్రాశయంలో లీకులు, విపరీతంగా చెమట పట్టడం, గుండెజబ్బుల్లో బొటాక్స్‌ను వినియోగిస్తున్న సంగతి తెలిసిందే. క్లోస్ట్రీడియం బొటులినమ్ టాక్సిన్ అనే విషమే ఎంటరోకోకస్ ఫేసియం అనే బ్యాక్టీరియంగా మారడాన్ని శాస్త్రవేత్తలు గమనించారు. సాధారణంగా భూమిలోను, నీటిలోను జీవించే క్లోస్ట్రీడియం బొటులినమ్, దాని జాతి బ్యాక్టీరియా ఓ జీవి కడుపులో ఉంటుందని మొదటిసారిగా తెలిసిందని వాటర్లూ విశ్వవిద్యాలయం ప్రొఫెసరు ఆండ్రూ డోక్సీ తెలిపారు. ప్రొటీన్ అనువర్తనాలతో పాటు అనేక వ్యాధికారకాల గురించి తెలుసుకోవడానికి ఈ సమాచారం ఉపయోగపడనుందన్నారు. ఆవు పేడ నుంచి సేకరించిన ఇ.ఫేసియం బ్యాక్టీరియాకు సంబంధించిన జన్యుక్రమాన్ని విజయవంతంగా అమర్చగలిగామన్నారు. పరిశోధన వివరాలు 'సెల్ హోస్ట్ అండ్ మైక్రోబ్'లో ప్రచురితమయ్యాయి.

ఆకుకూరలతో అధిక ఒత్తిడి, పక్షవాతానికి చెక్



వాషింగ్టన్: అధిక ఒత్తిడి తగ్గించుకోవాలన్నా, పక్షవాతం బారిన పడకుండా ఉండాలన్నా ఆకుపచ్చని ఆకుకూరలు తినాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. కార్యాలయాల్లో పని ఒత్తిడి కారణంగా నైజీరియా, ఘనా దేశాల్లోని మెజార్టీ ఉద్యోగుల మెదడులో రక్తస్రావం కావడం, అధిక రక్తపోటు వల్ల 90 శాతం మంది పక్షవాతానికి గురవ్వడాన్ని పరిశోధకులు గమనించారు. మెదడులో రక్తస్రావం అవుతున్న, సగటున 53.7 ఏళ్ల వయస్సున్న 682 మందిపై అధ్యయనం చేశారు. ఆకుపచ్చని ఆకుకూరలు అధికంగా తినేవారిలో పక్షవాతం వచ్చే ప్రమాదం 64 శాతం తగ్గిందని నిర్ధారణ అయింది. 93.9 శాతం మందికి అధిక రక్తపోటు కారణంగా మెదడులో రక్తస్రావమై పక్షవాతం వచ్చిందని గమనించారు. మధుమేహంతో బాధపడుతున్నవారికి 2.33 రెట్లు; ఇంట్లో, కార్యాలయాల్లోనూ ఒత్తిడికి గురయ్యేవారు 2.22 రెట్లు, అధికంగా కొవ్వు ఉన్నవారు 1.69 రెట్లు, పొగ తాగేవారిలో ఏకంగా 10.1 రెట్లు పక్షవాతం బారిన పడే ప్రమాదం ఉందని తేల్చారు.



ఆలకించండి మా ఆకాంక్షలు



పసిడి

కస్టమ్స్ తగ్గితే పారదర్శకత

పసిడి రంగంలో పారదర్శకత రావాలంటే, అంతర్జాతీయ విపణికి అనుగుణంగా దేశీయ ధరలు ఉండాలని పరిశ్రమ నిపుణులు పేర్కొంటున్నారు. దేశంలోకి దిగుమతి అవుతున్న బంగారంపై కస్టమ్స్ సుంకం 10 శాతంతో పాటు వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) 3 శాతం.. మొత్తం 13 శాతం పన్ను అమలవుతోంది. కస్టమ్స్ సుంకాన్ని నివారించేందుకు దొంగచాటుగా (స్మగ్లింగ్) తీసుకువచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. వారికి కిలోకు రూ.3 లక్షల వరకు మిగులుతోంది. ఇక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కలిగిన దేశాల నుంచి దిగుమతి చేసుకున్న పసిడిపై కస్టమ్స్ విధించడం లేదు. ఇలా దిగుమతి చేసుకున్నవారు, 3 శాతం జీఎస్‌టీ మాత్రమే చెల్లించి, విక్రయాలు జరిపినవారున్నారు. ఈ రంగంలో పారదర్శకత తెచ్చేందుకు కస్టమ్స్ సుంకాన్ని తగ్గించాలని వర్తకుల సంఘాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాయి.



వృథా నిల్వలు 25000 టన్నులు

- ✦ పసిడి దిగుమతులు 2016-17లో 500 టన్నులు
- ✦ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 700 టన్నులకు చేరుతుందని అంచనా.
- ✦ దేశంలో వృథాగా ఉన్న నిల్వలు ..25,000 టన్నులని అంచనా.

4 శాతమైతే ఇబ్బందులు తొలగుతాయ్

- కస్టమ్స్ సుంకాన్ని 4 శాతం చేస్తే కనుక, అంతర్జాతీయ ధరలకు దగ్గరగానే దేశీయంగా లభిస్తుంది. ఫలితంగా దొంగచాటుగా తెచ్చేవారికి ప్రయోజనం ఉండదు. ఇందువల్ల అధికారిక విక్రయాలు పెరిగి, పన్ను రూపేణ ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుంది. నల్లధనం చెలామణి కూడా నివారించవచ్చు.
- ప్రభుత్వానికి ఆదాయం తగ్గుతుందని భావిస్తే, కస్టమ్స్ సుంకం తగ్గించి, జీఎస్‌టీ పెంచాలనే సూచనా బులియన్ వర్గాల నుంచి వస్తోంది. ఇందువల్ల ఏ రూపంలో దేశంలోకి ప్రవేశించినా, పన్ను ఆదాయం ప్రభుత్వానికి తగ్గదు.
- నగదుతో కొనుగోళ్లను కనీసం రూ.లక్ష వరకు అనుమతించాలి. లేదా పారదర్శకత తేవాలంటే, పూర్తిగా పరిహరించాలనే డిమాండ్లు వస్తున్నాయి.
- వృథాగా నిల్వ ఉన్న బంగారాన్ని చెలామణిలోకి తెచ్చేందుకు, ప్రోత్సాహాలు పెంచాలి. ఆభరణాలను తాకట్టు పెట్టి, అవసరాలు తీరాక విడిపించుకోడానికి ఎక్కువమంది ఇష్టపడుతున్నారు కానీ, బ్యాంకులకు అప్పగించి, స్వల్ప వడ్డీ, గడువుతీరాక నగదు తీసుకునేందుకు సుముఖంగా లేరని ఒక నివేదిక తేల్చింది. అందువల్లే పసిడి నగదీకరణ పథకం పెద్దగా విజయవంతం కాలేదు. దీనిపై దృష్టి సారిస్తే, ఏటా దిగుమతుల కోసం భారీఎత్తున విదేశీ మారక ద్రవ్యం వినియోగించడం తగ్గుతుంది.

ఈనాడు బిజినెస్

ఔషధ

పరిశోధనకు ప్రోత్సాహకాలు

కొద్ది కాలంగా విదేశీ ప్రాధికార సంస్థల తనిఖీలు, అమెరికా విపణిలో ధరల క్షీణత.. దేశీయ విపణిలో ధరల నియంత్రణతో సతమతమవుతున్న దేశీయ ఔషధ పరిశ్రమ బడ్జెట్‌లో ప్రోత్సాహకాల కోసం ఎదురు చూస్తోంది. పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలకు, నష్ట భయం (రిస్క్) అధికంగా ఉండే కొత్త ఔషధం అభివృద్ధిలో పెట్టుబడులు ఆకర్షించడానికి పన్ను మినహాయింపులు కోరుకుంటోంది. 'ఫార్మా విజన్ 2020' భాగంగా కొత్త ఔషధాల అభివృద్ధికి నిధులు సమకూర్చడం, మౌలిక సదుపాయాలు కల్పించడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఆశిస్తోంది. ప్రైవేటు కంపెనీలు చేపట్టే పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలకు గ్రాంట్ రూపంలో నిధులు, పన్ను ప్రోత్సాహకాలు ఇవ్వాలని ఆశిస్తున్నారు.

పరిశ్రమ ఏం ఆశిస్తుందంటే..

- ఆరోగ్య సంరక్షణపై ప్రస్తుతం జీడీపీలో ఒక శాతం వ్యయం చేస్తున్నారు. ఉంది. దీన్ని 2.5 శాతం వరకు పెంచొచ్చని ఔషధ పరిశ్రమ భావిస్తోంది. ఆరోగ్య సంరక్షణపై ప్రభుత్వ వ్యయం పెరిగితే.. అది ఔషధ పరిశ్రమకు సానుకూలంగా పరిణమిస్తుంది.
- జనరిక్స్ ఔషధాలను మరింతగా అందుబాటులోకి తెచ్చేందుకు. జన్ ఔషధీ విక్రయ కేంద్రాలకు నిధుల కేటాయింపును పెంచొచ్చు.
- అమెరికా, ఐరోపా విపణులకూ తగినట్లు జనరిక్ ఔషధాల నాణ్యత పెంచడానికి, స్పెషాలిటీ ఔషధాల ఉత్పత్తుల వైపు కంపెనీలు మొగ్గు చూపడానికి వీలుగా పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలు, కేంద్రాలు విస్తరించడానికి ప్రోత్సాహకాలు ప్రకటించే వీలుంది.
- సెజ్‌లపై విధిస్తున్న కనీస ప్రత్యామ్నాయ పన్ను (మ్యాట్)ను సమీక్షించవచ్చు.
- ఔషధ కంపెనీలు పరిశోధన, అభివృద్ధిపై చేసే వ్యయంపై ఇచ్చే వెయిటెడ్ ట్యాక్స్ డిడక్షన్‌ను గత బడ్జెట్‌లో 200 శాతం నుంచి 150 శాతానికి తగ్గించారు. 2020-21 నుంచి దీన్ని 100 శాతానికి తగ్గించాలని ప్రతిపాదించారు. దీన్ని మళ్లీ 200 శాతానికి పెంచాలని ఔషధ పరిశ్రమ కోరుతోంది. కాంట్రాక్టు పరిశోధన సంస్థలు చేపట్టే క్లినికల్ పరీక్షల నుంచి అన్ని విధాలుగా చేపట్టే పరిశోధన కార్యకలాపాలకు ఈ శాతం వర్తింపచేయాలని పరిశ్రమ ప్రతినిధులు సూచిస్తున్నారు.
- ఔషధాల తయారీని ప్రోత్సహించడానికి ముడి ఔషధాలు, ఔషధాలు, బయోటెక్ ఔషధాల తయారీ యూనిట్ల లైసెన్సు నిబంధనలను సరళం చేయాలని పరిశ్రమ కోరుకుంటోంది. ముడి ఔషధాలకు చైనా, ఇతర దేశాలపై ఆధారపడడాన్ని తగ్గించుకోవడానికి ప్రత్యామ్నాయ ముడి ఔషధాల తయారీని ప్రోత్సహించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని భావిస్తోంది.

అగ్రగామి 6 దేశాల్లో భారత్

- ✦ ప్రపంచంలోని 20 అతి పెద్ద జనరిక్ ఔషధాల ఉత్పత్తి కంపెనీల్లో 6 భారత్‌లోనే ఉన్నాయి.
- ✦ ఏటా భారత ఔషధ పరిశ్రమ రూ.లక్ష కోట్లకు పైగా విలువైన ఔషధాలను ఎగుమతి చేస్తోంది.
- ✦ 50 శాతానికి పైగా ఎగుమతులు నిబంధనలు చాలా కఠినంగా ఉండే దేశాలకే వెళ్తున్నాయి.
- ✦ దేశంలో దాదాపు 3,000 ఔషధ కంపెనీలు ఉన్నాయి.
- ✦ అమెరికా కంటే దేశంలో ఔషధాల తయారీ వ్యయం 35-40 శాతం తక్కువగా ఉంటుంది.



పర్యాటకం

మౌలిక హోదా కల్పించాలి

భారత్‌లో వేగంగా వృద్ధి చెందుతున్న రంగాల్లో పర్యాటక, ఆతిథ్య రంగాలు కీలకం. వచ్చే అయిదు నుంచి ఏడేళ్లలో పర్యాటకులు 100 శాతం మేర వృద్ధి చెందొచ్చని అంచనాలు ఉన్నాయి. అయితే అధిక పన్నులతో పరిశ్రమ ఒడుదొడుకులు ఎదుర్కొంటుంది. కొత్తగా అమల్లోకి వచ్చిన వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) విధానంతో పన్నులు.. విదేశీ విపణులతో పోలిస్తే మూడు రెట్లు అధికంగా వసూలు చేస్తున్నట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. 2018-19 సాధారణ బడ్జెట్‌పై ఈ రంగం చాలా ఆశలే పెట్టుకుంది.




- పర్యాటక, ఆతిథ్య రంగానికి మౌలిక రంగ హోదా కల్పించాలి. తద్వారా హోటళ్లు సులభంగా రుణాలు పొందడంతో పాటు వ్యయాలు తగ్గుతాయి.
- పర్యాటక సేవల ద్వారా ఆర్జిస్తున్న విదేశీ మారక ఆదాయాన్ని ఎగుమతులుగా పరిగణించాలి. వీటికి సున్నా లేదా 5 శాతం పన్ను ఉండాలి.
- హోటల్ గదులకు జీఎస్‌టీ కింద విధిస్తున్న నిర్దేశిత పన్నుల స్థానంలో వాస్తవిక ఛార్జీ విధింపు విధానాన్ని తీసుకురావాలి.
- జీఎస్‌టీ రేట్లను హేతుబద్ధీకరించడంతో పాటు రెస్టారెంట్ల పరిశ్రమలకు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ ప్రయోజనాలను తిరిగి మదింపు చేయాల్సిన అవసరం ఉంది. హోటళ్లకు ఐజీఎస్‌టీ అమలు చేయాలి.
- భారత్‌లో చిన్న, మధ్య తరహా పర్యాటక వ్యాపారవేత్తల కోసం ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలి. ముద్రా కింద రుణాలు ఇవ్వాలి.
- విమానయాన రంగంలో ఎఫ్‌డీఐ పరిమితి పెంచినట్లుగానే.. పర్యాటకుల సంఖ్య పెంచేందుకు వీసా విధాన సులభతరం, మౌలిక సదుపాయాల కల్పన వంటి చర్యలు ప్రకటించాలి.

జీడీపీలో 10 శాతం వాటా

- ✦ జీడీపీలో పర్యాటక రంగ వాటా 10 శాతం. దేశంలో విదేశీ మారకం ఆర్జిస్తున్న వాటిలో ఈ రంగానిది మూడో స్థానం.
- ✦ 2016లో పర్యాటక, ఆతిథ్య రంగం ద్వారా జీడీపీకి 71.53 బిలియన్ డాలర్ల ఆదాయం సమకూరింది. 2027కు ఇది 147.96 బిలియన్ డాలర్లకు పెరగొచ్చు.
- ✦ 2016లో భారత్‌కు వచ్చిన విదేశీ పర్యాటకుల సంఖ్య 88 లక్షలు. ఇందులో బ్రిటన్, అమెరికా, బంగ్లాదేశ్ పర్యాటకులు మొదటి స్థానాల్లో ఉన్నారు.

36300 మించితేనే పైకి!



సమీక్ష : అంతర్జాతీయ మార్కెట్ల రాణింపు ప్రభావంతో గత వారం మన మార్కెట్ లాభాలతో ముగిసింది. విదేశీ సంస్థాగత మదుపర్ల (ఎఫ్ఐఐల) కొనుగోళ్లు కొనసాగడం ఇందుకు తోడ్పడింది. దేశీయ, అంతర్జాతీయ సానుకూలతల నేపథ్యంలో వారాన్ని మార్కెట్ ఉత్సాహంగానే ప్రారంభించింది. స్టాక్ మార్కెట్లలో ఉద్యోగ భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) పెట్టుబడుల పరిమితిని 15 శాతం నుంచి 25 శాతానికి పెంచాలనుకోవడం మార్కెట్ సెంటిమెంటు బలపడటానికి తోడ్పడింది. కంపెనీల త్రైమాసిక ఫలితాల ప్రభావం ఆయా రంగాల షేర్లపై కనిపించింది. వివిధ రంగాల్లో ఎఫ్‌డీఐ నిబంధనల సరళీకరణను ప్రభుత్వం నోటిఫై చేయడం, ప్రభుత్వ రంగ బ్యాంకులకు మూలధన పునర్వ్యవస్థీకరణ లాంటి అంశాలు మార్కెట్‌ను మరింత ముందుకు నడిపించాయి. దీంతో వారం మొత్తం మీద సెన్సెక్స్ 539 పాయింట్లు (1.52%) పెరిగి 36050 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 175 పాయింట్ల (1.61%) లాభంతో 11069 వద్ద స్థిరపడింది. దేశీయ సంస్థాగత మదుపర్లు (డీఐఐలు) నికరంగా రూ.1,453 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. ఎఫ్ఐఐల నికర కొనుగోళ్లు రూ.4,511 కోట్లుగా నమోదయ్యాయి.

లాభపడిన, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 3:4గా నమోదుకావడం.. మధ్య, చిన్న తరహా షేర్లలో లాభాల స్వీకరణను సూచిస్తోంది.

ఈవారంపై అంచనా } సెన్సెక్స్ 36300 స్థాయిని మించితే మరింత పైకి వెళ్లే అవకాశం ఉంటుంది. అదే 35800 దిగువకు వస్తే సమీపకాలంలో దిద్దుబాటుకు లోనుకావచ్చు.

ప్రభావిత అంశాలు } ఫిబ్రవరి 1న పార్లమెంటులో ప్రవేశపెట్టే వార్షిక బడ్జెట్ ఈవారమే కాకుండా రానున్న రోజుల్లోనూ మార్కెట్‌కు దిశానిర్దేశం చేయనుంది. ఈవారం ఐసీఐసీఐ బ్యాంక్, ఎల్అండ్‌టీ, టెక్ మహీంద్రా, హిందాల్కో, గోద్రేజ్ కన్జ్యూమర్ లాంటి దిగ్గజాలు త్రైమాసిక ఫలితాలు ప్రకటించనున్నాయి. ఈ ఫలితాల ప్రభావం ఆయా షేర్లపై ఉంటుంది. జనవరి 31, ఫిబ్రవరి 1 తేదీల్లో జరిగే అమెరికా ఫెడ్ సమావేశాన్ని మార్కెట్ వర్గాలు గమనిస్తాయి. ఈసారి వడ్డీ రేటును ఫెడ్ పావు శాతం పెంచొచ్చని భావిస్తున్నారు. చమురు ధరలు, ఎఫ్ఐఐలు, డీఐఐల పెట్టుబడులు, రూపాయి కదలికలు కూడా మార్కెట్‌పై ప్రభావం చూపుతాయి.


తక్షణ మద్దతు సాయిలు: 35823, 35507, 35118; **తక్షణ నిరోధం సాయిలు:** 36300, 36620, 36950
సెన్సెక్స్ 36300ను అధిగమిస్తేనే ముున్ముందు కూడా జోరు కొనసాగుతుందని భావించవచ్చు.

– సతీశ్ కంతేటి, జెన్ మనీ

బడ్జెట్ విన్నపాలు

కాలావధి డిపాజిట్లపై వయో వృద్ధులకు అధికవడ్డీ చెల్లించాలని, 80 ఏళ్లు పైబడిన వారికి పన్ను మినహాయింపు పరిమితి పెంచాలని, వృత్తి పన్నును ఆదాయం నుంచి ఎలా తీసేస్తున్నారో.. జీఎస్టీ (వస్తు సేవల పన్ను)ని కూడా తొలగించాలని ఎక్కువమంది పాఠకులు కోరుకుంటున్నారు. కొందరి సూచనలు ఇవీ..

1. వయోవృద్ధులకు ఆదాయపు పన్ను పరిమితిని ప్రస్తుతం ఉన్న రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలి. 80 ఏళ్లు పైబడిన వారికి ఈ మొత్తాన్ని రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంచాలి
– అలాజ్‌పూర్ లక్ష్మినారాయణ, సిద్ధిపేట, గుండాల రామకృష్ణయ్య, చిత్తూరు,
2. వయోవృద్ధులకు కాలావధి డిపాజిట్లపై ఇస్తున్న వడ్డీ రేటును కనీసం పది శాతానికి పెంచాలి.
– అందలం సత్యనారాయణ, కడప
3. సెక్షన్ 80సీ కింద జీవిత బీమా మొత్తం పరిమితి కనీసం రూ.50 వేలు ఉండేలా నిబంధన తీసుకురావాలి
– రాజు కటికెరెడ్డి
4. మారిన అద్దెలకు అనుగుణంగా ఇంటి అద్దె భత్యం నిబంధనల్లో మార్పు చేయాలి.
– కె.గోపాలకృష్ణయ్య, పుత్తూరు
5. అంకుర సంస్థలకు మరిన్ని ప్రోత్సాహకాలివ్వాలి. షేర్లపై స్వల్పకాలిక లాభాలపై పన్నును 10 శాతానికి తగ్గించాలి.
– పి.ప్రేమ్‌సాగర్, సీఏ విద్యార్థి, కాకినాడ
6. జాతీయ ఉపాధి హామీ పథకం మరిన్ని ప్రాంతాలకు విస్తరించి పని దినాలు పెంచాలి. అసంఘటిత రంగంలో ఉన్న వారందరికీ ఈఎస్ఐ సదుపాయం కల్పించాలి.
– ఎ.గణపతిరావు, శ్రీకాకుళం



బడ్జెట్ నుంచి ఏమి ఆశిస్తున్నారో మీ ఫొటోతో సహా మాకు పంపండి
businessdesk@eenadu.net, eenadubusinessdesk@gmail.com
(పాఠకుల మరిన్ని వినతులు www.eenadu.net బడ్జెట్-2018 స్పెషల్ విభాగంలో)

అంకుర పెట్టుబడుల్లో ఒకటే పన్ను

ఐటీ రంగం ఆకాంక్ష



అంకుర సంస్థల్లో పెట్టుబడులకు సంబంధించి దేశ-విదేశీ పెట్టుబడిదార్లకు ఒకే పన్నురేటు విధించాలని నాస్‌కామ్ (నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ కంపెనీస్) కోరుతోంది. ప్రస్తుతం నమోదు కాని సంస్థల్లో వాటాలు విక్రయించినపుడు దేశీయ పెట్టుబడిదార్లకు 20 శాతం, విదేశీ పెట్టుబడిదార్లకు 10 శాతం పన్నురేటు అమలవుతోంది. ప్రభుత్వం డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వైపు అడుగులు వేస్తున్న తరుణంలో సాధారణ సేవల కంటే డిజిటల్ సేవలపై అధిక పన్ను విధించరాదని నాస్‌కామ్ అధ్యక్షుడు ఆర్.చంద్రశేఖర్ కోరారు. 100 బిలియన్ డాలర్ల (సుమారు రూ.6.50 లక్షల కోట్ల) ఎగుమతుల స్థాయికి పెరిగిన ఈ పరిశ్రమ దేశీయంగా 39 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తున్న తరుణంలో, మరింత దూసుకెళ్లేందుకు ప్రభుత్వం సహకరించాలని కోరారు.

- ✦ విదేశీ పన్ను క్రెడిట్ నిబంధనలకు సంబంధించి, ఒక్కో దేశం నుంచి వచ్చిన ఆదాయం, చెల్లించిన పన్నుకు బదులుగా, అంతర్జాతీయంగా ఎగుమతులపై లభించే ఆదాయం, వాటిపై చెల్లించిన మొత్తం పన్నును పరిగణనలోకి తీసుకోవాలి.
- ✦ అంకుర సంస్థలకు కనీస ప్రత్యామ్నాయ పన్నునుంచి మినహాయింపు ఇవ్వాలి.
- ✦ ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకునే సేవలకు సాధారణ పద్ధతి కంటే అధిక వసూళ్లు ఉండకూడదు.

ఈవారం బోర్డు సమావేశాలు

నేడు (29న): హెచ్‌డీఎఫ్‌సీ, టెక్ మహీంద్రా, సెంచురీ టెక్స్‌టైల్స్, ఇమామీ, వోకార్డ్, లారస్ ల్యాబ్స్, మహీంద్రా లాజిస్టిక్స్, నవ భారత్ వెంచర్స్, నొవార్టిస్ ఇండియా, సన్ ఫార్మా అడ్వాన్స్‌డ్ రీసెర్చ్

రేపు (30న): ఐటీసీ, గోద్రేజ్ కన్జ్యూమర్ ప్రోడక్ట్స్, టీవీఎస్, రిలయన్స్ పవర్, సువెన్ లైఫ్ సైన్సెస్, ఎస్‌బీఐ లైఫ్, బీఈఎల్, భారత్ ఫైనాన్షియల్, అశోకా బిల్డ్‌కాన్, పిరమాల్ ఎంటర్‌ప్రైజెస్, ఇంజినీర్స్ ఇండియా, జీఐసీ హౌసింగ్ ఫైనాన్స్, లక్ష్మీ విలాస్ బ్యాంక్, మహీంద్రా లైఫ్‌స్పేస్ డెవలపర్స్, ఓబీసీ, ప్రతాప్ స్నాక్స్, గుజరాత్ పిపావవ్ పోర్ట్, గ్రాఫైట్


31న (బుధ): ఐసీఐసీఐ బ్యాంక్, కోరమండల్ ఇంటర్నేషనల్, వేదాంతా, డాబర్ ఇండియా, ఎన్‌టీపీసీ, అరవింద్, ఐడీబీఐ బ్యాంక్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, రిలయన్స్ ఇన్‌ఫ్రా, మహీంద్రా హాలిడేస్, అలెంబిక్ ఫార్మా, కరూర్ వైశ్యా బ్యాంక్, ఎస్కార్ట్స్, ఎక్సైడ్ ఇండస్ట్రీస్, హిందుస్థాన్ కన్‌స్ట్రక్షన్, హెచ్‌ఈజీ, హిందుస్థాన్ కాపర్, ఐఐఎఫ్ఎల్ హోల్డింగ్స్, జమ్మూ అండ్ కశ్మీర్ బ్యాంక్, నేషనల్ ఫెర్టిలైజర్స్, నోసిల్, ఫిలిప్స్ కార్బన్ బ్లాక్, షాపర్స్ స్టాప్, తంగమాయిల్ జువెలరీ, విమ్టా ల్యాబ్స్, వీఆర్ఎల్ లాజిస్టిక్స్

1న (గురు): సీసీఎల్ ప్రోడక్ట్స్, అశోక్ లేల్యాండ్, టైటాన్, బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, సియెట్, ఎంఆర్ఎఫ్, సెరా శానిటరీవేర్, కమిన్స్ ఇండియా, ఆక్జో నోబెల్ ఇండియా, ఎస్సెల్ ప్రోప్యాక్, మ్యాగ్మా ఫిన్‌కార్ప్, రాయల్ ఆర్చిడ్ హోటల్స్

2న (శుక్ర): ఆదిత్య బిర్లా ఫ్యాషన్, బజాజ్ ఆటో, హిందాల్కో ఇండస్ట్రీస్, యునైటెడ్ బ్రూవరీస్, బజాజ్ హోల్డింగ్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్, తాజ్ జీవీకే, టాటా గ్లోబల్ బేవరేజెస్, టాటా మెటాలిక్స్, ఫ్యూచర్ లైఫ్‌స్టైల్ ఫ్యాషన్స్, గ్లాక్సో స్మిత్‌క్లైన్ ఫార్మాస్యూటికల్స్, గోద్రేజ్ ప్రోపర్టీస్, బేయర్ క్రాప్ సైన్స్, సీఎల్ ఎడ్యుకేట్, మంగళూర్ రిఫైనరీ, ఇన్ఫో ఎడ్జ్, న్యూలాండ్ లేబొరేటరీస్, ఆర్‌పీజీ లైఫ్ సైన్సెస్, సద్భావ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, థామస్ కుక్, వర్ల్‌పూల్

3న (శని): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆర్తి ఇండస్ట్రీస్, జేకే సిమెంట్, ఉమ్యాక్స్ ఇండస్ట్రీస్, రిలాక్సో ఫుట్‌వేర్స్

కోడిగుడ్లు



28వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	380
చిల్లరగా (ఒక గుడ్డు)	4.40
బెంగళూరు	380
29వ తేదీకి	
విజయవాడ/గోదావరి	380
వరంగల్	382
విశాఖపట్నం	402
చెన్నై	390
చిత్తూరు	383
నమక్కల్	375

సిరి
కరీంనగర్
సోమవారం జనవరి 29, 2018
siri@eenadu.net

మీ పెట్టుబడులకు నామినీ ఉన్నారా?

పెట్టుబడి పెట్టడమే కాదు.. అవి మన తర్వాత చేరాల్సిన వారికి చేరేలా ఏర్పాటు చేయడమూ మన బాధ్యతే. అందుకు ఉపయోగపడేవే నామినేషన్.. వీలునామా.. మరి, ఈ విషయంలో మీరు తగిన జాగ్రత్తలు తీసుకున్నారా?

బ్యాంకు పొదుపు ఖాతా, డీ మ్యాట్, మ్యూచువల్ ఫండ్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బీమా పాలసీలు.. పెట్టుబడులు ఏవైనా.. వాటికి మరో వ్యక్తి పేరును నామినీగా పేర్కొనడం తప్పనిసరి. ఒక వ్యక్తి తన వివాహానికి ముందు పెట్టుబడులు ప్రారంభిస్తే.. సాధారణంగా అతని/ఆమె తల్లిదండ్రుల పేరుమీద నామనిర్దేశనం చేస్తుంటారు. వివాహం తర్వాత ఆ నామినేషన్‌ను మార్చాలనే సంగతి మర్చిపోతుంటారు. నామినేషన్ ఉన్న వ్యక్తి మరణించవచ్చు. ఇలాంటప్పుడు ఆయా ఖాతాల్లో వారి పేరు కొనసాగడం వల్ల ఇబ్బందే. ఇలాంటి సందర్భాల్లో ఆయా ఖాతాలున్న వ్యక్తికి ఏదైనా జరిగితే అందులో ఉన్న పెట్టుబడి మొత్తాలను వెనక్కి తీసుకోవడం చాలా కష్టంగా మారుతుంది. న్యాయస్థానాలను ఆశ్రయించి, వారసత్వ ధ్రువీకరణలు తీసుకోవాల్సి ఉంటుంది. అందుకే, ప్రతి ఒక్కరూ.. కేవలం పెట్టుబడులు పెట్టడమే కాదు.. వాటికి సరైన నామనిర్దేశనం చేయడం కూడా ముఖ్యమేనని మర్చిపోకూడదు.



సాయి కృష్ణ పత్రి
సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

ఒక వ్యక్తి తన తదనంతరం ఆయా పెట్టుబడులు ఎవరికి చెందాలో ముందే నిర్దేశించవచ్చు. దీనినే నామనిర్దేశనం (నామినేషన్ చేయడం, నామినీని నియమించడం) అంటారు. అతను ఈ లోకం నుంచి దూరమయ్యాక నామినీగా పేర్కొన్న వ్యక్తి కొన్ని నిబంధనలను పూర్తి చేయడం ద్వారా ఆయా పెట్టుబడి ఖాతాలో ఉన్న డబ్బును సులభంగా తన పేరుమీదకు తీసుకోవచ్చు. అయితే, నామినీగా పేర్కొన్న వ్యక్తి ఆ డబ్బుకు సంరక్షకుడు మాత్రమే. నిజమైన వారసులకు మాత్రమే ఆ డబ్బు చెందుతుంది.

ఉదాహరణకు.. ఒక వ్యక్తి కొంత డబ్బును ఒక పెట్టుబడి పథకంలో పెట్టాడనుకుందాం. దీనికి నామినీని కూడా పేర్కొన్నాడు. కొన్నాళ్ల తర్వాత ఆ వ్యక్తి మరణించారు. ఇలాంటప్పుడు ఆ పెట్టుబడి పథకంలో ఉన్న డబ్బును నామినీకి ఇస్తారు. అయితే, ఇదంతా సాధారణ ప్రక్రియలాగే కనిపిస్తుంది. ఒకవేళ ఎవరైనా వచ్చి, ఆ చనిపోయిన వ్యక్తికి చట్టబద్ధమైన వారసులమని వస్తే.. నామినీగా పేర్కొన్న వ్యక్తి ఆ డబ్బును వారికే అందించాలి. ఇలాంటప్పుడు ఏదైనా వివాదం ఏర్పడితే.. న్యాయస్థానానికి వెళ్లాల్సి ఉంటుంది. అక్కడ న్యాయస్థానం ఇచ్చిన తీర్పును బట్టి, ఆ డబ్బు ఎవరికి చెందాలన్నది నిర్ణయం అవుతుంది.

మరి, ఇలాంటప్పుడు నామినీ ఎందుకు అనే సందేహం రావచ్చు! ఇక్కడ నామినీ చట్టబద్ధమైన వారసుడు కానక్కర్లేదు. కానీ, చట్టబద్ధమైన వారసులకు మించి ఇతనికి ప్రత్యేక అధికారాలు ఉండవు.

సాంకేతికంగా చెప్పాలంటే.. నామినీ ఒక పెట్టుబడిదారుడి డబ్బుకు సంరక్షకుడు లేదా దానికి ఒక రక్షణ మాత్రమే. అంటే, అసలైన పెట్టుబడిదారుడు, అతని చట్టబద్ధమైన వారసులకు నామినీ ఒక అనుసంధానకర్త. అర్హులైన వారికి ఆ పెట్టుబడి మొత్తం చేరేలా చూడాల్సిన బాధ్యత అతనిపైన పెడుతున్నట్లు. కొన్నిసార్లు అసలైన వారసులే నామినీగా కూడా ఉంటారు. ఇలాంటప్పుడు కొత్త ఇబ్బందులేవీ రాకపోయినా.. ముందే చెప్పినట్లు.. నామినీగా అతని బాధ్యతలు, హక్కులు మాత్రం పరిమితమే. మిగిలిన వారసులు ఉంటే వారికి ఆ డబ్బును పంచాల్సిన అవసరం ఉంటుంది.

తదనంతరం ఎవరికి చెందాలి?

ఒక వ్యక్తి తన తదనంతరం అతనికి చెందిన ఆస్తులు ఎవరికి చెందాలో ఎలా నిర్ణయించాలి... దీని కోసం ఉన్న తేలికైన మార్గం 'విల్లు' రాయడమే. విల్లు రాయడం అంటే.. అదో పెద్ద తలనొప్పి వ్యవహారమని, దానికన్నా నామినీని పేర్కొనడం సులభం అని కొంతమంది భావిస్తుంటారు. నామినీని పేర్కొనడం ద్వారా ఆ డబ్బు ఎవరికి వెళ్లాలో తెలుస్తుంది. కానీ, ఇదే అంతిమం కాదు. ఇది విల్లుకు ప్రత్యామ్నాయం కాదని గుర్తుంచుకోవాలి. కొన్నిసార్లు నామినీ పేరు, విల్లులో పేర్కొన్న పేరు ఒకటే ఉండొచ్చు. ఇలాంటప్పుడు మరింత స్పష్టత ఉంటుంది. కానీ, అన్ని సందర్భాల్లోనూ ఇలాగే ఉంటుందని భావించలేం. ఒకవేళ నామినీకి మాత్రమే ఆ పెట్టుబడులకు సంబంధించిన పూర్తి మొత్తం చెందాలని భావిస్తే.. ఆ విషయాన్ని విల్లులో పేర్కొనడం మర్చిపోవద్దు.

వారసులంటే...

ఒక వ్యక్తి తన ఆస్తులు, పెట్టుబడులు ఎవరెవరికి చెందాలో స్పష్టంగా విల్లు రాసి పెట్టాడనుకుందాం. వారిని చట్టబద్ధవారసులుగా పరిగణించే అవకాశం ఉంటుంది.

అయితే, ఇక్కడ విల్లు రాసి పెట్టలేదనుకోండి.. ఇలాంటప్పుడు వారసులను అమల్లో ఉన్న చట్టాల ద్వారా, చట్టపరంగా నిర్ణయిస్తారు. ప్రస్తుతం భారతీయ వారసత్వ చట్టం 1925; హిందూ వారసత్వ చట్టం 1956; షరియా చట్టం 1937 ప్రకారం ఈ వారసత్వ ధ్రువీకరణ జరుగుతుంది.

రాయకపోతే ఏమవుతుంది?

వీలునామా, నామినేషన్ ఉన్నప్పుడు ఏ ఇబ్బందీ లేదు.. సరే.. మరి, ఈ రెండూ లేనప్పుడు పరిస్థితి ఏమిటి? పెట్టుబడులు పెట్టిన వ్యక్తి మరణించిన సందర్భంలో ఆయా పథకాల్లో నుంచి డబ్బును తీసుకోవడం ఎలా?

ఇలాంటప్పుడు రెండు సందర్భాలు ఎదురవుతాయి. మొదటిది.. బ్యాంకు/పెట్టుబడి సంస్థ ఆయా ఖాతాదారులతో సంబంధం ఉన్నవారిని సంప్రదించేందుకు ప్రయత్నిస్తుంది. ఇలాంటప్పుడు ఎవరైనా సమాధానం ఇస్తే.. వారిని అవసరమైన ధ్రువీకరణలు తీసుకురావాల్సిందిగా సూచిస్తుంది. ఆ తర్వాత ఆయా నిధులను వారికి అందిస్తుంది. రెండో సందర్భంలో.. ఎవరూ బ్యాంకుకు అందుబాటులోకి రాలేదనుకుందాం.. సంస్థ ఆయా ఖాతాలో ఉన్న డబ్బును తిరిగి పెట్టుబడి పెట్టడమో.. లేదా ప్రత్యేక ఖాతాలో జమ చేసి, ఎవరైనా వచ్చి, అడిగే వరకూ వేచి చూస్తుంది.

సంస్థల బాధ్యత ఎంత?

ఒక పెట్టుబడి పథకానికి నామినీ పేరు ఉందనుకుందాం.. అప్పుడు బ్యాంకులు/పెట్టుబడి సంస్థల బాధ్యత ఏమిటంటే.. ఆ నామినీకి అందులో ఉన్న డబ్బు అందేలా చూడటం వరకే. ఒకసారి నామినీకి ఆ డబ్బును స్వాధీనం చేసిన తర్వాత, బ్యాంకుకు/ పెట్టుబడి సంస్థలకూ ఏ సంబంధం ఉండదు. చట్టబద్ధమైన వారసులకు ఆ సొమ్మును పంచాల్సిన బాధ్యత నామినీపైనే ఉంటుంది.

షేర్ల విషయంలో..

ప్రతి నిబంధనకూ కొన్ని మినహాయింపులు ఉంటాయి. ఇక్కడ కూడా ఈ విషయంలో కొన్ని మినహాయింపులు మనకు కనిపిస్తాయి. నిబంధనల ప్రకారం.. వారసత్వంగా వచ్చిన సంపదను వారసులు మాత్రమే అందుకుంటారు. నామినీగా పేర్కొన్న వ్యక్తులు కాదు. అయితే, షేర్ల విషయంలో ఇది కొంత ప్రత్యేకం. షేర్లకు సంబంధించి, ఎవరిని నామినీగా పేర్కొంటే అతడే.. ఆయా పెట్టుబడులను సొంతం చేసుకోవచ్చు. ఇక్కడ దీన్ని మించి వీలునామా ఉన్నప్పుడే నామినీ అవి దక్కవు.

ఎవరైనా చనిపోయినప్పుడు అతని/ఆమె ఆస్తుల పంపకాలకు సంబంధించి వివాదాలు రావడం మనం చూస్తూనే ఉంటాం. పెట్టుబడులు పెట్టిన వ్యక్తి ఆయా పథకాలపై నామినీ పేర్లను పేర్కొన్నప్పటికీ ఇలాంటి వివాదాలు ఎందుకు వస్తాయనే విషయంలో కొంత గందరగోళం అనిపించవచ్చు. దీనికి కారణం.. ఆ వ్యక్తి సరైన విధంగా వీలునామా రాయకపోవడమే. తమ కుటుంబంలో ఇలాంటి ఇబ్బందులు రాకూడదని భావించేవారు నామినీ పేర్లతో పాటు.. ఆయా పెట్టుబడులు ఎంత శాతం ఎవరెవరికి చెందాలి అన్న విషయంలో వీలునామా రాయడం కూడా మర్చిపోకూడదు. అప్పుడే మీరు ప్రేమించే మీ కుటుంబ సభ్యులు ఏ ఇబ్బందీ లేకుండా ఆస్తులను ఆనందంగా పంచుకుంటారు.



గ్రాఫిక్: సుధాకర్

వీలునామా రాసేప్పుడు...

తాను సంపాదించిన సంపద ఎవరికి, ఏ రూపంలో చెందాలో పేర్కొనే ఒక రాతపూర్వక పత్రమే వీలునామా అని చెప్పొచ్చు. మరి, దీన్ని ఎవరు రాయవచ్చు? ఎలా రాయాలి అనే సందేహాలు ఉండటం సహజమే..

- 18 ఏళ్లు నిండిన వారెవరైనా సరే వీలునామా రాసేందుకు వీలుంది.
- పూర్తి మానసిక ఆరోగ్యంతో ఉండాలి. వీలునామాలో ఎన్ని మార్పులైనా చేసుకునేందుకు అవకాశం ఉంది. అయితే, కొత్తది రాసినప్పుడల్లా అది చివరి వీలునామాగా పేర్కొనాలి. వీలునామాను ఎన్నిసార్లయినా మార్చి రాసేందుకు అవకాశం ఉంది.
- మీ తదనంతరం వీలునామాను ఎవరు అమలు చేయాలో సూచించాలి.
- మైనర్ల పేరుమీద ఆస్తులను రాస్తుంటే.. వారికి ఎవరు సంరక్షకులుగా ఉండాలో కూడా తెలియజేయాలి.
- ఆస్తులను పంచే ముందు ఉన్న అన్ని అప్పులు, చెల్లించాల్సిన పన్నుల బాకీలను తీర్చేయాల్సిందిగా సూచించాలి.

ఎప్పుడు చెల్లదు..

- వీలునామా రాసే వ్యక్తి పూర్తి మానసిక ఆరోగ్యంగా లేనప్పుడు..
- వీలునామాను ఇష్టపూర్వకంగా కాకుండా.. ఎవరి ఒత్తిడితోనైనా రాసినప్పుడు
- మత్తు పదార్థాలను తీసుకొని, వాటి ప్రభావం శారీరకంగా, మానసికంగా వాటి ప్రభావం ఉన్నప్పుడు రాసిన వీలునామాలు చెల్లవు.

ఆన్‌లైన్‌లో యులిప్

జీవిత బీమా పాలసీలను ఆన్‌లైన్ ద్వారా తీసుకుంటున్న వారు పెరుగుతున్నారు. ఇలాంటి వారిని లక్ష్యంగా చేసుకొని మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ కొత్త ఆన్‌లైన్ యూనిట్ ఆధారిత బీమా పాలసీని విడుదల చేసింది. దీని పేరు **మ్యాక్స్ లైఫ్ ఆన్‌లైన్ సేవింగ్స్ ప్లాన్**. ఇందులో రెండు రకాల ఆప్షన్లు ఉన్నాయి. వేరియంట్ -1.. దీర్ఘకాలిక సంపద

కొత్త పథకం

సృష్టికి ఉపయోగపడేలా రూపొందించారు. జీవిత బీమా విలువను పెంచుకునేందుకు వెసులుబాటు ఉంటుంది. వేరియంట్-2ని ఎంచుకున్నప్పుడు మూడు రకాల రక్షణలు కల్పిస్తోంది. బీమా తీసుకున్న వ్యక్తి మరణిస్తే.. నామినీకి వెంటనే కొంత మొత్తం అందుతుంది. మంత్లీ ఫ్యామిలీ ఇన్‌కం బెనిఫిట్ కింద పాలసీ విలువలో 1శాతం చొప్పున చెల్లిస్తారు. భవిష్యత్తు ప్రీమియాలన్నీ రద్దయి, పాలసీ వ్యవధి వరకూ కొనసాగుతుంది. ఈ పాలసీని కనీసం 18 ఏళ్ల నుంచి ఎవరైనా తీసుకోవచ్చు. వేరియంట్-1 కు గరిష్ఠ వయసు 60ఏళ్లు. వేరియంట్-2కు 54ఏళ్లు. వార్షిక కనీస ప్రీమియం రూ. 36వేలు. పాలసీ వ్యవధి 5-30ఏళ్లు. పాలసీ విలువలో గరిష్ఠ పరిమితి అంటూ ఏమీ లేదు.

దీర్ఘకాలం కోసం...

- వడ్డీ రేట్లు తగ్గుతున్న నేపథ్యంలో దీర్ఘకాలం సురక్షిత పథకాల్లో కొనసాగించాలనుకునే వారికోసం ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఫిక్స్‌డ్ మెచ్యూరిటీ ప్లాన్ సిరీస్ 82 అందుబాటులోకి వచ్చింది. స్థిరాదాయ, డెట్ పథకాల్లో ఇది పెట్టుబడి పెడుతుంది. ఇది ఇన్‌కం విభాగానికి చెందిన క్లోజ్ ఎండెడ్ ఫండ్. ఎన్ఎఫ్ఓ ఫిబ్రవరి 1 వరకూ అందుబాటులో ఉంది. కనీస పెట్టుబడి రూ. 5వేలు. పెట్టుబడిని కనీసం 1215 రోజులు కొనసాగించాల్సి ఉంటుంది.

ఈక్విటీల్లో...

- వైవిధ్యంగా ఉండే ఈక్విటీ పథకాల్లో మదుపు చేసే వ్యూహంతో అందుబాటులోకి వచ్చిన పథకం ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ వాల్యూ ఫండ్ సిరీస్ 20. ఫండమెంటల్ అనాలసిస్ ద్వారా మంచి పనితీరు కనబరిచే షేర్లలో మదుపు చేయడం ద్వారా పెట్టుబడి వృద్ధికి అవకాశం కల్పిస్తామంటోంది. గ్రోత్ విభాగానికి చెందిన క్లోజ్ ఎండెడ్ పథకమిది. జనవరి 31 వరకూ పెట్టుబడికి అవకాశం ఉంది. కనీస పెట్టుబడి రూ. 5వేలు.
- ఈక్విటీలు, ఈక్విటీ ఆధారిత పథకాల్లో మదుపు చేసి, దీర్ఘకాలం కొనసాగాలని కోరుకునే వారికి యూటీఐ ఫోకస్డ్ ఈక్విటీ ఫండ్, సిరీస్ 6 అందుబాటులోకి వచ్చింది. చిన్న, మధ్య, భారీ కంపెనీలా అని చూడకుండా.. వృద్ధికి అవకాశం ఉన్న షేర్లలో ఇది మదుపు చేస్తుంది. మొత్తం మీద 30 కంపెనీలను ఎంచుకొని, వాటిలోనే పెట్టుబడులు పెడుతుంది. గ్రోత్ విభాగానికి చెందిన ఈ క్లోజ్ ఎండెడ్ పథకంలో పెట్టుబడిని 1150 రోజులు కొనసాగించాలి. కనీస పెట్టుబడి రూ. 5వేలు. ఫిబ్రవరి 5 వరకూ పెట్టుబడి పెట్టొచ్చు.

ఏ కార్డు.. ఎప్పుడు?

నగదు రహిత లావాదేవీలు అధికమవుతున్నాయి.. నగదు వాడకం దాదాపు తగ్గిపోతోంది. ఈ నేపథ్యంలో డెబిట్, క్రెడిట్ కార్డుల వాడకం గురించి కాస్త జాగ్రత్తగా ఉంటూ.. సందర్భానుసారం ఏవి వాడాలో తెలుసుకోవాల్సిన అవసరం ఏర్పడుతోంది. నగదుకు బదులుగా వాడే ఈ కార్డుల వినియోగం ఒకటే తీరుగా ఉన్నా.. పనితీరులోనూ, అందే ప్రయోజనాల్లోనూ ఎన్నో వ్యత్యాసాలు.. అందుకే, వీటిలో ఏ కార్డు ఎప్పుడు వాడాలన్నది తెలుసుకోవాలి.



క్రెడిట్, డెబిట్ కార్డులను ఎలా వాడాలన్నది ఇప్పుడు చెప్పే అవసరం ఏమీ లేదు. ఎందుకంటే.. పెద్ద నోట్ల రద్దు తర్వాత వీటి వినియోగం ఏ రీతిలో పెరిగిందో చూస్తూనే ఉన్నాం. . కొత్తగా క్రెడిట్ కార్డు తీసుకునే వారే వీటి విషయంలో కాస్త జాగ్రత్తగా ఉండాలి. బ్యాంకులు మీ బిల్లింగ్ తేదీని బట్టి ఒక వస్తువు కొన్న రోజు నుంచి 40-50 రోజుల వరకూ వ్యవధిని ఇస్తాయి. ఇది కార్డులను బట్టి మారుతూ ఉంటుంది. మీ కార్డుపై ఉన్న పరిమితి మేరకే వాడుకునే వీలుంటుంది. ఒక రకంగా ఇది మీకు అప్పులాంటిదే.

డెబిట్ కార్డు విషయంలో వేరేగా ఉంటుంది. ఇది మీ సొంత డబ్బుకు సంబంధించిన విషయం. మీ పొదుపు ఖాతాలో ఉన్న డబ్బునే మీరు వాడగలరు.

క్రెడిట్ కార్డు..

- ఏదైనా ఆన్‌లైన్‌లో కొనుగోలు చేయాలనుకున్నప్పుడు క్రెడిట్ కార్డును వాడటమే ఉత్తమం. అందులోనూ తక్కువ పరిమితి ఉన్న కార్డుతోనే ఎప్పుడూ కొనుగోళ్లు చేయాలి.
- బిల్లు గడువు తేదీలోపు చెల్లించగలను అని నమ్మకం ఉన్నప్పుడే క్రెడిట్ కార్డును వాడాలి.
- పెద్ద మొత్తంలో కొనుగోలు చేసి, నెలసరి వాయిదాల రూపంలో ఆ బిల్లు చెల్లించారనుకోండి. అప్పుడు క్రెడిట్ కార్డు వాడవచ్చు. అయితే, దీనికన్నా ముందు.. సున్నా శాతం వడ్డీకే వాయిదాల సౌకర్యం ఉండే అవకాశం ఏదైనా ఉందా చూసుకోండి.
- ఏదైనా ప్రత్యేక డిస్కౌంట్లు, నగదు వెనక్కిలాంటి ఆఫర్లు ప్రకటించినప్పుడు క్రెడిట్ కార్డు ఉత్తమమే. అయితే, కేవలం ఈ ఆఫర్ల వలలో పడి, అవసరం లేని వస్తువులు కొనకండి.
- మీ రుణ చరిత్రను క్రెడిట్ కార్డు ప్రభావితం చేస్తుంది. నెలనెలా క్రెడిట్ కార్డు వాడి, ఆ బిల్లును సకాలంలో తీరుస్తూ ఉంటే.. మీ రుణ చరిత్ర బాగుండటంతోపాటు, క్రెడిట్ స్కోరూ పెరుగుతుంది. అప్పుడు మీరు భవిష్యత్తులో రుణం తీసుకోవడం సులువవుతుంది.
- క్రెడిట్ కార్డులను ఉపయోగించి, నగదు తీసుకోవచ్చు. కానీ, ఆర్థిక క్రమశిక్షణ ఉన్న వారెవరూ ఈ కార్డుతో నగదును తీయడానికి ప్రయత్నించకూడదు. వడ్డీ రేటు భారం అధికంగా ఉంటుంది.

డెబిట్ కార్డు..

- ఏటీఎంల నుంచి నగదు తీయడానికి డెబిట్ కార్డు వాడతాం. అంటే, మన ఖాతాలో ఉన్న డబ్బును మాత్రమే వాడుకోవడానికి దీన్ని ఉపయోగించాలి. అనవసర అప్పులకు దూరంగా ఉండాలనుకున్నప్పుడు డెబిట్ కార్డును వాడటమే ఉత్తమం.
- నెలవారీ బడ్జెట్ ఖర్చులు కొన్ని ఉంటాయి. వీటికోసం మనం కొంత కేటాయిస్తాం. ఇలాంటప్పుడు క్రెడిట్ కార్డుతో వాటిని కొనడానికి బదులు డెబిట్ కార్డు వాడటమే మేలు.
- వృథా ఖర్చులు అరికట్టాలంటే.. క్రెడిట్ కార్డులకంటే.. డెబిట్ కార్డులు వాడటమే మేలు. ఎందుకో తెలుసా? అప్పు చేసినప్పుడు పెద్దగా ఆలోచించం. కానీ, మన కష్టార్జితం కరిగిపోతుంటే.. కాస్త జాగ్రత్తగా ఉంటాం!

ఏది ఏమైనా.. క్రెడిట్, డెబిట్ కార్డుల్లో ఏది వాడాలన్నది విచక్షణ సొంతంగా ఉండాలి. అప్పుడే మన జేబుపై భారం పడకుండా.. ఆయా కార్డులు అందించే ప్రయోజనాలను పొందగలం.

పింఛను ముందే తీసుకుంటే...

మార్గదర్శి

మూడు నెలల్లో నేను పదవీ విరమణ చేయబోతున్నాను. నెలకు వచ్చే బేసిక్ పింఛనులో మూడో వంతు కమ్యుటేషన్ చేసుకుంటే రూ.7,11,591 వస్తాయి. కానీ, నెలకు వచ్చే పింఛను రూ.8,581ని 15 ఏళ్లపాటు తగ్గిస్తారు. 15 ఏళ్ల తర్వాత కమ్యుటేషన్ కారణంగా తగ్గిన పింఛనును పునరుద్ధరించి పూర్తి పింఛను చెల్లిస్తారు. దీన్ని వినియోగించుకొని ముందే డబ్బు తీసుకోవడం మంచిదేనా?

- శ్రీనివాస రావు



పింఛనులో బేసిక్, కరువు భత్యం అని రెండు భాగాలు ఉంటాయి. 15 ఏళ్లలో అందుకునే బేసిక్ పింఛను మొత్తాన్ని కొంత డిస్కౌంటుతో పదవీ విరమణ చేసేప్పుడు తీసుకోవచ్చు. దీన్ని కమ్యుటేషన్ అంటారు. ప్రభుత్వ, ప్రభుత్వ రంగ ఉద్యోగులు 15 ఏళ్ల పింఛనను ముందుగానే తీసుకోవడం లాభదాయకమా? కాదా అన్నది తెలియాలంటే కొన్ని లెక్కలు తెలియాలి. కమ్యుటేషన్ వల్ల ఈ పింఛను రూ. 8,581 తగ్గుతుంది. దీంతో వచ్చిన రూ. 7,11,591లను సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీంలో దాచుకుంటే మూడు నెలలకు ఒకసారి రూ. 14,765 వరకూ వస్తాయి. కమ్యుటేషన్ వల్ల నెలకు మీకు అందే మొత్తం రూ. 3,659 తగ్గిపోతుంది. కానీ, గడువు తర్వాత మీ అసలు మీ చేతికి వస్తుంది. కమ్యుటేషన్ చేస్తే వచ్చిన రూ. 7,11,591 ను 13 శాతం రాబడి వచ్చే యాన్యుటీ పథకంలో పెట్టుబడి పెడితే నెలకు రూ. 8,581 వస్తాయి. 15ఏళ్ల తర్వాత మీ చేతికి ఏమీ రాదు. అంటే కమ్యుటేషన్‌తో వచ్చిన డబ్బును కనీసం 13శాతం రాబడి వచ్చే మార్గంలో మదుపు చేయగలిగితేనే దీన్ని ఎంచుకోవాలి. పదవీ విరమణ తర్వాత నెలకు వచ్చే ఆదాయం తగ్గుతుంది. కమ్యుటేషన్ చేసి మీ ఆదాయాన్ని మరో రూ. 3,659 తగ్గించుకోవడం కంటే ఎక్కువ పింఛను తీసుకోవడమే మంచిది. పదవీ విరమణ తర్వాత గ్రాట్యుటీ, మిగిలిన సెలవుల జీతం, ప్రావిడెంట్ ఫండ్ రూపంలో భారీ మొత్తం చేతికి వస్తుంది. ఈ డబ్బును అనారోగ్య అవసరాలకు అత్యవసర నిధిగా పెట్టుకోవచ్చు. ఇవేవీ లేకుండా కేవలం పింఛను మాత్రమే వచ్చేవారు కమ్యుటేషన్ ద్వారా వచ్చిన మొత్తాన్ని అనారోగ్య అవసరాలకు అత్యవసర నిధిగా దాచుకోవచ్చు.



వంగా రాజేంద్ర ప్రసాద్
సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

ప్రజా భవిష్య నిధి (పీపీఎఫ్)లో నుంచి మన అత్యవసరాలకు దాచుకున్న మొత్తంలో కొంత వెనక్కి లేదా అప్పుగా తీసుకవచ్చు కదా! జాతీయ పింఛను పథకం (ఎన్‌పీఎస్)లో ఇలా తీసుకోవడం వీలవుతుందా? పదవీ విరమణ, అత్యవసరాలకు సంబంధించి ఈ రెండింటిలో ఏది మెరుగైనది?

- గిరిధర్

దీర్ఘకాలిక అవసరాల కంటే తక్షణ అవసరాలు, కోరికలు, కలల కోసం ఖర్చు పెట్టాలని చూడటం మానవ బలహీనత. పదవీ విరమణ చేశాక పింఛను అత్యవసరం. పింఛను కోసం మొదలు పెట్టిన దీర్ఘకాలిక పొదుపు, పెట్టుబడులను మధ్యలో తీసుకోకూడదనే లక్ష్యంతో ఎన్‌పీఎస్ టైర్ 1 ఖాతాలో మొత్తాన్ని మధ్యలో వెనక్కి తీసుకోకూడదనే నిబంధన విధించారు. ఇటీవల దీన్ని కొంత సడలించారు. పిల్లల చదువు, పెళ్లి, ఇంటి నిర్మాణం, గుండెపోటు, పక్షవాతం, ప్రమాదం వంటి ఆరోగ్య అవసరాలకు మన ఎన్‌పీఎస్ నిల్వలో 25శాతం వెనక్కి తీసుకోవచ్చు. ఎన్‌పీఎస్ ప్రారంభించిన మూడేళ్ల తర్వాత ఈ సదుపాయం లభిస్తుంది. పదవీ విరమణ చేసేలోగా మూడుసార్లు ఈ సదుపాయం వినియోగించుకోవచ్చు. పీపీఎఫ్‌లో వడ్డీ జనవరి నుంచి 7.6శాతం. ఎన్‌పీఎస్ టైర్-1 ఈక్విటీలో గత ఐదేళ్ల రాబడి 14శాతం వరకూ ఉంది. ఇందులో ప్రభుత్వ బాండ్ పథకంలో కూడా రాబడి 8.47% పైగానే ఉంది. సెక్షన్ 80సీ కింద రూ. 1,50,000 పెట్టుబడి పెట్టి, అదనంగా మరో రూ. 50వేల పెట్టుబడి వరకూ ఎన్‌పీఎస్‌లో మదుపు చేసి, ఆదాయపు పన్ను రాయితీ పొందవచ్చు. కాబట్టి, మీరు ఎన్‌పీఎస్ ఎంచుకోవచ్చు.

56: వేలంలో అమ్ముడైన విదేశీయుల సంఖ్య.
169: వేలంలో అమ్ముడుబోయిన ఆటగాళ్ల సంఖ్య.

రూ.17 కోట్లు: కోహ్లిని బెంగళూరు అట్టిపెట్టుకునేందుకు వెచ్చించిన మొత్తం. ఐపీఎల్-11 వేలంలో ఎవరూ అతడిని అధిగమించలేదు.

రూ.11.5 కోట్లు: ఉనద్కత్‌ను రాజస్థాన్ కొన్న ధర. వేలంలో అత్యధిక ధర పలికిన భారత ఆటగాడు అతనే.

రూ.12.5 కోట్లు: స్టీవ్ స్మిత్, స్టోక్స్‌ల ధర. స్మిత్‌ను అట్టిపెట్టుకున్న రాజస్థానే స్టోక్స్‌నూ కొనుగోలు చేసింది.

ఏ జట్టులో ఎవరు..
(ధర రూ. కోట్లలో)

హైదరాబాద్
అట్టిపెట్టుకున్న ఆటగాళ్లు: వార్నర్ (12.5), భువనేశ్వర్ (8.5); **వేలంలో కొన్న దేశీయ ఆటగాళ్లు:** పాండే (11), ధావన్ (9), సాహా (5), కౌల్ (3.8), హుడా (3.6), అహ్మద్ (3), సందీప్ శర్మ (3), యూసుఫ్ పఠాన్ (1.9), గోస్వామి (1), థంపి (0.95), నటరాజన్ (0.4), సచిన్ బేబీ (0.2), బిపుల్ (0.2), హసన్ (0.2), భుయ్ (0.2), తన్మయ్ (0.2); **విదేశీయులు:** రషీద్ (9), విలియమ్సన్ (3), బ్రాత్‌వైట్ (2), షకిబ్ (2), నబి (1), జోర్డాన్ (1), స్టాన్‌లేక్ (0.5)

చెన్నై
అట్టిపెట్టుకున్న ఆటగాళ్లు: ధోని (15), రైనా (11), జడేజా (7); **వేలంలో కొన్న దేశీయ ఆటగాళ్లు:** జాదవ్ (7.8), కర్ణ్ (5), శార్దూల్ (2.6), రాయుడు (2.2), విజయ్ (2), హర్భజన్ (2), చాహర్ (0.8), ఆసిఫ్ (0.4), జగదీశన్ (0.2), కనిష్క్ (0.2), మోను (0.2), షోరే (0.2), క్షితిజ్ (0.2), చైతన్య (0.2); **విదేశీయులు:** డ్వేన్ బ్రావో (6.4), వాట్సన్ (4), డుప్లెసిస్ (1.6), వుడ్ (1.5), బిల్లింగ్స్ (1), తాహిర్ (1), శాంట్నర్ (0.5), ఎంగిడి (0.5)

బెంగళూరు
అట్టిపెట్టుకున్న ఆటగాళ్లు: కోహ్లి (17), డివిలియర్స్ (11), సర్ఫరాజ్ (3); **వేలంలో కొన్న దేశీయ ఆటగాళ్లు:** చాహల్ (6), ఉమేశ్ (4.2), సుందర్ (3.2), సైని (3), సిరాజ్ (2.6), ఎం.అశ్విన్ (2.2), పార్థివ్ (1.7), మన్‌దీప్ (1.4), వోహ్రా (1.1), నేగి (1), కుల్వంత్ (0.85), అనికేత్ (0.3), దేశ్‌పాండే (0.2), అనిరుధ్ జోషి (0.2); **విదేశీయులు:** వోక్స్ (7.4), మెకకలమ్ (3.6), డికాక్ (2.8), కౌల్టర్ నైల్ (2.2), గ్రాండ్‌హోమ్ (2.2), మొయిన్ (1.7), సౌథీ (1)

దిల్లీ
అట్టిపెట్టుకున్న ఆటగాళ్లు: పంత్ (15), మోరిస్ (11), అయ్యర్ (7); **వేలంలో కొన్న దేశీయ ఆటగాళ్లు:** మిశ్రా (4), నదీమ్ (3.2), శంకర్ (3.2), తెవాటియా (3), షమి (3), గంభీర్ (2.8), నమన్ (1.4), షా (1.2), గుర్‌కీరత్ (0.75), అవేశ్ (0.7), అభిషేక్ (0.55), జయంత్ (0.5), హర్షల్ (0.2), మంజోత్ (0.2), ఘోష్ (0.2); **విదేశీయులు:** మ్యాక్స్‌వెల్ (9), రబాడ (4.2), బౌల్ట్ (2.2), మన్రో (1.9) క్రిస్టియన్ (1.5), రాయ్ (1.5), లమిచానె (0.2)

రాజస్థాన్
అట్టిపెట్టుకున్న ఆటగాడు: స్మిత్ (12.5); **వేలంలో కొన్న దేశీయ ఆటగాళ్లు:** ఉనద్కత్ (11.5), శాంసన్ (8), కె.గౌతమ్ (6.2), రహానె (4), త్రిపాఠి (3.4), ధవల్ (0.75), బిన్నీ (0.5), అనురీత్ (0.3), విక్రమ్ బిర్లా (0.3), ఎస్.మిధున్ (0.2), గోపాల్ (0.2), ప్రశాంత్ (0.2), జతిన్ (0.2), అంకిత్ శర్మ (0.2), లొమ్రార్ (0.2); **విదేశీయులు:** స్టోక్స్ (12.5), ఆర్చర్ (7.2), బట్లర్ (4.4), షార్ట్ (4), లాఫ్లిన్ (0.5), చమీర (0.5), పక్తీన్ (0.6)

ముంబయి
అట్టిపెట్టుకున్న ఆటగాళ్లు: రోహిత్ (15), హార్దిక్ (11), బుమ్రా (7); **వేలంలో కొన్న దేశీయ ఆటగాళ్లు:** కృనాల్ (8.8), కిషన్ (6.2), సూర్యకుమార్ (3.2), చాహర్ (1.9), సంగ్వాన్ (1.5), సౌరభ్ తివారి (0.8), తేజిందర్ (0.55), దినేశన్ (0.2), తారె (0.2), లాడ్ (0.2), మార్కండె (0.2), లుంబా (0.2), అనుకుల్ (0.2), మోసిన్ (0.2); **విదేశీయులు:** పొలార్డ్ (5.4), కమిన్స్ (5.4), లూయిస్ (3.8), కటింగ్ (2.2), ముస్తాఫిజుర్ (2), బెరెన్‌డార్ఫ్ (1.5), డుమిని (1), ధనంజయ (0.5)

కోల్‌కతా
అట్టిపెట్టుకున్న ఆటగాళ్లు: నరైన్ (12.5), రసెల్ (8.5); **వేలంలో కొన్న దేశీయ ఆటగాళ్లు:** దినేశ్ కార్తీక్ (7.4), ఉతప్ప (6.4), కుల్‌దీప్ (5.8), చావ్లా (4.2), రాణా (3.4), నాగర్‌కోటి (3.2), మావి (3.2), శుభ్‌మన్ (1.8), వినయ్ కుమార్ (1), రింకు (0.8) అపూర్వ్ (0.2), జగ్గి (0.2); **విదేశీయులు:** లిన్ (9.6), స్టార్క్ (9.4), జాన్సన్ (2), డెల్‌పోర్ట్ (0.3), సీర్‌లెస్ (0.3)

పంజాబ్
అట్టిపెట్టుకున్నది: అక్షర్ (12.5); **వేలంలో కొన్న దేశీయ ఆటగాళ్లు:** రాహుల్ (11), అశ్విన్ (7.6), కరుణ్ (5.6), అంకిత్ రాజ్‌పుత్ (3), మోహిత్ (2.4), శరణ్ (2.2), యువరాజ్ (2), అక్ష్‌దీప్ (1), మనోజ్ (1), మయాంక్ (1), మంజూర్ (0.2), సాహు (0.2), దాగర్ (0.2); **విదేశీయులు:** టై (7.2), ఫించ్ (6.2), స్టాయినిస్ (6.2), ముజీబ్ (4), మిల్లర్ (3), గేల్ (2), డ్వార్షుస్ (1.4)

ఛాంపియన్స్

జైదేవ్‌కు జాక్‌పాట్

పూర్తయిన ఐపీఎల్ వేలం



- రూ.11.5 కోట్లకు కొన్న రాజస్థాన్
- అత్యధిక ధర పలికిన భారత ఆటగాడిగా రికార్డు
- గేల్‌ను రూ.2 కోట్లకు దక్కించుకున్న పంజాబ్

కొందరు అంచనాల్ని మించి ఎక్కడికో వెళ్లిపోయారు. ఇంకొందరు అంచనాల్ని అందుకోలేక కింద పడ్డారు. మరికొందరు అమ్ముడయ్యాం అంటే అమ్ముడయ్యాం అనిపించారు. కొందరైతే ఫ్రాంఛైజీల నిరాదరణతో షాక్ తిన్నారు. మొత్తానికి ఇప్పటిదాకా ఐపీఎల్ చరిత్రలోనే ఎన్నడూ లేనంతగా అత్యధిక మొత్తం ఖర్చయిన వేలానికి తెరపడింది. వేలంలో ఖర్చు చేయదగ్గ గరిష్ట మొత్తం రూ.66 కోట్ల నుంచి రూ.80 కోట్లకు పెరిగినా.. గత సీజన్ల తరహాలో ఫ్రాంఛైజీలు మరీ వేలం వెర్రిగా ఆటగాళ్లపై ఖర్చు చేయలేదు. అంచనాల్ని మించిన ధర పలికిన ఆటగాళ్లున్నారు కానీ.. గత రికార్డుల్ని బద్దలు కొట్టే రేటు ఎవరికీ దక్కలేదు. తొలి రోజు రూ.12.5 కోట్లు పలికిన స్టోక్స్‌దే ఈసారి రికార్డు. నిరుడూ అత్యధిక ధర అతడిదే. భారత పేసర్ జైదేవ్ ఉనద్కత్ ఊహించని స్థాయిలో రూ.11.5 కోట్లతో.. అత్యధిక ధర దక్కించుకున్న భారత ఆటగాడిగా నిలవడం విశేషం.

బెంగళూరు

ఐపీఎల్ 11వ సీజన్ కోసం ఆటగాళ్ల వేలానికి తెరపడింది. బెంగళూరు వేదికగా శని, ఆదివారాల్లో జరిగిన వేలంలో మొత్తం 169 ఆటగాళ్లు అమ్ముడుబోయారు. అందులో 56 మంది విదేశీయులు. తొలి రోజు రూ.12.5 కోట్లతో ఈ సీజన్‌కు అత్యధిక ధర దక్కించుకున్న ఆటగాడిగా రికార్డు నెలకొల్పిన స్టోక్స్‌ను రెండో రోజు కూడా ఎవరూ అధిగమించలేదు. అతడిని రికార్డు రేటుకు కొన్న రాజస్థానే గుజరాత్ పేసర్ ఉనద్కత్ ఏకంగా రూ.11.5 కోట్లు పెట్టడం విశేషం. చెన్నై, పంజాబ్‌లతో పోటీ పడి రాజస్థాన్ అతడనికి దక్కించుకుంది. నిరుడు పుణెకు ఆడిన జైదేవ్.. 13.41 సగటుతో 24 వికెట్లు తీయడం వేలం అతడికి కలిసొచ్చింది. కర్ణాటక ఆల్‌రౌండర్ గౌతమ్ కృష్ణప్ప రూ.6.2 కోట్లు (కనీస ధరకు 31 రెట్లు) పలికి ఆశ్చర్యపరిచాడు. అతడినీ రాజస్థానే సొంతం చేసుకుంది. రెండో రోజు భారత కుర్రాళ్లు వాషింగ్టన్ సుందర్ (రూ.3.2 కోట్లు-బెంగళూరు), సందీప్ శర్మ (రూ.3 కోట్లు-సన్‌రైజర్స్), నదీమ్ (రూ.3.2 కోట్లు-దిల్లీ) మంచి ధర దక్కించుకున్నారు. విదేశీయుల్లో ఆస్ట్రేలియా పేసర్ ఆండ్రూ టై రూ.7.2 కోట్లు పలికి ఆశ్చర్యపరిచాడు. అతడిని పంజాబ్ తీసుకుంది. అండర్-19 కుర్రాళ్లపై కన్నేసిన కోల్‌కతా.. రెండో రోజు పేసర్ శివమ్ మావిని రూ.3 కోట్లకు కొనడం విశేషం. గత సీజన్ వరకు లీగ్‌లో మంచి ధర దక్కించుకుంటూ వచ్చిన శ్రీలంక ఆటగాళ్లకు ఈసారి నిరాశ తప్పలేదు. తిసార పెరీరా, మాథ్యూస్ లాంటి వాళ్లు అమ్ముడుబోనే లేదు. ఇంకా ఇషాంత్ శర్మ, ప్రజ్ఞాన్ ఓజా, హెన్రిక్స్, స్టెయిన్, కోరె అండర్సన్, మోర్గాన్, ఫాల్క్‌నర్, షాన్ మార్ష్ లాంటి వాళ్లను ఫ్రాంఛైజీలు పట్టించుకోలేదు.

కోహ్లీనే రాజు: ఐపీఎల్-11 వేలం ముగిసింది. ఈ సీజన్లో అత్యధిక మొత్తం అందుకోబోతున్నది కోహ్లీనే అని తేలిపోయింది. అతడిని బెంగళూరు ఫ్రాంఛైజీ రూ.17 కోట్లకు అట్టిపెట్టుకున్న సంగతి తెలిసిందే.

రూ.431.7 కోట్లు

అన్ని ఫ్రాంఛైజీలు కలిపి ఖర్చు చేసిన మొత్తం. ఒక్క నైట్‌రైడర్సే మొత్తం రూ.80 కోట్లూ ఖర్చు చేసింది. గరిష్టంగా చెన్నై వద్ద రూ.6.5 కోట్లు మిగిలింది. పంజాబ్ రూ.10 లక్షలు, బెంగళూరు రూ.15 లక్షలు, ముంబయి రూ.65 లక్షలు, సన్‌రైజర్స్ రూ.65 లక్షలు, దిల్లీ రూ.1.6 కోట్లు, రాజస్థాన్ రూ.1.65 కోట్లు మిగిల్చాయి.

20 ఇప్పటి దాకా ఫెదరర్ గెలిచిన గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు. ఇందులో ఎనిమిది వింబుల్డన్, ఆరు ఆస్ట్రేలియన్ ఓపెన్, ఐదు యుఎస్ ఓపెన్, ఒక ఫ్రెంచ్ ఓపెన్ ఉన్నాయి.

- ఫెదరర్‌కు ఇది ఆరో ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్. ఈ టోర్నీలో అత్యధిక టైటిళ్లు సాధించిన రాయ్ ఎమర్సన్, జకోవిచ్ సరసన అతను చేరాడు.

మాటల్లేవ్... ఏమా ఆట.. ఏమా విజయం! 36 ఏళ్ల వయసులో.. విపరీతమైన వేడిని తట్టుకుంటూ.. ఐదు సెట్లపాటు పోరాడి గెలవడం అంటే మామూలు విషయం కాదు! తన కన్నా తక్కువ వయసు ఆటగాళ్లు గాయాలతో నిష్క్రమిస్తుంటే.. కుర్రాళ్లు సవాల్ చేస్తుంటే ఈ యోధుడు మాత్రం ఆఖరి వరకు పట్టు వదల్లేదు. ఎందుకంటే అతను రోజర్ ఫెదరర్..! గతేడాది ఇదే రాడ్‌లేవర్ ఎరీనాలో జవసత్వాలు పోసుకున్న ఛాంపియన్. కాలచక్రం నుంచి వెనక్కిపోతున్నామా అన్నట్లు మళ్లీ కొట్టేశాడు.. మారిన్ సిలిచ్‌ను ఓడించి మరో గ్రాండ్‌స్లామ్ టైటిల్ తన ఖాతాలో వేసుకున్నాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ గెలిచి మొత్తం మీద 20వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను చేజిక్కించుకున్నాడు. టెన్నిస్ చరిత్రలోనే అత్యుత్తమ ఆటగాడినని అతను మరోసారి నిరూపించుకున్నాడు.



36లో 20


ఫెదరర్		సిలిచ్
24	ఏస్‌లు	16
5	డబుల్‌ఫాల్ట్స్	4
6/13	బ్రేక్ పాయింట్లు	2/9
41	విన్నర్లు	45
152	పాయింట్లు	128

- ఫెదరర్ ఖాతాలో మరో గ్రాండ్‌స్లామ్
- ఆస్ట్రేలియన్ ఓపెన్ కైవసం
- ఐదు సెట్ల పోరులో సిలిచ్‌పై గెలుపు

మెల్‌బోర్న్

రోజర్ ఫెదరర్.. ఛాంపియన్! ఈ మాట మళ్లీ మళ్లీ రాసుకోవాలేమో! మరి అలా ఉంది అతని ఆట! ఎక్కడా తగ్గట్లేదు.. అదే వాడి.. అదే జోరు! ఫలితం.. మరో టైటిల్.. రోజర్ తన జోరు మరోసారి చూపించిన వేళ.. ఆస్ట్రేలియన్ ఓపెన్ అతని వశమైంది. మ్యాచ్ ఐదు సెట్ల పాటు సాగినా.. మూడు గంటలు నడిచినా.. ఫైనల్లో రోజర్ ఆటే హైలైట్. ఈ స్విస్ స్టార్ 6-2, 6-7 (5-7), 6-3, 3-6, 6-1తో మారిన్ సిలిచ్ (క్రొయేషియా)ను ఓడించాడు. కెరీర్‌లో 30వ గ్రాండ్‌స్లామ్ ఫైనల్ ఆడిన రోజర్.. తన అనుభవాన్ని రంగరించి ప్రత్యర్థిపై పైచేయి సాధించాడు. గతేడాది ఇదే సిలిచ్‌ను ఓడించి వింబుల్డన్ టైటిల్ గెలుచుకున్న ఫెదరర్.. ఈసారీ అదే జోరు ప్రదర్శించాడు. కానీ అప్పుడు సిలిచ్ సులభంగా లొంగితే.. ఈసారి గట్టిగానే పోరాడాడు. తన బలమైన రిటర్న్‌లు, మెరుపు సర్వీసులతో బాగా ఇబ్బంది పెట్టాడు. ఒకవైపు 38 డిగ్రీల ఎండ.. మరో వైపు సిలిచ్ పోరాటం.. అయినా ఫెదరర్ తగ్గలేదు. తొలి సెట్ ఆరంభంలోనే మారిన్ సర్వీస్ బ్రేక్ చేసిన ఫెదరర్ 6-2తో సెట్ గెలిచాడు. రెండో సెట్లో సిలిచ్ పుంజుకున్నాడు. ఒకరి సర్వీసులను ఒకరు బ్రేక్ చేసుకోవడంతో స్కోరు సమంగా సాగింది. టైబ్రేకర్‌కు మళ్లిన ఈ సెట్లో తన సర్వీసులతో అదరగొట్టిన మారిన్.. 7-6 (7-5)తో సెట్ గెలిచాడు. ప్రస్తుత టోర్నీలో రోజర్ సెట్ కోల్పోవడం ఇదే తొలిసారి. కానీ ఫెదరర్ తగ్గలేదు. మూడో సెట్ ఆరో గేమ్‌లో ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసిన రోజర్.. 4-2తో ఆధిక్యంలోకి వెళ్లడమే కాక.. ఆ తర్వాత 6-3తో సెట్ గెలిచి ఆధిక్యంలో నిలిచాడు. నాలుగో సెట్లో మ్యాచ్ గెలవడానికి ఫెదరర్‌కు గొప్ప అవకాశం లభించింది. రెండో గేమ్‌లో సిలిచ్ సర్వీస్ బ్రేక్ చేసిన అతను 2-0 ఆధిక్యంలో నిలిచాడు. ఐతే వెంటనే అతను సర్వీస్ కోల్పోయాడు. ఆ తర్వాత మరోసారి రోజర్ సర్వీస్ బ్రేక్ చేసిన మారిన్ ఈ సెట్‌ను 6-3తో గెలుచుకుని మ్యాచ్‌ను ఐదో సెట్‌కు మళ్లించాడు.

కన్నీళ్లాగలేదు..: సిలిచ్ ఆట చూస్తే.. ఐదో సెట్లో ఫెదరర్‌కు ముప్పులాగే కనిపించింది. అప్పటికే అతను నాలుగు సెట్లు ఆడి అలసిపోయాడు కూడా! అయితే అందర్ని ఆశ్చర్యపరుస్తూ రోజర్ విజృంభించాడు. తన క్లాసిక్ షాట్లతో మారిన్‌ను ఉక్కిరిబిక్కిరి చేశాడు చూస్తుండగానే 3-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లిన అతను.. ఆ తర్వాత 5-1తో ఛాంపియన్‌షిప్ ముంగిట నిలిచాడు. మెరుపు ఏస్‌తో 40-0తో నిలిచిన రోజర్.. తన రిటర్న్‌ను సిలిచ్.. నెట్ దాటించలేకపోవడంతో సంబరాల్లో మునిగిపోయాడు. గెలిచాక కొన్ని సెకన్ల పాటు నమ్మలేనట్లు చూసిన అతను.. తేరుకున్న తర్వాత అభిమానులకు అభివాదం చేశాడు. ట్రోఫీ అందుకుంటున్న సమయంలో రోజర్.. భావోద్వేగానికి గురయ్యాడు. కెరీర్‌లో 20వ టైటిల్ సాధించిన ఆనందంలో కన్నీళ్ల పర్యంతం అయ్యాడు.



రన్నరప్ బోపన్న: కెరీర్‌లో రెండో గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించాలనుకున్న రోహన్ బోపన్నకు నిరాశే ఎదురైంది. మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్లో బోపన్న-తియో బబోస్ (హంగేరి) 6-2, 4-6 (9-11)తో దబ్రౌస్కి (కెనడా)-పవిచ్ (క్రొయేషియా) చేతిలో పరాజయం చవిచూశారు.

332 రోజర్ సాధించిన గ్రాండ్‌స్లామ్ మ్యాచ్ విజయాలు

- ఓవరాల్‌గా అత్యధిక టైటిళ్లు సాధించిన జాబితాలో మార్గరేట్ కోర్ట్ (24), సెరెనా (23), స్టెఫీగ్రాఫ్ (22) తర్వాతి స్థానం ఫెదరర్ (20)దే.

ఓ కుబేరుడు.. ఓ కూలీ



ముంబయి: ఐపీఎల్ వేలంలో ఇద్దరు కుర్రాళ్లు అందరినీ ఆకర్షించారు. ఒకరు అపర కుబేరుడి కొడుకైతే.. మరొకరు అతికష్టంపై జీవితాన్ని వెళ్లదీస్తున్న రోజు కూలీ కొడుకు. ఆర్యమాన్ విక్రమ్ బిర్లాను రాజస్థాన్ రాయల్స్ రూ.30 లక్షలు కొనుక్కుంటే.. మంజూర్ దర్‌ను రూ.20 లక్షలకు పంజాబ్.. జట్టులోకి తీసుకుంది. విక్రమ్.. ప్రముఖ పారిశ్రామికవేత్త కుమార్ మంగళం బిర్లా తనయుడు.. రూ.30 లక్షలు అతడికి చిన్న విషయం. వ్యాపారంతో తండ్రితో చేరి కెరీర్‌ను నిర్మించుకోవడం 20 ఏళ్ల విక్రమ్‌కు తేలికే. కానీ ఆటంటే అతడికి ప్రేమ. మైదానంలో శ్రమించి, అదృష్టాన్ని పరీక్షించుకోవాలని అతడు నిర్ణయించుకున్నాడు. వేలంలో ముందు అమ్ముడుపోకున్నా.. రెండో రౌండ్లో రాజస్థాన్ అతణ్ని ఎంపిక చేసుకుంది. ఇక మంజూద్ దర్.. కశ్మీర్ బ్యాటింగ్ సంచలనం. ఎన్ని ఆటంకాలు ఎదురైనా అతడు క్రికెట్‌ను వదిలి పెట్టని తీరు స్ఫూర్తి కలిగించేదే.



అతడిదో పేద కుటుంబం. కూలీ అయిన తండ్రికి సహకరించేందుకు తానూ శ్రమించాడు. రాత్రి సెక్యూరిటీ గార్డుగా పని చేస్తూ.. పగలు ఇతర చిన్నా చితకా పనులు చేసేవాడు. కానీ రోజు కొన్ని గంటలపాటు ప్రాక్టీస్ చేయడం మాత్రం మానేవాడు కాదు. స్టేడియానికి కొన్నేళ్ల పాటు సైకిల్‌పైనే వెళ్లాడు. దర్‌కు మంచి హిట్టర్‌గా పేరుంది. భారీ కాయంతో బలంగా ఉండే అతణ్ని స్నేహితులు 'భీమ్' అని పిలుస్తుంటారు.

గేల్.. చివరికి అలా!




ఐపీఎల్‌లో, ఆ మాటకొస్తే ప్రపంచ టీ20 చరిత్రలోనే అత్యంత ఆకర్షణీయ ఆటగాళ్లలో ఒకడైన గేల్‌కు ఇలాంటి పరిస్థితి వస్తుందని ఎవ్వరూ ఊహించి ఉండరేమో. ఒకటికి రెండుసార్లు వేలంలోకి వచ్చి అమ్ముడుబోలేదు అతను. కనీస ధర రూ.2 కోట్లకు కొనడానికి కూడా ఏ ఫ్రాంఛైజీ ఆసక్తి చూపించలేదు. దీంతో గేల్ ఈసారి ఐపీఎల్‌కు దూరమైనట్లే అని అంతా అనుకున్నారు. ఐతే చివర్లో అమ్ముడుబోని ఆటగాళ్లను మరోసారి వేలంలోకి తేగా.. గేల్‌ను కింగ్స్ ఎలెవన్ రూ.2 కోట్ల కనీస ధరకే సొంతం చేసుకుంది.

సిరాజ్ మళ్లీ..

గత ఏడాది ఐపీఎల్ వేలంలో ఏకంగా రూ.2.6 కోట్లు పలికి ఆశ్చర్యపరిచిన హైదరాబాదీ యువ పేసర్ మహ్మద్ సిరాజ్ కోసం ఈసారి కూడా వేలంలో గట్టి పోటీనే నెలకొంది. అతడిని గత సీజన్ రేటుకే బెంగళూరు తీసుకుంది. నిరుడు సిరాజ్ సన్‌రైజర్స్‌కు ఆడాడు.

వయసు 16.. ధర రూ.4 కోట్లు

అఫ్గానిస్థాన్ నుంచి రషీద్ ఖాన్ లాగే మరో యువ స్పిన్నర్ సంచలన ధర దక్కించుకున్నాడు. ఆ దేశానికి చెందిన 16 ఏళ్ల ముజీబ్ జాద్రాన్ కోసం పంజాబ్ ఏకంగా రూ.4 కోట్లు పెట్టింది. అతడి కోసం ఫ్రాంఛైజీల మధ్య గట్టి పోటీ నెలకొంది. ముజీబ్ బౌలింగ్‌లో ఒక రహస్యం ఉందని, అందుకే అతడిని ఆ ధరకు కొన్నామని ఫ్రాంఛైజీ సహ యజమాని ప్రీతి జింతా తెలిపింది. మరోవైపు ఐపీఎల్ కాంట్రాక్టు దక్కించుకున్న తొలి నేపాల్ క్రికెటర్‌గా సందీప్ లమిచానె రికార్డు సృష్టించాడు. అతడిని కనీస ధర రూ.20 లక్షలకే దిల్లీ కొనుగోలు చేసింది.



ముజీబ్



సందీప్



అమ్ముడుపోని ప్రముఖ ఆటగాళ్లు

ఇషాంత్ శర్మ, ప్రజ్ఞాన్ ఓజా, వరుణ్ ఆరోన్, అశోక్ దిండా, రజత్ భాటియా, ఉన్ముక్త్ చంద్, శ్రీనాథ్ అరవింద్, రిషి ధావన్, ఇక్బాల్ అబ్దుల్లా, మిథున్, హెన్రిక్స్, కోరె అండర్సన్, మోర్నీ మోర్కెల్, సిమన్స్, షాన్ మార్ష్, మోర్గాన్, హేల్స్, తిసార పెరీరా, హోల్డర్, స్టెయిన్, మలింగ, రూట్, ఆమ్లా, గప్తిల్, ఫాల్క్‌నర్, బెయిర్‌స్టో, మెక్లెనగన్, హేజిల్‌వుడ్, జంపా, శామ్యూల్ బద్రీ, హెడ్

ఎయిమ్స్‌కు నిధులు కేటాయించాలి: జితేందర్‌రెడ్డి

ఈనాడు, దిల్లీ: గత బడ్జెట్ సమయంలో సభా ముఖంగా తెలంగాణకు ప్రకటించిన ఎయిమ్స్‌కు ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరినట్లు తెరాస లోక్‌సభాపక్ష నేత జితేందర్‌రెడ్డి వెల్లడించారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల ప్రారంభాన్ని పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం ప్రధానమంత్రి మోదీ ఆధ్వర్యంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో రాజ్యసభ సభ్యుడు కె.కేశవరావుతోపాటు ఆయన తెరాస తరఫున పాల్గొన్నారు. సమావేశానంతరం జితేందర్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడారు. “గత బడ్జెట్ సమయంలో తెలంగాణకు ఎయిమ్స్ ప్రకటించినా ఇంత వరకూ నిధులు కేటాయించలేదు. ఈసారి బడ్జెట్‌లో నిధులు కేటాయించి, దాని పూర్తికి నిర్దిష్టకాలపరిమితిని సభాముఖంగా చెప్పాలి. అలాగే కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులు రాష్ట్రాలకు సరిగా అందడంలేదు. ఆర్థిక సంవత్సరం పూర్తికావొస్తున్నా అరకొరగానే కేంద్రం నుంచి వస్తున్నాయి. నిధుల విడుదలలో జాప్యంవల్ల పథకాలను సకాలంలో పూర్తి చేయలేకపోతున్నాం. ఇకమీదట వేగంగా విడుదల చేయాలి. కేంద్రప్రాయోజిత పథకాలకు బడ్జెట్‌లో నిధులు ప్రకటించినా రాష్ట్రాలకు చేరకపోతే లాభం ఉండదని చెప్పాం” అని వివరించారు

నియంతృత్వ పాలనకు నిదర్శనం తెరాస సర్కారు: తమ్మినేని

ఈనాడు, హైదరాబాద్: తనని, తన ప్రభుత్వాన్ని ఎవరూ విమర్శించకూడదనే అహంకార ధోరణి సీఎం కేసీఆర్‌లో పరాకాష్ఠకు చేరిందని.. విమర్శించిన వారిని జైలుకి పంపించే దుస్సాహసానికి పూనుకుంటున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఓ ప్రకటనలో విమర్శించారు. ఉద్యమ సమయంలో ఎదుటి పక్షాలను పరుష పదజాలాన్ని వాడి దూషించినప్పుడు కేసీఆర్‌ను జైలుకు పంపిస్తే ఉద్యమాలు ఎలా చేసేవారని ప్రశ్నించారు. తానుమాట్లాడితే ఒప్పు, ఇతరులు మాట్లాడితే తప్పు అనే నియంతృత్వ పాలనకు తెరాస సర్కారు నిదర్శనంగా నిలుస్తోందని తెలిపారు.

తమ్మినేనితో మందకృష్ణ భేటీ: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ ఆదివారం తమ్మినేనితో భేటీ అయ్యారు. ఎస్సీ వర్గీకరణపై సోమవారం నిర్వహించనున్న అఖిలపక్ష సమావేశానికి హాజరుకావాలంటూ తమ్మినేనిని ఆహ్వానించారు.

దళిత సమస్యలపై ప్రజాపోరాటం: చాడ

దళితుల హక్కులు, సమస్యల సాధన కోసం ప్రజా పోరాటాలు చేయాలని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. మఖ్దూం భవన్‌లో ఆదివారం బరిగెల సాయిలు అధ్యక్షతన జరిగిన దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్రస్థాయి సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేసీఆర్ సర్కారు దళితులకు చేసిన మేలేమిటో చెప్పాలన్నారు. మూడెకరాలభూమిని ఇప్పటి వరకూ ఇవ్వకపోవడం, ఎస్సీ ఎస్టీ ఉప ప్రణాళిక నిధులను దారిమళ్లించడం ద్వారా దళితులను మోసం చేస్తున్నారని చాడ విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఐక్య సంఘటన కూటమిని నిర్మించాల్సిన అవసరముందన్నారు. సదస్సులో నర్సింహా, బాలనర్సింహా, ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

కందుల లెక్క తప్పింది!

- ఆ పంట తొలి, రెండో అంచనాల్లో దెబ్బతిన్న అర్థ, గణాంకశాఖ
- ముందుస్తు లెక్కల ప్రకారం 53,600 టన్నులకే కేంద్రం అనుమతి
- ఇప్పటికే 70 వేల టన్నులు కొన్న తెలంగాణ ప్రభుత్వం
- పరిమితిని లక్షన్నర టన్నులకు పెంచాలని తాజా లేఖ



ఈనాడు - హైదరాబాద్

కందుల ధర విషయంలో దెబ్బతీసేందుకు అన్నీ రకాలుగా అందరూ ప్రయత్నిస్తుండంతో అన్నదాతలు నష్టపోతున్నారు. పంట దిగుబడులపై అర్థ, గణాంక శాఖ(డీఈఎస్) ముందస్తు అంచనాలు దెబ్బతినడంతో ధరలు, కొనుగోళ్లపై ప్రభావం పడింది. గతేడాది కొన్న పాత కందులను ఇప్పుడు తక్కువ ధరకే వ్యాపారులు, నాఫెడ్‌లు అమ్మేస్తుండటంతో కొత్త పంటకు డిమాండు పడిపోయింది. డీఈఎస్ ఏటా పలు పంటల దిగుబడులపై 4 సార్లు ముందస్తు అంచనాలను కేంద్ర వ్యవసాయశాఖకు పంపుతుంది. ఈ గణాంకాల ఆధారంగా ‘మద్దతు ధరకు కొనుగోలు పథకం’(పీఎస్ఎస్) కింద సేకరణకు కేంద్రం అనుమతిస్తుంది. మొత్తం దిగుబడిలో 40 శాతం పంటను మద్దతు ధరకు కొనేందుకు కేంద్రం నిధులిస్తుంది. ఈ లెక్కల్లో తేడాలుంటే రాష్ట్రమే నిధులు భరించకతప్పదు. ఇప్పుడు కందుల కొనుగోలులో ఇలాగే జరుగుతోంది. తెలంగాణలో గత వానాకాలం(ఖరీఫ్) సీజన్‌లో 2.51 లక్షల హెక్టార్లలో కంది సాగైందని.. లక్షా 34 వేల టన్నుల దిగుబడి వస్తుందని డీఈఎస్ తొలి అంచనాను కేంద్రానికి పంపింది. అంటే హెక్టారుకు 535 కిలోల ఉత్పాదకత వస్తుందని తెలిపింది. ఈ లెక్కల ఆధారంగా పీఎస్ఎస్‌లో 40 శాతం కోటా ప్రకారం 53,600 టన్నులను ఫిబ్రవరిలోగా కొనడానికి ‘జాతీయ సహకార మార్కెటింగ్ సమాఖ్య’(నాఫెడ్)కు కేంద్రం అనుమతించింది. నాఫెడ్ తరపున ‘తెలంగాణ రాష్ట్ర సహకార మార్కెటింగ్ సమాఖ్య’(మార్క్‌ఫెడ్)ను నోడల్ ఏజెన్సీగా నియమించి ఇప్పటికే 70 వేల టన్నులను కొన్నది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కందుల దిగుబడిపై రెండో ముందస్తు అంచనాలను ఇటీవల డీఈఎస్ కేంద్రానికి పంపింది. దీని ప్రకారం సాగు విస్తీర్ణం 2.95 లక్షల హెక్టార్లకు దిగుబడిని 2.84 లక్షల టన్నులకు పెంచింది. హెక్టారుకు ఉత్పాదకత 964 కిలోలుగా తెలిపింది. మూడేళ్లలో ఇదే రికార్డుస్థాయి ఉత్పాదకత కావడం గమనార్హం. దీనిలో 40 శాతం నిబంధన కింద లక్షా 13 వేల టన్నుల కొనుగోలుకు అనుమతి ఇవ్వడానికి కేంద్రం సుముఖంగానే ఉంది. కానీ పాత నిల్వలు తక్కువ ధరకే మార్కెట్‌లోకి వస్తుండటంతో ధర ఇప్పట్లో పెరిగేలా లేదని మార్కెటింగ్ శాఖ అధ్యయనంలో తేలింది. బయటి మార్కెట్‌లో క్వింటా ధర రూ.4 వేల వరకే ఉన్నందున ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మకానికి రైతులు వస్తున్నారు. కొనుగోలు పరిమితిని లక్షన్నర టన్నులకు, గడువు తేదీని మార్చి 31 వరకూ పెంచాలని కోరుతూ కేంద్ర వ్యవసాయశాఖకు తాజాగా లేఖ రాసినట్లు మార్కెటింగ్ శాఖ కార్యదర్శి పార్థసారథి ‘ఈనాడు’కు చెప్పారు. రైతులు ఎంత పంట తెస్తే అంతా మద్దతు ధరకు కొనాల్సి ఉందని, కానీ 40 శాతం పరిమితి వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై భారం పెరుగుతున్నట్లు ఆయన తెలిపారు.

ఓడీఎఫ్‌పై పరిశీలనకు కేంద్ర బృందాలు

తెలంగాణలో 138 గ్రామాల ఎంపిక

ఓడీఎఫ్ గ్రామాల సంఖ్య పెరుగుదల	
2015–16	800
2016–17	1,959
2017–18	4,050
అత్యల్ప ఓడీఎఫ్ గ్రామాలున్న జిల్లాలు	
మహబూబ్‌నగర్	0.69%
జోగులాంబ గద్వాల	0.92%
నాగర్‌కర్నూల్	1.74%
భద్రాద్రి కొత్తగూడెం	1.78%

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని ఆరుబయలు మలవిసర్జన రహితం (ఓడీఎఫ్) అని ప్రకటించిన గ్రామాల్లో పరిశీలన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టాలని కేంద్రం నిర్ణయించింది. ఇందుకోసం రాష్ట్రంలోని 23 జిల్లాలకు చెందిన 138 గ్రామాలను తాజాగా ఎంపిక చేసింది. ఈ గ్రామాల్లో కేంద్ర పరిశోధకులు (ఇన్వెస్టిగేటర్లు) త్వరలోనే పర్యటిస్తారు. 51 ప్రశ్నలకు సమాధానాలు రాబట్టి నివేదికలను కేంద్రానికి అందజేయనున్నారు. గ్రామంలో నూరుశాతం మరుగుదొడ్లు, వాటిలో నీటి సరఫరా తదితర సదుపాయాలూ ఉంటేనే ఆ గ్రామాన్ని ఓడీఎఫ్‌గా రాష్ట్రం ప్రకటిస్తుంది. ఇలా ఇప్పటికి 3,608 పంచాయతీల్లోని 4,050 గ్రామాలను ఓడీఎఫ్‌గా వెల్లడించింది. తొమ్మిది జిల్లాల్లో నూరు శాతం గ్రామాలు ఓడీఎఫ్‌గా మారాయని కేంద్రానికి తెలిపింది. రాష్ట్రం ప్రకటించిన గ్రామాలు నిజంగా సంపూర్ణ ఆరుబయలు రహితంగా మారిందీ లేనిదీ తెలుసుకొని తగిన సూచనలు, సలహాలు ఇచ్చేందుకు కేంద్రం కొన్ని ప్రైవేట్ సంస్థలను ఎంపిక చేసి రాష్ట్రాలకు పంపుతోంది. ఇప్పటికే తెలంగాణలోని కొన్ని గ్రామాల్లో ఇటువంటి పరిశీలన చేపట్టిన కేంద్రం.. తాజాగా ఒక్కో జిల్లాకు ఆరు గ్రామాల చొప్పున 23 జిల్లాల్లోని 138 గ్రామాలను ఎంపిక చేసింది. దిల్లీకి చెందిన మూడు సంస్థల ప్రతినిధులు ఈ గ్రామాల్లో ఇళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో మొత్తం 51 ప్రశ్నలకు సమాధానాలు నమోదు చేస్తారు. మరుగుదొడ్డికి నీటి సరఫరా, పాఠశాలల్లో ఏర్పాట్ల తీరు, ఇంతకు ముందు ఆరుబయలుగా ఉపయోగించిన ప్రాంతాల్లోని ప్రస్తుత పరిస్థితి తదితర వివరాలు నమోదు చేసుకొంటారు. ఫొటోలు తీసుకుంటారు. రాష్ట్రానికి స్వచ్ఛభారత్ కింద నిధుల మంజూరు తదితరాలకు ఈ నివేదికలనే కేంద్రం ఉపయోగించుకుంటుంది.

‘కాళేశ్వరం’ మట్టితీతలో రికార్డు



కాలువలో వేసిన పైపులు



మట్టిని తరలిస్తున్న వాహనాలు

కాళేశ్వరం, న్యూస్‌టుడే: కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి మట్టితీతలో ఆదివారం రికార్డు సృష్టించారు. మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలు, కన్నెపల్లి పంపుహౌజ్ నిర్మాణాల్లో మట్టితీత పనుల్లో మొదటి నుంచి ఏ ఒక్క రోజు కూడా 70 వేల క్యూబిక్ మీటర్ల మట్టి తీయలేదు. అందుకు భిన్నంగా కన్నెపల్లి పంపుహౌజ్ నుంచి అన్నారం బ్యారేజీ వరకు నిర్మిస్తున్న కాలువకు సంబంధించి శనివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి ఆదివారం ఉదయం ఎనిమిది గంటల వరకు రికార్డుస్థాయిలో 1.5 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తీయటం విశేషం. 13.2 కిలోమీటర్ల నిడివి గల కాలువను తవ్వేందుకు 1.80 కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టితీత పనులు చేపట్టాల్సి ఉంది. ఇటీవల నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు కాలువను సందర్శించిన సమయంలో రోజుకు లక్ష క్యూబిక్ మీటర్ల చొప్పున మట్టిని తీసి ఏప్రిల్ వరకు పనులు పూర్తిచేయాలని ఆదేశించారు.

విహారయాత్రలో విషాదం

కుంటాల జలపాతంలో పడి యువకుడి దుర్మరణం



ఇంజమామ్ ఉల్ హక్ మృతదేహం

నేరడిగొండ, న్యూస్‌టుడే: విహార యాత్ర ఆ మిత్రుల్లో విషాదాన్ని నింపింది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇంజమామ్ ఉల్ హక్(21) కుంటాల జలపాతంలో పడి మృత్యువాతపడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఇంజమామ్ సహ ఉద్యోగులతో కలిసి ఆదివారం ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని కుంటాల జలపాతం సందర్శనకు వచ్చాడు. మధ్యాహ్నం 12.30 సమయంలో జలపాతం అందాలు వీక్షిస్తుండగా ఇంజమామ్, ఆకాశ్, శ్యాం, అభిమన్యు ప్రమాదవశాత్తు జలపాతంలో పడ్డారు. ఆకాశ్, శ్యాంలకు ఈత రావడంతో బయటకు వచ్చారు. అభిమన్యును స్థానికులు బయటకు లాగి రక్షించారు. ఈత రాని ఇంజమామ్ జలపాతంలో మునిగిపోయి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టగా సాయంత్రం 4 గంటల సమయంలో మృతదేహాన్ని బయటకు తీశారు.

బంగారు కుటుంబం కోసమే కేసీఆర్ పాటుపడుతున్నారు: ఉత్తమ్



సభలో మాట్లాడుతున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

గీసుకొండ, న్యూస్‌టుడే: సీఎం కేసీఆర్ బంగారు తెలంగాణ కోసం పని చేయడం లేదని.. తన కుటుంబాన్ని బంగారం చేసుకోవడానికే పాటుపడుతున్నారని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. వరంగల్ గ్రామీణ జిల్లా గీసుకొండ మండల కేంద్రంలో పలు పార్టీలకు చెందిన కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన బహిరంగసభలో ఆయన మాట్లాడారు. అధికారం చేపట్టిన నాలుగేళ్లల్లో సుమారుగా రూ.5 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తెరాస ప్రభుత్వం ఒక్కో రైతుకు కనీసం రూ.5 అయినా ఖర్చుపెట్టిందా అని ప్రశ్నించారు. రాష్ట్ర మంత్రివర్గంలో ఒక్క మహిళను కూడా తీసుకోకుండా రాష్ట్రంలోని 2 కోట్ల మంది మహిళలను అవమానపరిచారని విమర్శించారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ పార్టీ 70 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన 100 రోజుల తరువాత రైతులు బ్యాంకుల నుంచి తీసుకున్న రూ.2 లక్షల రుణాలను ఏకకాలంలో మాఫీ చేస్తామని ప్రకటించారు.

తమన్నాపై బూటు విసిరిన అభిమాని



కలీముల్లాఖాన్

నారాయణగూడ, న్యూస్‌టుడే: సినీకథానాయిక తమన్నాపై ఓ యువకుడు బూటు విసిరాడు. అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లో ఓ నగల షోరూమ్ ప్రారంభోత్సవానికి తమన్నా వచ్చారు. కార్యక్రమాన్ని ముగించుకొని వెళ్తూ సుమారు 20 అడుగుల దూరం నుంచి ఆమె అభిమానులకు అభివాదం చేస్తుండగా ముషీరాబాద్‌కు చెందిన కలీముల్లాఖాన్ బూటు విసిరాడు. అది తమన్నాను దాటి వెళ్లి దుకాణ సిబ్బందికి తగిలింది. అప్రమత్తమైన నారాయణగూడ పోలీసులు నిందితున్ని అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారు. బీటెక్ చేసి ఖాళీగా ఉంటున్న కలీముల్లా.. తాను తమన్నా అభిమానిగా పేర్కొన్నాడు. ఈ మధ్య కాలంలో ఆమె మంచి సినిమాలు చేయడం లేదని కలీముల్లా చెప్పినట్లు పోలీసులు తెలిపారు.

మాంసానికి ధరల మంట

- కిలో రూ.500 నుంచి రూ.550
- గత ఆర్నెల్లలో కిలోకు రూ.100 వరకూ పెంపు
- రాష్ట్రంలో 40 లక్షలు గొర్రెలొచ్చినా తీవ్ర కొరత
- మేడారం జాతరకు పెరిగిన కొనుగోళ్లు
- తోళ్లకు డిమాండు పడిపోవడంతో మాంసం ధరపై ప్రభావం



కొనేవారు లేక వృథాగా వదిలేసిన తోళ్లను చూపుతున్న వ్యాపారి రమేశ్

ఈనాడు, హైదరాబాద్: మేక, గొర్రెల మాంసం ధరలు మండుతున్నాయి. రాష్ట్రంలో ప్రాంతాలను బట్టి కిలో మేక మాంసాన్ని రూ.500 నుంచి 550 దాకా విక్రయిస్తున్నారు. మరో 2 రోజుల్లో మేడారం జాతర పెద్దఎత్తున జరుగుతున్నందున మేకలు, గొర్రెలు కొనుగోళ్లు ఊపందుకున్నాయి. లక్షలాది మంది భక్తులు జాతరలో మొక్కులు తీర్చుకునేందుకు వీటిని కొంటున్నారు. మేకలు, గొర్రెల విక్రయ ధర పెరుగుతుండటం, వీటి తోళ్లకు డిమాండు పడిపోతున్నందున ఈభారాన్ని తట్టుకునేందుకు మాంసం ధర పెంచాల్సి వస్తోందని చెబుతున్నారు.

నగరాల్లో మేకలు.. పల్లెల్లో గొర్రెలకు గిరాకీ: హైదరాబాద్, వరంగల్ వంటి నగరాల్లో మేకపోతు లేదా మేక మాంసం కావాలని ఎక్కువమంది అడుగుతున్నారని, గొర్రె మాంసానికి పల్లెల్లో మాత్రమే గిరాకీ అధికమని పలువురు వ్యాపారులు ‘ఈనాడు’కు వివరించారు. గొర్రెల పెంపకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నందున మేకల పెంపకం తగ్గుతోంది. హైదరాబాద్ టోకు మార్కెట్లకు బెంగళూరు, చెన్నై వ్యాపారులు ఒకేసారి 50 నుంచి 100 వరకూ జీవాలను కొంటున్నారు. దీంతో ఇక్కడ ధరలు మరింత అధికమవుతున్నాయి. రాష్ట్రంలో గత జులై నుంచి ఇప్పటివరకూ 40 లక్షల గొర్రెలను ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చి ఇక్కడ రాయితీపై ఇచ్చినట్లు తెలంగాణ గొర్రెలు, మేకల పెంపకందారుల సమాఖ్య ప్రభుత్వానికి నివేదించింది. వీటినుంచి మరో 15 లక్షల జీవాల సంతానోత్పత్తి జరిగినట్లు తెలిపింది.

తోలు కొనేవారేరీ: దేశవ్యాప్తంగా మేక, గొర్రె తోలుకు డిమాండు పడిపోవడంతో వాటిని కొనేవారు లేరు. గతంలో ఒక్కో తోలును కనీసం రూ.300కు కొనేవారని, ఇప్పుడు రూ.10కి అడగటం లేదని వ్యాపారులు వాపోతున్నారు. మనదేశం నుంచి తోలు ఎగుమతులు తగ్గుతున్నందున ఆ ప్రభావం మాంసం అమ్మకాలపై పడింది. 2014-15లో తోళ్ల ఎగుమతులపై 64.94 కోట్ల డాలర్ల ఆదాయం రాగా 2016-17లో 53.25 కోట్ల డాలర్లకు తగ్గింది. అమెరికా, జర్మనీ, ఇటలీ, బ్రిటన్ వంటి దేశాలకు ఇక్కడి నుంచి తోళ్లను 43శాతం వరకూ కొంటున్నాయి. చెప్పుల ఎగుమతుల్లో భారత్‌ది 7వ స్థానం. తోళ్ల అమ్మకాలపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిస్తామని గొర్రెలు, మేకల పెంపకందారుల సమాఖ్య ఎండీ లక్ష్మారెడ్డి ‘ఈనాడు’కు చెప్పారు.

అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండు లేదు

– బస్వారెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త, జాతీయ మాంసం పరిశోధన సంస్థ, హైదరాబాద్

తోళ్ల ఎగుమతులకు డిమాండు పడిపోవడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో మనదేశం నుంచి తోళ్లకు ధర ఆదాయం లేదు. దేశీయ మార్కెట్‌లో వాటి ఉత్పత్తుల తయారీకి ప్రోత్సాహకాలిస్తే డిమాండు పెరిగే అవకాశాలున్నాయి. మాంసం ధరల మార్కెట్‌ను తోళ్ల పరిశ్రమ ప్రభావితం చేస్తోంది.

తోళ్లను వృథాగా వదిలేశా

– రమేశ్, మాంసం వ్యాపారి, హైదరాబాద్

మేకలు, గొర్రెలకు డిమాండు పెరుగుతోంది. హైదరాబాద్ మార్కెట్‌లో వాటి ధరలను వారానికోమారు ఒక్కోరకంగా పెంచేస్తున్నారు. తోలును కొనేవారుంటే మాకు ఆర్థికంగా వెసులుబాటు ఉంటుంది. గత 2 నెలల్లో మేం కిలో ధర రూ.50కి పెంచి కిలో రూ.540కి అమ్ముతున్నాం. అయినా నష్టమే వస్తోంది.

ఉన్నత చదువుల కోసం లండన్ వెళ్లి అదృశ్యం

ఆచూకీ తెలపాలంటూ తల్లిదండ్రుల వేడుకోలు



రమేశ్ తల్లిదండ్రులు. అంతరచిత్రంలో రమేశ్

మేడిపల్లి, న్యూస్‌టుడే: తమ కుమారుడు ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్తానంటే తల్లిదండ్రులు సంతోషించారు. కాయాకష్టం చేసి ఆర్థికంగా ఆసరాగా నిలిచారు. లండన్‌లో ఉన్నత చదువులు పూర్తి చేసుకుని ఉన్నతంగా ఎదగాలని ఆశించారు. మూడేళ్ల నుంచి కుమారుడి సమాచారం తెలియక కన్నీరు మున్నీరవుతున్నారు. జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం కాచారం గ్రామానికి చెందిన రాపర్తి వెంకటి, భూమక్కల మూడో కుమారుడు రమేశ్ (34) ఏడో తరగతి వరకు ఊళ్లోనే చదువుకున్నాడు. హైదరాబాద్‌లో డిగ్రీ పూర్తి చేసి ఎంబీఏ చదివేందుకు 2009లో లండన్ వెళ్లాడు. ఏడాది పాటు ఎంబీఏ చదివి 2011 డిసెంబరు వరకు గడువు ముగిసే వీసా పొందిన రమేశ్ 2015 వరకు తమతో ఫోన్‌లో మాట్లాడినట్లు తండ్రి వెంకటి తెలిపారు. అనంతరం తమతో కనీసం ఫోన్‌లో మాట్లాడక పోవడంతో ఆవేదన చెందుతున్నట్లు పేర్కొన్నారు. రమేశ్ అన్నయ్య గంగాధర్ ఉపాధి కోసం సౌదీ అరేబియా వెళ్లగా మరో సోదరుడు గణేష్ ప్రైవేటు ఉపాధ్యాయునిగా కరీంనగర్‌లో స్థిరపడ్డారు. దుస్తులు కుట్టుకుని జీవించే వెంకటి కుటుంబంలో మరో ఇద్దరు ఆడపిల్లలు ఉండగా వారికి పెళ్లిల్లు చేశారు. తమ కుమారుడు కనిపించడం లేదని పలువురికి విన్నవించామని తల్లిదండ్రులు చెప్పారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ విషయమై స్పందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఛాంపియన్స్

ఫైనల్లో సైనా ఓటమి

తైజుదే ఇండోనేషియా మాస్టర్స్



జకార్తా: సైనాకు మళ్లీ నిరాశే. ఏడాది తర్వాత ఓ అంతర్జాతీయ టోర్నీ ఫైనల్ ఆడిన భారత స్టార్ షట్లర్ ఇండోనేషియా మాస్టర్స్ టైటిల్ గెలవడంలో విఫలమైంది. ప్రపంచ నంబర్‌వన్ తైజు యింగ్ (తైవాన్) ముందు సైనా నెహ్వాల్ మరోసారి తేలిపోయింది. ఆదివారం ఏకపక్షంగా జరిగిన ఫైనల్లో సైనా 9-21, 13-21తో తైజు చేతిలో పరాజయంపాలైంది. తైజు చేతిలో సైనాకు ఇది వరుసగా ఏడో ఓటమి. తైజుతో 10 మ్యాచ్‌ల్లో సైనా ఒకే ఒక్కసారి (2013లో) గెలిచింది. చక్కని ఫామ్‌తో ఇండోనేషియా ఫైనల్లో అడుగుపెట్టిన ప్రపంచ నంబర్-12 సైనా టైటిల్ పోరులో ప్రత్యర్థికి ఏమాత్రం పోటీ ఇవ్వలేకపోయింది. సైనా అనేక అనవసర తప్పిదాలు చేసింది. ఆరంభం నుంచే తైజు తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. తొలి గేమ్‌లో విరామ సమయానికి 11-2తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. విరామం తర్వాత సైనా కొన్ని పాయింట్లు సాధించినా.. తైజు ఆధిపత్యాన్ని మాత్రం అడ్డుకోలేకపోయింది. తొలి గేమ్‌ను అలవోకగా గెలుచుకున్న తైజు.. రెండో గేమ్‌లోనూ జోరు కొనసాగించింది. 4-0తో ఆధిక్యంలోకి వెళ్లిన ఆమె.. ఏ దశలోనూ వెనక్కి తగ్గలేదు. విరామానికి 11-5తో నిలిచిన తైజు.. పెద్దగా శ్రమ పడకుండానే గేమ్‌ను ముగించింది.

రైనా.. ఏడాది తర్వాత

- భారత జట్టులోకి ఆగమనం
- దక్షిణాఫ్రికాతో టీ20లకు చోటు



దిల్లీ: సీనియర్ బ్యాట్స్‌మన్ సురేశ్ రైనా భారత జట్టులో తిరిగి చోటు సంపాదించాడు. ఏడాది కాలంగా టీమ్‌ఇండియాకు దూరంగా ఉన్న రైనాను దక్షిణాఫ్రికాతో ఫిబ్రవరి 18న ఆరంభమయ్యే మూడు టీ20ల సిరీస్‌కు సెలక్టర్లు ఎంపిక చేశారు. రైనా చివరగా గత ఏడాది ఫిబ్రవరిలో ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్ ఆడాడు. తర్వాత ఫిట్‌నెస్ సమస్యలు, ఫామ్ లేమితో జట్టుకు దూరమయ్యాడు. ఇటీవల ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో అతను మెరుపులు మెరిపించాడు. ఒక సెంచరీ కూడా సాధించాడు. ఉనద్కత్, శార్దూల్ ఠాకూర్‌లకు కూడా ఈ జట్టులో చోటు దక్కింది. మిగతా జట్టంతా మామూలే. టీ20ల కంటే ముందు భారత్, దక్షిణాఫ్రికా ఆరు వన్డేల సిరీస్ ఆడతాయి.

దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్‌కు భారత జట్టు: కోహ్లి, రోహిత్, ధావన్, రాహుల్, రైనా, ధోని, దినేశ్ కార్తీక్, పాండ్య, పాండే, అక్షర్ పటేల్, చాహల్, కుల్‌దీప్, భువనేశ్వర్, బుమ్రా, ఉనద్కత్, శార్దూల్ ఠాకూర్

పాకిస్థాన్‌దే సిరీస్

మౌంట్ మౌంగనుయ్ (న్యూజిలాండ్): న్యూజిలాండ్‌తో మూడు టీ20ల సిరీస్‌ను పాకిస్థాన్ కైవసం చేసుకుంది. అంతేకాదు సిరీస్ విజయంతో కివీస్‌ను వెనక్కినెట్టి ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని సొంతం చేసుకుంది. ఆదివారం నిర్ణయాత్మక మూడో టీ20లో పాక్ 18 పరుగుల తేడాతో గెలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన ఆ జట్టు నిర్ణీత ఓవర్లలో 6 వికెట్లకు 181 పరుగులు చేసింది. ఫకర్ జమాన్ (46) టాప్ స్కోరర్. ఛేదనలో పాక్ బౌలర్ల ధాటికి కివీస్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 163 పరుగులే చేయగలిగింది.

హాకీలో భారత్ ఓటమి

హామిల్టన్: నాలుగు దేశాల హాకీ టోర్నీలో భారత్‌కు నిరాశ. కొద్దిలో విజయం చేజారింది. ఆదివారం అత్యంత ఉత్కంఠభరితంగా జరిగిన రెండో అంచె ఫైనల్లో భారత్ షూటౌట్లో బెల్జియం చేతిలో ఓడిపోయింది. నిర్ణీత సమయానికి రెండు జట్లు 4-4 గోల్స్‌తో సమంగా నిలిచాయి. భారత్ తరఫున రమణ్‌దీప్ రెండు గోల్స్ (29వ, 53వ) కొట్టగా.. నీలకంఠ (42వ), మన్‌దీప్ (49వ) చెరో గోల్ సాధించారు. బెల్జియంలో జట్టు కోసిన్స్ (41వ), చార్లియర్ (43వ), క్యుస్టెర్స్ (51వ), డెనాయర్ (56వ) తలో గోల్ కొట్టారు. షూటౌట్లో బెల్జియం 3-0తో గెలిచింది.

లారాను దాటిన కోహ్లి



దుబాయ్: భారత కెప్టెన్ విరాట్ కోహ్లి ఆల్‌టైమ్ కెరీర్ అత్యుత్తమ ర్యాంకింగ్స్‌లో వెస్టిండీస్ దిగ్గజం బ్రయాన్ లారాను అధిగమించాడు. తాజా టెస్ట్ ర్యాంకింగ్స్‌లో అతడు రెండో స్థానాన్ని నిలుపుకున్నాడు. ర్యాంకింగ్స్ పాయింట్లను 900 నుంచి 912కు పెంచుకున్న కోహ్లి.. అత్యుత్తమ కెరీర్ ర్యాంకింగ్ పాయింట్లలో బ్రయాన్ లారా (911)ను దాటేశాడు. సునీల్ గావస్కర్ (916)కు చేరువయ్యాడు. తాజా ర్యాంకింగ్స్‌లో స్టీవ్ స్మిత్ (947) అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

ఐదో వన్డే ఇంగ్లాండ్‌దే



పెర్త్: ఆస్ట్రేలియాతో ఐదు వన్డేల సిరీస్‌ను ఇంగ్లాండ్ విజయంతో ముగించింది. థామస్ కుర్రాన్ (5/35) విజృంభించడంతో ఆదివారం ఐదో వన్డేలో 12 పరుగుల తేడాతో విజయం సాధించింది. సిరీస్‌ను 4-1 ఆధిక్యంతో ముగించింది. రూట్ (62; 68 బంతుల్లో 2×4) మెరవడంతో మొదట ఇంగ్లాండ్ 259 పరుగులు చేసింది. అనంతరం ‘మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్’ కుర్రాన్ ధాటికి ఆస్ట్రేలియా 48.2 ఓవర్లలో 247 పరుగులకు ఆలౌటైంది. ఆ జట్టులో స్టొయినిస్ (87; 99 బంతుల్లో 6×4, 4×6) విజయం కోసం పోరాడాడు. మాక్స్‌వెల్ (34), టిమ్ పైన్ (34) రాణించినా ఫలితం లేకపోయింది. కుర్రాన్‌తో పాటు మొయిన్ అలీ (3/55) ఆస్ట్రేలియాను దెబ్బ తీశాడు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92,
Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00

అతివేగం.. స్నేహవియోగం!

- అదుపు తప్పి చెట్టును ఢీకొట్టిన కారు
- అక్కడికక్కడే ముగ్గురు మిత్రుల మృతి.. మరొకరికి తీవ్రగాయాలు



చెట్టును ఢీకొట్టి నుజ్జునుజ్జయిన కారు.. మృతిచెందిన ప్రవీణ్, డేవిడ్, అర్జున్

చేవెళ్ల, చేవెళ్ల గ్రామీణం – న్యూస్‌టుడే: అతివేగం ముగ్గురి ప్రాణాలు బలిగొంది. హైదరాబాద్‌లోని వేర్వేరు సంస్థల్లో ఉద్యోగాలు చేస్తున్న నలుగురు మిత్రులు వారాంతాన్ని ఆస్వాదించడానికి అనంతగిరి పర్యాటక కేంద్రానికి వెళ్తుండగా.. కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టి ముగ్గురు చనిపోగా ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఒకే ప్రమాదంలో ముగ్గురు స్నేహితులు ప్రాణాలు వదలడం అందరినీ కలచి వేయడంతో పాటు వారి కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల పరిధిలోని మీర్జాగూడ గేటు సమీపంలో బీజాపూర్ రహదారిపై ఆదివారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన డేవిడ్(29), కేసేపోగు సుసన్న ప్రవీణ్(28), పేట్‌బషీరాబాద్‌కు చెందిన అరుగొండ అర్జున్‌కుమార్(26), ఇబ్రహీంపట్నం మండలం గుర్రంగూడకు చెందిన శ్రావణ్ స్నేహితులు. హైదరాబాద్‌లో ఉంటున్న వీరు.. సరదాగా గడిపేందుకు ఆదివారం తెల్లవారుజామున అనంతగిరి బయల్దేరారు. ప్రవీణ్ కారు నడుపుతుండగా పక్కన డేవిడ్ వెనుక సీటులో అర్జున్, శ్రావణ్ కూర్చున్నారు. ఉదయం ఆరున్నర గంటల ప్రాంతంలో మీర్జాగూడ గేటు సమీపంలో రోడ్డు మలుపు దాటి కొంత దూరం వెళ్లిన తర్వాత ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి రోడ్డు పక్కనే ఉన్న మర్రిచెట్టును ఢీకొట్టారు. ప్రమాదంజరిగిన సమయంలో కారు వేగంగా ఉండటంతో ముందుభాగం నుజ్జునుజ్జయి అందరూ వాహనంలోనే ఇరుక్కుపోయారు. అటుగా వెళ్తున్న ప్రయాణికులు ప్రమాదాన్ని గమనించి 100 కాల్‌సెంటర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలానికి వచ్చిన పోలీసులు అతికష్టం మీద మృతదేహాలను కారులో నుంచి బయటకు తీశారు. డేవిడ్, ప్రవీణ్, అర్జున్ అక్కడికక్కడే మరణించగా.. తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతున్న శ్రవణ్‌ను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పంచనామా కోసం చేవెళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తమ పిల్లలు చదువులు పూర్తి చేసుకొని ఉద్యోగాల్లో ఇప్పుడిప్పుడే స్థిరపడుతున్నారని ఆనందపడుతుండగా అంతలోనే తీరని విషాదం జరిగిందని మృతుల కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతుల్లో డేవిడ్, ప్రవీణ్‌లకు ఇప్పటికే వివాహం జరగ్గా.. అర్జున్‌కు ఇంకా పెళ్లి కాలేదు.

గౌరీ లంకేష్ హత్యవెనుక హిందుత్వ శక్తులు

- కర్ణిసేన ఆందోళనలతో 'పద్మావత్' సినిమాకు ప్రచారం
- నూతన ఆవిష్కరణలకు భారత్ అతిపెద్ద కేంద్రం
- హైదరాబాద్ సాహితీ సంబరాల్లో వక్తలు

ఈనాడు – హైదరాబాద్

జర్నలిస్టు గౌరీ లంకేష్ హత్య వ్యక్తిగత కక్షలతో జరగలేదని, ఈ ఉదంతం వెనుక బలమైన రాజకీయ అండదండలున్న హిందుత్వ శక్తులు ఉన్నాయని వక్తలు పేర్కొన్నారు. పేదరికం, అవినీతి, రాజకీయాలు, మతపరమైన కేంద్రాలపై వార్తలు రాస్తున్నపుడు ఆమెకు రోజూ బెదిరింపులు వచ్చేవని తెలిపారు. గౌరీ లంకేష్ హత్య తర్వాత అంతిమయాత్రలో ఆ స్థాయిలో ప్రజలు వచ్చారంటే... ఆమెకు అన్యాయం జరిగిందని తెలుస్తోందని వివరించారు. ఆదివారం హైదరాబాద్ సాహితీ సంబరాల చివరి రోజు సదస్సులో భాగంగా "గౌరీ లంకేష్ జీవితంలో ధైర్యం, కరుణ, ప్రయాణం" అంశంపై జరిగిన చర్చలో ప్రొఫెసర్ చందన్ గౌడ, రచయితలు గీతా రామస్వామి, కన్నన్ సుందరం మాట్లాడారు. ఆంగ్ల భాష నుంచి కన్నడ భాషకు మారి అక్కడి ప్రజా సమస్యలపై రచనలు చేసేందుకు గౌరీ లంకేష్ ఎంతో కష్టపడ్డారని గీతా రామస్వామి తెలిపారు. హిందూ ఛాందసవాదం సహా ఇతర కుల, మత, రాజకీయ ఛాందస వాదాలని వ్యతిరేకించాలని గౌరీ లంకేష్ చెప్పేవారని ప్రొఫెసర్ చందన్‌గౌడ తెలిపారు. గత మూడేళ్లలో ప్రాంతీయ భాషల్లో రచనలు చేస్తున్న పలువురు.. దాడులు, హత్యలకు గురవుతున్నారని కన్నన్ సుందరం తెలిపారు.

సమాచారం నిర్ధరించుకోకుండానే...

తాజావార్తల పోటీతో అందిన సమాచారం నిర్ధరించుకోకుండా ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని జర్నలిస్టు రాజ్‌దీప్ సర్‌దేశాయ్ తెలిపారు. దేశంలోని అధికభాగం పత్రికలు, టీవీఛానెళ్లు రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తల చేతుల్లోనే ఉన్నాయన్నారు. ప్రజలకు సమాచారం కావాలని, వ్యక్తిగత రాజకీయాలు, అజెండా అవసరం లేదన్నారు. 'మీడియా- బ్రేకింగ్‌న్యూస్' అంశంపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. కర్ణిసేన ఆందోళనలతో మహారాష్ట్రలో జరిగిన 2వేల మంది రైతు ఆత్మహత్యలు వెలుగులోకి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కర్ణిసేన కారణంగా 'పద్మావత్' సినిమాకు ప్రచారంతో పాటు నిర్మాతలకు డబ్బులు వచ్చాయన్నారు.

2030 నాటికి ప్రపంచ ఆదాయంలో 25శాతం భారత్‌దే

నూతన ఆవిష్కరణలు.. మాట్లాడినంత సరళమైన ప్రక్రియ కాదని టాటా గ్రూపు ఆవిష్కరణల సమాఖ్య ఛైర్మన్ ఆర్.గోపాలకృష్ణన్ తెలిపారు. ఒక ఆలోచన వచ్చిన తరువాత ఆటుపోట్లు ఎదుర్కొని ఆచరణలోకి వచ్చేందుకు ఏళ్ల సమయం పడుతుందని పేర్కొన్నారు. ఆవిష్కరణలకు భారత్ అతిపెద్ద కేంద్రమని వెల్లడించారు. ప్రస్తుతం సామాజిక శాస్త్రాల్లో మనతో ఎవరూ పోటీపడలేరన్నారు. జీడీపీ దేశ అభివృద్ధి అంచనాకు ఏ విధంగా ప్రామాణికం కాదో.. మేధోసంపత్తి హక్కుల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని భారత్‌ను ఆవిష్కరణల దేశం కాదనడం సరికాదన్నారు. భారత్‌లోని యువత మేధస్సు నుంచి వస్తున్న ఆవిష్కరణలతో.. 2030 నాటికి ప్రపంచ ఆదాయంలో 25శాతం మనదేశానిదే ఉంటుందన్నారు. 'నూతన ఆవిష్కరణల జీవనగాథ' పుస్తకంపై కార్వీ వ్యవస్థాపకుడు పార్థసారథితో కలిసి ఆయన చర్చలో పాల్గొన్నారు.